
గోతెలుగు.కామ్
చక్కటి కుటుంబ వార పత్రిక
అతులిత బంధం
నండూరి సుందరీనాగమణి




నిస్త్రాణగా మెట్లమీద కూలబడిపోయింది మధుబాల. ఆమె నుదుటినుంచి చెమటలు ధారాపాతంగా కారిపోవటం మొదలయ్యింది. షాక్ వలన కొంచెం తలతిరుగుతున్నట్టు అనిపిస్తుండగా, అదిరే పెదవులతో "ప్లీజ్, కొంచెం మంచినీళ్ళు..." అంది నూతిలోంచి వచ్చినట్టున్న గొంతుతో ఎంతో నీరసంగా...

"అయ్యో...ఒక్క క్షణం మేడమ్..." ఆమె వంక జాలిగా చూస్తూ రామలక్ష్మి గ్లాసులో అందించిన మంచినీళ్ళు గటగటా తాగేసింది, మధు.

"ఏ టైమ్ లో జరిగిందిది?"

"మూడు గంటలప్పుడు...నందిని మేడమ్ గారు ఆ లెటర్ చూడగానే..."

‘‘కానీ నాకు తెలియకుండా ఎలా పంపించారు?  కనీసం ఫోన్  అయినా చేసి చెప్పాలి కదా?’’

‘‘అయ్యో, మీకు ఫోన్ చేసారమ్మా... ఒక సారి కాదు, రెండు మూడు సార్లు చేసారు. చేసినంత సేపూ ఆయన ఇక్కడే వెయిట్ చేసారు. సరే, ఉత్తరంలో మీ సంతకమే ఉంది కదాని...’’

‘‘ప్చ్... నా ఫోన్ పాడయింది... ఆఫీసు నుంచి వస్తూ ఉంటే బైక్ కూడా బ్రేక్ డౌన్ అయింది... వేరే ఆటో పట్టుకుని వచ్చేసరికి ఈ టైమ్  అయింది... ఇప్పుడు నేనేం చేయాలి?’ కొంత పైకీ, కొంత స్వగతంగా అనుకుంటూ మాట్లాడుతున్న మధుబాల ఉన్నట్టుండి  పానిక్ అయిపోయింది.

‘‘మీ ‘ఊయల’ చాలా ప్రిస్టీజియస్ కేర్ సెంటర్ అని నాకు కొంచెం దూరమే అయినా  ఇక్కడ చేర్చాను, నా బాబుని.  మీరేమో అర్థం లేకుండా, ఎవడికో ఇచ్చేసారు... మీ మీద కేస్ పెడతాను...’’ గట్టిగా అరిచింది. అంతలోనే ఆమె గొంతు రుద్ధమైంది.

‘‘మేడమ్... ఏదైనా ఉంటే మీరు నందిని గారితో మాట్లాడాలి. నా మీద అరిస్తే ఎలాగా?’’ కొంచెం సీరియస్ గా మొహం గంటు పెట్టుకుంటూ అన్నది  రామలక్ష్మి.

‘‘ఆ,  నందిని గారినే అడుగుతాను...ఏదీ,  మీ ల్యాండ్ ఫోన్ ఉపయోగించుకోవచ్చా?’’

‘‘నందిని గారు బాంబే వెళ్ళారు... ఇప్పుడు ఫ్లైట్ లో ఉంటారు...’’

‘‘ఓ మైగాడ్... ఎప్పుడు వస్తుంది తను?’’

‘‘ఎల్లుండి వచ్చేస్తారమ్మా...’’

‘‘నాకు... నాకు... ఒక హెల్ప్ చేయగలవా రామలక్ష్మి? ఒక ఆటో పిలవగలవా?’’

‘‘మీ బాబును  గురించి బెంగ పడకండమ్మా...మీ బాధ అర్థమౌతోంది... అలాగే, తప్పకుండా

పిలుస్తాను...”

రామలక్ష్మి పిలుచుకు వచ్చిన ఆటోలో కూలబడి, తనుండే ఇంటి అడ్రెస్ చెప్పింది, మధుబాల.

***

“ఏమిటోయ్, అనుకోని ఈ అదృష్టం?” పార్టీ ఇస్తానంటూ వెంటబడిన కన్నన్ ని నవ్వుతూ అడిగాడు, స్వరూప్.

“చెప్తాగా... రా మరీ...” బైక్ ‘అప్సరా’ బార్ ముందు పార్క్ చేసి, ముందుకు నడిచాడు కన్నన్.

“చాలా రోజులైంది నేను డ్రింక్స్ తీసుకుని...ఇంతకీ విషయం ఏమిటి?” మళ్ళీ కుతూహలంగా అడిగాడు, స్వరూప్.

“చెప్తాగా... వెయిట్...” టేబుల్ మీద ఉన్న వాజ్ లోంచి తాజా రోజాను చేతిలోకి తీసుకుని రేకులు లాగుతూ అన్నాడు కన్నన్. అతని కన్నులలో ఒక వింత కాంతి...

వెయిటర్ ని పిలిచి కావలసినవి అన్నీ ఆర్డర్ ఇచ్చాడు. ఆర్డర్ వచ్చేవరకూ ఇద్దరూ మాట్లాడుకోలేదు. స్వరూప్ కి ఏదో ఫోన్ కాల్ రావటంతో అక్కడ సిగ్నల్ లేక బయటకు వెళ్ళాల్సి వచ్చింది.

తిరిగి వచ్చేసరికి రెండు మూడు సిగరెట్స్ కాల్చేసాడు, కన్నన్... అతని ముఖం కాస్త నెర్వస్ గా ఉన్నట్టు అనిపించింది, స్వరూప్ కి. ఈలోగా ఆర్డర్ వచ్చింది.

అన్నీ కలిపి, ఐస్ క్యూబ్ వేసి గ్లాసును స్వరూప్ ముందుకు తోసాడు, కన్నన్.

ఐదు నిమిషాలు గడిచాయి... “చెప్పు...” అన్నాడు స్వరూప్ కన్నన్ వంక ప్రశ్నార్థకంగా చూస్తూ...

‘‘చెబుతాను కాని, స్వరూప్... నువ్వు  నాకు తప్పకుండా సహాయం చేయాలిరా...”

‘‘ఏ విషయంలోనో చెబితే కదా తెలిసేది?” కొంచెం అసహనం ధ్వనించింది స్వరూప్ స్వరంలో.

‘‘నాకు... మధుబాలంటే చాలా ఇష్టం...అరే  వాహ్! ఏం స్ట్రక్చర్ రా ఆమెది?”

‘‘కన్నన్, ఏం మాట్లాడుతున్నావు నువ్వు?  రేపో ఎల్లుండో పెళ్లి చేసుకోబోతూ, పరాయి ఆడదాని గురించి అలా  ఎలా మాట్లాడ గలుగుతున్నావు? నీకు మేరేజ్ ఫిక్స్ అయింది, అది గుర్తు పెట్టుకో...” వారిస్తున్నట్టుగా అన్నాడు స్వరూప్.

‘‘అయితే ఏమిటి? దానికీ దీనికీ ఏం సంబంధం ఉంది? ఇంకా ఆర్నెల్ల వరకూ పెళ్ళికి ముహూర్తాలు లేవంట... ఈలోగా ఏదో కాలక్షేపం అయిపోతుంది... మరీ, మధుబాలతో నీకు మంచి స్నేహం ఉంది కదా... కాస్త నన్ను రికమెండ్ చేయాలి గురూ...” బ్రతిమాలుతున్నట్టు అన్నాడు కన్నన్.

అప్పటివరకూ తాగినదంతా దిగిపోయినట్టయింది స్వరూప్ కి...

‘‘సారీ బాస్. మధుబాల అలాంటిది కాదు... ప్లీజ్... నీకు సరదాలుంటే తీర్చుకోవటానికి వేరే మార్గాలు వెదుక్కో... ఆ అమ్మాయిని మాత్రం అల్లరి పెట్టకు...ఇది కరెక్ట్ కాదు...” కోపంగా అన్నాడు.

‘‘ఏం, నువ్వైతే ఫర్వాలేదా?” వెకిలిగా నవ్వాడు, కన్నన్.

‘‘ఛీ! ఏం మాట్లాడుతున్నావు? మధు నాకు సిస్టర్ లాంటిది...”

‘‘లాంటిది - కాని కాదు కదా?”

‘‘కన్నన్... మనిషికి ఏది ఉన్నా లేకపోయినా కేరెక్టర్ చాలా ఇంపార్టెంట్. నీ దృక్పథం మార్చుకో... చాలా తప్పుగా ఆలోచిస్తున్నావు. వస్తాను బై...” అసహనంగా లేచాడు స్వరూప్.

‘‘హు... నీ ఋణం ఉంచుకోను లేవోయ్... ఏదో సెట్ చేసి పెడతావని అనుకుంటే ఏంటి తెగ బెట్టు చేస్తున్నావు?”

‘‘జస్ట్ షటప్ మై డియర్ కన్నన్... ఏదో మంచివాడివని పొరపాటు పడి నీతో స్నేహం చేసాను. గుడ్ బై...” చరచరా నడుచుకుంటూ బయటికి వెళ్ళిపోయాడు, స్వరూప్.

అతను వెళ్ళిన వైపే చూస్తూ కసిగా పళ్ళు కొరికాడు కన్నన్. ఈ సారి అతని ముఖంలో క్రౌర్యం స్పష్టంగా ప్రతిఫలిస్తోంది.

***

‘‘డార్లింగ్... ఆకలి వేస్తోంది...” బయటి నుంచి వస్తూనే బాగ్ సోఫాలో విసిరేసి, కంప్యూటర్ దగ్గర కూర్చుని పనిచేసుకుంటున్న కార్తీక్ భుజాలమీద వయ్యారంగా వాలిపోయింది డాలీ, తన బరువంతా అతని వీపు మీద వేస్తూ...

‘‘హేయ్, ఆగు ఓ నిమిషం... కొద్దిగా బిజీగా ఉన్నాను...” దృష్టి మరల్చకుండా చెప్పాడు, కార్తీక్.

‘‘వ్హాట్ యార్, నీ పని నాకన్నా ముఖ్యమైనదా?” వంగి అతని చెంపను గట్టిగా ముద్దాడింది డాలీ... అంతే, ఆమె పెదవుల స్పర్శతో వివశుడైన కార్తీక్ ఆ పని వదిలేసి ఇటు తిరిగి డాలీని మీదకు లాక్కున్నాడు.

కొద్ది నిమిషాల తరువాత అతన్ని విడిపించుకుంటూ, “కార్తీ... అయాం ఫీలింగ్ హంగ్రీ !” అంది గోముగా...

“హంగ్రీ అంటే జాంగ్రీలు ప్లేట్ లోకి రావు బేబీ, వండుకుంటే వస్తాయి... పద కిచెన్ లోకి... ఇద్దరం కలిసి చేసుకుందాం...” అన్నాడు సీట్ లోంచి లేస్తూ.

“అబ్బా బోర్ బాబూ వంటంటే...” గునిసింది, డాలీ.

“తినటం బోర్ కాదేం? పద... నువ్వు కబుర్లు చెబుతూ కూర్చో, నేనే చేస్తాలే...” ఆమె బుగ్గ మీద చిటికె వేసాడు.

ఇద్దరూ వంటింట్లోకి వెళ్ళారు. ఆమె మాటలు వింటూ తాను పనిలో పడ్డాడు కార్తీక్.

“కార్తీ, నాకు ఈరోజు అరియర్స్ వచ్చాయి... రేపు నీకు మంచి గిఫ్ట్ కొనిస్తాను...”

“ఓ, కంగ్రాట్స్ డాళింగ్... నువ్వు నాకు ఏం కొన్నా సరే, నా అరియర్స్ డబ్బు రాగానే నీకు మాత్రం డైమండ్ నెక్లెస్ కొనిస్తా... ప్రామిస్”
“ఐ నో యువర్ లవ్ డియర్... ఆ అన్నట్టూ, సండే నాకు బెంగుళూరులో కాన్ఫరెన్స్ ఉంది... శనివారమే బయలుదేరాలి నేను.”
“అయితే నేనూ వస్తాను...”

“ఉహు, వద్దు... వచ్చి ఏం చేస్తావు? అయినా నేను మా ఆఫీస్ వాళ్ళతో ఫ్లైట్ లో వెళతాను. నువ్వు వద్దులే...”

“నేనిక్కడ ఒక్కడినీ ఉండలేను, నాకు బోరు కొడుతుంది డాలీ...”

“ఫర్వాలేదు కార్తీ... కలయిక తరువాత విరహం, విరహం తరువాత కలయిక బాగుంటాయి... అయినా మనం ఎప్పుడూ కలిసి ఉండటం కుదరదు... ఒకరిని ఒకరు శాసించుకోవటానికి వీలు లేదు... మరచిపోయావా, మనం మొగుడూ పెళ్లాలం కాదు కదా?” నవ్వింది డాలీ.
ఆమెతో మాట్లాడుతూనే రైస్ కుకర్ పెట్టేసి, గబగబా పప్పు, కూర చేసాడు.

“థాంక్ యు డాళింగ్, యు డిడ్ ఇట్...” మళ్ళీ మరో చుంబనం ప్రసాదించి, “నేను స్నానం చేసి వస్తాను, పళ్ళాలు పెట్టు, ఇద్దరం తినేద్దాం...” చెప్పేసి, వాష్ రూమ్ లోకి వెళ్ళింది డాలీ.

‘ఒకప్పుడు వంటింట్లోకి రావాలంటేనే ఏడ్చే తనేనా ఈవేళ ఈమెకు వంట చేసి పెడుతున్నాడు? డాలీ అంటే నాకెందుకు ఇంత పిచ్చి?’ తనను తానే ప్రశ్నించుకున్నాడు కార్తీక్. అతనికి జవాబు దొరకలేదు కాని కనురెప్పల్లో అరక్షణం పాటు ఐశ్వర్య ముఖం కదిలింది. దాన్ని బలవంతంగా పక్కకి తోసేస్తూ, ఆ రాత్రి డాలీ అందించబోయే అపురూప స్వర్గ సుఖాలను ఊహించుకుంటూ, మధురోహలతో మరో వాష్ రూమ్ లోకి దారి తీసాడు, కార్తీక్.

***

పదహారో సారి మధుబాలకు చేస్తున్న ఫోన్ కాల్ ను కట్ చేసింది ఐశ్వర్య. దాదాపు గంట నుంచి ప్రతీ ఐదు నిమిషాలకూ ప్రయత్నిస్తోంది. కాల్ కలవటం లేదు. ‘స్విచ్డ్ ఆఫ్’ అనే వస్తోంది.

‘మధూకి ఏమైంది? చాలా సమయం దాటింది, అయినా ఇంకా ఇంటికీ రాలేదు... ఫోన్ పోయిందా? లేక పాడైందా? లేదా మధూకి ఏదైనా యాక్సిడెంట్... ఉహు, అలా జరగదు... ఐదు నిమిషాల్లో మధూ ఇంటికి వచ్చేస్తుంది...’ అల్లకల్లోలమైపోతున్న తన మనసుకు సర్ది చెప్పుకుంటూ, ఆదుర్దాని అణచుకుంటూ ఒక గ్లాసు చల్లని నీటిని తాగింది ఐశ్వర్య. ఆ తర్వాత హాల్లోనే అటూ ఇటూ పచార్లు చేయసాగింది. అలా అటూ ఇటూ ఒక యాభై సార్లు తిరిగాక డోర్ బెల్ మ్రోగింది.

‘‘ఏమిటింత ఆలస్యం? ఏమై పోయావ్?’’ తలుపు తెరిచి తెరవగానే కోపంగా అరిచింది ఐశ్వర్య, మధుబాలను చూడగానే...
ఆమె జవాబు చెప్పే లోగానే, “ఆ డొక్కు ఫోన్ మార్చెయ్. అసలు పని  చేయటం లేదు. నాకిక్కడ కాళ్ళూ చేతులూ ఆడటం లేదు... విన్నావా? అవునూ...” చిన్నగా కేకపెట్టి, “వాడేడే?” అంది.

‘‘ఐశూ... ఐశూ... బాబు... బాబు...మన బాబి...’’ ఐశ్వర్యను కౌగిలించుకొని ఆమె భుజం మీద తలవాల్చి వెక్కి వెక్కి ఏడవసాగింది, మధుబాల.

‘‘ఆ? చెప్పు.... బాబు? బాబుకు ఏమైంది చెప్పు మధూ... టెన్షన్ గా ఉంది...’’

‘‘బాబును తీసుకు వెళ్ళిపోయారు...’’ మధుకు దుఃఖం వరదలు కట్టలుగా తెంచుకుంది. నేలమీద కూలబడి  వెక్కి వెక్కి ఏడుస్తున్న మధూని చూస్తూంటే అంతా అయోమయంగా తోచింది ఐశ్వర్యకు. తానూ  పక్కనే కూర్చుని ఆమెను ఒడిలోకి తీసుకుంది, ఏం జరిగిందో అర్థం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ...

‘‘మధూ... ప్లీజ్ కూల్ డౌన్ ...’’ ఆమె జుత్తులోని వేళ్ళు పోనిచ్చి రాయసాగింది ఐశ్వర్య. రెండు నిమిషాల తర్వాత దుఃఖం లోంచి తేరుకుంది మధు.

‘‘చూసావా ఐశూ... వేణు ఎంత పని చేసాడో?’’

‘‘వేణూనా? వేణు అని  నీకెలా తెలుసు?’’

‘‘లేకపోతే ఇంకెవరు? అతనికే ఆ అవకాశం ఉంది బాబును తనతో తీసుకు వెళ్ళటానికి...’’ నిర్వేదంగా అంది మధుబాల.

‘‘నీ యాబ్సెన్స్ లో బాబునలా ఎలా ఇచ్చేస్తారు మధూ? వాళ్లకి... ఆ నందినికి మాత్రం బుద్ధి ఉండక్కరలేదా?’’

‘‘అదంతా నా  దురదృష్టం ఐశూ... నా సంతకాన్ని ఫోర్జ్ చేసి నేను అతనితో బాబును పంపమన్నట్టు లెటర్ రాసిచ్చి తీసుకుపోయాడు. పాపం వాళ్ళు నాకు చెప్పటానికి ప్రయత్నించారు. కాని నా ఫోన్ పాడై... భగవంతుడా, నామీద కోపంతో వేణూ వాణ్ని ఏం చేస్తాడో?’’

‘‘ఏదీ, వేణూ ఫోన్ నెంబర్ ఇవ్వు... నా సెల్ లో లేదు... ఓ సారి మాట్లాడతాను...’’

‘‘ఉహు వద్దు ఐశూ...’’ విముఖంగా ముఖం తిప్పుకుంది మధుబాల.

‘‘కాదులే, ఓ సారి మాట్లాడితే ఏమౌతుంది? ప్లీజ్... ఏదీ ఒక్క సారి... చెప్పు...’’

బలవంతంగా నంబర్ చెప్పింది మధుబాల.




“అమ్మా, బాబును చూసావా, ఎంత ముద్దుగా ఉన్నాడో...” ఊయలలో పడుకుని నిద్రిస్తున్న, ఆరు నెలల వయసున్న బాబు ముఖంలోకి మురిపెంగా చూస్తూ అన్నాడు, వేణు.

“అవునురా... వాడివన్నీ మీ నాన్నగారి పోలికలే... నవ్వినప్పుడు ఆ బుగ్గల మీద సొట్టలు చూడు!” తానూ మురిసిపోయింది సుగుణమ్మ.

“ఇవిగోమ్మా, నేపీలు పట్టుకు వచ్చాను. ఇది బేబీ సోప్, ఆయిల్... ఇది పౌడరు. ఇదిగో బేబీ టవల్... ఈ పాకెట్ లో కాటన్ జుబ్బాలూ, డ్రాయర్లూ ఉన్నాయి. ఇంకేమైనా కావాలా?” తన చేతిలోని సంచిలోంచి వస్తువులన్నీ బల్లమీద పేర్చుతూ అన్నాడు, వేణు.

“ఇంకేం అక్కర్లేదురా... దిష్టి తగలకుండా పెట్టటానికి నల్ల తిలకం కావాలి. ఆ చిలాయ్  నేను బియ్యం వేయించి తయారు చేస్తానులే...”

‘‘రేపు అక్కయ్యా, వినతా వస్తానని అన్నారమ్మా వీడిని చూడటానికి...’’

‘‘ఊ... పుట్టిన తర్వాత ఇదే కదా చూడటం... రానీ... మేనల్లుడిని కళ్ళారా చూసుకుంటారు...’’

‘‘ఇక ఫర్వాలేదమ్మా... వీడిని తీసుకు వచ్చేసాను కదా... దూడ వెనుక ఆవూ దిగుతుంది చూడు...’’ కసిగా అన్నాడు, వేణు.
కాసేపు మౌనంగా ఉండిపోయింది సుగుణమ్మ.

రెండు నిమిషాల తర్వాత, మెల్లగా అంది, ‘‘ఏమోరా బాబూ, నువ్వు తప్పు చేసావని అనిపిస్తోంది నాకు... తల్లినీ బిడ్డనూ విడదీయటం పాపం...’’

‘‘ఆవిడకి అలాగే బుద్ధి చెప్పాల్లేమ్మా నీకు తెలియదు... బయట నా పరువు తీసింది. అయినా నా కొడుకు నా దగ్గర ఉండక ఇంకెక్కడ ఉంటాడు?’’ గర్వంగా అన్నాడు. ‘‘తనకీ కొడుకే కదరా... ఇప్పటికీ నువ్వు ఇంటికి రావటం లేటైతే నాకు కంగారుగా ఉంటుంది. అలాంటిది పసిగుడ్డును వదిలి తల్లి ఉండగలదా? తల్లడిల్లి పోదూ?’’

తల్లి వైపు అదోలా చూసి తన గదిలోకి వెళ్ళిపోయాడు, వేణూ.‘నేనే తప్పు చేసేనేమో...’ దీర్ఘంగా నిట్టూర్చి, పిల్లాడికి పాలు కలిపి, పాలసీసాలో పోయసాగింది, సుగుణమ్మ.

**

మర్నాడు సాయంత్రం -

‘‘ఎందుకే అంతలా కుమిలిపోతావు? ఊరుకో...’’ దిండులో ముఖం దూర్చి విలపిస్తున్న మధుబాల భుజం తడుతూ అన్నది ఐశ్వర్య. ఆమె దగ్గరనుంచి స్వల్పంగా వస్తున్న వాసనకు ముఖం చిట్లించి, “ఏంటి ఐశూ ఇది?” అంది బాధగా మధుబాల.

‘‘యా... అయామ్  సారీ... చాలా బాధ కలిగింది,  అందుకే కొద్దిగా తాగాను... ప్లీజ్ ఎక్స్ క్యూజ్ మీ...” దూరంగా వెళ్లి బెడ్ మీద పడుకుంది,  ఐశ్వర్య.

తానే లేచి ఐశ్వర్య దగ్గరకు వెళ్ళి, ఆమెను తన చేతుల్లోకి తీసుకుంది, మధుబాల.

‘‘ఏమైంది?” అంది అనునయంగా...

‘‘నీకూ తెలుసుగా, సరిగ్గా ఎనిమిది నెలలు అయింది కార్తీక్ నన్ను విడిచి వెళ్లి... మళ్ళీ,  ఈరోజు కనిపించాడు నాకు... అమీర్ పేట చౌరస్తా దగ్గర ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర చూసాను. అతని కారు, నా స్కూటరూ  పక్క పక్కనే ఆగాయి. నన్ను చూడలేదు. పక్కనే ఎవరో అమ్మాయి ఉంది. ఆమెతోనే ఉంటున్నాడనుకుంటాను... ఎవరో చెప్పారు ఆ మధ్య... చాలా బాధగా ఉంది మధూ...బాబీని ఆడిస్తూ...కాస్తో కూస్తో నా మనసును మరల్చుకునే దాన్ని. వాణ్ణి నీ మొగుడు ఎత్తుకుపోయాడు... నీకూ హింసే... నాకూ హింసే... ఈ ఆడజాతికి టోటల్ గా జన్మంతా శిక్షేనా?” రెండు చేతుల్లో ముఖం కప్పుకుని నిశ్శబ్దంగా కన్నీరు కార్చింది ఐశ్వర్య...

‘‘ఛీ... ఇదేమిటే... నా ఐశూ కంట తడి పెట్టటమా? నో.. నెవర్! రాత్రే కదా మన బాబీ గాడిని ఎలా అయినా తెచ్చేసుకుందామని నాకు ధైర్యం చెప్పావు? ప్లీజ్... ఊరుకో...”

‘‘ఏవి నేస్తం, ఆనాటి మధురమైన రోజులు? ఏవి నేస్తం, ఆనాటి దూసుకుపోయే రెక్కలు? ఏది నేస్తం, చుక్కల లోకంలోకి ఎగిరిపోయే ఆ ఉత్సాహం, ఉల్లాసం?”

‘‘అవును...అయిపోయిన  గతమెప్పుడూ మంచిదే... గడుస్తున్న వర్తమానమే... వట్టి వ్యర్థకాలం అనిపిస్తూ ఉంటుంది...” మధూ కనుల ముందు ఏవేవో దృశ్యాలు...

***

‘‘ఏయ్ మధూ...ఇవ్వాళ ఆదివారమే కదే, కాసేపయినా నన్ను పడుకోనీకుండా ఆ స్తోత్రాలు పెట్టి నా నిద్ర చెడగొట్టకపోతే, నువ్వూ పడుకోకూడదూ కాసేపు?” నిద్ర లేచి కూర్చుని, చిరాకు పడింది ఐశ్వర్య.

‘‘ష్!” మందలింపుగా చూసి, టేప్ లో వస్తున్న విష్ణు సహస్రనామం పుస్తకంలో చూసి చదువుతూ వినసాగింది, మధుబాల.

భుజాలు ఎగురవేసి, టవల్ తీసుకొని బాత్ రూమ్ వైపు నడిచింది ఐశ్వర్య ఫ్రెష్ అవటానికి. పది నిముషాల్లో స్నానం కూడా ముగించి వచ్చి, మధూ ఎదురుగా మంచం మీద మఠం వేసుకుని కూర్చుంది. అప్పటికి స్తోత్రం మొత్తం పూర్తి అయింది.

‘‘ఊ, ఇంతకూ ఈరోజు మన మెస్ లో ఏం టిఫినో... ఆకలేస్తోంది బాగా...” పొట్ట తడుముకుంది ఐశ్వర్య...

‘‘రా మరి, కిందికి వెళ్లి తిని వద్దాం... ఆదివారం కదా, ఏ పూరీకూరనో, ఏ పెసరట్ ఉప్మానో చేసి ఉంటాడు భీముడు...” నవ్వింది మధుబాల.

‘‘ఊ, వెళదాం కానీ, నీ ప్రోగ్రాం ఏమిటో చెప్పు ఈ రోజు!” ఆరాటంగా అడిగింది, ఐశ్వర్య...

‘‘ఏముంది? టిఫిన్ తినేసి, బట్టలు ఉతుక్కోవాలి... ఆ పని అయ్యాక లంచ్... తర్వాత కాసేపు రిలాక్సింగ్ గా పాటలు విని, కింద టీవీలో ఏద్దైనా మంచి మూవీ వస్తే చూసి, ఆ తర్వాత చదువుకోవాలి. రేపు పరీక్ష ఉంది కదా మనకి!”

‘‘అబ్బా, ఆదివారం కూడా ఇంత సుత్తి ప్రోగ్రామా? అలంకార్ లో మంచి ఇంగ్లీష్ మూవీ వచ్చింది, ఫస్ట్ షో కి పోదామే...”

‘‘నిన్న వెళ్లావు కదే ఆ మూడో నంబర్ రూమ్ మాగీ తో... చాలలేదా?” చిన్నగా కసిరింది మధు.

‘‘అది నిన్న, ఇది ఈరోజు...పైగా అది హిందీ సినిమా... ఈ సినిమా నీతో చూడాలని అనుకున్నానే...”

‘‘అయితే వచ్చే వారం వెళదాం లే... మరి పద... బ్రేక్ ఫాస్ట్ చేసి వద్దాం!” ఇద్దరూ మెట్లు దిగి డైనింగ్ హాల్లోకి వచ్చారు.

అప్పటికే ఆ హాస్టల్లోని అమ్మాయిలంతా కుర్చీల్లో కూర్చుని టిఫిన్ తింటూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

‘‘హాయ్ జంట కవులూ, గుడ్మార్నింగ్...” అంటూ పలకరించారు.వాళ్ళని నవ్వుతూ విష్ చేసి, ఐశ్వర్య, మధూ కూర్చోగానే, భీముడి భార్య భాగ్యం ప్లేట్స్ పెట్టి, లోపలినుంచి వేడి వేడిగా పెసరట్, ఉప్మా పట్టుకు వచ్చి వడ్డించింది. చట్నీ చిన్న గిన్నెల్లో వేసి అందించింది.

‘‘భాగ్యం, నాకింకో పెసరట్ కావాలి... ముందే చెబుతున్నా...” నవ్వుతూ చెప్పి ప్లేటు ముందుకు లాక్కుంది ఐశ్వర్య...

‘‘మూడు ముక్కల పెసరట్... అదిరింది...” ఘుమఘుమలాడిపోతున్న పెసరట్ ను త్రుంచి, అల్లం చట్నీ తో తింటూ అన్నది మధుబాల. ‘‘అవును, మూడు ముక్కల పెసరట్ అని ఎందుకంటారు మధూ?”

‘‘ఉల్లి పాయ, పచ్చి మిర్చి, అల్లం- ఈ మూడు రకాల ముక్కల్నీ సన్నగా తరిగి, ఇలా పెసరట్ మీద అద్ది, వేస్తారు కదా, అందుకని...” ‘‘అవునా, పెసరట్టు మా ఇంట్లో మా అమ్మ ఎప్పుడూ చేయదు...” దిగులుగా అంది ఐశ్వర్య...

“ఏం? ఎందుకని?”

“మాది రైతు కుటుంబం కదా… ఇలాంటి టిఫిన్లు అలవాటులేదు. రాగి సంగటి, జొన్న రొట్టె, ఎప్పుడైనా గోధుమ చపాతీలు! ఇదే మాకు బ్రేక్ ఫాస్ట్… అందుకే నాకు ఇలాంటి టిఫిన్స్ అంటే చాలా ఇష్టం మధూ…” అమాయకంగా చెప్పింది ఐశ్వర్య.

“మరి నీకూ తెలుసుకదే, మీ ఇంటి పరిస్థితి, ఎంతో కష్టపడి నిన్ను చదివిస్తున్నారు మీ నాన్నగారు. నెలతిరిగే సరికి నీకు డబ్బు పంపటానికి ఎంత ఇబ్బంది పడతారో కూడా నువ్వే చెప్పావు… మరి… నీ సరదాల కోసం నువ్విలా డబ్బు తగలేస్తే ఎలా చెప్పు?”

“నా సరదాల కోసం నేను నా అవసరాలు కొన్ని త్యాగం చేస్తాను తెలుసా? ఉదాహరణకు వీకెండ్ కి మూవీకి వెళ్ళాలి అంటే, మన మెస్ లో తప్ప మరెక్కడా ఎంత అవసరమైనా తినను. గైడ్స్ కొనుక్కోకుండా నోట్స్ రాసుకుని చదువుతాను. మధ్య మధ్యలో పండక్కి బట్టలు కొనుక్కోమని నాన్న డబ్బులిచ్చినా వాటిని వాడకుండా జాగ్రత్త గా దాచుకుంటాను. సాయంత్రాలు ఇంకేదైనా చేయాలని, పార్ట్ టైం జాబ్ లా అన్న మాట… డబ్బు సంపాదించాలని ఉంటుంది… కాని, ప్రస్తుతం డిగ్రీ మంచి మార్కులతో పాసవందే మనకి జాబ్ రాదు… అందుకని చదువే మన ప్రథమ కర్తవ్యం!”

“అవును ఐశూ, మనం బాగా కష్టపడాలి… ఈ ఏడాది పూర్తి అయిపోతే, మనకి కాంపస్ లోనే మంచి సెలెక్షన్ రావచ్చు… అరె… ఇదేమిటి?” కంగారు గా వెదుక్కోసాగింది, మధుబాల.

“ఏమైంది?”

“రూమ్ తాళం వేయటం మరచిపోయాను…”

‘‘ఫర్లేదులే, ఇద్దరం ఇక్కడే ఉన్నాము కదా!’’ ఫక్కున నవ్వింది ఐశ్వర్య…

మధుకి కూడా నవ్వొచ్చేసింది. ‘‘యూ నాటీ!’’ అని భుజమ్మీద కొట్టింది నవ్వుతూ…

ఇంకో పెసరట్ వేడి వేడిగా తెచ్చింది భాగ్యం. దాన్ని సగానికి తుంచి వద్దంటున్నా మధూ పళ్ళెంలో పడేసింది ఐశ్వర్య.

టిఫిను తిన్నాక, రూమ్ కొచ్చి, కాసేపు పుస్తకాలు తెరిచారు స్నేహితురాళ్ళు ఇద్దరూ.

***

మధుబాల తల్లిదండ్రులు ఏలూరు వాస్తవ్యులు. మధు వాళ్ళది ఒకప్పుడు కలిగిన కుటుంబమే అయినా ఇప్పుడు మాత్రం మామూలు మధ్యతరగతి కుటుంబం అనే చెప్పాలి. తండ్రి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు. తల్లి మామూలు గృహిణి. మధు పైన ఉన్న ఇద్దరాడపిల్లల పెళ్ళిళ్ళు చేసే సరికి ఆమె తండ్రి కుటుంబరావు గారికి సగం ఆస్తి హరించుకుపోయింది. తర్వాత మగపిల్లాడు మధు అన్నయ్య గిరి కూడా స్కూలు టీచరే. కొత్తగా ప్రక్కనున్న పెల్లెలోనే ఉద్యోగంలో చేరాడు. ఆస్త్మా లో బాధపడే తల్లి ఆయన దగ్గరే ఉంటుంది. లక్షలు ఖర్చు పెట్టి పెళ్ళిళ్ళు చేసినా ఇప్పటికీ ప్రతీ పండక్కి ఏదో ఒకటి కావాలని అడుగుతూ భార్యల్ని పుట్టింటికి తరుముతారు అల్లుళ్ళు. వాటి కోసం డబ్బును సమకూర్చి మళ్ళీ కూతుళ్ళతో పంపేసరికి తలప్రాణం తోకకి వస్తుంది ఆయనకి.

ఈ చికాకుల మధ్య సెలవులకి ఇంటికి వెళ్ళటానికి కూడా మధుబాలకు ఇష్టంగా అనిపించదు. నాన్నని చూస్తే ఎంతో జాలి, ప్రేమ కలుగుతాయి. అందుకే తనకి మంచి ఉద్యోగం వస్తే ఆయన బాధ్యతలు పంచుకుంటూ, వాళ్ళను చక్కగా చూసుకోవాలని కలలు కంటూ, తన చదువు శ్రద్ధగా చదువుకుంటోంది మధుబాల.

ఐశ్వర్య ఇంటి పరిస్థితి మరో విధంగా ఉంది.  ఆమె తల్లిదండ్రులు అనంతపురంలో ఉంటారు.తండ్రి ఒక చిన్నకారు రైతు. ఆయనకి  ముగ్గురు పిల్లలు. పెద్దమ్మాయికి పెళ్లి చేసారు. కొడుకును కూడా పెద్ద చదువులే చదివించినా, అతడు చదువు పూర్తి  కాగానే కలకత్తాలో ఉద్యోగం సంపాదించుకొని వెళ్ళిపోయి అక్కడే తన సహోద్యోగి బెంగాలీ భామను పెళ్లి చేసుకున్నాడు. అతడినుంచి సహాయం అంతంత మాత్రమే. రాయల సీమంతా రాళ్ళ మయమే... వర్షాభావం వలన  పంటలు సరిగ్గా పండక అవస్థలు పడుతున్నా, చిన్న కూతురి మీదే ఆశలు పెట్టుకొని చదివిస్తున్నాడు ఆ తండ్రి.

***

ఆలస్యంగా హాస్టల్ కి వచ్చి రూమ్ తలుపు తట్టబోయి, అది తీసే ఉండటంతో లోపలి తోసింది, మధుబాల. గదంతా చీకటిగా ఉండి,  వెక్కిళ్ళు పెడుతూ ఏడుస్తున్న శబ్దం వినిపించింది.

''ఐశూ...” అని పిలుస్తూ స్విచ్ వేయగానే లైట్ వెలిగింది. హృదయ విదారకంగా ఏడుస్తూ,  మంచం మీద ఒక మూటలా పడుంది  ఐశ్వర్య.మధు మనసు చెరువైపోయింది... “ఏమిటే ఐశూ... ఏమైందిరా?” త్వరత్వరగా వెళ్లి ఆమె పక్కనే కూర్చుని వీపు పై చేయి వేసింది. ‘మధూ,’ ఒక్క ఉదుటున లేచి ఆర్తిలో, ఆమెను చుట్టేసింది ఐశ్వర్య.




‘‘ఐశూ... ఏమైంది? ఇంటి దగ్గర అందరూ బాగున్నారా? చెప్పవే...” గాబరాగా ఆమె చేయి పట్టి ఊపుతూ అడిగింది.

తల అడ్డంగా ఊపింది ఐశ్వర్య. “మా అక్కను బావ బలితీసుకున్నాడు మధూ... నిన్న రాత్రి అక్క చనిపోయిందట... ఈరోజు నాన్న ఫోన్ చేసారు. అమాయకురాలైన అక్క బావ అకృత్యాలకు బలైపోయింది మధూ...” మళ్ళీ వెక్కి వెక్కి ఏడవ సాగింది ఐశ్వర్య.

‘‘అయ్యో...” హతాశురాలైంది మధుబాల.

‘‘అసలు మీ అక్కకు ఏమైంది?”

‘‘ఆ త్రాష్టుడు మా అక్కను పెళ్లి చేసుకుని మూడేళ్ళు అయింది. పద్దెనిమిది సంవత్సరాలకే అక్కకి పెళ్లి చేసారు. అరవిరిసిన పువ్వును ఒక రాక్షసుడి చేతిలో పెట్టారు. ఆ దరిద్రుడికి లేని

వ్యసనం లేదు. చేసేది చిన్న ఉద్యోగమైనా ఊరంతా అప్పులే. తాగుడు, పేకాట మాత్రమే  కాకుండా ఎంతో మంది ఆడవాళ్ళతో సంబంధాలు. తత్ఫలితంగా వాడికి వచ్చిన ఎయిడ్స్ వ్యాధి అక్కకీ సోకింది. నేను ఎన్నో సార్లు నాన్నతో మొర పెట్టుకున్నాను, అక్కని మా ఇంటికి తీసుకు వచ్చేద్దామని. కాని అతను మారతాడన్న ఆశతో కొంతా, కుటుంబం పరువు పోయి నడి వీధికి ఎక్కుతుందన్న మధ్య తరగతి భయంతో కొంతా ఆయన అందుకు ఒప్పుకోలేదు.

చివరికి అక్క పరిస్థితి విషమించి, నిన్న ఆసుపత్రి లోనే చనిపోయిందిట. అటు వాడి పరిస్థితీ ఏమీ బాగుండలేదట.  నేడో రేపో వాడూ పోతాడు. అనవసరంగా మా అక్క పచ్చని బతుకు కాస్తా బుగ్గిపాలై పోయింది… మధూ… అదృష్ట వశాత్తూ అక్కకి పిల్లలు పుట్ట లేదు. లేక పోతే ఈ మహమ్మారి వ్యాధి వాళ్ళకీ సోకి ఉండేదే…” భోరున విలపించింది ఐశ్వర్య.

“అయ్యో ఎంత పని జరిగింది?” మధు బాల కళ్ళు చెమ్మగిల్లాయి. గొంతు పూడుకు పోయింది. ఎలాగో పెగల్చుకుంటూ, “బాధ పడకు ఐశూ… ఆమెకి మనకి ఋణం తీరి పోయి వెళ్ళి పోయింది. నిజంగా అలా జరగటం బాధా కరమే. అయితే ఊరికి వెళతావా ఐశూ?” అన్నది.

“లేదు మధూ… జరగవలసిన అనర్థం జరిగి పోయింది. దహన సంస్కారమూ అయి పోయింది… ఇప్పుడు వెళ్లి ఏం చేయాలి?” మళ్ళీ ఐశ్వర్య కళ్ళు నీటితో నిండి పోయాయి.

“ఐశూ… కూతురిగా నీకు ఒక బాధ్యత ఉంది… అక్కడ తమ పెద్ద  కూతుర్ని పోగొట్టుకున్న అమ్మా నాన్నలు ఎంత వ్యధ అనుభవిస్తున్నారో తెలుసా? నువ్వు వెళితే వాళ్లకి చాలా ఉపశమనంగా ఉంటుంది. నా మాట విని లేచి బట్టలు సర్దుకో… నిన్ను నేను బస్ ఎక్కిస్తాను. తెల్లారే సరికి ఇల్లు చేరతావు. లే…పద…”

అమ్మానాన్నలు గుర్తు వచ్చిన ఐశ్వర్యకు మరింత దుఖం వచ్చింది. నిజం! ఈ వయసులో

అమ్మకి ఎంత గర్భ శోకం? అన్నయ్య కలకత్తా నుంచి ఎలాగూ రాడు. తను వెళితే కొంతైనా వాళ్లకి ఓదార్పుగా ఉంటుంది. అసలు ఎలా ఉన్నారో, తిన్నారో లేదో... అమ్మకి అసలే ఆయాసం... ఆవిడకి ఈ దుఃఖ భారంతో ఏమైనా అయితే? నాన్న మగ వాడే కాని లోపల మనసు వట్టి బేల... దగ్గరుండి చూసుకోక పోతే ఏమై పోతారు వాళ్ళు?

''అవునే... వెళతాను...'' గబ గబా బాగ్ లో బట్టలు సర్దబోయి ఆగి పోయింది.

''ఏమైంది?''

''మధూ, నెలాఖరు కదా, నా దగ్గర డబ్బు లేదు...'' నిస్సహాయంగా కూల బడింది.

''నా దగ్గరుందిలే ఐశూ... పద వెళదాం... పదవ రోజు వరకూ ఉండి అమ్మా నాన్నలతో ఉంటే, వాళ్ళ దుఃఖం నుండి కొంచెమైనా సేద దీరుతారు. వాళ్లకి నువ్వున్నావన్న ధైర్యం చెప్పి, బలం కలిగించి రా...'' తన పర్స్ లోంచి రెండు వేలు తీసి ఐశ్వర్య బాగ్ లో పెట్టింది మధు బాల.

''నీ ఋణం ఈ జన్మలో తీర్చుకోలేను మధూ... నా పుణ్య ఫలం నీవు నా స్నేహితురాలివి కావటం...'' మనసారా కౌగలించుకుంది ఐశ్వర్య... ఆమె కళ్ళు తుడిచి, బయలుదేర దీసింది, మధు.

***

రోజులు గడచి పోతున్నాయి.

మధు బాల, ఐశ్వర్య ఫైనల్ ఇయర్ లోకి వచ్చేసారు. వేరే ఇతర వ్యాపకాలు ఏవీ పెట్టుకోకుండా మనసంతా చదువు మీదనే లగ్నం చేసి చదువుకోవాలని అనుకున్నా, ఐశ్వర్యకు పరిస్థితులు

సహకరించటం లేదు. పెద్ద కూతురి మీద బెంగతో తండ్రి మంచాన పడ్డాడు. నెల నెలా ఆయన పంపించే డబ్బు బాగా తగ్గి పోవటం వలన సాయంత్రం కాలేజి అయ్యాక పార్ట్ టైం గా ట్యూషన్ తీసుకుంది ఐశ్వర్య.
రూప  అనే ఒక పన్నెండేళ్ళ పాపకు ఇంగ్లీష్, మాథ్స్ చెప్పాలి. జన్యు లోపం వలన ఆ పాప నడవ గలిగే స్థితిలో లేదు... ప్రైవేటుగా చదువుకుంటోంది. రూప అమ్మా నాన్నలు మంచి జీతం ఆఫర్ చేయటంతో, దూరమే అయినా ఐశ్వర్య,  కాలేజి అవగానే రెండు బస్సులు మారి మరీ వెళ్ళి వస్తోంది.

మధు బాల కూడా ఒక ప్రైవేట్ జాబ్ లో చేరింది. సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది వరకూ. ఇద్దరూ ఇంచు మించుగా అర గంట తేడా లోనే హాస్టల్ కి వచ్చేస్తారు. స్నానం, భోజనం ముగించి పుస్తకాల ముందు కూర్చుంటే మళ్ళీ పన్నెండుకే పడుకోవటం. మళ్ళీ ఉదయం లేచి పరుగులు, ఉరుకులూ తప్పవు... ఒక్క ఆదివారం మాత్రం ఎక్కడికీ వెళ్ళకుండా కలిసే ఉండేవాళ్ళు ఇద్దరూ.

ఆ రోజు ఐశ్వర్య మూడ్ చాలా చిరాకుగా ఉంది. కాలేజి ఫీజు కట్టటానికి మర్నాడే ఆఖరు తేదీ. చేతిలో ఐదు వందల కన్నా లేవు.  రూప వాళ్ళ ఇంటికి వెళ్ళే సరికే సాయంత్రం ఆరు దాటింది. రూప  అమ్మా, నాన్నా ఇద్దరూ ఇంట్లో లేరు. ఆయా పాపను అప్పటికే రెడీ చేసింది.
“గుడీవినింగ్ టీచర్...” విష్ చేసింది రూప ...

“గుడీవినింగ్ బేబీ, నిన్న చెప్పిన లెక్కలు చేసావా?” పాప తల నిమిరి, కుర్చీలో కూర్చుంది ఐశ్వర్య.

“ఓ” తలూపి, లెక్కల నోట్ బుక్ ని ఆమెకి అందించింది రూప.

“ఓ, వెరీ నైస్... ఎంత బాగా చేసావో...” బాగ్ లోంచి చాక్లెట్ తీసి అందించింది ఐశ్వర్య. ఆయా

పళ్ళెంలో వేడి వేడి దోసెలు రెండు పెట్టి,  టిఫిన్ పట్టుకు వచ్చింది.

“అయ్యో రోజా ఎందుకు?” ఇబ్బందిగా, మొహమాటంగా అంది ఐశ్వర్య.

“తీసుకోండి టీచర్… కాలేజీ నుంచి వస్తారు కదా, ఆకలేస్తుంది… ఇంట్లో ఉన్నా నాకూ ఆకలేస్తుంది. మా మమ్మీ నాకు టిఫిన్, పాలు ఇచ్చి బయటకు వెళ్ళింది… మరి మీరు మీ హాస్టల్ కి వెళ్ళే సరికి బాగా లేట్ అవుతుంది కదా… తినండి…” ప్రేమగా చెప్పింది రూప. టిఫిన్, కాఫీ అయ్యాక, ఇంగ్లీష్ గ్రామరు, లెక్కల్లో కొత్త అధ్యాయం తీసి కొత్త పాఠం చెప్పింది ఐశ్వర్య. పాఠాల్లో పడి సమయం ఎంతయిందో కూడా తెలియలేదు. ఈలోగా వచ్చింది అమల,  రూప  వాళ్ళమ్మ.

“ఏమ్మా ఐశ్వర్యా, బాగున్నావా? ఎలా ఉంది చదువు?” తన గదిలోకి వెళ్లి డ్రెస్ మార్చుకు వచ్చి పలకరిస్తూ కూర్చుంది అమల.
“రూప  చక్కగా చదువుతోంది మేడమ్!” చెప్పింది ఐశ్వర్య.

“అవునా? థాంక్స్ అమ్మా… ఒక్క నెల రోజుల్లోనే ఎంతో పికప్ అయింది. ఇదివరలో నేనే చెప్పేదాన్ని. కాని నాకు బయట బాధ్యతలు ఎక్కువ అయ్యాయి ఈ మధ్య… అందుకే రోజంతా ఇంట్లోనే దాని పక్కనే ఉన్నా, సాయంత్రం క్లబ్ యాక్టివిటీస్ కోసం బయటకు వెళ్ళక తప్పటం లేదు. రేపు ఆదివారం బ్లడ్ డొనేషన్ కాంప్ పెట్టాం… ఆ హడావుడిలో ఉన్నాను…” చెప్పింది అమల.
ఆమె వైపు ఆరాధనగా చూసింది ఐశ్వర్య.

“వదినా…” కొత్త గొంతు వినిపించింది గది బయట నుంచి…

“కార్తీక్ బాబాయ్…హాయ్… ఎప్పుడు వచ్చావు? రా, నా రూమ్ లోకి…” గట్టిగా పిలిచింది

రూప.

“హాయ్ రూపా…” లోపలి వచ్చాడు కార్తీక్.

ఇంచు మించు ఆరడుగుల పొడవులో, అందుకు తగ్గ దేహ ధారుడ్యంతో… మాన్లీ గా ఉన్నాడు. కళ్ళలో అదో రకమైన నిర్లక్ష్యం కనబడుతోంది.
“హాయ్ రా బేబీ, ఎలా ఉన్నావ్?” దగ్గరగా వచ్చి రూపకు షేక్ హాండ్ ఇచ్చాడు కార్తీక్.

“బాగున్నాను… వచ్చిన వెంటనే…నన్ను పలకరించలేదుగా, పో, నీతో మాట్లాడను…” బుంగ మూతి పెట్టింది రూప.

“ఏదో ఫోన్ వచ్చిందిరా… మాట్లాడుతూ ఉండి పోయాను…ఈ రోజు వర్క్ బాగా ఉందిరా… అమ్మ దార్లో కలిసింది. బాగా ఆకలేస్తోంది… ఏమైనా తినేసి వచ్చి కూర్చుందామని… సారీ రా…”

“ఊ…”

వాళ్ళు మాట్లాడుకుంటుంటే కొద్దిగా ఇబ్బంది తోచి, లేచి నిలబడింది ఐశ్వర్య.

అది గమనించిన అమల, “కార్తీక్, ఈమె ఐశ్వర్య. మన రూపకి టీచరు…” అని పరిచయం చేసింది.

“ఇంత చిన్నమ్మాయి టీచరా?  ఓ… వెరీ గ్లాడ్ టూ మీట్ యు అండీ…” చేయి చాచాడు…

మొహ మాటంగా ఆ చేయి అందుకుని వదిలేసింది ఐశ్వర్య.

“చదువుకుంటోంది… ఈ ఏడాది కష్ట పడితే డిగ్రీ చేతికి వస్తుంది…” చెప్పింది అమల.

‘‘నేను…నేనిక  వెళతానండీ…’’ చెప్పింది ఐశ్వర్య.

‘‘బయట హోరున వర్షం… ఎలా వెళతారు?’’ అడిగాడు కార్తీక్.

‘‘ఓ పని చేయి ఐశ్వర్యా… ఎలాగూ ఈ రోజు బాగా లేట్ అయింది కదా… నువ్వూ కార్తీక్ తో పాటే భోజనం చేసేయ్. కార్తీక్, నువ్వు నీ కార్లో ఆ అమ్మాయిని దింపేసి వెళ్ళు…’’ చెప్పింది అమల.

‘‘భోజనమా…రాగానే ఆయా టిఫిన్ ఇచ్చారు.  వద్దు… నేను బస్ లో వెళ్ళి పోతాను లెండి…’’ గాబరాగా అంది ఐశ్వర్య…

‘‘అయ్యో, మొహమాట పడకమ్మా… రా… వడ్డించేస్తున్నా… రూపా నీకు అన్నం కలిపి తెస్తారా…’’ అని వెళ్ళి పోయింది అమల.

‘‘టీచర్… పోనీ ఈరోజుకు నాతో ఉండి పోకూడదూ?’’ అడిగింది రూప.

‘‘ఉహు…నాకు వీలు కాదమ్మా… చదువు కోవలసిన పని ఉంది… ఎప్పుడైనా ఉంటానులే…’’ బుజ్జగింపుగా చెప్పింది ఐశ్వర్య.
కార్తీక్ గది లోంచి వెళ్ళిపోయాడు. అమల భోజనం వడ్డించిన పళ్ళెంతో వచ్చి, ‘‘ఐశ్వర్యా, అన్నీ టేబుల్ మీద పెట్టాను. ఆయా ఉంది. కొంచెం శ్రమ అనుకోకుండా మొహమాట పడకుండా వెళ్లి భోజనం చేయమ్మా.. నేను పాపకి తినిపించి వస్తాను…’’ అంది. చేసేది లేక, గట్టిగా వద్దని చెప్పలేక తలూపింది ఐశ్వర్య.

భోజనాల దగ్గర పెద్దగా మాటలు సాగ లేదు. భోజనమంటే ఎంతో ఇష్టపడే శ్వర్యకు, ప్లేట్ చుట్టూ  ఏవేవో తెలియని ఆధరువులు కనబడుతున్నా, తిండి సయించలేదు.

ఐశ్వర్యను మధ్య మధ్యలో గమనిస్తూ భోజనం పూర్తి చేసాడు కార్తీక్. చామన చాయగా ఉన్నా, చురుకైన కళ్ళు, ఉంగరాలు తిరిగిన జుట్టుతో, క్రీమ్ కలర్ సల్వార్ పైజమాలలో అందంగానే ఉంది ఐశ్వర్య. గడ్డం మీద పుట్టు మచ్చ అందంగా బ్యూటీ స్పాట్ లా అనిపించింది. నవ్వుతున్నట్టున్న కళ్ళు, ప్రసన్నమైన ముఖం... పరీక్షగా చూస్తే మాత్రం ఆ కళ్ళల్లో ఏదో దిగులు గూడు కట్టుకున్నట్టు తోచిందతనికి.

కార్తీక్ తన తల్లి దండ్రులతో వేరే చోట ఉంటాడు. ఒక ప్రైవేటు కంపెనీలో మంచి జీతంతో, మంచి హోదాలోనే ఉన్నాడు. అతని అన్నయ్యా, వదినా వేరేగా ఇక్కడ ఉంటారు. బాధ్యతలు లేక పోవటంతో జీవితాన్ని ఆనందంగా అనుభవించటమే తన ధ్యేయంగా పెట్టుకున్నాడు. అమ్మా నాన్నలు పెళ్లి చేస్తామంటున్నా ఏదో ఒక కారణం వలన దాన్ని వాయిదా వేస్తూ ఉన్నాడు.

‘‘వెళదామా?” నాప్ కిన్ తో చేతులు తుడుచుకుంటూ అప్పటికే భోజనం ముగించిన ఐశ్వర్యతో అన్నాడు. ఇంకా జోరుగా పడుతున్న వర్షాన్ని కిటికీ లోంచి దిగులుగా చూస్తూ తలూపింది, ఐశ్వర్య.

అమలకు చెప్పి అతనితో బయటకు నడిచింది ఐశ్వర్య. ఫ్రంట్ డోర్ తెరిచి పట్టుకున్నాడు ఎక్కమన్నట్టుగా చూస్తూ. ఒద్దికగా ఎక్కి, ముడుచుకుని కూర్చుంది. ఆమెకు ఎందుకో నెర్వస్ గా అనిపించసాగింది. పోనీ దిగి పోయి వెళదామంటే ఆగని వర్షం. నిస్సహాయంగా కూర్చుండి పోయింది. మెత్తగా సాగి పోతుంది కారు... చల్లగా ఉంది ఏసీ వలన... కమ్మని సంగీతం మంద్ర స్థాయిలో వినిపిస్తోంది.

‘‘హలో, నా పేరు కార్తీక్... రావణాసురుడు కాదు...” ఆమె ముఖం ముందు చిటికెలు వేస్తూ అన్నాడు కార్తీక్. అతని ముఖంలో నవ్వు. కొద్దిగా రిలాక్స్ అయింది ఐశ్వర్య.

‘‘అబ్బే, అదేం లేదు... సారీ...” అంది సర్దుకుంటూ...

‘‘కొద్దిగా ఫ్రీగా ఉండండి... ఇబ్బందిగా ఫీల్ అవద్దు...” స్నేహంగా చెప్పాడు.

ఐశ్వర్య కూడా  బావుండదని నవ్వింది.  తన గురించి చెప్పి అతని గురించి అడిగింది. స్నేహం అన్నా, సరదాలన్నా చాలా ఇష్టమనీ, అమ్మా నాన్నా పెళ్ళికి తొందర పెడుతున్నారనీ, కానీ తనకి పెళ్లి అంటే ఇష్టం లేదనీ చెప్పాడు. తన ఇష్టాలు, అభిరుచులూ చెప్పాడు...
అతని ఫ్రీ లైఫ్ గురించి అర్థమైన ఐశ్వర్య, వారాంతానికి అతని అలవాట్లకీ, సరదాలకీ తగలేసే డబ్బును తలచు కొని బాధగా నిట్టూర్చింది... డబ్బు లేకే కదా, తన చదువు ఇబ్బందిలో పడేలా ఉందిప్పుడు...

అమల, అరుణ్ ల సేవా భావాలకీ, కార్తీక్ స్వభావానికీ ఏ మాత్రమూ పొంతన కుదిరినట్టు అనిపించలేదు. స్వంత అన్నదమ్ములలోనే స్వభావ వైరుధ్యాలు...

‘‘నెహ్రూ నగర్ వచ్చేసాం. మీ హాస్టల్ కి ఎలా వెళ్ళాలో చెప్పండి...” అతని మాటలతో ఆలోచనల్లోంచి బయటకు వచ్చి, గుర్తులు చెప్పసాగింది.

హాస్టల్ గేటు ముందు కారాపాడు.

‘‘థాంక్ యు వెరీ మచ్ అండీ...” కృతజ్ఞతగా చెప్పింది ఐశ్వర్య.

‘‘సో, మళ్ళీ ఎప్పుడు?” చిరునవ్వుతో అడిగాడు.

‘‘మళ్ళీనా?” అయోమయంగా అడిగింది ఐశ్వర్య...

‘‘మీరు నాకు నచ్చారు... మళ్ళీ కలవాలనిపిస్తోంది...” చెప్పేసాడు దాచుకోకుండా...

ఐశ్వర్య ముఖం ఎర్ర బడింది.

‘‘ఓకే ఓకే కోపం వద్దు... బై...” నవ్వేసి, కారును బాక్ చేసుకున్నాడు, కార్తీక్. వెను తిరిగి గేటు తెరచు కొని హాస్టల్ లోకి వెళ్ళి పోయింది, ఐశ్వర్య.




‘‘ఏమిటే ఐశూ, ఇంత లేటు? ఎప్పటినుంచి ఎదురు చూస్తున్నానో తెలుసా? బయటేమో కుండపోత వర్షం... ఎలా వస్తావో ఏమిటో అని ఎంత  భయమేసిందో...’’ కంగారుగా అడుగుతున్న మధుబాలకి ‘‘అక్కడే లేట్ అయిందే...అమల గారి మరిది దింపాడు...’’ క్లుప్తంగా చెప్పి బట్టలు మార్చుకుంది.

‘‘ఇంతకీ నువ్వెలా వచ్చావే?’’ ఐశ్వర్య ప్రశ్నకు, నవ్వేసింది మధుబాల.

‘‘అసలు వెళ్ళలేదు. నా ఉద్యోగం నిన్ననే ఊడిందిలే...’’ అభావంగా చెప్పింది.

‘‘ఎందుకు మధూ?’’ ఆశ్చర్యం గా అడిగింది ఐశ్వర్య.

‘‘వాళ్ళకిప్పుడు మనిషి వద్దుట... అంతే చెప్పారు... రేపటి నుండీ మరోటి వెదుక్కోవాలి...అరె, పడుకుంటున్నావేమిటి? అన్నం తినవా?’’

‘‘అక్కడే తినేసానే, అమల గారు చాలా బలవంతం చేసారు... నువ్వు తిన్నావా?’’

‘‘లేదు... కాని ఆకలి కూడా లేదు... అరటి పళ్ళు ఉన్నాయి తింటానులే...’’

‘‘సారీ మధూ... నువ్వు ఎదురు చూస్తావని తెలిసి కూడా హాస్టల్ కి ఫోన్ చేసి, నీతో ఆలస్యం అవుతుందని చెప్పలేకపోయాను... ప్లీజ్, నువ్వు కాస్త తినేయ్... రా, నే తోడుంటాగా...’’ మెస్ నుంచి తెచ్చిన కారేజీ విప్పి కంచం లో అన్నం వడ్డించింది మధు వద్దని అంటున్నా సరే... ససేమిరా అన్న స్నేహితురాలిని బుజ్జగిస్తూ, అన్నం కలిపి తినిపించసాగింది...

‘‘అమ్మ లక్షణాలన్నీ పుణికి పుచ్చుకున్న ఓ ఐశ్వర్యమ్మా, నా పిల్లల్ని నువ్వే పెంచాలమ్మా...’’ అంటూ నవ్వింది మధుబాల.

తానూ నవ్వేసి, ‘‘నువ్వే అమ్మవు నాకు... అన్ని విషయాల్లోనూ...’’ అంది ఐశ్వర్య.

కబుర్లు చెబుతూ మధూ నిద్రపోయినా ఐశ్వర్యకు ఎందుకో త్వరగా నిద్ర రాలేదు. కార్తీక్ రూపం, అతని మాటలూ గుర్తు రాసాగాయి...

***

వద్దు వద్దంటున్నా తన దగ్గర డబ్బు ఉన్నదంటూ కాలేజీ ఫీజు మధు కట్టేసింది... ఐశ్వర్యకు ఏం చేయాలో కూడా తెలియలేదు... అందుకే నెచ్చెలిని కౌగలించుకుని కన్నీరు పెట్టుకుంది.

‘‘అయామ్ సారీ మధూ... నీ పరిస్థితీ అంతంత మాత్రమే అని తెలిసి కూడా... ప్రతీ సారీ నిన్ను ఇబ్బంది పెడుతూనే ఉన్నాను. నన్ను క్షమించు... నీ ఋణం ఎలా అయినా తీర్చుకుంటానే... నన్ను నమ్ము...’’ అంది గద్గద స్వరంతో.

వారానికి మూడు సార్లు రూపకు ట్యూషన్ చెబుతున్నప్పుడు ఏదో వంకతో వస్తున్నాడు, కార్తీక్. వచ్చినప్పుడల్లా రూపతో మాట్లాడుతున్నా అతని చూపులు మాత్రం ఐశ్వర్య చుట్టూనే తిరిగేవి.

ఎంతో ఇబ్బందిగా ఉన్నా ఎందుకో అతను అలా చూడటం ఒక రకమైన గిలిగింతగా తోచేది ఐశ్వర్యకు. అయితే, కార్తీక్ జీవనవిధానం అసలు నచ్చలేదు ఆమెకు ... మంచి జీతం, మంచి హోదా... మంచినీళ్ళలా డబ్బును ఖర్చు చేసే మనస్తత్వం... వీకెండ్ పార్టీలకే బోలెడు డబ్బును

తగలేస్తాడు. 'లేని వాడు లేక ఏడుస్తుంటే, ఉన్నవాడు తినలేక చచ్చాడట!' తన అమ్మమ్మ చెప్పే సామెత గుర్తు వచ్చింది.

రెండు వారాలు గడిచిన తరువాత ఓ శనివారం నాడు ట్యూషన్ ముగించుకుని వస్తుంటే వరండాలో ఎదురు పడ్డాడు కార్తీక్...

"అప్పుడే వెళుతున్నారు? ఇంకా ఏడే అయింది..."

"అవునండి... పాఠం చెప్పటం అయిపోయింది..."బిడియంగా చెప్పింది ఐశ్వర్య.

"సరే రండి, నేను నెహ్రూ నగర్ వెళుతున్నాను... మిమ్మల్ని  డ్రాప్ చేస్తాను..."

"నేను బస్ లో వెళతాను లెండి..." ముందుకు కదలబోయింది.

"ప్లీజ్... నేనూ అటే వెళుతున్నాను కదా... రండి..." కారు ముందు డోర్ తెరిచి పట్టుకోవటంతో ఇక సభ్యత కాదేమోనని కారెక్కింది ఐశ్వర్య.

అటువైపుగా వచ్చి డ్రైవింగ్ సీట్ లో కూర్చుని డోర్ వేసి, కారు స్టార్ట్ చేసాడు కార్తీక్.

మెల్లగా కారును పోనిస్తున్నాడు.

ఎందుకో తెలియదు కానీ ఐశ్వర్యకు కొద్దిగా అనీజీగా తోచింది. అతను తన క్లాస్ మేట్ కాదు, కొలీగ్ కాదు, స్నేహితుడూ కాదు... తగుదునమ్మా అని తాను అతని కార్లో రావటం ఏమిటి? తన మీద తనకే చిరాగ్గా అనిపించింది.

"ఏమిటి, ఏమైంది?" ఆమె ముఖంలోకే పరీక్షగా చూస్తూ అన్నాడు, కార్తీక్...

"అబ్బే, ఏం లేదు..."

"అందమైన ఆడపిల్లలు అబద్ధాలు చెప్పినా అవి అందంగానే ఉంటాయి..." ఐశ్వర్య ముఖం ఎర్రబడటంతో... "అని ఎక్కడో చదివాను..." అని ముగించాడు...

ఐశ్వర్య మాట్లాడలేదు... మౌనంగా ఉండిపోయింది...

"రేపు మీ ప్రోగ్రాం ఏమిటి?" అన్నాడు.

"ఏముంది? బట్టల ఉతుకుడు కార్యక్రమం..." చెప్పింది ఐశ్వర్య...

గలగలా నవ్వేసాడు కార్తీక్...

"ఎప్పుడూ ఎక్కడికీ వెళ్ళరా? ఆదివారం కూడా హాస్టల్ లోనే ఉంటారా?"

‘‘అవునండి... వారంలో పెండింగ్ పనులన్నీ అప్పుడే చేసుకుంటాం కదా... బట్టల పనీ, చదువూ, బజారు పనులు లాంటివి...’’
‘‘ఓహ్... ఈ వారం నేను మా ఫ్రెండ్స్ కి చిన్న ట్రీట్ ఇస్తున్నాను... మీరూ రావాలి మరి...’’
‘‘ట్రీటా? ఇవ్వండి... మీ పార్టీకి రావటానికి నేను మీ ఫ్రెండ్ ని కాను కదా...’’
‘‘ఎందుకు కారు? నేను ఫ్రెండ్లీ గానే పిలుస్తున్నాను... మీరే నన్ను మీ ఫ్రెండ్ గా స్వీకరించటం లేదు...’’
‘‘చూడండి, కయ్యానికీ, వియ్యానికీ ఇంకా నెయ్యానికి కూడా సమ ఉజ్జీ కావాలండి... మేమెక్కడ, మీరెక్కడ? స్నేహం చేయటానికి మన మధ్య ఎన్నెన్నో అంతరాలు...’’
‘‘భలేవారే, నాకు అలాంటి తేడాలు ఏమీ లేవండి... మన మధ్య స్నేహం పెరగాలని ఆశిస్తున్నాను... అందుకే రేపు పార్టీకి రండి... ప్లీజ్... నాకోసం...’’
కరగబోతున్న మనసును చిక్కబట్టుకుంటూ, ‘‘వీలు కాదులెండి రేపు... మరెప్పుడైనా వస్తాను... మా హాస్టల్ వస్తోంది... కారాపండి...’’ అంది ఐశ్వర్య...
‘‘నన్ను డిజప్పాయింట్ చేస్తున్నారు...’’ కినుకగా అన్నాడు కారాపుతూ...
‘‘థాంక్స్ ఫర్ ది లిఫ్ట్ అండీ... జాగ్రత్తగా వెళ్ళండి...’’ కారు దిగి చేయి ఊపి హాస్టల్ లోపలి వెళ్ళిపోయింది ఐశ్వర్య.

***

భోజనం చేస్తున్నప్పుడు జరిగిందంతా చెప్పింది ఐశ్వర్య. వింటున్న మధుబాల, ‘‘పాపం పిలుస్తున్నాడుగా, వెళ్ళరాదూ?’’ అంది నవ్వుతూ...
‘‘ఛ, మనకెందుకే అలాంటి పార్టీలు? అందులోనూ మగవాళ్ళతో... ఊహు...’’ తల అడ్డంగా తిప్పింది.
‘‘సరే, సినిమాకి వెళదాం మనం...’’ అంది మధుబాల...
‘‘మైగాడ్... నువ్వు సినిమాకా? నమ్మలేకపోతున్నాను అమ్మమ్మా.. ఇంతకీ ఏం సినిమా అది?’’
‘‘పాత సినిమా... పాండవ వనవాసం...చాలా బాగుంటుంది...’’
‘‘ఓహో... నువ్విలాంటి సినిమాలు తప్ప చూడవు కదూ? అలాగేలే వెళదాం...’’ చెప్పింది ఐశ్వర్య.

అయితే మర్నాడు ఉదయమే మధుబాల ఊరికి వెళ్ళాల్సి వచ్చింది. ఆమె తండ్రికి ఆరోగ్యం బాగాలేదని ఫోన్ కాల్ రావటంతో హడావుడిగా ఊరికి బయలుదేరింది, ఐశ్వర్యకు లక్ష జాగ్రత్తలు చెప్పి.

***

మధుబాల వెళ్ళేసరికే అనంతరామయ్యను  హాస్పిటల్ లో జాయిన్ చేసారు. ఆయన స్కూలు టీచరు. ముందురోజు క్లాసులో పాఠం చెబుతూ ఉండగానే ఉధృతంగా గుండెల్లో నొప్పి వచ్చింది. ఉన్నపాటున కూలబడిపోయిన ఆయన్ని స్కూలు యాజమాన్యమే హాస్పిటల్ కి తీసుకువెళ్లి అక్కడినుంచి ఆయన కొడుకుకు ఫోన్ చేసి విషయం చెప్పారు.

సరియైన సమయానికి హాస్పిటల్ కి తీసుకురావటం వలన అనంతరామయ్యకు ప్రాణాపాయం తప్పింది. కాని నలభై ఎనిమిది గంటలు గడిస్తే కాని ఏమీ చెప్పలేమని అన్నారు.

మధు ఊరిలోకి రాగానే ఎదురు వచ్చిన పక్కింటి కుర్రాడు, గిరి శిష్యుడూ అయిన  సాల్మన్ ఆమె చేతిలోని బాగ్ ని అందుకున్నాడు. ‘‘ఏరా సాల్మన్, నాన్నగారికి ఎలా ఉందిరా?’’ ఆరాటంగా ప్రశ్నించింది మధుబాల.

‘‘ఇప్పుడు ఫర్వాలేదు అక్కా… నిన్న చాలా సీరియస్  అన్నారు డాక్టర్ గారు…’’ చెప్పాడు వాడు.

ఇంట్లోకి అడుగు పెడుతూనే మధుని గట్టిగా పట్టుకుని ఏడవసాగింది పూర్ణమ్మ.

‘‘ఊరుకో అమ్మా, ఊరుకో… గండం తప్పింది కదా…’’ తన కన్నీళ్లు ఆపుకుంటూ తల్లిని ఓదార్చింది, మధుబాల.

దుఃఖం నుంచి తేరుకున్నాక, తనను తాను కాస్త సంబాళించుకొని, కూతురికి కాఫీ కలిపి ఇచ్చింది పూర్ణమ్మ.

‘‘అమ్మా, అక్కలకి  కబురు పెట్టారా?’’

‘‘వాళ్ళిద్దరికీ నిన్న అన్నయ్య ఫోన్ చేసాడమ్మా, సాయంత్రానికి వస్తారేమో…’’

అక్కడే నీరసంగా పడుకుని ఉన్న నాన్నమ్మ దగ్గరికి వెళ్లి కూర్చుని ఆమె చేతిని మెల్లగా తాకింది మధుబాల. ఆమె కళ్ళు తెరచి, మధును గుర్తించింది.

‘‘ఎప్పుడొచ్చావే బుజ్జీ?’’ అంది నీరసంగా…

‘‘ఇప్పుడే నాని... ఎలా ఉన్నావు?’’
‘‘నాకేమే, చూసావా మీ నాన్నకి గుండెల్లో నెప్పట... కాటికి కాళ్ళు చాచుకుని ఉన్నాను... ఆ మాయదారి దేవుడు నన్ను ఎత్తుకుపోకూడదూ?’’ ఒక్కసారిగా దగ్గుతెర ఆమెను కమ్మేసింది.
‘‘అయ్యయ్యో, అత్తా... ఏమిటిది?’’ పూర్ణమ్మ త్వరత్వరగా వచ్చి ఆమెకు మంచి నీళ్ళు ఇచ్చి, పడుకోబెట్టింది.
హాస్పిటల్ కి వెళ్లి తండ్రిని చూడగానే మధు కళ్ళలో కన్నీరు కాలవలు కట్టింది.
బాగా చిక్కిపోయాడు తన తండ్రి... వయసు మీద పడులోంది... జంట దయ్యాల్లా బీపీ, షుగరూ ఆయన్ను పీక్కు తింటున్నాయి. వచ్చే ఏడాది రిటైర్ అవుతాడు. ఈలోగా కొడుక్కి పెళ్లి చేసి కోడల్ని తెచ్చుకోవాలని సంబంధం కుదుర్చుకున్నారు కూడా... పక్క ఊరిలోనే స్కూలు హెడ్ మాస్టారి అమ్మాయి నిర్మలతో... నిశ్చితార్థం కూడా అయింది... ముహూర్తం వచ్చే నెలలో అనుకుంటున్నారు... ఈలోగానే ఇలా అయింది...
దీనంగా మంచం మీద పడుకుని ఉన్నాడు అనంత రామయ్య. అతని చేతికి అమర్చిన గొట్టం లోంచి సైలైన్ బాటిల్ లో ఉన్న ద్రవాలు శరీరంలోనికి వెళుతున్నాయి. నిద్రకు మందు ఇచ్చినట్టున్నారు...
తల్లినీ చెల్లెల్నీ చూసి, కుర్చీలో కూర్చుని ఉన్న గిరి లేచాడు...
‘‘ఎలా ఉన్నావని’’ చెల్లెల్ని అడిగి, ‘‘ఇందాకే పడుకున్నారమ్మా...’’ అని తల్లితో చెప్పాడు.
‘‘బాగా బెంగ పెట్టుకున్నాడమ్మా... ఇప్పటికి గండం దాటినట్టే... మూడు రోజుల తర్వాత డిశ్చార్జ్ చేస్తారు. కాని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి... జాబ్ కి వాలంటరీ రిటైర్మెంట్ పెట్టటమే మంచిదేమో...’’ దిగులుగా అన్నాడు గిరి.
గిరి ఖాళీ చేసిన కుర్చీలో కూర్చుని, తండ్రి చేతిని తన చేతిలోకి తీసుకుంది, మధుబాల.
చిన్నతనం నుండీ తమ కోసం ఎన్నో కష్టాలు పడ్డ చేతులు... దిగువ మధ్యతరగతి బ్రతుకులు... సరిగ్గా రాని బడి పంతుళ్ళ జీతాలు... అయినా ఏనాడూ తిండికి బట్టకూ, చదువుకూ లోటు లేకుండా చూసుకున్నాడు...
తన చిన్నప్పుడు నాన్నతో షికారుకు వెళ్లి కాలువ గట్టు మీదనుంచి జారి నీళ్ళల్లో పడి కొట్టుకు పోతూ ఉంటే ఈత రాకపోయినా ఆయన కూడా నీళ్ళల్లో దూకి తనను పట్టుకుని గట్టు మీద

కూర్చోబెట్టి తాను మునిగిపోతూ ఉంటే అటు వచ్చిన ఎవరో ఆయన్ని రక్షించారు... ఇంటర్ క్వాలిఫికేషన్ తో ఏదైనా జాబ్ చేస్తానని ఆ తర్వాత ప్రైవేటు గా చదువుకుంటానని తానంటే అందుకు ఒప్పుకోకుండా పట్నంలో ఉంచి డిగ్రీ చదివిస్తున్నాడు...
అక్కలకి కూడా చాలా మంచి సంబంధాలే చూసి చేసాడు పెద్ద పెద్ద కట్నాలిచ్చి... అయినా ఎప్పుడూ డబ్బు కోసం గొడవలే బావలిద్దరూ.... తమను పెంచి పెద్ద చేసిన తమ తండ్రి ఈరోజు ఇలా... మళ్ళీ మధుబాల కనులు నిండు కొలనులైనాయి.
"చెల్లాయ్, ఎందుకురా కన్నీళ్లు? బాధ పడకు... నాన్న మళ్ళీ మనకి దక్కారు అంతే చాలు...నువ్వు భోజనం చేయలేదట కదా... నేను నాన్న దగ్గరుంటాను... నువ్వు అమ్మతో వెళ్లి భోజనం చేసి కాసేపు పడుకుని రా..." సముదాయిస్తూ అన్నాడు గిరి.
"అన్నయ్యా... నాన్నకి ఏమీ ప్రమాదం లేదు కదా... చూడు ఎంత చిక్కిపోయాడో... ఎలా అయిపోయాడో..." దిగులుగా అంది మధుబాల.
"లేదురా, ఆ ప్రమాదం తప్పింది... అబ్జర్వేషన్ కోసం హాస్పిటల్ లో ఉంచమన్నారు డాక్టర్ గారు. అంతే...డోంట్ వర్రీ..."
"సరే అన్నయ్యా..." కళ్ళు తుడుచుకుంది మధుబాల.
"నేను ఇక్కడ ఉంటానురా గిరీ, అదెప్పుడు తిందో ఏమో, చెల్లాయిని తీసుకువెళ్ళి, మీరిద్దరూ అన్నం తినేసి రండి..." అంది పూర్ణమ్మ.
"అదేమిటమ్మా, నువ్వూ తినలేదు కదా..." అంది మధుబాల.
"ఫర్వాలేదమ్మా, అన్నయ్య నాకు తీసుకువస్తాడులే...మీరు బయలుదేరండి..." అందావిడ కుర్చీలో కూర్చుంటూ... ఆమె కళ్ళలో కదలాడుతున్న బాధను, భయాన్ని చూస్తుంటే మధుబాల మనసు నీరైపోయింది.
"అమ్మా... నాన్న తప్పకుండా కోలుకుంటారు... నువ్వలా అయిపోకే... ఎంత చిక్కిపోయావో తెలుసా? నువ్వు బాగుంటే నాన్నతో పాటుగా అందరం బాగుంటాము..." తల్లి చేయిని పట్టుకుని చెబుతూ ఉంటే, ఆర్తితో మధుబాల గొంతు పూడుకుపోయింది.

నీళ్ళు నిండిన కళ్ళతో తలూపింది పూర్ణమ్మ




ఆ సాయంత్రం మెస్ లో టీ తాగి వచ్చేసరికి ఆగకుండా మ్రోగుతున్న మొబైల్ ని  ఆన్సర్ చేసింది ఐశ్వర్య 'ఇదెవరి నంబరో' అనుకుంటూ...

''హలో'' అనగానే అవతలనుంచి...

''హాయ్ ఐశ్వర్యా, నేను కార్తీక్ ని...'' అని వినిపించింది.

ఒక్క క్షణం ఉలిక్కి పడి, వెంటనే తేరుకుంటూ, "హా, చెప్పండి..." అంది మెల్లగా.

''పార్టీకి తీసుకు వెళతాను... రెడీ గా ఉంటారా?''

''నిన్ననే చెప్పాను కదండీ, నాకు ఇంటరెస్ట్ లేదు...''

''ఐశూ... ప్లీజ్...''

అతను అలా చనువుగా 'ఐశూ' అంటుంటే ఐశ్వర్యకు ఒళ్ళు జలదరించింది... ఒక రకమైన మైకం ఆవహించింది...

''ఏమిటీ చనువు?'' అంది చిరుకోపంతో..

''మరి మీరు నా అందమైన ఫ్రెండ్ కదా... అలా పిలవాలనిపించింది...''

''నేను... నేను ఫోన్ పెట్టేస్తున్నాను....''

''ఓహ్, నో... పెట్టేయకు ఐశూ... నన్ను మాట్లాడనీ... ఆరోజు రూప గదిలో నిన్ను చూడగానే ఫ్లాట్ అయిపోయా... ఇంతవరకూ నా జీవితంలో ఎవరినీ చూసి ఇంతగా ఇంప్రెస్ అవలేదు నేను... నా క్లాస్ మేట్స్, కొలీగ్స్... చాలా మంది ఆడపిల్లలనే చూసాను... కాని వాళ్ళల్లో ఎవరికీ లేని స్నిగ్ధత్వం నీలో ఉంది... అందుకే... అందుకే... నీతో స్నేహం పెంచుకోవాలనే ఇంతగా తాపత్రయ పడుతున్నాను... ఐ లైక్ యు... గెట్ రెడీ... ఐ విల్ పిక్ యు అప్... ప్లీజ్...'' మార్ధవంగా అతను చెబుతూ ఉంటే ఇదివరకెన్నడూ ఎరగని ఒక అపురూపమైన భావన కలిగింది ఐశ్వర్యకు...ఒక పురుషుడు ఒక సౌందర్య రాశిగా తనను గుర్తించి, తన అందాన్ని శ్లాఘిస్తున్నాడు... తన ప్రమేయం లేకుండానే ఆమె బుగ్గలు ఎర్రని గులాబీలయ్యాయి. కనులు అరమోడ్పులయ్యాయి.

''మర్చిపోకు... ఒక్క అరగంటలో వస్తున్నాను... మంచి డ్రెస్ వేసుకు రెడీ కావాలి... సరేనా?'' అతని కాల్ డిస్కనెక్ట్ అయింది... ఐశ్వర్య మనసు మాత్రం కనెక్ట్ అయిపోయింది.

***

తన పుట్టినరోజుకు కొనుక్కున్న ఆకాశనీలం మీద వెండి జరీ వర్క్ చేసిన డ్రెస్ వేసుకుంది ఐశ్వర్య. తమ రూము బాల్కనీలోని కుండీలలో పెంచుతున్న గులాబీలలో పసుపు రంగు గులాబీ పువ్వు ను త్రుంచి జడలో పెట్టుకుంది. కాస్త ప్రత్యేకంగా తయారై, క్రిందికి వచ్చి గేటు దగ్గర నిలబడింది అతని కోసం ఎదురు చూస్తూ...

‘అతను రమ్మనగానే వెళ్లిపోవటమేనా? నిన్ననేగా మధూతో మగాళ్ళతో స్నేహమేమిటి అన్నావు?’ బుద్ధి మందలించటం మొదలు పెట్టింది.
‘చస్ స్నేహితుడు ఇప్పుడు అతను నాకు. స్నేహితుడయ్యాక అతడు మనవాడే…’ మనసు మెత్తగా బుద్ధిని మందలించింది.
మరో పది నిమిషాల్లో కార్తీక్ కారు మెత్తగా వచ్చి గేటు ముందు ఆగింది. అతను దిగి ఫ్రంట్ డోర్ తెరిచాడు ఎప్పటిలాగే… అయితే ఎప్పటిలా ముడుచుకుపోకుండా విరిసిన దరహాసంతో ఠీవి గా కారెక్కి కూర్చుంది ఐశ్వర్య.

‘‘ఐషూ… యు ఆర్ లుకింగ్ లైక్ యాన్ యాంజిల్…’’ ప్రశంసగా చూసాడు కార్తీక్ డ్రైవ్ చేస్తూనే …

‘‘థాంక్స్ అండీ…’’ అంది స్వల్పంగా సిగ్గు పడుతూ…

‘‘నిజంగా నువ్వు చాలా బావుంటావు తెలుసా? ఐ లైక్ దిస్ గ్రేస్!’’ అన్నాడు కన్నార్పకుండా ఆమెనే చూస్తూ…

‘‘ప్లీజ్, కాస్త రోడ్డు కూడా చూడండి… అనవసరమైన ప్రమాదాలు జరిగిపోగలవు!’’ చిరునవ్వుతో హెచ్చరించింది ఐశ్వర్య.

‘‘నిజంగా థాంక్స్, నా స్నేహాన్ని, ఆహ్వానాన్ని కూడా మన్నించి నాతో వస్తున్నందుకు…’’ మనస్ఫూర్తిగా చెప్పాడు కార్తీక్.

‘‘నాకే ఆశ్చర్యంగా ఉంది అసలు మీ స్నేహాన్ని ఎలా అంగీకరించగలిగానా అని!’’ స్వగతంగా అన్నది ఐశ్వర్య.

‘‘అదేమిటి ఐషూ? నేను అంత పాపిష్టి వాడినా?’’ చిన్నబుచ్చుకున్నాడు కార్తీక్.

‘‘అహ  అదికాదు… అంతరాలని చెరిపివేసేదే అసలైన స్నేహం అని నాకు తెలుసు… కాని… మీ

ఆహ్వానమో, నా మనసు చేసిన చిత్రమో కాని, నేను మీతో వస్తున్నాను... అదే నాకు ఆశ్చర్యంగా ఉంది అంటున్నాను... అంతే..."

ఈసారి ఏమీ మాట్లాడలేదు కార్తీక్. మౌనంగా డ్రైవ్ చేస్తూ ఉండిపోయాడు.

"అయామ్ సారీ, మిమ్మల్ని నొప్పించా?"

"నో..నో... నాటెటాల్, ఇన్ ఫాక్ట్, మనసులో అనిపించిన భావనను ఉన్నదున్నట్టు చెప్పటం నాకు నచ్చింది...కొన్ని భావనలకు లాజిక్కులూ, కారణాలు ఉండవు కదా?" చిరునవ్వుతో అన్నాడు కార్తీక్.

కార్తీక్ ఎప్పుడూ ఒక పక్కగా పెదవిని వంచి నవ్వుతాడు... ఆ వంపు, నవ్వినప్పుడు గడ్డం మీద పడిన చిరు సొట్ట ముచ్చటగా అనిపించింది ఐశ్వర్యకి.

'హోటల్ వినోదిని' పోర్టికో లో కారు ఆగగానే, అక్కడి స్టాఫ్ కారును హాండ్ ఓవర్ చేసుకున్నారు.

"రా ఐశూ... మన వాళ్ళు అంతా వచ్చేసి ఉంటారు..." కారు దిగి అటుగా వచ్చి ఫ్రంట్ డోర్ తెరిచాడు. యువరాణి లా దిగింది ఐశ్వర్య... మనసులో మాత్రం 'పాలెస్ లా ఉంది... ఇలాంటి హోటల్ ని ఇంతవరకూ ఎప్పుడూ చూడలేదు...' అనుకుంది.

గ్లాస్ డోర్స్ తెరవగానే పరిమళ భరితమై చుట్టేసింది శీతలపవనం. సెంట్రల్ ఎయిర్ కండిషన్డ్ వాతావరణాన్ని ఫీల్ అవుతూ, కార్పెట్ మీద అడుగులు మెత్తగా పడుతూ ఉండగా, ఆ లాంజ్ లోని మెత్తని సోఫాలను, ప్రతీ కార్నర్ లోనూ అందంగా అమర్చిన తాజా రోజాపూల అలంకరణను, సన్నగా వినిపిస్తున్న పాశ్చాత్య సంగీతాన్ని గమనిస్తూ, షాండిలియర్ దీపాల వెలుగులో నవవధువులా మెరిసిపోతున్న ఆ హోటల్ అందాలను పరికిస్తూ, అతన్ని అనుసరించింది, ఐశ్వర్య.

'అభినయ' రెస్టారెంట్ వైపు నడిచాడు కార్తీక్. అప్పటికే అక్కడ ఎదురు చూస్తున్న కొలీగ్స్,

మిత్ర బృందం ఒక పదిమంది వరకూ ఉన్నారు.
"ఏమిటిది కార్తీక్ ఇంత ఆలస్యమా? మా కళ్ళు కాయలు కాస్తున్నాయి..." అన్నది ఓ అమ్మాయి. చామన చాయకు ఒక ఛాయ తక్కువ ఉన్నా చాలా యాక్టివ్ గా ఉన్నది ఆమె.

"గంట నుంచి పడిగాపులు పడి ఉన్నాం బాస్..." నవ్వాడు మరో అతను.

"హే, హూ ఈజ్ దిస్ డాల్?" సంభ్రమంగా ఐశ్వర్యను చూస్తూ అడిగింది మరో తెల్లని అమ్మాయి. మిగిలిన అబ్బాయిలంతా బహుశా కార్తీక్  టీం మేట్స్ కాబోలు,  నవ్వుతూ చూస్తున్నారు.

"దిస్ ఈజ్ ఐశ్వర్య మై ఫ్రెండ్... ఐశ్వర్యా, దీజ్ ఆర్ మై ఫ్రెండ్స్ అండ్ కొలీగ్స్... ఈమె పేరు సోఫియా. ఇదిగో ఈమె నేహా... ఇతను సాహిల్... హి ఈజ్ లక్కీ... దిస్ గై ఈజ్ అమర్..." పరిచయాలు కావించాడు కార్తీక్.

"ఇదిగో, ఈ సాహిల్ కి ఒక ప్రాజెక్ట్ నిమిత్తం అమెరికా పంపిస్తోంది మా కంపెనీ... ఆ సందర్భంగా నేను వీళ్ళందరికీ డిన్నర్ ఏర్పాటు చేసాను..." వివరించాక, అప్పటికే రిజర్వ్ చేసుకున్న పెద్ద టేబుల్ చుట్టూ అందరూ కూర్చున్నారు.

అందరినీ ఛాయిస్ అడిగి ఎవరికి  కావలసినవి, వాళ్లకి ఆర్డర్ చేయసాగాడు కార్తీక్... ఐశ్వర్య వైపు తిరిగి, "నీకు ఏం కావాలి ఐశూ?" అని అడిగాడు ఆప్యాయంగా.

"నీ ఛాయిసే నా ఛాయిస్ కార్తీక్..." ముందే తన టీం మేట్స్ ముందు బహువచనం వాడవద్దు అన్న కార్తీక్  మాటలను గుర్తు తెచ్చుకుంటూ చిరునవ్వుతో చెప్పింది, ఐశ్వర్య.

"దట్స్ గుడ్..." అని చెబుతూ, తనకీ, ఐశ్వర్యకి రోటీలు, వెజ్ కోఫ్తా కర్రీ, నూడిల్స్ ఆర్డర్ చేసాడు కార్తీక్. సోఫియా, నేహా ఇద్దరూ ఐశ్వర్యతో చాలా స్నేహంగా మాట్లాడసాగారు. కబుర్ల మధ్య డిన్నర్ చివరి అంశానికి వచ్చారు. ఎవరికి  కావాల్సిన డెజర్ట్ వారికి ఆర్డర్ ఇచ్చాడు

కార్తీక్. తనకీ ఐశ్వర్యకీ మాత్రం కాఫీ ఫ్లేవర్డ్ ఐస్ క్రీమ్ ఆర్డర్ ఇచ్చాడు.

ఆ చల్లని వాతావరణంలో, ప్రశాంతమైన ఆ పరిసరాలలో కార్తీక్ పక్కనే కూర్చుని చల్లగా ఆ ఐస్ క్రీమ్ తినటం, ఆ ఫ్లేవర్... అలాగే ఐశ్వర్య మనసులో నిలిచిపోయాయి మధుర క్షణాలై... ఎప్పటికీ ఈ నిమిషాన్ని మాత్రం మరువలేను... అనుకుంది మనసులో... ఒక చిన్న మమతాంకురం మొలకెత్తింది హృదయ క్షేత్రంలో...

బిల్ చెల్లించి, "సో, యు ఆర్ లీవింగ్ టుమారో... సాహిల్.. మిస్సింగ్ యు... మూడునెలలు ఎంతలో గడుస్తాయిలే... హోమ్ సిక్ నెస్ పెట్టుకోక, చక్కగా ఎంజాయ్ చేసి రా... హావ్ అ వెరీ నైస్ ట్రిప్..." అని సాహిల్ ని హగ్ చేసుకున్నాడు కార్తీక్... మిగిలిన వాళ్లకి చేయి ఊపి, ఐశ్వర్యతో, "వెళదామా?" అన్నాడు... తలూపి, మిగిలిన వారికి తానూ చేయూపి, అతనితో బయలుదేరింది, ఐశ్వర్య. తిరిగి వస్తున్నప్పుడు కారులో ఇద్దరూ ఏమీ మాట్లాడుకోలేదు కాని, మౌనమే మధుర సంగీతమై ఇద్దరి మనసులనూ అలరించినట్టు తోచింది...హాస్టల్ గేటు దగ్గర కారాపి, ఆమె దిగబోతుంటే, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుని, ఒక సారి నొక్కి వదిలేసాడు కార్తీక్. ఆ స్పర్శ తనకెన్నో చెప్పినట్టే అనిపించింది ఐశ్వర్యకి. చేయి ఊపి గేటు తెరచుకుని లోపలికి వెళ్ళిపోయింది.

***

ఆ రాత్రికి మధుబాల అక్కలు ఇద్దరూ కూడా వచ్చారు. వారం రోజుల తర్వాత, అనంత రామయ్యను డిశ్చార్జ్ చేసారు. మొదటి సారి అటాక్ రావటం వల్ల మరో సారి రాకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా బీపీ కంట్రోల్ లో ఉండాలని చెప్పారు డాక్టర్లు.

"గిరీ, నీ పెళ్ళితో పాటుగా మధూకి కూడా చేసేస్తే... నా బాధ్యత తీరుతుందేమో అనిపిస్తోందిరా..." భార్య స్పూనుతో తాగిస్తున్న జావను తాగుతూ అన్నాడు అనంతరామయ్య.

‘‘వద్దు నాన్నా, చెల్లాయిని చదువుకోనీండి. ఉద్యోగం చేస్తే దానికి కాస్త ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటుంది. లేకపోతే మా బతుకుల్లాగే తయారవుతుంది...” చెప్పింది మధూ పెద్దక్క వైజయంతి మాల.

‘‘అవున్నాన్నా, అది చదువుల సరస్వతి... దాని భవిష్యత్తును పాడు చేయవద్దు...” చంటి దాన్ని ఒడిలోకి తీసుకుంటూ తానూ అక్కను బలపరచింది చారుశీల.

అప్పటికే వారం రోజుల పైగా కాలేజీ మానేయటంతో అక్కలతో పాటుగా తానూ సిటీకి బయలుదేరింది మధుబాల, తల్లికీ, అన్నకూ వెయ్యి జాగ్రత్తలు చెప్పి. నానమ్మ కాళ్ళకు నమస్కరించి ఆశీర్వచనాలు తీసుకుంది.

***

హాస్టల్ రూమ్ కి రాగానే ఐశ్వర్యలో వచ్చిన మార్పు మధుబాలకు సుస్పష్టంగా గోచరించింది. గదిలోకి రాగానే ఖరీదైన సెంటు వాసన నాసికాపుటాలకు సోకింది. ఐశ్వర్య బెడ్ పక్కన అర నిండా ఖరీదైన కాస్మెటిక్స్ ఉండటం గమనించింది. బట్టల స్టాండు మీద విప్పిన కొత్త డ్రెస్ ఉంది. ఏం జరిగి ఉంటుందో లీలగా అర్థమౌతుంటే, కించిత్ భయం కలిగింది మధుబాలకు. ఆదమరచి నిదురపోతున్న ఐశ్వర్య ముఖంలోని వింత కాంతిని చూస్తుంటే ముచ్చటగా అనిపించింది.

అలికిడికి కనులు విప్పిన ఐశ్వర్య ‘‘ఎప్పుడు వచ్చావే?” అంది, లేచి గట్టిగా కౌగలించుకుంటూ. “ఇప్పుడే కాని, ఇదేంటే తలుపులు దగ్గరికి వేసి మరీ పడుకున్నావు? లోపల గడియ పెట్టుకోవద్దూ?” అంది మధు బాగ్ లోని వస్తువులన్నీ తీసి సర్దుతూ.

‘‘ఉదయమే లేచానే. కాసేపు చదువుకొని మళ్ళీ పడుకున్నాను. ఈరోజు టెస్ట్ ఉంది మనకి. నువ్వు రాయక్కరలేదులే... ఆ ఇంతకీ మీ నాన్నగారికి ఎలా ఉందే?”

‘‘ఫర్లేదు ఐశూ... గండం తప్పింది ప్రస్తుతానికి. నా గురించి దిగులు పడుతున్నారు...”

“ఊ...” నిట్టూర్చింది ఐశ్వర్య, తన తల్లిదండ్రులు మనసులో మెదలగా.

“ఏమిటే ఇవన్నీ? ఆ డ్రెస్ ఎప్పుడు కొన్నావు? అసలు డబ్బులు ఎక్కడివి?” అడిగింది మధుబాల.

“అదంతా పెద్ద కథ. నువ్వు ఫ్రెష్ అయి రా... టిఫిన్ తింటూ చెప్పుకుందాం... నేను ఆల్రెడీ స్నానం కూడా చేసేసాను...” అంది ఐశ్వర్య.
తలపంకించి, బట్టలు తీసుకొని, రెస్ట్ రూమ్ వైపు నడిచింది మధుబాల.

***

“సో... కార్తీక్ ని ప్రేమిస్తున్నావా? అతనే అవన్నీ నీకు ప్రెజెంట్ చేసాడా?”

“అవును మధూ... కార్తీక్ లో ఏదో ఆకర్షణ ఉంది... అది నన్ను అతడి వైపు లాగేస్తోంది... నేను తట్టుకోలేక  అటే వెళ్ళిపోతున్నాను...”
“కానీ... ఐశూ... నీ చదువు?”

“చదువుకేమైందే, చక్కగా చదువుకుంటాను...”

“వివాహం విద్య నాశాయ - అన్నారు పెద్దలు... నీకు తెలియదా?”

మధూ అన్న మాటలు మెదడుకు అందగానే ఫక్కున నవ్వింది ఐశ్వర్య.

“అంటే ఏమిటి? ఇప్పుడు నేను కార్తీక్ ని పెళ్ళి చేసేసుకుంటానని అనుకుంటున్నావా?”

“ఇప్పుడు కాకపోతే వచ్చే ఏడాదైనా చేసుకుంటావు కదా... ప్రేమలో పడితే ఊబిలో పడినట్టే అని ఎక్కడో చదివాన్లే... మనసంతా అతడి మీదనే ఉంటే, చదువు అటకెక్కించేస్తావని నా భయం... మన అంతస్తులు ఎలాంటివో, నీకూ తెలుసు కదా... పెళ్ళి అనేది జీవితంలో స్థిరపడినాక

చేసుకుంటేనే మంచిది...”

“అమ్మా మధుబాలా, నా ప్రేమకూ చదువుకూ ఎలాంటి సంబంధమూ లేదు... నేను చక్కగా శ్రద్ధ పెట్టి చదువుకుంటాను. నా గోల్స్ నేను మరచిపోను...మంచి ఉద్యోగం సంపాదించుకుంటాను. సరేనా? తర్వాత మరో విషయం... అసలు నేను పెళ్ళే చేసుకోను!” మధుబాల కళ్ళు పెద్దవయ్యాయి.

“ఏమిటీ, పెళ్ళి చేసుకోవా? అదేమిటే?”




“ఈ భూ ప్రపంచకంలో పెళ్ళి చేసుకుని ఎవడైనా సుఖ పడ్డాడా చెప్పు గోవిందూ!” నవ్వు దాచుకుంటూ అంది ఐశ్వర్య.
“ఏయ్...” నెత్తి మీద మొట్టింది మధు...
“మిస్సమ్మ నేనూ చాలా సార్లు చూసాను కాని, నువ్వు చెప్పేది నిజమా? ఊరికే జోక్ చేస్తున్నావు కదా?” అంది నవ్వేస్తూ.

ఐశ్వర్య ముఖం గంభీరంగా మారింది.
‘‘మొట్ట మొదటి సారి నేను టెన్త్ చదివేటప్పుడు నా క్లాస్ మేటు మంగ పెళ్ళి పేరుతో ఓ మోసగాడి కుట్రకి బలి అయి పోవటం చూసాను. ముంబై లో జాబ్ చేస్తున్నాడని వాడికిచ్చి చేసారు., పెళ్ళైన మూడో నెలలో అరబ్బు షేకులకి అమ్మేశాడు దాన్ని... ఎప్పుడూ నవ్వుతూ ఉండే మా మంగ ఎవ్వరికీ కనబడకుండా మాయమైపోయింది. బ్రతికుందో లేదో ఇప్పటికీ తెలియదు.
ఇక మా అక్కయ్య సంగతి తెలుసు కదా... తన అపరాధం లేకుండా ఎయిడ్స్ కి ఆహారమైపోయింది. వాడూ ఇప్పుడు ఇవాళో రేపో అన్నట్టు ఉన్నాట్ట... మన వార్డెన్ పద్మలత గారిని భర్త వదిలి వెళ్ళిపోయాడు. ఎందుకు ఏం తప్పు చేసిందని? మగవాళ్ళ దౌష్ట్యానికి మన ఆడవాళ్ళు బలి చేయబడుతున్నారు. అందుకే నాకు పెళ్ళి పేరుతో చేయబడే ఈ దోపిడీ అంటే చాలా అసహ్యం వేస్తోంది. పెళ్ళి చేసుకోకూడదని ఏనాడో నిర్ణయం చేసుకున్నాను నేను...ఓయ్ మధూ... నువ్వు విన్నది నిజమే...’’ అలాగే తనవైపు చూస్తున్న మధూ చేయి పట్టి కుదిపింది ఐశ్వర్య.
‘‘మరి... ఆ కార్తీక్ తో...’’
‘‘పిచ్చి మధూ... ప్రేమకీ పెళ్ళికీ సంబంధం ఏముంది? నా చదువు అయ్యాక అతనితో సహజీవనం చేయాలని అనుకుంటున్నాను...’’
‘‘ఏమిటీ? సహజీవనమా!?’’ కీచుగా అరిచింది మధు.
అవునన్నట్టు తలూపింది ఐశ్వర్య.
‘‘ఐశూ, నీకేమైనా మతి పోయిందా? అది ఏ సంప్రదాయం చెప్పు? ఎందుకు ఇలాంటి పిచ్చి నిర్ణయాలు? సమాజం పట్ల నీకు అవగాహన లేదే, అసలు నీది సరియైన నిర్ణయమే కాదు ఐశూ... టూ మచ్ చేయకు...’’
‘‘కాదు మధూ... ‘సహజీవనం’ అనేది చక్కటి ఏర్పాటు. ఇద్దరిలో ఎవరికీ ఎవరి మీదా హక్కులు, అధికారాలు ఉండవు. ఆ జీవితం బోర్ కొట్టినప్పుడు వెళ్ళి పోయి వేరేగా బ్రతకవచ్చు... నా ఆర్థిక స్వేచ్ఛ కూడా నాకు ఉంటుంది... కార్తీక్ అంటే నాకు ప్రేమే... కాని అతడిని బంధించే అధికారం నాకు లేదు. అతని ఐడియాలు కూడా ఇవే... అందుకే ఈ ప్రపోజల్

నాకు బాగా నచ్చింది. ఇంకెంత? మూడు నెలలు... పరీక్షలు అవగానే, మా కోసం ఫ్లాట్ తీసుకుంటానని అన్నాడు...'' మురిపెంగా చెప్పింది ఐశ్వర్య.
మధుబాల కనుల ముందు 'ఇదిగో, ఈ నిప్పు కణికతో ఆడుకుంటాను, ఎర్రగా అందంగా ఉంది కదా...' అని అంటున్న అమాయకపు బాలిక కదలాడింది, ఐశ్వర్య రూపంలో...
''ఐశూ... నీ ఆలోచన చాలా దారుణంగా ఉంది... పాశ్చాత్య నాగరికత నుంచి మనం దిగుమతి చేసుకునేవి ఇవా? వాళ్ళ కష్టపడే తత్త్వం, క్రమశిక్షణ... ఇవి చూసి నేర్చుకోవాలి. అంతే కాని ఇలాంటివి ... ఊహు, నువ్వు బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో ఐశూ... కావాలంటే నేను కార్తీక్ తో మాట్లాడతాను...'' నచ్చజెప్పబోయింది.
''మధూ... ఇటు చూడు, నేను ఆనందంగా ఉండటమే కదా నీకు కావలసింది?''
''అవును... నా నెచ్చెలి ఎప్పుడూ ఆనందంగా ఉండాలి...''
''ఇదిగో ఈ జీవన విధానమే నాకు ఆనందం కలిగించేది అర్థమైందా? పిచ్చి మొద్దు... అలా భయపడిపోకే... అయినా ఇంకా సమయముంది కదే... ముందు బాగా చదువుకోవాలి. అందుకే పరీక్షలు అయ్యే వరకూ కార్తీక్ ని కలవదలచుకోలేదు...'' గట్టిగా చెప్పేసింది ఐశ్వర్య.
అయోమయంగా చూసి, దేవుడికి తన నేస్తాన్ని కనిపెట్టి ఉండమని మనసులోనే గాఢంగా వేడుకుంది మధుబాల.

***

అన్నట్టుగానే ఎన్నిసార్లు ఫోన్ చేసినా కార్తీక్ ని కలవలేదు ఐశ్వర్య. ఆమె నిగ్రహానికి అబ్బుర పడినది మధుబాల. కార్తీక్ అంటే ఎంతో ప్రేమ ఉన్నా, తన భవిష్యత్తు అంటే ఇంకా ప్రేమ కలిగిన ఆ అమ్మాయిని చూసి శ్లాఘించ లేకుండా ఉండలేకపోయింది మధుబాల.
ఆఖరి పరీక్ష అయిన తరువాత కాలేజీ దగ్గరకు కారు తీసుకుని వచ్చాడు కార్తీక్. మధుబాలను అతనికి పరిచయం చేసింది, ఐశ్వర్య.
''మధు గారూ, ప్లీజ్ జాయిన్ అజ్ ఫర్ లంచ్...'' ఆహ్వానించాడు, కార్తీక్.
అతనితో మాట్లాడే అవకాశం కోసం ఎదురు చూస్తున్న మధుబాల వెంటనే అంగీకరించింది. కార్తీక్ చామన చాయలో ఉన్నా అందగాడే అనుకుంది. ఐశ్వర్యను చూడగానే అతని కళ్ళలో మెరిసిన  మెరుపులు మధుబాలకు సంతృప్తిని కలిగించాయి.

'ఐశ్వర్య చేతిని వదిలి పెట్టడు... వీరి బంధం మూడు ముళ్ళ బంధం అయ్యేలా చూడాలి' అని గట్టిగా అనుకుంది. మధు ఉన్నందు వలన పెద్దగా ఏమీ మాట్లాడకుండా డ్రైవ్ చేయసాగాడు కార్తీక్. అతనితోనూ, మధూతోనూ తానే గలగలా మాట్లాడసాగింది ఐశ్వర్య.

హోటల్ దగ్గర కారు ఆగగానే కార్తీక్ పక్కనే ముందు సీట్ లో కూర్చున్న ఐశ్వర్య లేడి పిల్లలా చక్ మని దిగింది. డోరు తెరిచి, మధు చేయి పట్టి దింపి, నడిపించింది. ఆ స్టార్ హోటల్ యొక్క హొయలు చూస్తూ అడుగులో అడుగు వేసుకుంటూ ఐశ్వర్యను అనుసరించింది మధు. వెనకాలే కార్తీక్ కూడా వచ్చాడు.

చల్లని ఆహ్లాదకరమైన వాతావరణంలో ముగ్గురూ ఒక టేబుల్ దగ్గర కూర్చున్నారు. రోటీ, పనీర్ కర్రీ ఆర్డర్ చేసాడు కార్తీక్ ముగ్గురికీ.

అతన్నే పరిశీలనగా చూస్తున్న మధుబాల ఉన్నట్టుండి "కార్తీక్, నేను మీతో కొంచెం మాట్లాడాలి...' అని అనటంతో ఉలిక్కి పడింది ఐశ్వర్య. "ఏయ్..." అంటూ వారిస్తున్నట్టుగా ఆమె చేయి నొక్కింది.

"చెప్పండి మధూ! మాట్లాడండి..." ప్రోత్సాహ పూర్వకంగా నవ్వాడు కార్తీక్.

"మా ఐశ్వర్య మీద మీకు ఎలాంటి ప్రేమ?"

జవాబు చెప్పలేనట్టు చూసాడు కార్తీక్...

"మీకు ఎలా చెప్పాలో తెలియడం లేదు. ఐశ్వర్యను చూడగానే 'ఈమె నాది' అనిపించింది. తను నాకు కావాలి... ఆమెతో నా జీవితం చాలా హాయిగా ఉంటుంది... తాను నవ్వితే పన్నీటి జల్లు... అలిగితే ఎడారిలో ఎండల సెగలు..." ఇంకా ఏదో చెప్పబోతున్న అతనితో, "మరైతే, పెళ్ళి చేసుకోవచ్చు కదండీ?" అంది మధుబాల.

"పెళ్ళి! ఆ చట్రం లో బంధింపబడటం నాకు ఇష్టం లేదు..." దృఢంగా అన్నాడు కార్తీక్.

"అంటే... ఎంత కాలం కలిసి ఉంటారు?" సూటిగా అతన్నే చూస్తూ అన్నది మధుబాల, వారిస్తున్న ఐశ్వర్యను పట్టించుకోకుండా..

"ప్రస్తుతం మాకిద్దరికీ ఒకరి పట్ల ఒకరికి ప్రేమ, అనురాగం ఉన్నాయి. అయితే అవి ఇప్పుడే కాదు, ఎల్లకాలం ఉంటాయనే ఆశిస్తున్నాను... ఇద్దరం స్వేచ్ఛా జీవులమే... మా ఇంట్లో కూడా నా పెళ్ళికి తొందర చేస్తూనే ఉన్నారు చాలా కాలంగా... అయితే, నా జీవన విధానం,

మనసులోని ఆలోచనలు వేరేగా ఉన్నాయి. నేను పెళ్ళికి పరమ వ్యతిరేకిని. బంధాలు, బాధ్యతలు ఇష్టం లేదు. చాలా చిన్నదైన ఈ జీవితాన్ని పూర్తిగా ఆనందించటానికే నేను ఇష్టపడతాను. ఐశ్వర్యకు కూడా నా అభిప్రాయాలు నచ్చాయి. అందుకే ఇద్దరం...''

అతని మాట పూర్తి కాకుండానే అంది మధుబాల... ''కానీ ప్రపంచం మిమ్మల్ని గౌరవంగానే చూస్తుంది అనుకుంటున్నారా?''

''చూడండి మధూ, మా జీవితాలు మా ఇష్టం... ఈ ప్రపంచంతో మాకు సంబంధం లేదు...'' తినటం పూర్తి చేసి మంచి నీళ్ళు తాగుతూ అన్నాడు కార్తీక్.

''ఐశ్వర్యా, ఇది చాలా రిస్క్ తో కూడుకున్న వ్యవహారం... అతను మగవాడు. ఒక స్త్రీగా నువ్వే ఎక్కువ సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుంది...'' నచ్చ జెబుతున్నట్టు అన్నది మధుబాల.

''అంతా నీ భ్రమ మధూ... ఈ ప్రపంచం నేను బాధల్లో ఉన్నప్పుడు తోడు రాలేదు... నా జీవితంతో దానికి సంబంధం లేదు... మేమే దాన్ని వెలి వేస్తాం...''

పసి పాపను చూసినట్టు ఐశ్వర్య వంక చూసిన మధుబాల, నిస్సహాయంగా లేచింది.

''అదేమిటి, మీరు ఏమీ తినలేదు...'' నొచ్చుకున్నాడు, కార్తీక్.

''ఇట్స్ ఆల్ రైట్... సయించటం లేదు... నేను వస్తాను...''

''ఉండు మధూ, నేనూ వచ్చేస్తున్నాను... కార్తీక్, మళ్ళీ కలుద్దాం. బై...'' మధుని అనుసరించింది ఐశ్వర్య.

''ఉండండి, నేను డ్రాప్ చేస్తాను...'' అని కార్తీక్ పిలుస్తున్నా వినకుండా, వెను దిరిగి చూడకుండా బయటకు వచ్చేసింది మధుబాల.

నిస్సహాయంగా ఆమెతో వచ్చిన ఐశ్వర్య అప్పటికే ఆటో ఎక్కేసిన మధు పక్కన చతికిలబడింది.

***

బీరువా తాళాలు వేసి వెనక్కి తిరిగిన అమల గుమ్మంలో నిలబడిన అమ్మాయిని చూసి, ''ఎవరమ్మా?'' అని అడిగింది ఆదరంగా... తమ క్లబ్ సహాయం కోరి వచ్చే అనాధలకు లోటు లేదు మరి.

‘‘అమల గారు మీరే కదండీ? నేను మీతో మాట్లాడటానికి వచ్చాను... లోపలికి రావచ్చా?’’ మెల్లగా అడిగింది.

రమ్మని తల ఊపి, కూర్చోమన్నట్టు ఎదురుగా ఉన్న కుర్చీ చూపించింది అమల. సన్నగా పొడుగ్గా ఉన్న ఆ అమ్మాయి ముఖంలో ఏదో వేదన కదలాడులోంది. ఆ వేదనలో కూడా చాలా అందంగా ఉంది ఆ అమ్మాయి.

‘‘ఎవరమ్మా నీవు? నీ పేరు?’’ బెల్ కొట్టింది అమల అడుగుతూనే.

‘‘నా పేరు మధుబాల అండీ. ఇక్కడే డిగ్రీ చదువుతున్నాను. ఐ మీన్ ఫైనల్ పరీక్షలు రాసాను. ఐశ్వర్య నా స్నేహితురాలు...’’

‘‘ఐశ్వర్య? ఓహ్, తనా? మా రూప టీచర్ కదా... చెప్పమ్మా, ఏం కావాలి నీకు?’’ బాయ్ తెచ్చిన చల్లని మంచి నీటి గ్లాసును మధు ముందుకు జరుపుతూ ఆప్యాయంగా అన్నది అమల.

దాహంగా అనిపించటంతో గ్లాసు ఎత్తి ఆ నీళ్ళను గడగడా తాగేసింది మధుబాల. తర్వాత గొంతు సవరించుకుంది.

‘‘మీకు తెలుసా? మీ మరిది కార్తీక్, ఐశ్వర్య ప్రేమించుకున్నారు!’’ అంది ఆమె ముఖ కవళికలను గమనిస్తూ.

‘‘ప్రేమా?’’ తేలికగా అన్నది అమల.

‘‘కార్తీక్ ఈజీ గోయింగ్ టైపు మధుబాలా... అతనిది ప్రేమ కాదు... ఐశ్వర్యను డ్రాప్ అవమని నా మాటగా చెప్పు...’’ అంది...

‘‘నాకు అర్థం కాలేదు... అతన్ని గురించి మీరే ఇలా చెబుతున్నారు?’’ ఆశ్చర్యంగా అన్నది మధుబాల.

నిట్టూర్చింది అమల. ‘‘ఊరందరిదీ ఒక దారి అయితే ఉలిపి కట్టెది ఒకదారి అన్న సామెత విన్నావు కదా... మొదటి నుంచీ కార్తీక్ ది అదో దారి. మా వారికీ ఇతనికీ దాదాపు పదిహేను సంవత్సరాల తేడా ఉండటం వలన వాడు నాకు మా రూప లాగే నా సంతానమని అనిపిస్తాడు. మా అత్తగారు, మామ గారూ కార్తీక్ కలిసి విడిగా ఉంటారు. చాలా కాలం తర్వాత కలిగిన సంతానం కావటం వలన మా మావగారు బాగా గారాబంగా పెంచారు కార్తీక్ ని. దాంతో

వాడికి  చిన్నప్పటి నుంచీ ఆడింది ఆట, పాడింది పాటా అయింది. చదువైన వెంటనే మంచి జాబ్ వచ్చింది. సర్కిల్ పెరిగింది. దాంతో హైక్లాస్ అలవాట్లు కూడా అబ్బినాయి. మేము ఎంత వారించినా, నివారించాలని ప్రయత్నించినా మా మాట వినడు. తన జీవితం తనదీ అంటాడు. మా అత్తగారు వాడి  కోసం లిటరల్ గా బెంగ పెట్టుకున్నారు. వాడిని పెళ్ళికి ఒప్పించే బాధ్యత నా మీద పెట్టారు కూడా. కాని కార్తీక్ ఎవరి మాటా వినడు... 'లైఫ్ ఈజ్ ఫర్ ఎంజాయ్ మెంట్' అన్నది అతని నినాదం. అంటే తినటం, తాగటం, తిరగటం... ఇదే...''

''మరి... ఐశ్వర్య...''

''నేను ఆమెతో కూడా మాట్లాడాను మధూ... వీళ్ళ చనువును గ్రహించిన వెంటనే ఆమెకు  వీడి గురించి విపులంగా చెప్పాను కూడా... ఆమె వెనక్కి తగ్గటం లేదు... ఆరు నెలల క్రితం వరకూ చిన్న గువ్వ పిల్లలా బిడియంగా ఉండేది... ఇప్పుడు రాజహంసలా ఆత్మ స్థైర్యంతో తిరుగుతోంది... ఇట్స్ ఓకే... అది వాడిని చూసి వచ్చిన ధీమా అని నాకూ తెలుసు. నిజం చెబుతున్నాను, ఐశ్వర్య వాడిని పెళ్లాడితే, వాళ్ళిద్దరూ కలిసి జీవితాన్ని పంచుకుంటే నాకన్నా సంతోష పడే వాళ్లు ఎవ్వరూ ఉండరు. వాళ్ళమ్మా నాన్నలకి కూడా నిశ్చింత. కాని ఇద్దరూ వినటం లేదు కదా!'' అంది అమల.

''ఆఖరి ఆశ కూడా అడుగంటింది అమల గారూ... మీరేదైనా పరిష్కారం చూపిస్తారని అనుకున్నాను... కాని...'' దిగులుగా ఓ నిట్టూర్పు విడిచింది మధుబాల.

''నాకో ఆశ ఉందమ్మా! ఇద్దరి మధ్యనా ఉన్న బంధం బలీయమై అది పెళ్ళికి దారి తీసినా తీయవచ్చును కదా... అందుకే ఇప్పటికి ఏమీ మాట్లాడవద్దు... మనం మాట్లాడినా ఫలితం ఉండదు... జరిగేది జరగనీ...'' గంభీరంగా చెప్పింది అమల.

''ఐశ్వర్యను ఎప్పుడూ ద్వేషించకండి, ప్లీజ్... దానికి అజ్ఞానపు పొరలు కమ్మేశాయి...'' నీళ్ళు నిండిన కనులతో వేడుకుంది మధుబాల.

''ఛ ఛ ఎంత మాట! మా బంగారం మంచిదా ఏమిటి? ఐశూ చాలా మంచి పిల్ల... కాక పోతే స్వతంత్ర భావాలు ఎక్కువ. ముందు ముందు వాళ్ళే తెలుసుకుంటారు లేమ్మా... నాకా నమ్మకం ఉంది... కళ్ళు తుడుచుకో... ఇదిగో వేడిగా కాఫీ తాగమ్మా...''


ఆవిడ ఆప్యాయతకు చలించి పోయింది మధుబాల.

విస్ఫారిత నేత్రాలతో ముగ్ధురాలై ఆమెనే చూస్తూ కాఫీ తాగింది.

“ఐశ్వర్య చాలా అదృష్టవంతురాలు మధూ... ఎవరికి వారే తమ తమ స్వార్థం చూసుకుంటున్న ఈ రోజుల్లో, స్నేహం పేరుతో అవసరార్థం మనుషుల్ని వాడుకుంటున్న ఈ రోజుల్లో... తనకి నీలాంటి చెలిమి కలిమిని పంచే స్నేహితురాలు ఉండటం ఆ పిల్ల చేసుకున్న పుణ్యమే... ఇదిగోమ్మా నా కార్డు... నువ్వు ఎప్పుడైనా నా దగ్గరికి రావచ్చు... సరేనా?” మధు భుజం తడుతూ అన్నది అమల.

“చా...చాలా చాలా ధన్యవాదాలక్కా...” అప్రయత్నంగా అన్నది మధుబాల.

“అక్క! ఎంత కమ్మని పిలుపు ! ! థాంక్స్ రా... ఐశూ తో పాటు నువ్వూ ఇప్పుడు నా చెల్లెలివే... చీకటి పడుతోంది... వెళ్లిరా అమ్మా...” గుమ్మం వరకూ వచ్చి సాగనంపింది అమల.




‘సప్తగిరి నిలయం’ లో ఫ్లాట్ నంబర్ వన్నాట్ వన్.

పసుపు పూసిన గడపకు ఎర్రని కుంకుమ బొట్లూ, తెల్లని సున్నపు బొట్లూ మెరిసిపోతున్నాయి.

ఆ ముంగిట చక్కగా తీర్చిదిద్దిన రంగుల రంగవల్లి సోయగాలు చూడటానికి రెండు కళ్ళూ సరిపోవు ఎవ్వరికీ...

"ఇదిగో అనూ... ఈరోజు ఉగాది పండగ... ఈరోజు మనం ఎలా ఉంటే ఈ సంవత్సరం అంతా కూడా అలాగే ఉంటాము. నీకు తెలియనిదా? ఈరోజు ఏం చేస్తున్నావు స్పెషల్స్ చెప్పు?" గుమ్మానికి మామిడి తోరణాలు కడుతూ అన్నాడు, విశ్వనాథం. దిగులుగా చూసింది అన్నపూర్ణ.

"ఏమిటోయ్ నీ బాధ? ఊ??" దగ్గరగా వచ్చి అనునయించాడు.

"ఇద్దరు అబ్బాయిలూ చెరో దేశంలోనూ ఉన్నారు... ఎప్పుడో కాని రారు... మనిద్దరమే ఇక్కడ బిక్కు బిక్కు మంటూ...." ఆవిడ కళ్ళల్లో నీళ్ళు జలపాతాలై ఉరికాయి.

"పిచ్చి అనూ... ఎందుకింత బాధ? వాళ్ళ భవిష్యత్తును వాళ్ళు వెదుక్కుంటూ వలస పోయారు. కాదని అనటానికి మనమెవ్వరం ? ఎప్పటికైనా నాకు నువ్వూ, నీకు నేనూ... అంతే..." తగ్గు స్వరంతో చెబుతూ ఆమెను దగ్గరకు తీసుకున్నాడు.

"కాని... కాని..."

"నాకు తెలుసు అనూ... కన్న కడుపు వాళ్ళ కోసం ఎంత కలవరిస్తుందో నాకు తెలుసు. రెక్కలు వచ్చిన పక్షుల కోసం తల్లి దండ్రులు బాధ పడటం అర్థ రహితం. వాళ్ళు ఎక్కడున్నా, క్షేమంగా సంతోషంగా ఉండాలని కోరుకోవటం ఒక్కటే మన కర్తవ్యం. నాకు ఆకలేస్తోంది అమ్మా, అన్నపూర్ణమ్మా!"

"అయ్యో... ఉండండి... ఉగాది పచ్చడికి అన్నీ సిద్ధం చేసేసాను, మీరు కొద్దిగా కలిపేస్తే, నైవేద్యానికి పాయసం, పులిహోర తయారు చేసాను. దేవుడికి కాస్త నైవేద్యం పెట్టేసి మీకు పెడతాను... సరేనా... రండి..." అంటూ వంటింట్లోకి దారి తీసింది అన్న పూర్ణ.

అప్పటికే దూసిన వేప పువ్వుల నుండి రెక్కలు వేరు చేసి, తీసి ఉంచిన కొత్త చింత పండు రసంలో వేసాడు విశ్వనాథం. లేత కొబ్బరి చిప్పలోంచి కొబ్బరిని తీసి సన్నగా తరిగి ఆ ముక్కలు కలిపాడు. అరటి పండు చక్రాలుగా చేసి వాటినీ, పచ్చి మామిడి కాయను చిన్నగా ముక్కలు కోసి వాటినీ, కొత్త బెల్లాన్ని తురిమి ఆ తురుమునూ కలిపాడు. అర స్పూను ఉప్పు, కారం వేసాడు. వాటిని చెంచాతో కలిపి వెండి గిన్నెలో రెడీ చేసాడు.

ఈలోగా వెండి గిన్నెల్లో నైవేద్యం పెట్టి, దేవుడి దగ్గర ఉంచింది అన్నపూర్ణ. ఉగాది పచ్చడిని కూడా అక్కడ పెట్టి ఇద్దరూ కలిసి పూజ చేసుకున్నారు.

పట్టు చీర కట్టుకుని, ముక్కుకు మూడు రాళ్ళ ముక్కు పుడకతో, పచ్చని ముఖానికి మరింత పచ్చగా మెరిసేలా పసుపు పూసుకుని, నొసట పావలా కాసంత కుంకుమ బొట్టు పెట్టుకున్న తన అన్నపూర్ణ సాక్షాత్తూ ఆ కాశీ అన్నపూర్ణేశ్వరి లాగానే అనిపించింది విశ్వనాథం కళ్ళకి. ఆమె కనులలో ఎప్పుడూ ధారలా కురిసే వాత్సల్యం ఆ అపార్ట్ మెంట్స్ లో అందరికీ పిన్నిని చేసేసింది. తనూ ఆమెతో పాటుగా బాబాయ్ అయిపోయాడు. పన్నెండు అపార్ట్మెంట్ లున్న ఆ భవనంలో అందరికీ తలలో నాలుకలా ఉంటారు దంపతులు ఇద్దరూ... ఇద్దరు కొడుకులూ ఉద్యోగాలు విదేశాల్లో చేసుకుంటూ, దూరంగా ఉన్నారు. ఎప్పుడైనా రావటమే... ఇద్దరూ ఒకేసారి రావటమూ అరుదే... ఎంతగా వారానికోసారి స్కైప్ లో మాట్లాడుతున్నా, మనవలను చూపించి వాళ్ళ ఆట పాటలను గురించి వివరించినా తమ ఇద్దరికీ తృప్తిగా అనిపించదు.

క్రిందటి ఏడాది తాను రిటైర్ అయిన వెంటనే పిల్లలు ఇద్దరూ తమ దగ్గరకు వచ్చేయమని అడిగారు. పర్మనెంట్ గా ఉండటం కోసం కాదు కాని ఓ సారి వెళ్లాలని అనిపించి ఇద్దరూ వెళ్లి రెండేసి నెలలు అమెరికాలో పెద్దబ్బాయి దగ్గరా, లండన్ లో చిన్నబ్బాయి దగ్గరా ఉండి వచ్చారు. కాని వారివి బిజి జీవితాలు. తల్లి దండ్రులతో కూడా కలిసి గడపలేనంత ఉక్కిరి బిక్కిరి జీవితం, ఉద్యోగ బాధ్యతలూ... అదీ గాక, అక్కడి శీతల వాతావరణం పడని అన్నపూర్ణకు బాగా జబ్బు చేసింది. వైద్యుల సలహా మేరకు తిరిగి భారత దేశానికి వచ్చేసారు.

‘‘పిన్నీ… నాకు పూర్ణం బూరెలు కుదరటం లేదు… కొద్దిగా మా ఇంటికి వచ్చి చూపెట్టరూ?” ఎదురింట్లో ఉంటున్న జయంతి వచ్చింది.
నవ్వి, “సరే, మీ బాబాయ్ కి టిఫిన్ పెట్టి వస్తాను పావు గంట తర్వాత…” అని చెప్పి పంపింది ఆమెను. “నాకూ తినాలని ఉందోయ్ పూర్ణాలు!” ఆశగా అన్నాడు విశ్వనాథం.

‘‘చాల్లెండి, అరగవు. మళ్ళీ మీరే అవస్థ పడతారు… అయినా జయంతి మీకు ఎలాగూ పంపుతుంది కదా, ఒక్కటి పెడతాలెండి…” అంది నవ్వుతూ.

‘‘ఒక్కటా? ఒక్కటేనా? సరే… ముందు త్వరగా నాకు పచ్చడీ, ప్రసాదం పెట్టేయ్…” అన్నాడు విశ్వనాథం.

‘‘అమ్మమ్మా… నాకు జుట్టు చిక్కు తీసి, జడ గంటలతో పెద్ద జడ వేయవూ?” చేతిలో జడ గంటలతో వచ్చింది పై అపార్ట్మెంట్ లో ఉంటున్న పదేళ్ళ అపర్ణ.

‘‘సరేరా… ఇదిగో ఉగాది పచ్చడి పట్టు… మీ తాత గారు చేసారు… బహు కమ్మగా ఉంటుంది…” అంటూ చెంచాతో ఆ పాప చేతిలో కాస్త వేసింది, అన్నపూర్ణ.

తనూ ప్రసాదం తిని, ఆ పాపకు జడేసి పంపించి, పక్క ఫ్లాట్ కి బయలు దేరింది.

‘‘అక్కడే ఉండి పోక త్వరగా వచ్చేయ్… ఈలోగా నేను కవి సమ్మేళనం చూస్తాను…” ఉత్సాహంగా టీవీ ఆన్ చేసాడు విశ్వనాథం.

***

‘‘హాయ్ మధూ! ఎలా ఉన్నావే?”

ఫోన్ లో ఐశ్వర్య గొంతు వినగానే మైమరచి పోయింది మధు బాల.

‘‘ఐశూ, నేను బాగున్నాను. నువ్వెలా ఉన్నావు? ఎక్కడున్నారు మీరిప్పుడు?” ఆరాటంగా ప్రశ్నించింది.“జైపూర్ లో ఉన్నాం మధూ... నీ

ఉద్యోగ ప్రయత్నాలు ఎంత వరకూ వచ్చాయి? ఇప్పుడు మీ ఊరి లోనే ఉన్నావా?”

‘‘అవును ఐశూ... అన్నయ్య పెళ్లి అయింది. నాకూ సంబంధాలు చూస్తున్నారు నాన్నగారు. కొన్ని ఉద్యోగాలకు అప్లై చేసాను హైదరాబాదు లోనే... పెళ్ళికి తొందర లేదని చెప్పినా నాన్న గారు వినటం లేదు...”

‘‘పోనీ లేవే, చేసేసుకో, ఓ పనై పోతుంది... హైదరాబాద్ సంబంధం అయితే బెటరు... నీ ఉద్యోగానికి వీలుగా ఉంటుంది కదా... నాకూ ఒక ఇంటర్వ్యూ వచ్చింది వచ్చే వారం. అప్పటికి తిరిగి వస్తాను...”

‘‘హాపీగా ఉన్నావా ఐశూ?” మధు గొంతు వణికింది.

‘‘చాలా చాలా సంతోషంగా ఉన్నాను మధూ... కార్తీక్ నాకు సరైన భాగస్వామి. ఒక్క పెళ్ళి అన్న బంధం లేదు అంతే, సమస్త బంధాలు ఉన్నాయి మా మధ్య... చాలా ప్రేమిస్తాడు నన్ను. నిజంగా హాపీగా ఉన్నాను...” పరవశంగా చెప్పింది ఐశ్వర్య.

‘‘పోన్లే, అంతకన్నా కావలసింది ఏముంది? నువ్వు హైదరాబాద్ వచ్చాక ఫోన్ చేయి. వచ్చి కలుస్తాను.”

‘‘సరే మధూ... ఇక ఉంటాను...” ఫోన్ డిస్కనెక్ట్ చేసింది ఐశ్వర్య...

‘‘ఎలా ఉంది నీ ఫ్రెండ్?” ఐశ్వర్యను దగ్గరకు లాక్కుంటూ అన్నాడు కార్తీక్.

‘‘బాగుంది... ఊ., ఇప్పుడు చెప్పు... హైదరాబాద్ తిరిగి వెళ్ళాక మన ప్రోగ్రాం ఏమిటి?”

‘‘ఏముందీ? సెలవైపోవచ్చింది కదా, తిరిగి నేను జాబ్ లో చేరటం, నువ్వు ఉద్యోగంలో చేరటం...’’

‘‘అది కాదు కార్తీ... మనం ఎక్కడ ఉంటాము?’’

‘‘మా ఫ్రెండ్స్ కి చెప్పాను కదా, మంచి ఫ్లాట్ తీసుకుంటారు మన కోసం... కావలసినవి అన్నీ కొనుక్కుందాం...’’ ఆమె ముంగురులు సవరిస్తూ అన్నాడు కార్తీక్.

‘‘నేనంటే నీకు ఇష్టమా?’’ జవాబు తెలిసినా మురిపెంగా మళ్ళీ అడిగింది ఐశ్వర్య...

‘‘చాలా...’’ తమకంగా అన్నాడతను చేతి వేళ్ళతో సరాగాలు ఆడుతూ...

‘‘థాంక్ యు కార్తీ... ఐ లవ్ యూ సో మచ్... ఈ ఆనందం ఎప్పుడూ ఉండాలి... ఉంటుంది కదూ?’’

ఝంఝూమారుతంలా ఆమెను కమ్ముకు పోతూ అన్నాడు, “ఐ లవ్ యు టూ డార్లింగ్... ఎప్పుడూ ఉంటుంది... నిన్ను చూసిన క్షణమే నీ వశమై పోయింది నా మనసు... మన నిర్ణయానికి మనం బాధ పడే రోజు రాకూడదు, రానివ్వను...’’

ఏదో చెప్పబోతున్న ఐశ్వర్య పెదవులను తన పెదవులతో మూసేసి, లైట్ ఆర్పేసాడు.

***

ఇంటర్ వ్యూ కోసం అని సిటీకి వచ్చి తన హాస్టల్ కే వచ్చింది మధు బాల. ఒకటి రెండు రోజుల కోసం తమ వార్డెన్ సహకారంతో అక్కడ ఉండటం అమ్మాయిలకు పరిపాటే.

ఆమెను చూడగానే ఆనందంగా ఆహ్వానించింది పద్మలత.

‘‘మధ్యాహ్నం ఇంటర్ వ్యూ ఉంది మేడమ్. అయిపోతే సాయంత్రం వెళ్ళిపోతాను. లేక పోతే రేపటి

వరకూ ఉంటాను. ఇవిగో మీ ఛార్జెస్..." పర్స్ తీయబోయింది.

"అయ్యో, ఒక్క రోజుకు ఎందుకు తల్లీ, వద్దు..." వారించి, గెస్ట్ రూమ్ చూపింది పద్మ లత.

"ఐశూ ఎలా ఉంది మధూ?" అని అడిగింది.

"బాగానే ఉంది మేడమ్... ప్రస్తుతం జైపూర్ లో ఉంది..." చెప్పింది మధు బాల.

"అతన్ని ఒకటి రెండు సార్లు చూసాను. బావుంటాడు... పెద్ద పొజిషన్ లోనే ఉన్నాడు కదూ?"

"అవును... కానీ...." మధు బాల గొంతులో దిగులు చోటు చేసుకుంది.

"ఐశ్వర్య తీసుకున్న నిర్ణయమే మంచిదనిపిస్తూ ఉంటుంది నాకు..." అన్నది పద్మ లత. ఆశ్చర్యంగా చూసింది మధుబాల."అవునమ్మా... మన దేశంలో పెళ్ళి అనేది ఇప్పుడు ఒక వ్యాపారం అయి పోయింది. మనం వర కట్నం ఇవ్వాలి, బానిసలుగా చాకిరీ చేయాలి. వాళ్లకి పిల్లల్ని కనివ్వాలి. సమానత్వం అనేది లేదు. ఉద్యోగం చేస్తే జీతమంతా పువ్వుల్లా అతడి దోసిట్లో పోయాలి. అతనికి కావలసినప్పుడల్లా పడక సుఖాన్ని అందివ్వాలి. మనకి మూడ్ ఉన్నా లేకున్నా, ఆరోగ్యం సరిగ్గా ఉన్నా లేకున్నా బలవంతంగా అదొక హక్కు లాగా దాంపత్య సుఖాన్ని అనుభవించి తీరతాడు మొగుడు... కట్టు బానిసల్లే అతనికీ, అతడి తరఫు వారికీ ఊడిగం చేయాలి. ఈ వివాహ విధానం కన్నా ఐశ్వర్య ఎంచుకున్న జీవన విధానం నాకు నచ్చింది. సహ జీవనంలో బంధాలు, కట్టుబాట్లు ఉండవు కదా... ఎవరి వ్యక్తిత్వాన్ని వాళ్ళు కాపాడుకోవచ్చు అనిపిస్తోంది..." తన జీవితంలో పొందిన చేదు అనుభవాలను నెమరు వేసుకుంటూ అన్నది పద్మ లత.
"మేడమ్ మీరు..."

"మీకందరికీ  తెలుసు కదా, నేను సింగిల్ ఉమన్ని. చాల కాలం అయిందమ్మా నేను అతన్నుంచి విడి పోయి. నరక యాతన పడి దాన్నుంచి విముక్తిని పొందాను. ఇదిగో ఈ ఉద్యోగం

చేసుకుంటూ హాయిగా ఉన్నాను. అతను మరొక పెళ్ళి చేసుకున్నాడు...” ఏ భావమూ లేకుండా నిర్లిప్తంగా చెప్పింది పద్మలత.

‘‘కానీ, మీరెందుకు శిక్ష అనుభవించాలి? అతడు హాయిగా ఉన్నాడుగా?” కోపంగా అన్నది మధు బాల.

‘‘ఇది జవాబు లేని ప్రశ్న మధూ... అతడు అదృష్టవంతుడు అంతే... ఆ జీవితం నాకు వద్దని అనుకున్నాను కనుక నేనూ అదృష్టవంతురాలినే... పదేళ్ళ క్రితం నాకూ ఒక కార్తీక్ దొరికి ఉంటే నేనూ ఐశ్వర్య మార్గమే పట్టి ఉండే దాన్నేమో... ఆ నరక ప్రాయమైన అనుభవాలను తలచుకుంటే చాలు, జీవితం మీదనే విరక్తి వస్తుంది తెలుసా? థాంక్ గాడ్! అయామ్ రిలీవ్డ్ ఫ్రం దట్ హారిబుల్ పెయిన్! ఒక చిన్నారిని అడాప్ట్ చేసుకోవాలని ఉంది...అమ్మను అయి, ఒక పాపకు జీవితాన్ని ఇవ్వాలని ఉందమ్మా...” కావాలనే ‘అనాథ’ అన్న మాట వాడని పద్మ లత ఉన్నత వ్యక్తిత్వానికి మనసు లోనే వందనాలు అర్పించింది మధు.

‘‘మేడమ్. మీకు ఉద్యోగంలో సమస్యలు ఎదురు కాలేదా? ఒంటరి జీవితం గడుపుతున్నప్పుడు మీ స్నేహితులనో, బంధువులనో చూసినప్పుడు మీరేదో కోల్పోతున్నారన్న భావన కలగదా?”

‘‘లేదు, అలాంటి భావనలకు దూరమై చాలా కాలమైంది మధూ... నాలోని అమ్మ మాత్రం కలవరిస్తూ ఉంటుంది బిడ్డ కోసం. ఇక ఉద్యోగంలో సమస్యలా? చాలానే ఎదుర్కొన్నాను. ఉద్యోగంలోంచి బదిలీ అవకుండా ఇక్కడే ఉండాలంటే నా శరీరాన్ని లంచంగా అడిగారు నా పై ఆఫీసర్లు చాలా మంది. వాళ్ళ సంగతి అంతా విపులంగా నా ఉన్నతాధికారులకు వివరణ ఇస్తూ ఉత్తరాలు రాస్తాను. మా డిపార్ట్మెంట్ రూల్స్, రెగ్యులేషన్స్, వాటిల్లోని ‘లా’ నాకు చాలా నేర్పించాయి. నేను నేర్చుకున్న ఆత్మ రక్షణ విద్యలూ నాకు బాగా పనికి వచ్చాయి. ఎట్ లీస్ట్ నన్ను నేను ఎలా కాపాడుకోవాలో తెలుసుకున్నాను.”

‘‘మిమ్మల్ని చూసి చాలా నేర్చుకోవాలి మేడమ్ !” ఆరాధనగా అన్నది మధుబాల.

‘‘ఎవరి జీవితాలు వారికే పాఠశాలలమ్మా! అనుభవాలు అన్నీ నేర్పుతాయి. ఆ, వెళ్లి టిఫిన్ చేసి, కాసేపు విశ్రాంతి తీసుకుని, ఇంటర్ వ్యూకి ప్రిపేర్ అవ్వమ్మా...”

‘‘థాంక్ యు మేడమ్”

***

జైపూర్ నుంచి తిరిగి రాగానే హాస్టల్ కి వచ్చి తన కొద్దిపాటి సామాను తీసుకుని కార్తీక్ తో పాటుగా అపార్ట్మెంట్ కి వచ్చేసింది ఐశ్వర్య. అప్పటికి మళ్ళీ తమ ఊరికి వెళ్ళింది మధుబాల.

ఇంటికి కావలసిన సామాన్లు, వంట పాత్రలు, సరుకులు అన్నీ కొనుక్కున్నారు ఐశ్వర్య, కార్తీక్ కలిసి షాపింగ్ చేసి. ఇల్లంతా నీట్ గా సర్దుకున్నారు. ఒక రెండు రోజుల్లో తన బట్టలు తీసుకుని వచ్చేస్తానని ఇంటికి వెళ్ళాడు కార్తీక్.

తన ఇల్లు చూసుకుంటుంటే ఎంతో ఆహ్లాదంగా, హాయిగా అనిపిస్తోంది ఐశ్వర్యకి. ఎంత బాగుందీ జీవితం? ఎంత చక్కని ప్రేమికుడు కార్తీక్? ఇన్నాళ్ళకి తనకి ఒక ఇల్లు, తనదైన ఇల్లు... హాయైన జీవితం... రేపటి ఇంటర్వ్యూ బాగా చేస్తే ఉద్యోగంలో కూడా జాయిన్ అయిపోవచ్చు...
మధూ కూడా ఇంటర్వ్యూ బాగా చేసానని చెప్పింది. అదీ సిటీకి వచ్చేస్తే అబ్బ... చక్కగా మళ్ళీ కలుస్తూ ఉండవచ్చు...

హుషారుగా స్నానం చేసి తేలిక పాటి నైట్ డ్రెస్ వేసుకుని, అన్నం తిని ప్రశాంతంగా నిద్ర పోయింది ఐశ్వర్య.




ఐశ్వర్య నిద్ర లేచేసరికి ఏడు దాటిపోయింది. లేచిన వెంటనే మెయిల్ చెక్ చేసుకోవటం అలవాటు. ఎదురుగా మెయిల్ కనిపించగానే ఆమె గుండె ఝల్లుమంది… ఆనందంతో ఒడలు పులకరించింది. అనుకున్నట్టుగానే తాననుకున్న ఉద్యోగం వచ్చేసింది. మెయిల్ పంపించారు కంపెనీ వాళ్ళు.

ఉత్సాహంగా ఈ కబురు చెప్పటానికని కార్తీక్ సెల్ కి ఫోన్ చేసింది ఐశ్వర్య. రింగ్ అవుతోంది కానీ ఎత్తటం లేదు… సైలెంట్ మోడ్ లో పెట్టి నిద్రపోతున్నాడేమోనని అనుకుంటూ అసంతృప్తిగానే లేచి బ్రష్ చేసుకొని హాల్లోకి వచ్చి, టీవీ ఆన్ చేసింది.

కాఫీ తాగాలనిపించి, చూస్తే ఫ్రిజ్ లో పాలు లేవు.  కారిడార్ లోకి వచ్చి వాచ్ మాన్ కోసం బెల్ నొక్కింది.

"ఏమ్మా, ఈ ఫ్లాట్ లోకి కొత్తగా వచ్చినట్టున్నారు కదూ?  నారాయణ  ఇంట్లో లేడమ్మా. ఏం కావాలి?" అడిగింది అన్నపూర్ణ. దంపతులిద్దరూ అప్పుడే గుడికి వెళ్లి వస్తున్నారు.

‘‘ఆ… అదీ… సారీ ఆంటీ… ఏమీ వద్దు…” లోపలికి  వెళ్లి తలుపు మూసుకోబోయింది ఐశ్వర్య.

‘‘పిన్నీ, ఓ బిందెడు మంచి నీళ్ళు ఇవ్వరూ? నిన్న నారాయణ లేక నీళ్ళు పట్టలేకపోయాం…” మూడో ఫ్లాట్ మేనక వచ్చింది.

‘‘దాందేముంది మేనకా, బిందె తెచ్చుకోమ్మా, ఇస్తాను. అమ్మాయ్, కాఫీ తాగావా?” ఐశ్వర్యను ఉద్దేశించి అన్నది అన్నపూర్ణ.

‘‘ఇం…ఇంకా లేదండీ… అదే… పాల పేకెట్ కోసం… నారాయణ ఉన్నాడేమోనని…” నసిగింది.

‘‘అవునా, ఉండమ్మా పాల పేకెట్ నేనిస్తాను… అవునూ అబ్బాయ్ కనిపించటం లేదు…”

‘‘అవునండీ, సాయంత్రం వస్తాడు…”

అన్నపూర్ణ తెచ్చిచ్చిన పాలు కాచుకుని కాఫీ కలుపుకుని తాగి హాయిగా నిట్టూర్చింది ఐశ్వర్య. పక్కింట్లో ఇద్దరూ వృద్ధ దంపతులే ఉంటున్నారు కాబోలు… ఎంత మంచావిడ ఆంటీ!

స్నానం చేసి బట్టలు మార్చుకుని వచ్చేసరికి తలుపు తట్టిన శబ్దం అయింది. తెరిచి చూస్తే ఉప్మా ప్లేట్ లో అన్నపూర్ణ నిలబడి ఉంది.

‘‘రండి ఆంటీ… లోపలికి  రండి… అయ్యో ఎందుకు తెచ్చారు ఆంటీ? వద్దు…” ఇబ్బందిగా మొహం పెట్టింది.

‘‘ఏమ్మా, తల్లిలాంటి దాన్ని నా దగ్గర మొహమాటం ఏమిటి చెప్పు?”

‘‘అది కాదు… నాకు… నాకు… ఉప్మా సయించదు…”

ఫక్కున నవ్వింది అన్నపూర్ణ.

‘‘ఓ అదా? ఉప్మా సయించదు అని మీ బాబాయ్ దగ్గర అనేవు... ఒప్పుకోరసలు... నా చేతి ఉప్మా అంటే ఆయనకి  అంత ప్రీతి మరి! ఆ, అన్నట్టు నువ్వు ఆ ఆంటీ పిలుపు అటక మీద పడేసి పిన్నీ అని పిలవాలి. ఈ బిల్డింగ్ హోలు మొత్తం మీద అందరికీ నేను పిన్నినీ, ఆయన బాబాయీ...”

‘‘ఊ... అదికాదు ఆంటీ... సారీ పిన్నీ... మా హాస్టల్ లో భీముడు ఉప్మా చేసిన రోజు బయటే టిఫిన్ తినే వాళ్ళం...పెసరట్ ఎంత రుచిగా చేసేవాడో, ఉప్మాని తగలెట్టేసేవాడు. అబ్బా, ఏం ఉప్మా పిన్నీ,  ఉండలు ఉండలుగా ఉండి, భయంకరమైన రుచితో...”

‘‘అలాగా? పాపం మీ భీముడు మిమ్మల్ని బెదరగొట్టేసి ఉంటాడు. ఉప్మా రవ్వను దోరగా వేయించుకుని, పోపులో అన్ని దినుసులతో పాటుగా జీడిపప్పు ఎక్కువగా వేసి, ఉల్లి, మిర్చి, అల్లం ముక్కలు వేసి వేయించి, నీళ్ళు పోసి మరిగాక రవ్వ ఒక చేత్తో పోస్తూ, మరో చేత్తో కలియబెడితే ఉండలు కట్టదు. ఉడుకు పట్టగానే, ఆ పైన ఇంత నెయ్యి వేసి కలియబెడితే ఆ రుచే వేరు...ఒక్క స్పూన్ తిని చూడు... ఇక వదలవంటే నమ్ము...”

అన్నపూర్ణ బలవంతం మీద స్పూనుతో నోట్లో పెట్టుకున్న ఐశ్వర్య, ఐదు నిమిషాల్లో ప్లేట్ ఖాళీ చేసేసింది, ‘యమ్మీ పిన్నీ, చాలా బాగుంది....’ అంటూ.

‘‘మంచమ్మాయివి తల్లీ! ఇంతకీ నీపేరు?”

‘‘నా పేరు ఐశ్వర్య పిన్నీ!”

‘‘కొత్తకాపురం కాబోలు...  అవునమ్మాయ్, కాపురం పెట్టించడానికి మీ పెద్దవాళ్ళు ఎవ్వరూ రాలేదా?” ఐశ్వర్య గొంతులో ఏదో అడ్డు పడ్డట్టు అయింది.

‘‘అదీ... అదీ... వస్తారు పిన్నీ...”

‘‘ఊ... అబ్బాయి వచ్చాక మా ఇంటికి తీసుకురామ్మా... సరే, నేను వస్తాను మరి...’’ ఖాళీ ప్లేట్ చేతిలోకి తీసుకుంది అన్నపూర్ణ, ఐశ్వర్య వారిస్తున్నా వినకుండా.

‘‘చాలా థాంక్స్ పిన్నీ... నాకు పనమ్మాయినీ, పాలబ్బాయినీ మాట్లాడి పెట్టాలి మీరు...’’ రిక్వెస్ట్ చేసింది.

‘‘అంతగా చెప్పాలా? అలాగే... ఈరోజే కుదురుస్తాను ఐశ్వర్యా...’’

అన్నపూర్ణ వెళ్ళిపోగానే తలుపు మూసుకుని సోఫాలో కూలబడింది ఐశ్వర్య.

అమ్మా, నాన్నా గుర్తు వచ్చారు. ఇలా కార్తీక్ తో కలిసి ఉంటున్నట్టు ఇంట్లో వాళ్లకి తెలియదు. కానీ ఎప్పుడో ఒకప్పుడు తెలియక మానదు... ఎవరి ద్వారానో తెలియటం కన్నా తానే తెలియజేయటం మంచిది.

రేపటినుంచీ, కొత్త ఉద్యోగానికి, కొత్తాఫీసుకు వెళ్ళాలి... ఉదయమే లేచి, ఇద్దరూ కలిసి పనులు, వంటా పూర్తి చేసుకుని, బాక్సులు సర్దుకుని, ఎవరి ఆఫీసుకు వాళ్ళు...

అసలు కార్తీక్ తనాఫీసులో ఉద్యోగం వేయిస్తానని అన్నాడు, కానీ రకరకాల ప్రశ్నలు ఎదుర్కోవలసి వస్తుందని తానే వారించింది. తన ప్రతిభతో ఉద్యోగం రాకపోతే అప్పుడు తప్పేది కాదేమో... ఏది ఏమైనా నేటి సమాజానికి ఈ ‘లివిన్ టుగెదర్’ కొత్తే. ‘పెళ్ళి’ అనే వ్యవస్థకు అలవాటు పడిపోయిన వారు రియలైజ్ అవటానికి ఇంకా ఎన్నేళ్ళు పడుతుందో ఏమో...

కార్తీక్ ఫోన్ చేసాడు. సంబరంగా తన ఉద్యోగం విషయం చెప్పింది.

‘‘హార్టీ కంగ్రాట్స్ రా... నేను రాత్రికి వస్తాను. ఇంట్లో వాతావరణం ఏమీ బాగాలేదు. అమ్మ ఉదయం నుంచి ఏడుపు మొదలుపెట్టింది... నాకూ మూడ్ సరిగ్గా లేదు, అర్థం చేసుకుంటావు కదూ?’’ అన్నాడు.

‘‘ఓ, సారీ కార్తీ…’’

‘‘ఇట్ ఈజ్ ఓకే ఐశూ, మనం ఊహించిందే కదా… రాత్రి అన్నయ్య కూడా వచ్చాడు. ఇప్పటివరకూ వీళ్ళని వదిలి వెళ్ళలేదు కదా, ఇప్పుడు బట్టలు సర్దుకుని వచ్చేస్తూ ఉంటే వాళ్ళు తట్టుకోలేక గొడవ… ఏమిటో.. సరే… మళ్ళీ మాట్లాడతాను…’’ కట్ చేసేసాడు కార్తీక్. ఐశ్వర్యకు మనసంతా చేదు తిన్నట్టుగా అయిపోయింది. ఏడుపు వచ్చింది… మళ్ళీ తన ఆశయాలు, ఆదర్శాలు, సిద్ధాంతాలు గుర్తు వచ్చి ధైర్యం తెచ్చుకుంది. కొత్తగా ఒక విషయం మొదలైనపుడు ఆ పనికి ముందు అన్నీ అవరోధాలే ఉంటాయి. తర్వాత అందరికీ అర్థమౌతుంది, అలవాటూ అవుతుంది… పక్కింటి పిన్ని గుర్తు వచ్చి మనసు ఆహ్లాదంగా అయింది.

మరో అరగంట తర్వాత మళ్ళీ మొబైల్ రింగ్ అవటంతో ఉలిక్కిపడి ఆన్సర్ చేసింది.

‘‘హాయ్ మధూ! ఆ… బాగున్నానే… కార్తీక్ వాళ్ళ ఇంటికి వెళ్ళాడు. ఈరోజు సాయంత్రానికి వస్తాడు. ఏమిటీ, నిజమా? వావ్… వాటే వండర్? ఆ ఆఫీసు మా ఆఫీసుకు దగ్గరలోనే ఉంది… వచ్చేయవే… ఎప్పుడు జాయిన్ అవుతావు? వచ్చే వారమా? గుడ్… నా దగ్గర ఉండకూడదూ? ఓహ్, ఓకే… మన హాస్టల్ లోనేనా? సరే నీ ఇష్టం! వేరే ఇల్లు దొరికే దాకా అక్కడ ఉండు… నేను కూడా నీకు ఇల్లు వెదుకుతానులే… ఓ తమాషా చెప్పనా? ఈరోజు మొదటిసారి ఉప్మా ఇష్టంగా తిన్నాను… అదీ… మా పక్క ఫ్లాట్ లో ఓ ఆంటీ… ఊహు, పిన్ని ఉన్నారు…’’ మైమరచిపోయి మధూతో కబుర్లు చెప్పసాగింది ఐశ్వర్య.

***

‘‘ఇప్పుడు ఒంటరిగా ఉద్యోగానికి ఎందుకమ్మా? పెళ్ళి చేసుకున్నాక చూడవచ్చు కదా?’’ వారింపుగా అన్నాడు అనంత రామయ్య. ‘‘మహిళకు ఆర్థిక స్వాతంత్ర్యం చాలా అవసరం నాన్నా… మీ బాధ్యతను కాదని అనటం లేదు… ప్రస్తుతానికి జాయిన్ అవనీయండి…’’ మృదువుగా చెప్పింది మధుబాల.

‘‘తెలిసినవాళ్ళకి, బంధువులకీ చాలా మందికి చెప్పాను నాన్నా, చెల్లాయి గురించి... తన పెళ్ళి గురించి మీరేమీ వర్రీ అవకండి.” అన్నాడు గిరి.“కాఫీ తీసుకోండి...” గిరి భార్య నిర్మల ట్రే లో అందరికీ కాఫీలు, మామగారికి పళ్ళ రసం తీసుకు వచ్చింది.“థాంక్స్ వదినా... నేను రాత్రి బస్ కి బయలుదేరతాను నాన్నా...” చెప్పింది మధుబాల.

‘‘జాగ్రత్తమ్మా... నేను వచ్చి నీతో ఉండే వీలు లేదు... నాన్నగారిని చూసుకోవాలి కదా...” నిస్సహాయంగా అన్నది పూర్ణమ్మ. ‘‘ఇన్నాళ్ళూ ఒంటరిగానే ఉన్నాను కదమ్మా... అప్పుడు చదువూ, ఇప్పుడు ఉద్యోగం అంతే కదా? ఇల్లు దొరికే వరకూ హాస్టల్ లోనే ఉంటాను. ఏమీ భయం లేదు...” సముదాయించింది మధుబాల.

‘‘మధూ, నీ చీరలు ఉతికి ఇస్త్రీ చేసి ఉంచాను, సర్దుకో...” చెప్పింది నిర్మల. ‘‘అయ్యో వదినా, నీకెందుకు శ్రమ? చాలా థాంక్స్...” కృతజ్ఞతగా అన్నది మధుబాల.చిన్నగా నవ్వింది నిర్మల, ఫర్వాలేదన్నట్టు.“ఇదిగో మధూ, ఈ డబ్బు నీ దగ్గర ఉంచుకో...” ఐదు వేలు తీసిచ్చాడు, గిరి.మౌనంగా అందుకొని బాగ్ లో పెట్టుకుంది మధుబాల.

***

‘‘బుజ్జి, నీ నిర్వాకమంతా తెలిసిందమ్మా... నీ అక్క చనిపోయి బాధని కలిగించింది, నువ్వేమో బ్రతికుండి వేదన కలిగిస్తున్నావు...పెళ్ళి కాకుండా ఓ మగవాడితో నువ్వు చేస్తున్నది కాపురం కాదు, అదేమిటో నా నోటితో కన్నతండ్రిగా నేను చెప్పలేను. కూటికి పేదను కానీ గుణానికి కాదు ఇంతవరకూ... అసలు నిన్ను కన్న పాపానికి పరిహారంగా నాకు చచ్చిపోవాలని ఉంది. అయితే మంచం పట్టిన నా భార్యను జాగ్రత్తగా చూసుకోవలసిన బాధ్యత భర్తగా నాకుంది కనుక ఆ పని చేయటం లేదు.ఇక నువ్వు ఇంటికి రాకు... నిన్ను చూసి నిజంగానే చచ్చిపోయే పరిస్థితిని తీసుకురాకు.ఇట్లు తిరుపతయ్య వ్రాలు.”

ఆరోజు పోస్ట్ లో ఆఫీసుకు వచ్చిన ఉత్తరాన్ని చూడగానే ఐశ్వర్య ముఖం పాలిపోయింది.

అమ్మా, నాన్నా అంటూ మనసు ఆక్రోశించింది. కన్నీటి పర్యంతమై, ఇక పని చేయలేక వంట్లో బాగుండలేదని ఇంటికి వచ్చేసింది.ఇక తనకు కార్తీక్, మధూ తప్ప ఎవ్వరూ లేనట్టే... ఎంత నిర్దయగా రాసాడు నాన్న? ఆయన తప్పేమీ లేదులే, ఈ కర్కోటకపు సమాజానికి ప్రతినిధి అతడు. నిజానికి కార్తీక్ తో తానెంత సంతోషంగా ఉన్నదో చూస్తే తల్లిదండ్రులుగా ఎంతో సంతోషిస్తారు వాళ్ళు కూడా...ఈ ఆలోచనలతో మెల్లగా తేరుకుని, స్టవ్ మీద టీ కోసం నీళ్ళు పెట్టింది ఐశ్వర్య. ‘‘ఓయ్ ఐశూ... త్వరగా తలుపు తీయి...” పిలుపుతో పాటే కాలింగ్ బెల్ మ్రోగించాడు కార్తీక్.తలుపు తీసిన ఐశ్వర్యకు ఓ హగ్ ఇచ్చి, “కమ్మని యాలకుల టీ రమ్మని పిలిచింది, వచ్చేసాను...” అంటూనే మ్లానమైన ఆమె ముఖం చూసి, “ఏమైంది?” అన్నాడు అనుమానంగా.మౌనంగా తన చేతిలోని ఉత్తరాన్ని అందించింది.

చదివి, “ఓ, దీన్ని గురించేనా ఐశూ? ఇదింకా ప్రారంభమే... ముందు ముందు మరిన్ని ఎదుర్కోవాలి. మనం నమ్మిన సిద్ధాంతం కోసం ఎదుర్కోవాల్సిందే... కాకపోతే ఆయన నీ కన్నతండ్రి కాబట్టి నీకు అంత వేదన కలగటం సహజం... ఏదీ మరి? టీ తాగుదామా? వెళ్ళి ముఖం కడుక్కు రా ఐశూ, టీ నేను చేస్తాను...” అన్నాడు అనునయంగా.అతని మాటలకు కరిగి నీరైంది ఐశ్వర్య. ఇలాంటి మంచివాడి గురించి ఎందుకో నాన్నకి భయాలూ, అనుమానాలు? అనుకుంటూ వాష్ రూమ్ లోకి వెళ్ళి ఫ్రెష్ అయి వచ్చింది. ఆమె వచ్చేసరికి ప్లేట్ లో బిస్కట్స్, టీ కప్పులు సిద్ధం చేసాడు కార్తీక్.“త్వరగా టీ తాగేస్తే బయటికి వెళదాం...” ఆమె బుగ్గ మీద చిటికె వేసి, టీ కప్పు అందించాడు.

***

‘పడతి జానకమ్మ పాణినే గ్రహియింప
విరచినాడు శివుని విల్లునతడు
భంగమొందె ధనువు యంగవించెనుసీత
వరుడు రాము చేరి వధువు మురిసె!’

తాను వ్రాసిన ఆటవెలదిని రాగయుక్తంగా చదివి, ఆ పద్యమున్న కాగితాన్ని పూజామందిరంలో

రాముడి పాదాల మీద ఉంచాడు విశ్వనాథం. ఆయనకి పద్యరచన చాలా ఇష్టం. అప్పుడప్పుడూ ఇలా రామాయణంలోని ఘట్టాలను రాసి రాముడికి అంకితం ఇస్తూ ఉంటాడు.

'గౌతము భార్యా పాలిటి కామ ధేనువితడు
ఘాతల కౌశికు పాలి  కల్ప వృక్షమూ...
సీతాదేవి పాలిటి చింతామణి యితడు...
ఈతడు దాసుల పాలి ఇహపర దైవము...
రామ చంద్రుడితడు రఘువీరుడు...
కామిత ఫలములియ గలిగేనిందరికీ...'

ఆయన పద్యం వినగానే అప్రయత్నంగా పాడింది అన్నపూర్ణ. "పద్యం వింటూ ఉంటే అన్నమయ్య కీర్తన గుర్తు వచ్చింది... ఎంత బాగా రాసారు?" ఆయన ముఖంలోకే ఆరాధనగా చూసింది, అన్నపూర్ణ.

"చక్కగా పాడావు అనూ... సామాన్య మానవుడిగా భూమి మీద వసించిన నారాయణుడే రాముడు. ఆయన పడినన్ని కష్టాలు, సాధ్వి సీతమ్మ అనుభవించినంత వేదన ఎవరూ పడి ఉండరు. ప్రతీ దంపతులకూ ఆ ఆదిదంపతులే ఆదర్శం అనూ... ఎంత వేదనలో ఉన్నా ఆయన్ని తలచుకుంటే చాలు ఎంతో సాంత్వన!" భక్తి  పారవశ్యంతో చేతులు జోడించాడు విశ్వనాథం.

"పిన్నీ..." పిలుపుతో పాటుగా లోపలి జొరబడింది ఐశ్వర్య, మధుబాల చేయి పట్టుకుని.

"ఐశ్వర్యా, రామ్మా... ఏమిటీ ఉదయమే లేచేసావా? ఆదివారం కదా, ఇంకాసేపు పడుకుంటావు కదా అనుకున్నాను!" నవ్వుతూ ఎదురు వెళ్లి ఆమె చేయి పట్టుకుంది అన్నపూర్ణ.

"ఈ అమ్మాయి...?"

“పిన్నీ, ఇదిగో, ఇదే నా ఏకైక బెస్ట్ ఫ్రెండ్... మధుబాల... ఆదివారం కదాని ఇంటికి పిలిచేసాను... మధూ, చెప్పాగా పిన్నిగారు...” మురిపెంగా పరిచయాలు చేసేసింది ఐశ్వర్య.

“మధూ...నీ స్నేహితురాలు నిన్ను తలచుకోని క్షణం ఉండదు అంటే నమ్ము... చాలా సంతోషంగా ఉందమ్మా... రా.. ఇలా కూర్చో... ఉండండి, మీ బాబాయ్ పూజ అయిపోవచ్చింది... ఇప్పుడే ఐదు నిమిషాల్లో వచ్చేస్తాను...” అంటూనే లోపలికి వెళ్ళింది అన్నపూర్ణ.

“ఈరోజు కార్తీక్ టూర్ వెళుతున్నాడు కలిసి గడుపుదాం అన్నావు., రాగానే, వీళ్ళ ఇంటికి తీసుకు వచ్చావు... ఏమిటే ఇదీ? నాకు కొత్తగా ఉంది... మళ్ళీ కాసేపాగి వద్దాం...” చిన్న గొంతుతో మొహమాటంగా అన్నది మధుబాల.

“ఏం కాదు... నాకు దొరికిన కొత్త ఆత్మీయులని పరిచయం చేయవద్దూ? అసలు నువ్వు రాత్రే వచ్చేయాల్సిందే... చక్కగా కబుర్లు చెప్పుకొనే వాళ్ళం కదా!”

“నిన్న ఆఫీసులోనే బాగా ఆలస్యం అయిపోయింది ఐశూ, చెప్పాను కదా... ఇంతకూ నువ్వెలా ఉన్నావు?”

“ఎలా ఉన్నాను? నువ్వే చెప్పాలి మరి!”

“అప్పటికన్నా బాగున్నావు, సంతోషంగా ఉన్నావు కదా! అందుకే కాస్త నిండుదనం వచ్చింది...” పరీక్షగా చూస్తూ చెప్పింది మధుబాల.

“జీవితం ఎంతో సంతృప్తిగా ఉంది మధూ... ఒక్కటే బాధ నాకు...అదే, అమ్మానాన్నలకి దూరమయ్యానని. వాళ్లకి నేను చేసిన పని నచ్చలేదు... కానీ ఏమీ చేయలేను. ఈ ఆనందాన్ని దూరం చేసుకోలేను...” నిస్సహాయంగా చెప్పింది ఐశ్వర్య.

“అమ్మా నాన్నలే కదా, తప్పకుండా వాళ్ళు నిన్ను పెద్ద మనసుతో క్షమించే రోజు వస్తుందిలే, బాధపడకు...” ఐశ్వర్య భుజాల మీద చేయి వేసి ఆత్మీయంగా నొక్కింది మధుబాల.

‘‘తీర్థం, ప్రసాదం తీసుకోండి తల్లులూ!’’ విశ్వనాథం వచ్చాడు.

పచ్చని దబ్బపండు మేని ఛాయ, గోధుమ రంగు పట్టు ధోవతి కట్టుకొని ఉత్తరీయం భుజాల చుట్టూ కప్పుకున్నాడు. నుదుట విభూది రేఖల మధ్యలో ఉదయ భాను బింబమల్లే ప్రకాశిస్తున్న ఎఱ్ఱని కుంకుమ బొట్టు.

భక్తిగా లేచి తీర్థమూ, ప్రసాదమూ తీసుకున్నారు ఇద్దరూ. తనను ఆయనకు ఐశ్వర్య పరిచయం చేయగానే అప్రయత్నంగా వంగి ఆయన పాదాలకు నమస్కారం చేసింది మధుబాల.


‘‘ఇష్ట కామ్యార్థ సిద్ధి రస్తు!’’ అని దీవించి, కూర్చోమని చెప్పి లోపలికి  వెళ్ళారు.

‘‘అమ్మాయ్, పులిహోర, చక్రపొంగలి చేసాను. ఇక్కడే తింటారా? లేక బాక్స్ లో పెట్టి ఇవ్వనా?’’ ఆప్యాయంగా అడిగింది అన్నపూర్ణ.

‘‘అబ్బే, వద్దు పిన్నీ, నేను టిఫిన్ కి దోసెల పిండి రెడీ చేసాను…’’ చెప్పింది ఐశ్వర్య.

‘‘ఇది దేవుడి ప్రసాదం కదా, వద్దని అనకూడదు. సరే, బాక్స్ లో పెట్టి ఇస్తా తినండి ఇద్దరూ.. ప్రస్తుతానికి మంచి కాఫీ ఇస్తాను… సరేనా?’’

ఐదే ఐదు నిమిషాల్లో ఘుమఘుమలాడే కాఫీ కప్పులతో వచ్చింది అన్నపూర్ణ. లొట్టలేస్తూ తాగేసి, ప్రసాదాల కారియర్ తీసుకుని మళ్ళీ వస్తామంటూ మధుబాలతో సహా తన ఫ్లాట్ లోకి దూరిపోయింది ఐశ్వర్య.




“ఇప్పుడు చెప్పు ఎలా ఉంది జాబ్?” మెత్తటి సోఫాలో కూర్చున్న మధు పక్కనే కూర్చుని ఆమెను చుట్టేసుకుంటూ అడిగింది ఐశ్వర్య.

“బాగుందే... నేనూ చిన్న రూమ్ చూసుకోవాలని అనుకుంటున్నాను. నువ్వు చెప్పు నీ లైఫ్ ఎలా ఉంది? కార్తీక్ ఎలా ఉన్నాడు? నీతో ఎలా ఉంటాడు? నిన్ను బాగా చూసుకుంటాడా? ప్రేమగా ఉంటాడా?” ప్రశ్నల వర్షం కురిపించింది మధుబాల.

“చాలా...” మెరుస్తున్న కళ్ళతో చెప్పింది ఐశ్వర్య.

“ఇద్దరం కలిసి పనులన్నీ చేసుకుంటాం. మార్కెట్ పనులు, ఇస్త్రీ చేసుకోవటం, కూరగాయలు కోయటం లాంటివి. గిన్నెలకీ, బట్టలకీ పని మనిషి ఉంది. వంట మాత్రం నేనే చేస్తాను. కార్తీక్ కూడా అప్పుడప్పుడు ప్రయోగాలు చేస్తూ ఉంటాడు...”

“ఓ...” నవ్వింది మధుబాల.

“హాయిగా ఉందే మధూ, నాదైన ఒక జీవితం... ఈ హాయి నాకు మాత్రమే సొంతం...”

“అవునవును... కానీ నీ అస్తిత్వాన్ని కోల్పోకు మరి. నీకంటూ కొద్దిగా సమయం వెచ్చించుకో... మంచి పుస్తకాలు చదువుకోవటానికి, మంచి సంగీతం వినటానికి... సరేనా?”
“అలాగే... కానీ ఇద్దరం ఉంటే సమయమే తెలియదు. చాలా సేపు కబుర్లతో, టీవీ చూస్తూ, నవ్వుకుంటూ గడిపేస్తాం... వీకెండ్ కి బయటికి వెళతాం... అన్నట్టు పిన్నిచ్చిన ప్రసాదాలు తిందామా? పాపం నువ్వు వచ్చాక ఏమీ పెట్టలేదు...ఆకలి వేస్తుంది కదా...” అంది ఐశ్వర్య.
“సరే, తిన్నాక ఈరోజు నేను వంట చేస్తా సరదాగా... సరేనా?” అంది నవ్వుతూ మధుబాల.
“అలాగేనే... మీ అమ్మా నాన్నగారూ బాగున్నారా? ఇప్పుడు ఆయన ఆరోగ్యం ఎలా ఉందీ?”
“ఫర్వాలేదే... నాకు సంబంధాలు చూస్తున్నారు... తన బాధ్యతలు నెరవేర్చుకోవాలని...”
“అద్భుత: అయితే నువ్వు ఓ ఇంటి దానివి అవుతావన్న మాట... భలే భలే... సిటీ సంబంధమే చూడమని చెప్పు... సరేనా? ఇదిగో ప్లేట్స్ లో సర్దేసా... రా తిందాం...”
తిన్నాక ఇల్లంతా తిప్పి చూపించింది ఐశ్వర్య. తన వార్డ్ రోబ్ లో బట్టలు, డ్రెస్సింగ్ టేబుల్ మీదున్న రకరకాల సౌందర్య సాధనాలు, కార్తీక్ ప్రెజెంట్ చేసిన నెక్లెస్, తాను కొనుక్కున్న బంగారు గాజులు అన్నీ చూపించింది. ఐశ్వర్య కళ్ళల్లో మెరుపులు చూస్తుంటే మధు బాలకు ఎంతో సంతృప్తి కలిగింది. ‘పోనీలే ఈ సహ జీవనమనే జీవిత విధానం తానూహించినంత బల హీనమైనది కాదేమో... మారుతున్న కాలంలో ఇదీ ఒక జీవన విధానమే కాబోలు...’ అనుకుంది.
ఆరోజంతా కలిసి వంట చేసుకొని, కబుర్లు నంచుకుంటూ ఆరగించి, ఆ తర్వాత టీవీలో సినిమాలు చూస్తూ హాయిగా నవ్వుతూ గడిపేశారు ఆ స్నేహితురాళ్ళు ఇద్దరూ.
***
హాస్టల్ కి దగ్గరలోనే ఒక సింగిల్ బెడ్ రూమ్ అపార్ట్మెంట్ తీసుకుని అందులోకి షిఫ్ట్ అయింది మధు బాల.
రోజూ ఉదయమే వంట చేసుకుని, ఆఫీసుకు వెళ్లి రావటం, మళ్ళీ రాత్రి వచ్చి కాసేపు పుస్తకాలతో కాల క్షేపం చేసి అన్నం తిని పడుకోవటం... ఇలా రొటీన్ కి అలవాటు పడింది.
రోజుకో సారి ఐశ్వర్యకి ఫోన్ కాల్, ఎప్పుడైనా కలవటం...ఇవి మామూలే.
ఆరోజు ఆఫీసుకు వెళ్ళగానే అక్కడ సోఫాలో కూర్చుని ఉన్న అమ్మాయిని చూసి ఆశ్చర్య పోయింది మధు. ఆమె కూడా మధును పరీక్షగా చూసి వెంటనే చిరునవ్వు నవ్వింది.

''ఏయ్, నువ్వు మమతా దాస్ కదూ? ఎన్నేళ్ళయింది నిన్ను చూసి?'' మమత పక్కనే కూర్చుని ఆమె చేయి పట్టుకుంది మధుబాల.

''అవును. నేను మమతనే... బాగున్నావా మధూ? టెన్త్ తర్వాత విడిపోయాం మనం...'' తెల్లగా సన్నగా చెక్కిన దంతపు బొమ్మలా ఉంది మమత. నార్త్ ఇండియన్ అమ్మాయి కావటం వలన యాసతో కూడిన తెలుగు మాట్లాడుతుంది. మెజెంటా కలర్ చుడీ దార్ లో, పెదవులకు గులాబీ రంగు లిప్ స్టిక్ తో ఎంతో అందంగా అనిపించింది. పాపిటలో సిందూరం ఆమె వివాహిత అని తెలియజేస్తోంది.

''ఓ, పెళ్లి అయిపోయిందా? మీ వారు...''

''ఇక్కడే బంజారా హిల్స్ లో ఓ కంపెనీలో వర్క్ చేస్తున్నారు. నువ్విక్కడ?'' ఆంగ్లంలో చెప్పింది మమత.

''ఇది నా ఆఫీసే మమతా... నెల రోజుల క్రితం ఇక్కడ జాయిన్ అయ్యాను... నువ్వు...''

''ఇక్కడ జాయిన్ అవటానికి వచ్చాను...'' నవ్వింది మమత.

''వావ్... వెరీ గుడ్... రా... మా బాస్ దగ్గరికి వెళదాం...'' అని మమత చేతిలోని అపాయింట్ మెంట్ ఆర్డర్ అందుకుంది మధుబాల.

''నేను ఆల్రెడీ కలిసాను మమతా... కూర్చోమని అన్నారు...''

సంభాషణ అంతా ఇంగ్లీష్ లోనే జరుగుతోంది. మమతకి తెలుగు మాట్లాడటం కష్టంగా ఉందని తలచి తనూ ఆంగ్లానికి షిఫ్ట్ అయింది మధు.

''ఓకే, నేను కలిసి వస్తాను...నేను ఆయనకి పర్సనల్ సెక్రెటరీనిలే" లోపలికి వెళ్లి సాగర్ లాల్ తో మమత తన స్నేహితురాలని చెప్పింది. వెంటనే మమతను లోపలికి పిలిపించి, ఆమె పని చేయాల్సిన సెక్షన్ కి తీసుకువెళ్ళి, అక్కడి ఆఫీసర్ కు పరిచయం చేసాడు స్వయంగా సాగర్ లాల్.

బాస్ కాబిన్ లోనే తన సీటు కావటం వలన జాగ్రత్తగా వర్క్ నేర్చుకోమని చెప్పి తానూ లోపలికి వెళ్లి పోయింది మధుబాల.

***

సంధ్య చీకట్లు ముసురుకుంటున్నాయి. వాకిట్లోనూ, బాల్కనీలోనూ దీపాలు వెలిగించి, హాల్లోనూ లైట్ వేసింది ఐశ్వర్య.

"ఏమిటి అలా ఉన్నావు?" ఏదో ఫోన్ కాల్ మాట్లాడిన తర్వాత దీర్ఘాలోచనలో పడిన కార్తీక్ ని కుదుపుతూ అడిగింది ఐశ్వర్య.

"ఏమీ లేదు ఐశూ... వచ్చే వారం మా మేనత్త కూతురి పెళ్లి ఉంది మా ఊరిలో... అదే విషయం అన్నయ్య గుర్తు చేసాడు... నేను వెళ్ళాలి!"

"మరి నేను?" అప్రయత్నంగా, అమాయకంగా అడిగింది ఐశ్వర్య.

"నాన్న గారి చెల్లెలి కూతురు. వెళ్ళక పోతే ఆయన చాలా బాధ పడతారు... అదీ గాక, మా అత్తయ్యతో చిన్నప్పటి నుండీ నాకు చాలా అనుబంధం... నిన్ను తీసుకు వెళ్ళటం కుదరదు..." కొద్దిగా ఇబ్బంది పడుతూ చెప్పాడు కార్తీక్.

"కార్తీ... అదీ...మీ వాళ్లకి తెలుసు కదా, మనం ఇద్దరం కలిసి ఉంటున్నామని..." ఏదో చెప్ప బోయిన ఐశ్వర్యను వారిస్తూ, "ఐశూ... మనం కలిసి ఉన్నా కానీ మనిద్దరివీ స్వతంత్ర జీవితాలు కదా... ఎవరూ ఎవరినీ ఇబ్బంది పెట్ట కూడదు. మా అత్తయ్య వాళ్లకి మన రిలేషన్ తెలియదు కదా... నువ్వు నాతో వస్తే అన్నీ బయటకు వస్తాయి. నాకది ఇష్టం లేదు..."

"అంటే... నువ్వు నమ్మిన సహ జీవనం మీద నీకే నమ్మకం లేదా? ఎవరో ఆక్షేపిస్తారని ముసుగేసుకుంటావా?" తీవ్రంగా అడిగింది ఐశ్వర్య.

"ఇందులో ముసుగేముంది? మాంసం తింటున్నాం కదాని మెడలో ఎముకలు వేసుకు తిరగలేము కదా... అమ్మా నాన్నలకి, అన్నయ్యా వదినలకి మన సంగతి తెలుసు. బంధువుల్లో ఎవరికీ తెలియదు. తెలిస్తే మా వాళ్ళు చిన్న తనంగా ఫీల్ అవుతారు. కొన్నాళ్ళ తర్వాత తెలిసినా ఫర్వా లేదు..."

ఐశ్వర్య మనసంతా పాడై పోయింది. దుఃఖం సుడులు తిరిగి గొంతు దగ్గరే ఆగి పోయినట్టు అయింది. అవమానంగా కూడా అనిపించింది. మౌనంగా లేచి వెళ్లి దూరంగా బాల్కనీ లోని ఉయ్యాలలో కూర్చుంది.

అతను ఎవరి తోనూ సంబంధాలు తెంచుకో లేదు. తను మాత్రం అమ్మా నాన్నలకి శాశ్వతంగా దూరమైంది. ఒకరిపై మరొకరికి హక్కులు లేని మాట నిజమే... కానీ స్నేహం ఉంటుంది కదా...

సాంత్వన ఉండ కూడదని లేదు కదా... ఘనీభవించిన మంచు గడ్డ కరిగినట్టు ఆమె కళ్ళలోంచి కన్నీరు జాలు వారింది. తనకు తెలుసు కార్తీక్ ఇంతే... అది స్వార్థమో ఏమో తెలియదు కానీ అతను తన గురించే తప్ప ఎవరి గురించి ఆలోచించని మనిషి... అలవాటు చేసుకోవాలి కానీ ఇలా బాధ పడ కూడదు... మెల్లగా కళ్ళు తుడుచుకుంది ఐశ్వర్య.

''ఐశూ... ఇదిగో జ్యూస్ తాగు...'' గ్లాసుతో జ్యూస్ అందించాడు కార్తీక్.

''సెంటిమెంటల్ ఫూల్ అవకు ఐశూ... నాతో నువ్వు మెల్లగా అలవాటు పడాలి. నేనేమిటో నీకు తెలుసు కదా... అన్నీ తెలిసే కదా మనం ఈ జీవితం మొదలు పెట్టింది? ఇప్పుడు కొత్తగా ఇలా ఇల్ ఫీలింగ్స్ వద్దు. నిన్ను నీ పేరెంట్స్ దగ్గరకు వెళ్ళ వద్దు అని నేను ఎప్పుడూ అనను... అసలు అలా శాసించే హక్కులూ, అధికారాలు మన జీవితంలో లేవు కదా... ఇప్పుడు నువ్వు ఇలా బాధ పడితే నేను ఏం చేయగలను చెప్పు?'' అనునయంగా చెబుతూనే ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

తలూపి మెల్లగా సిప్ చేస్తూ జ్యూస్ తాగింది ఐశ్వర్య.

''ఎప్పుడు బయలుదేరుతున్నావు?''

''వచ్చే సోమవారం. మూడు రోజులు లీవ్ పెట్టాను. అందరం కలిసే వెళుతున్నాము. వెళ్ళాకా ఫోన్ చేయటం కుదరక పోవచ్చు...''

'సరే' అన్నట్టు తలూపింది. చేదుగా, వికారంగా అనిపించింది ఆమెకు ఎందుకో.

''ఇటు రా...'' చేయి చాపి దగ్గరకు తీసుకున్నాడు.

''కార్తీ... ఐ లవ్ యూ...'' నిశ్శబ్దంగా అతని గుండెల్లో ఒదిగిపోయింది.

''ఐ నో ...అండ్ ఐ టూ!'' అన్నాడు ఆమె చుట్టూ చేతులు బిగిస్తూ... ''లోపలికెళదాం...'' అతని పెదవులు గుసగుసలాడాయి.

క్షణాలు, నిమిషాలై; నిమిషాలు గంటగా మారి, గడియారం ఎనిమిదైనట్టు గంట కొట్టింది. మోహావేశం చల్లారి పోయాక, గుండెలో పేరుకున్న బాధంతా ఎవరో తీసేసినట్టు అనిపించింది ఐశ్వర్యకు. శరీరం, మనసూ కూడా చిత్రమైన హాయితో నిండి పోయాయి. ఎక్కడో చదివింది తాను 'సంగీతమూ, శృంగారమూ మనసుకెంతో సాంత్వన నిస్తాయి' అని. ఎంత నిజం!

తన ఎదపై వాలి సేద దీరుతున్న ఆమె వీపును సవరిస్తూ, ‘‘ఐశూ, ఆకలి వేస్తోంది…’’ అన్నాడు కార్తీక్.

‘‘కూరలు ఉన్నాయి, మైక్రో లో వేడి చేస్తాను. రైస్ కుక్కర్ పెట్టాలి… లేస్తాను…’’ సోగ కళ్ళతో నవ్వుతూ లేచింది.

నైటీ హుక్స్ సరి చేసి, ‘‘ఊ… ఇప్పుడు వెళ్ళు… ఏమైనా హెల్ప్ కావాలంటే పిలువు. జుట్టు దువ్వుకో… పక్కింటి పిన్ని గారేమైనా వస్తే బాగుండదు… నాకు కాస్త ఆఫీస్ వర్క్ ఉంది…’’ అంటూ లాప్ టాప్ తెరిచాడు.

సరిగ్గా ఇరవై నిమిషాల తర్వాత టేబుల్ మీద అన్నీ వడ్డించి అతన్ని పిలిచింది ఐశ్వర్య.

***

‘ఏమిటీ మనిషి? తన కోసమే పుట్టినట్టు ప్రవర్తిస్తాడో సారి… తనతో ఏమీ సంబంధం లేనట్టూ ఉంటాడు ఇంకో సారి… అతను వచ్చేసరికి చాలా సార్లు ఆలస్యం అవుతూ ఉంటుంది. భోజనం చేయకుండా తాను ఎదురు చూస్తూంటే, అలా కాచుకుని ఉండ వద్దని, ఎనిమిది కల్లా భోజనం చేసేయమని చెబుతాడు. ఆలస్యంగా వచ్చిన ప్రతీ సారీ బయట తినే వస్తాడు. ఒక్కో సారి డ్రింక్ చేసి కూడా…

లోపల బాధ కలిగినా అదేమీ బయట పెట్టకుండా కాస్త తిని పడుకుంటూ ఉంటుంది తను. ఈ రోజుల్లో మంచి నీళ్ళ లాగే మద్యం సేవించటం హై సొసైటీ లో కామన్. కార్తీక్ లాంటి ఉద్యోగస్తులకు పార్టీలు, విందులూ పరిపాటే. అలాగే, తనకు తెలిసినంత వరకూ తాగినప్పుడు ఒకరిద్దరు ఇతర స్త్రీలలతో అనుభవాలు కూడా కార్తీక్ కి ఉన్నాయి. ఆఫీసులో అతని ప్లేస్ ను బట్టి అతని లేడీ సబార్డినేట్స్ చాలా మంది అతనితో చనువుగా మెలుగుతారు. కార్తీక్ దృష్టిలో అది తప్పు కాదు. అలాంటి స్వేచ్ఛ కోసమే తాను పెళ్ళి అనే బంధంలో ఇరుక్కోనని చెబుతాడు.

కానీ తనకి ఒకటే ఆశ్చర్యం… మనసు లేకుండా తనువుతో సరాగాలు ఆడటం సులభమా? మదిలో ప్రేమనేది లేకుండా శారీరకంగా ఆనందం కలుగుతుందా? ఎట్టి పరిస్థితుల లోనూ తన భాగస్వామిగా కార్తీక్ ని తప్ప మరెవ్వరినీ ఊహించదే తను? మరి అతను? పెళ్ళి అయిన

మగవాళ్ళు నీతిగా ఉంటారని కాదు కాని, కొన్ని కట్టుబాట్ల వలన కొంతైనా నీతిని పాటిస్తారని తన భావన.
తనకు కూడా అలాంటి పరిమితులు వద్దనీ, ఎవరి మీద మనసైనా తన కోరికలు తీర్చుకోవచ్చనీ ఎప్పుడో చెప్పాడు కార్తీక్. విననట్టు ఊరుకుంది అయిష్టంగా... తాను ఎటూ ఆప లేదు అతన్ని... కానీ మనసుకు వ్యతిరేకంగా తానెందుకుండాలి? పెళ్లి అయిన ఆడవాళ్ళు భర్తల మీద అలుగుతారట. రెండేసి రోజులు మాట్లాడరట. పడక మీదికి రానీయరట. భర్తలు వాళ్ళని మంచి చేసుకుంటారట... రక రకాల ప్రామిస్ లు చేస్తారట. చివరికి ప్రసన్నం చేసుకుని ఒద్దికగా ఉంటారట... ఇది ఒక కోణం.
డబ్బు కోసం చంపేయటాలు, మాటలతో చిత్రవధ చేయటాలు, శారీరకంగా హింస పెట్టటాలు, బలవంతంగా అనుభవించటాలు ఇది మరో రకం, మరో కోణం. అమ్మో, ఆ నరకం కన్నా, ఇదే నయం అనిపిస్తుంది. తనకి ఆరోగ్యం సరిగ్గా లేనప్పుడు కానీ, మూడ్ బాగాలేనప్పుడు కానీ తన వాంఛ తీర్చుకోవటం కోసం తనని ఎప్పుడూ బలవంతం చేయడు కార్తీక్. అందుకు సంతోష పడాలేమో... అతనంటే ఉన్న అపరిమితమైన ప్రేమ వలన కానీ, లేక పోతే అతనికున్న చాపల్యాలు తెలిసీ మళ్ళీ అతనితో కలయిక అసాధ్యమే. అతని స్పర్శకే పులకించి పోయి తనను తాను అర్పించేసుకుంటుంది మరి...
ఏదైనా ఊరు వెళ్ళినా, టూర్ వెళ్ళినా ఫోన్ చేయడు కార్తీక్. మొదట్లో బాగా ఎదురు చూసేది. తర్వాత తర్వాత ఎదురు చూడటం మానేసింది. అక్కడ పనుల తర్వాత రిలాక్సేషన్ కోసం ఫ్రెండ్స్ తో డ్రింక్స్ తీసుకుంటాడని తనకి తెలుసు. ఇక ఆపైన ఆలోచించదు, అడగదు కూడా.. ఎందుకంటే, తన హద్దులు తాను ఎప్పుడూ అతిక్రమించ కూడదు. తమ జీవన విధానంలో అవలంబించ వలసిన మొదటి నియమం ఇది.
పిన్ని దగ్గర అన్నమయ్య కీర్తనలు నేర్చుకుంటోంది ఈ మధ్యే... ఆ సాధన తనకు కాస్త సాంత్వన నిస్తోంది. తన గొంతు చాలా బావుందనీ, పట్టు వదలక సాధన చేయమనీ ఎంతో ప్రోత్సహించింది పిన్ని. పిన్నీ, బాబాయ్ ఎంత మంచి వాళ్ళు? మొదట్లో తమ బాంధవ్యం గురించి తెలిసి, తమది వివాహ బంధం కాదని అర్థమై మౌనంగా ఉండిపోయారు. కానీ తనను దూరం చేయ

లేదు. పిన్ని గారు సలహాగా ఏదో చెప్పాలని ప్రయత్నించినట్టు అనిపించింది. కానీ ఎందుకో మిన్నకుండిపోయారు.
ఫ్లాట్స్ లో అందరికీ తెలిసి పోయింది, కార్తీక్ తన భర్త కాదని. ఇక్కడ చేరి మూడు నెలలు పూర్తి అవుతున్నా ఇంకా ఎవరితోనూ పరిచయం దాట లేదు. ఉద్యోగానికి వెళ్ళి రావటం, వీకెండ్స్ కి పనులు, కార్తీక్ తోనో, మధూ తోనో బయటికి వెళ్లి రావటంతో తనకీ సమయం చాలటం లేదు. అందుకే ఒక్క పిన్ని, బాబాయ్ గార్లిద్దరూ తప్ప ఇంకెవరూ దగ్గర కాలేదు.
కలిసి జీవితం మొదలు పెట్టని రోజుల్లో తనకి పరీక్షల సమయంలో అతను ఎంత బ్రతిమాలినా తన ఏకాగ్రత అంతా చదువు మీదనే ఉండేది. ఎంతో నిగ్రహశక్తి తో ఉండగలిగేది. అలాంటిది, ఇప్పుడెందుకింత ఒంటరిగా అనిపిస్తోంది?
కార్తీక్ కూడా ఆఫీసు పనుల మీద, చాలా సార్లు బయటకు వెళ్ళాడు తనని వదిలి. అయితే ఈసారి ఫ్యామిలీతో వెళ్ళాడు... అందుకా ఇంత బాధగా ఉంది? కార్తీ, ప్లీజ్ త్వరగా వచ్చేయవా? నాకు దిగులుగా, బెంగగా ఉంది డార్లింగ్... ప్లీజ్...’
ఆలోచనల్లోనే నిద్ర లోకి జారుకుంది, ఐశ్వర్య.




మమతా, మధుబాలా త్వరగానే దగ్గరయిపోయారు. ఆఫీసులో మరో ఇద్దరు లేడీ కొలీగ్స్ ఉన్నారు. అందరూ ప్రతీ రోజూ కలిసి లంచ్ చేస్తారు. మాటల మధ్యలో తెలిసింది, మమత తెలుగు అబ్బాయినే ప్రేమించి పెళ్ళి చేసుకుందని.

“అయితే మీ ఇంట్లో భారతీయత వెల్లివిరుస్తుంది అన్న మాట! ఇంచక్కా ఉత్తరదేశపు పండుగలూ, వంటలూ, దక్షిణ దేశపు పండుగలూ వంటలూ... భలే భలే...” చిన్నపిల్లలా కేరింతలు కొట్టింది మధుబాల. ఆమె సంతోషం చూసి తానూ నవ్వేసింది మమత. మధుబాల ఉద్యోగంలో బాగా స్థిరపడిపోయింది. చక్కని అంకితభావంతో పని చేయటం వలన ఉన్నతాధికారుల మెప్పునూ, మన్ననలనూ పొందింది. మమత కూడా పని బాగా నేర్చుకొని తెలియనివి కొలీగ్స్ ని, మధుబాలనూ అడుగుతూ బాగానే పని చేయసాగింది. మధ్యలో రెండు మూడు సార్లు ఇంటికి వెళ్ళి వచ్చింది మధుబాల. అనంతరామయ్య బాగా

కోలుకుని తిరిగి ఉద్యోగంలో జాయిన్ అయ్యాడు. గిరి భార్య నిర్మలకు నెలతప్పింది. మళ్ళీ ఇంట్లో ఆనంద వాతావరణం నెలకొంది. గిరి మధుబాలకు సంబంధాలు చూస్తూనే ఉన్నాడు. చదువుకున్న చెల్లెలికి మంచి ఉద్యోగంలో ఉన్న వరుడిని, అదీ ఆమె పని చేసే ఊళ్లోనే  చూడాలని అతని తాపత్రయం.

ఒకసారి మమత ఎందుకో వరుసగా రెండు రోజులు ఆఫీసుకు రాలేదు. ఎప్పుడో గానీ సెలవు తీసుకొని మమత తనకు ఏమీ చెప్పకుండా మానేయటంతో ఆమె మొబైల్ కి ఫోన్ చేసింది మధుబాల. రెండు మూడు సార్లు రింగ్ అయినా ఎవరూ తీయలేదు. మమత ఇంటికి ఎప్పుడూ వెళ్ళే సందర్భం రాలేదు. అందుకనే, ఆమె ఆరోగ్యం బాగాలేదేమో అని కొంత కంగారు పడినా, అడ్రస్ వెదుక్కుంటూ వెళ్ళటం కష్టమని ఊరుకుంది. వరుసగా ఫోన్ కాల్స్ చేస్తూనే ఉంది. రెండో రోజు ఫోన్ పూర్తిగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది.

మూడో రోజు ఆఫీసుకు వచ్చింది మమత. చాలా నీరసంగా కనబడింది.

‘‘ఏయ్ మమ్మూ? ఏమిటిది చెప్పా పెట్టకుండా మానేసావు? వంట్లో బాగాలేదా? అయ్యో, ఇదేమిటి, ఇలా స్కార్ఫ్ కట్టుకున్నావు?” కంగారుగా అడిగింది మధుబాల.

‘‘బాగా జ్వరం వచ్చి తగ్గింది మధూ...అంత కన్నా ఏం లేదు. కొద్దిగా చలిగా, జలుబుగా ఉందని స్కార్ఫ్ కట్టుకున్నాను...” చెప్పి పనిలో జొరబడింది మమత.

మధ్యాహ్నం లంచ్ టైం లో కూడా తాను తెచ్చుకున్న బ్రెడ్ ముక్కలే తిన్నది మమత.

సాగర్ లాల్ దగ్గర సెలవు తీసుకుని బాగ్ తీసుకుని మధుబాల బయటకు వచ్చేసరికే చిరుచీకట్లు ముసురుకుంటున్నాయి. ఆఫీసు బయట ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్టుగా  నిలబడి ఉన్నది  మమత.

‘‘అయ్యో, మమతా ఏమిటింకా ఇంటికి వెళ్ళలేదా? మీ వారు రాలేదా?” కంగారుగా అడిగింది.

‘‘నేను నీకోసం ఎదురు చూస్తున్నాను... నేను... నేను... నీతో మీ ఇంటికి రానా?” మొహమాటంగా అడిగింది మమత.

‘‘అయ్యో, మహారాణీ లా... రా వెళదాం...” తన స్కూటర్ని పార్కింగ్ లోంచి బయటకు తెచ్చి, హెల్మెట్ సర్దుకుంటూ ‘ఎక్కు...’ అంది వెనకసీటు చూపించి. ఎక్కి సర్దుకు కూర్చుంది మమత.

రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న మధు ఇంటికి చేరటానికి పది నిముషాల కన్నా ఎక్కువ సమయం పట్టలేదు.  స్కూటర్ పెట్టేసి, లిఫ్ట్ లో తన ఫ్లాట్ కి చేరుకుంది మధుబాల, మమతతో సహా.తాళం తీసి లోపలికి  అడుగు పెట్టి, “రా మమ్మూ, ఇదిగో ఇదే మన చిట్టి సామ్రాజ్యం!” అంది కుర్చీ చూపిస్తూ.సింపుల్ గా ఉన్నా అన్నీ అందంగా అమర్చుకుంది మధుబాల. గోడలో అమర్చిన అరల్లో బొమ్మలూ, అలంకరణ వస్తువులూ, పుస్తకాలూ ఉన్నాయి.

‘‘అమ్మో, ఎన్ని పుస్తకాలు? నువ్వు బాగా చదువుతావు కదూ?” అంది మమత.

‘‘అవును మమ్ము, పుస్తకాలుంటే ఇంక తిండీ, నీళ్ళూ అక్కరలేదు. మా ఐశూ నేనూ చదివి బాగా డిస్కస్ చేసుకునే వాళ్ళం...” నవ్వి, “కూర్చో మమ్మూ, మనిద్దరం తినటానికి ఏమైనా చేస్తాను...” అని వంటగదిలోకి నడిచింది.

పది  నిమిషాల్లోనే  ‘అటుకుల ఉప్మా’ ప్లేట్స్ లో వచ్చింది.

‘‘వేడి వేడిగా తినెయ్... ఇంకా చలేస్తోందా? ఆ స్కార్ఫ్ తీసెయ్ మమ్మూ...” తనే లాగబోయి అది పక్కకి జరిగి ఆమె తెల్లని చెంప కనబడటంతో చిన్నగా  అరిచింది అప్రయత్నంగా.

తెల్లని చెంప మీద గోళ్ళతో రక్కిన రక్కుళ్ళు ఇంకా పచ్చిగానే ఉన్నాయి. ఆమె చెక్కిలి ఎర్రగా కందిపోయింది. అకస్మాత్తుగా ఆ చిరుగాయాలకు చల్లని గాలి తగలటంతో నొప్పిగా అనిపించి, “అబ్బా...” అని మూలిగింది మమత.

‘‘అయ్యో, ఏమిటి? ఏమిటిది మమతా? ఎవరు చేసారు ఈ గాయాలు?” త్వరత్వరగా వెళ్లి అరలోంచి ఆయింట్ మెంట్ తీసుకు వచ్చి మృదువుగా బుగ్గ మీద రాసింది మధుబాల.

శుష్కంగా నవ్వింది మమత.

‘‘ఎవరేమిటి మధూ? నా పతిదేవుడే... ఈరోజు అందుకే నీ దగ్గరకు వచ్చాను. నా జీవితంలోని కొన్ని చేదు పుటలను పరిచయం చేయాలని...”

‘‘నిజమా? నేను నమ్మలేకపోతున్నాను...” అప్రయత్నంగా మధు కళ్ళలో నీళ్ళు నిండాయి.

‘‘ఛ! నాకోసం నీవు బాధ పడకు మధూ...”

‘‘సరే మమ్మూ, తర్వాత మాట్లాడుకుందాం. బాగా నీరసంగా ఉన్నావు, ముందు ఇది తీసుకో, తర్వాత వేడిగా కాఫీ తాగుదాం...” తనను తాను  సంబాళించుకుంటూ చెప్పింది మధుబాల. మౌనంగా ఫలహారము, కాఫీలు ముగిసాయి.

‘‘మమతా, ఇప్పుడు చెప్పవే... అసలు ఏం జరిగింది?” దీర్ఘంగా నిట్టూర్చి చెప్పటం మొదలుపెట్టింది మమత.

‘‘మీ ఊరిలో టెంత్ రాసేయగానే మా నాన్నగారికి బదిలీ అవటంతో హైదరాబాద్ వచ్చేసాం. ఇంటర్ మీడియట్ మంచి మార్కులతో పాసై, ఇంజినీరింగ్ లో జాయిన్ అయ్యాను. అక్కడే నాకు నరేంద్ర పరిచయం అయ్యాడు. చక్కగా పాడే నరేందర్ గానమాధుర్యానికి నేను వశురాలను అయిపోయాను. పరిచయం స్నేహంగా, స్నేహం ప్రణయంగా రూపు దిద్దుకోవటానికి ఆట్టే సమయం పట్టలేదు. ఇద్దరం డిగ్రీ రాగానే వివాహం  చేసుకోవాలని నిర్ణయం చేసుకున్నాము.

అయితే మా కాలేజీ విద్యార్థులు ఎవరో మా నాన్నగారికి మా విషయం తెలియజేసారు. మా నాన్నగారు నన్ను పిలిచి సౌమ్యంగానే నరేంద్ర గురించి అడిగారు. నేనతన్ని గాఢంగా

ప్రేమిస్తున్నానని, ఒప్పుకుంటే పెద్దల ఆశీర్వాదంతో లేకుంటే గుడిలో దేవుడి ఆశీర్వాదంతో మా పెళ్ళి జరుగుతుందనీ చెప్పాను. అయితే అందరు తండ్రుల్లా ఆయన కోపం తెచ్చుకోలేదు. నరేంద్ర గురించి తాను వాకబు చేసాననీ, అతనంత యోగ్యుడు కాదనీ, నేను డ్రాప్ అవటం మంచిదనీ చెప్పారు.


నీకు తెలుసు కదా, మనం చిన్నప్పుడు పంచతంత్రంలో చదువుకున్నట్టు 'పోగాలము దాపురించిన వాడు మిత్రుని మాటను, అరుంధతినీ, దీప నిర్వాణ గంధమునూ వినడు, కనడు, మూర్కొనడు' అని... నాన్నగారి హితోక్తులు నా చెవికెక్క లేదు. ఆయన మౌనంగా తన అసమ్మతిని తెలియజేసి, నాకు కొంత డబ్బు ఇచ్చి ఇంట్లోంచి వెళ్ళిపొమ్మని చెప్పారు. నేను ఆ డబ్బు వద్దని అనలేదు. ఇంకా ఉద్యోగాలు సంపాదించుకోలేని మాకు ఆ డబ్బు ఎంత ఉపయోగమో నాకు తెలుసు. ఆర్యసమాజ్ పద్ధతిలో, కొంతమంది మిత్రుల సహకారంతో  మా వివాహం జరిగిపోయింది. ఇద్దరం చిన్న ఇల్లు తీసుకుని కాపురం పెట్టాం. నవ్వులు పువ్వులతో కాపురం మొదలైంది.

మంచి మార్కులతో డిగ్రీ పాస్ అయిన మేమిద్దరం ఉద్యోగాన్వేషణలో పడ్డాం. ప్రతీ పోటీ పరీక్షకూ కలిసి చదువుకొని,  ప్రిపేర్ అయి వెళ్ళి బాగా రాయాలని, పాసై, ఇంటర్వ్యూలలో కూడా జయం సాధించి మంచి జాబ్ లు సంపాదించాలని ఎన్నెన్నో కలలు కనేదాన్ని. నేను జాగ్రత్తగా చదువుకుంటూ, తననీ రమ్మంటే వచ్చే వాడు కాదు. ఫ్రెండ్స్ తో ఏదో ప్రోగ్రాం ఉందంటూ వెళ్ళిపోయేవాడు.

పోనీ నేను కూర్చుని చదువుకుంటూ ఉంటే వచ్చి సరాగాలు మొదలు పెట్టేవాడు, లేదా, సినిమా ప్రోగ్రాం వేసేవాడు. జీవితానికి కావలసినది ఏమిటో తెలిసిన నాకు అతని జీవన విధానం నచ్చలేదు. రాత్రి టీవీ లో అడ్డమైన సినిమాలూ చూడటం, తెల్లవారి ఆలస్యంగా నిద్ర లేచి, ఆదరా బాదరా తయారై బయటకి పోవటం. అసలు జాబ్ కి వెళ్ళినట్టుగా రోజూ ఎక్కడికి వెళుతున్నాడో కూడా తెలిసేది కాదు. అడిగితే ఉద్యోగ ప్రయత్నాలు అని చెప్పేవాడు. కాని తర్వాత తెలిసింది అతను క్లబ్ కి వెళ్లి పేకాట ఆడతాడని, ఆ అలవాటుకు బానిసనీ... నా

కలలన్నీ కల్లలై పోయాయి మధూ...

నాన్న గారు నాకిచ్చిన ఐదు లక్షల రూపాయలకు కాళ్ళు వచ్చాయి. జాయింట్ అకౌంట్ లోంచి ఎప్పుడో డ్రా చేసేసాడా మూర్ఖుడు. అప్పుడు నా కళ్ళు తెరుచుకున్నాయి, కాని ఏం లాభం? అప్పటినుండీ అతన్ని కంట్రోల్ చేయాలని ఎంతో ప్రయత్నించాను. నయానా భయానా చెప్పి చూసాను. ఒక దగ్గర నిలబెట్టి ఉద్యోగాలకు అప్లికేషన్ పెట్టించాలని ట్రై చేసాను.




ఊహు

వినలేదు. తనది చేయి తిరిగిన హాండ్ అనీ పోగొట్టుకున్న డబ్బుకు పదింతలు పేకాట లోనే సాధించగలననీ అన్నాడు. నేను ఒక చిన్న జాబ్ లో జాయిన్ అయ్యాను.

నాకు వచ్చే జీతంలోనే ఇంటద్దె, పాలు, బియ్యం,సరుకులు అన్నీ నడవాలి. పైగా అతనికి పాకెట్ మనీ ఇవ్వాలి. లేకపోతే అరిచి గోల చేసేసేవాడు. ఇంటి పనిలో నాకు వీసమెత్తు సహాయం కూడా చేసేవాడు కాదు. వండిపెడితే హాపీగా తిని లేచేవాడు. గట్టిగా గొడవ పెట్టుకున్నాను. ఏమనుకున్నాడో ఒక రోజు ఎవరో సినిమా సంగీత దర్శకుడు తనకి గాయకుడిగా అవకాశం ఇస్తానని అన్నాడని, కానీ ఒక లక్ష రూపాయలు ఇవ్వాల్సి వస్తుందనీ, ఆ డబ్బు మా

నాన్నగారిని అడిగి తీసుకురమ్మని  చెప్పాడు. మన ప్రతిభను వెదుక్కుంటూ అవకాశాలు రావాలి కానీ ఇలా డబ్బిచ్చి అవకాశాలు కొనుక్కోవటం అంటే నాకు అసహ్యం అని చెప్పాను. పైగా నాన్నగారి ముఖం చూడటానికే నాకు అర్హత లేదని నా భావన. అలాంటప్పుడు ఆయన దగ్గరకి వెళ్లి అడిగి తెమ్మంటాడేమిటి అని చాలా దుఃఖం వచ్చింది. నేను వెళ్ళి డబ్బు తీసుకురాలేదని అతనికి కోపం వచ్చి చెన్నై వెళ్ళిపోయాడు.

అలా ప్రశాంతంగా ఒక మూడు నెలలు గడిచాయి. నా ప్రాణానికి మళ్ళీ వెనక్కి వచ్చాడు. ఖరీదైన బట్టలతో పాటుగా రెండు లక్షల రూపాయలు తెచ్చి నాకిచ్చాడు. తమిళ్ సినిమా పాటలకు ట్రాక్స్ పాడుతున్నానని చెప్పాడు. ఏది నిజమో ఏది అబద్ధమో తెలియని స్థితి. అభావంగా తలూపాను. తన తప్పులకు క్షమించమనీ, ఇకనుంచి కష్టపడి పాడుతూ సంపాదిస్తాననీ, చెన్నై వెళ్ళిపోదామనీ గొడవ చేసాడు. కానీ నేను ఒప్పుకోలేదు. అప్పటికే మన కంపెనీలో జాబ్ కి అప్లై చేసాను.

వారం రోజుల తర్వాత జరిగిన ఇంటర్ వ్యూ లో సెలెక్ట్ కూడా అయ్యాను. నేను జాయిన్ అయిన వెంటనే మనం కలిసాం కదా... అతను ఒక వారం ఇక్కడా, ఒక వారం చెన్నై లోనూ  ఉండేవాడు.  ఏం చేస్తాడని అడిగిన వారికి నీకు చెప్పినట్టే చెప్పేదాన్ని. ఏం చేయను మరి? పరువు కోసం తప్పేది కాదు...

మొన్న మళ్ళీ వచ్చాడు. ఈసారి నా బంగారు నగలన్నీ ఇవ్వమని అడిగాడు. నేను ఇవ్వనని గట్టిగా చెప్పాను. నేను ఎంత ప్రతిఘటించినా వినకుండా నాతో బలవంతపు శృంగారం జరిపాడు. ఇదిగో పైశాచికత్వంతో నా చెంప మీద ఇలా గోళ్ళతో గట్టిగా గీరేసాడు. ఇక కొన్ని చోట్ల అయిన గాయాలు, నొప్పులూ చెప్పలేనివి మధూ... పెళ్ళి చేసుకుని రెండేళ్ళు కాకుండానే రెండు జన్మల బాధలు అనుభవించాను. చాలా సార్లు అనిపిస్తుంది, పెళ్ళికి ముందు నరేన్ కురిపించిన ప్రేమ నటనా? ఒకవేళ అది నటన కాకుంటే, నిజమే అయుంటే, మరిప్పుడు ఆ ప్రేమ ఏమై పోయింది? ఆవిరై గాలిలో కలిసిపోయిందా?

ఈ రోజు మళ్ళీ చెన్నై వెళ్ళిపోయాడు. ఇప్పుడు నాకేం చేయాలో తోచటం లేదు. క్షణం క్షణం నరకం అనుభవిస్తూ అతనితో కలిసి బ్రతకాలని లేదు. ఎందుకో నా మనసెరిగిన స్నేహితురాలివని నీతో ఇవన్నీ చెప్పుకోవాలని అనిపించింది…" చెప్పటం ముగించి రెండు చేతులలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది మమత.

"అయ్యో, మమ్మూ… ఏమిటిది? ప్లీజ్ మా తల్లివి కదూ, అలా ఏడవకు…" ఆమెను అక్కున చేర్చుకుని కళ్ళు తుడిచింది మధుబాల.

"ముందు విశ్రాంతి తీసుకో… తర్వాత ఏం చేయాలో ఆలోచిద్దాం… సరేనా?" ఆమెను అనునయించి, తన మంచం మీదనే పడుకోబెట్టింది మధుబాల.

మమత ఆదమరచి నిద్రపోయింది. పసిపాపలా కనిపిస్తున్న ఆమెను చూస్తుంటే మధుబాలకి ఎంతో బాధ, ఆవేదన కలిగాయి… పెళ్ళి అంటే ఒక్క క్షణం భయం కలిగింది. అంతకన్నా ముందు, ఈ మమత సమస్యను ఎలా తీర్చాలి? జీవితాన్ని ఎలా చక్కదిద్దాలి? ఈ ఆలోచనలు ఆమెను చుట్టుముట్టాయి.

***

టేబుల్ మీద తలవాల్చి పడుకుంది ఐశ్వర్య. ఏదో తెలియని బాధ ఆమెను కుదిపేస్తోంది. ఏమిటిది? ఎందుకీ వివక్ష? తాను మాత్రం ఆడపిల్ల కాదా?

పై ఫ్లాట్ లో సందడి క్రింది వరకూ వినిపిస్తోంది… నవ్వుల కిలకిలలూ, కబుర్ల గలగలలూ అలల్లా గాలిలో తేలివస్తున్నాయి. పైనున్న వాటాలోని ప్రసన్నకు సీమంతం చేస్తున్నారు, అపార్ట్ మెంట్ లోని ఆడవారంతా కలిసి. విషయం తెలిసినప్పటినుండీ తానూ ఆ వేడుక చూడాలని ఆరాటపడింది కానీ ఐశ్వర్యకు పిలుపు రాలేదు… ఎప్పుడైనా పిన్ని గారింట్లో కలిసినప్పుడు బాగానే మాట్లాడతారు అందరూ… ఇలాంటి పేరంటాలకు మాత్రం పిలవరా? మనసు బాధతో మూలిగింది.

‘‘ఐశూ, ఎందుకంతగా బాధ పడతావ్? లే, లేచి బట్టలు మార్చుకో, బయటకు వెళదాం…” సముదాయించాడు కార్తీక్.

‘‘లేదు కార్తీ… నాకు రావాలని లేదు…”

‘‘ఇలా ఇంట్లోనే కూర్చుంటే బాధ పడుతూనే ఉంటావు… పోనీ మధుబాల గారిని రమ్మని చెప్పనా?”

‘‘ఉహు, వద్దు…”

‘‘అమ్మాయ్ ఐశూ, ఉన్నావా?” అంటూ లోపలికి దూసుకు వచ్చింది అన్నపూర్ణ.

‘‘రండి ఆంటీ…కూర్చోండి. ఐశూ, రా పిన్ని వచ్చారు…”

గబుక్కున లేచి, జుట్టు సరిచేసుకుని, ముఖం నీళ్ళతో కడుక్కుని బయటికి వచ్చింది ఐశ్వర్య.

‘‘ఏమిటి ఇంకా అలాగే ఉన్నావు? పైన సందడి వినబడటం లేదా? రెడీ అవమ్మా…”

మౌనంగా తలదించుకుని నిలబడింది ఐశ్వర్య.

‘‘అదీ… అదీ… ఆంటీ… ఐశ్వర్యను వాళ్ళు పిలవలేదు… అందుకని…”

‘‘పిలవలేదా? ఎందుకుటా? ఇదేం తప్పు చేసిందని?” ఆవిడకి కోపం వచ్చేసింది.

‘‘ఆ ప్రసన్న వాళ్ళమ్మకి లేకపోతే దానికైనా ఉండక్కరలేదా? ఉండు నేను గట్టిగా అడిగేస్తాను…” అంటూ లేచింది.


పసుపు రంగుకు కుంకుమ రంగు అంచు పట్టుచీరతో అచ్చు అమ్మవారిలా ఉన్నది అన్నపూర్ణ. ఆమె కొంగును పట్టి ఆపుతూ, “వద్దు పిన్నీ… నాకు రావాలని లేదు…” అంది

ఐశ్వర్య.

“ఐశ్వర్యా… నేను కూడా వెళ్ళటం లేదమ్మా… ఈ బిల్డింగ్ లో ప్రతీ అమ్మాయీ నా కన్న కూతురితో సమానమే. ఎవరికి న్యాయం జరగకపోయినా నేను సహించలేను…” అన్నది అన్నపూర్ణ.

“కాని, మీరు వెళ్ళకపోతే వాళ్ళు చాలా బాధపడతారు…”

“పడనీ… బాధ అంటే వాళ్ళకీ అర్థం కావాలి కదమ్మా?”




పెళ్ళి దగ్గర పడుతున్న కొద్దీ మధుబాలలో ఆనందంతో పాటుగా ఏదో తెలియని భయం కూడా చోటు చేసుకోసాగింది.

ఏ ఆటంకాలూ లేకుండా అన్నీ కుదిరాయి అనుకుంటే వేణుగోపాల్ చెల్లెలు వినత ప్రవర్తన పట్ల ఏదో జంకు కలుగుతోంది. ఒకరోజు వేణు షాపింగ్ కార్యక్రమం పెట్టాడు. తనను డైరెక్ట్ గా మార్కెట్ దగ్గరున్న షాపింగ్ మాల్ కి వచ్చేయమని చెప్పాడు. తాను వెళ్ళిన పది నిమిషాల

తరువాత కారులో వచ్చారు వేణు, వినత. వినతను దింపి కారు పార్కింగ్ చేసుకోవటానికి వెళ్ళాడు వేణు.

తానే రెండు అడుగులు ముందుకు వేసి, వినత వైపు చేయి చాపి ''హాయ్!'' అంది మధుబాల.

''హాయ్'' అంటీ అంటనట్టుగా మునివేళ్ళతో వేళ్ళను స్పృశించి వదిలేసింది వినత. ఇక ఏం మాట్లాడాలో అర్థం కాక మౌనంగా నిలుచుని ఉండిపోయింది మధుబాల. ఈలోగా వచ్చాడు వేణు.

''మధూ, అమ్మ నీకు పదివేల రూపాయలు పంపించింది. నీకు ఇష్టమైన చీరలు సెలెక్ట్ చేసుకోమని చెప్పింది. పెళ్ళికి కట్టుకోబోయే పెద్ద పట్టుచీర, మరో రెండూ తీసుకో... మధుపర్కాలు వేరేగా కొంటాము కదా...'' అన్నాడు.

''విన్నూ, నువ్వు కూడా నీకేం కావాలో కొనుక్కో... ఆ తర్వాత నన్ను ఆడిపోసుకోకు...''చెల్లెలితో అన్నాడు నవ్వుతూ.

''అలాగే, ముందు మీ శ్రీమతిగారి షాపింగ్ కానీ... ఆ తర్వాత నేను...'' అదోరకంగా నవ్వింది వినత.

చీరలు మడతలు విప్పి, పరచి చూపిస్తున్నాడు సేల్స్ మాన్ కానీ మధుబాల దృష్టి దానిమీద నిలవటం లేదు.

''ఈ అరిటాకుపచ్చ రంగుకి వంగపువ్వు రంగు అంచు చూడండి... వెరీ రేర్ కాంబినేషన్... పైటకొంగు చూడండి లతలతో ఎంత బాగా నేసారో...'' అతను వర్ణిస్తున్నాడు... నిజంగానే ఆ చీర చాలా బాగుంది. అప్రయత్నంగా వేలికొసల్తో పైటంచును తాకింది మధుబాల.

''బాగుంది కదూ, పాక్ చేయించనా?'' అన్నాడు వేణు.

''అవును... అలాగే...'' మెల్లగా అంది మధుబాల.

ఈలోగా పక్కనే మరో కష్టమర్స్ చూస్తున్న చీరల మీద పడింది మధుబాల దృష్టి. ''ఆ మెజంటా రంగు చీర ఓ సారి ఇవ్వండి...'' అని అడిగి తీసుకుని దగ్గరగా చూడసాగింది...

''నేను కొన్ని చీరలు తీసుకుంటాను. వీటికి నేనే పే చేస్తాను...'' అంది వేణుతో...

''ఎవరికీ? మీ వాళ్ళకా?''

''అవును... మా అమ్మకీ, వదినకీ, నాయనమ్మకీ, ఇంకా నా ఫ్రెండ్ ఐశ్వర్యకూ... ఇదిగో ఈ మెజంటా కలర్ చీర ఆమెకు బాగా నప్పుతుంది...''

‘‘ఓహ్, దట్స్ గుడ్…’’ అన్నాడు వేణు.
చీరల సెలక్షన్ లో వినత ఏమీ కల్పించుకోలేదు. తాను మాత్రం పదిహేను వేల రూపాయల చీర ఒకటి కొనిపించుకుంది. మధుబాలకి మూడు చీరలు తీసుకున్నాడు వేణు. మధు తాను కూడా ఒక నాలుగు చీరలు తీసుకుంది.
‘‘మా చీరలు అయాయి… ఇక మీ బట్టలు?’’ అంది మధుబాల.
‘‘అవి, నాన్నగారూ, అమ్మా, నేనూ కలిసి వస్తాము…అప్పుడు తీసుకుంటాం. వినతా… శనివారం నాడు బావను కూడా తీసుకుని రా… ఆయనకీ డ్రెస్ కొనాలి…’’ అన్నాడు వేణు.
షాపింగ్ అయ్యాక, అక్కడే ఉన్న రెస్టారెంట్ కి కాఫీ తాగుదామంటూ తీసుకువెళ్ళాడు వేణు. మధుబాలకి ప్రాణ సంకటంగా ఉంది. వినతతో స్నేహంగా మాట్లాడదామన్నా ఆమె అంటీ అంటనట్టు ఉంటోంది. ఏం మాట్లాడినా స్వోత్కర్ష, వాళ్ళ అత్తారింట్లో ఆమెను ఎంతో ప్రత్యేకంగా చూస్తారంటూ గొప్పలూ… కొన్ని సార్లు ‘ఏదో పుణ్యం చేసావు కాబట్టి మా ఇంటి కోడలివి అవుతున్నావు’ అన్న శ్లేష ఆమె మాటల్లో తెలియజేస్తూ ఉంటుంది…
‘‘ఇక్కడ ఉప్మా చాలా బాగుంటుంది… తిందామా?’’ అన్నాడు వేణు…
‘‘ఉహు.. నాకు కాఫీ చాలు…’’ అంది వినత.
‘‘అదేమిటే, ఇద్దరం ఈ పక్కనే థియేటర్ లో సినిమా చూసి ఇక్కడికి వచ్చి ఉప్మా తినేవాళ్ళం కదూ? మరచిపోయావా? తిను… ఆర్డర్ చేస్తున్నా…’’ అని ‘మూడు ఉప్మా’ అని ఆర్డర్ చెప్పాడు.
‘‘పెళ్ళి అయాకా ఆ ఉద్యోగం మానేస్తావా?’’ మధుబాల వైపు చూస్తూ అడిగింది వినత.
‘‘మానేయటం ఎందుకూ?’’ అయోమయంగా వేణుగోపాల్ వైపు చూసింది మధుబాల.
‘‘ఉహు, మానదు…మంచి ఉద్యోగమే కదా…’’ అన్నాడు వేణు.
‘‘ఏమోలే., మనింటి ఆడవాళ్ళు ఉద్యోగం చేయటం అమ్మకీ, నాన్నగారికీ ఇష్టమో కాదో అని…’’
‘‘అది నేను చూసుకుంటాలే… డోంట్ వర్రీ…ఊ… ఉప్మా వచ్చింది… తిని ఎలా ఉన్నదో చెప్పండి…’’ అన్నాడు వేణు.
‘‘నిజమే, ఉప్మా చాలా బాగుంది…’’ అంది మధుబాల.

‘‘శుభలేఖ ఇవ్వటానికి నువ్వు స్వయంగా రా అన్నయ్యా... మా అత్తగారికి పట్టింపు ఎక్కువ...’’ చెప్పింది వినత.

‘‘అలాగే విన్నూ... సరే కాఫీయే కదా నీకు?’’

‘‘ఏదో ఒకటి చెప్పు...త్వరగా తాగేసి బయలుదేరదాం...’’

ముగ్గురూ కాఫీ తాగటం అయ్యాక కారులో బయలుదేరారు ముగ్గురూ. దారిలో తన రూమ్ దగ్గర దిగిపోయింది మధుబాల.

***

‘‘హలో మధూ, మన పెళ్ళి శుభలేఖలు వచ్చేసాయి. ఈరోజు సాయంత్రం ఇంటికి రా... ఇద్దరం కలిసి వెళ్లి మా వినత ఇంట్లో ఆమె అత్త గారికి శుభలేఖ ఇద్దాము. సరేనా?’’ ఫోన్ లో చెప్పాడు వేణు.

‘‘సరే” నని ఫోన్ పెట్టేసింది మధుబాల.

మధుకు పెళ్ళి కుదిరినప్పటినుండీ ఆమెను ఆఫీసులో అందరూ చాలా అపురూపంగా చూసుకుంటున్నారు. తన మంచితనంతో, స్నేహంతో, కార్యదీక్షతో అందరికీ తలలో నాలుకలా మెలిగే మధూ అంటే అందరికీ ఎంతో ఇష్టం మరి.

ఆ సాయంత్రం ఇంటికి వెళ్లి స్నానం చేసి లేత నీలం రంగు కాటన్ చీరలో పువ్వులా తయారై వేణు ఇంటికి బయలుదేరింది మధుబాల.

ఆమెను సాదరంగా ఆహ్వానించారు సుగుణమ్మ, గోవర్ధనరావూ. హాల్లోని సోఫాలో బిడియంగా కూర్చుంది మధు.

తానే స్వయంగా చల్లని మంచినీళ్ళు తెచ్చి కాబోయే కోడలికి అందించి, పక్కనే కూర్చుంది సుగుణమ్మ.

‘‘నిన్ననే శుభలేఖలు వచ్చాయ్ మధూ... మీవి కూడా వచ్చేసాయా?’’

‘‘ఈరోజు ప్రెస్ నుంచి అన్నయ్య తెస్తానని అన్నాడు అత్తయ్యా..’’ మెల్లగా చెప్పింది మధు.

‘అత్తయ్య’ అని మధు పిలవగానే సుగుణమ్మ ముఖం చంద్రబింబం అయింది. భర్త వైపు ఓ చిరునవ్వు విసిరింది.

‘‘ఇప్పుడు నాన్నగారి ఆరోగ్యం బాగుందా అమ్మా?’’ ఆప్యాయంగా అడిగాడు గోవర్ధనరావు.

“ఫర్వాలేదండి, ఇంట్లో ఉండలేకనే మళ్ళీ జాబ్ లో జాయిన్ అయ్యారు…”

“అబ్బాయి వచ్చేస్తాడమ్మా, ఉండు నీకు కాఫీ తెస్తా…” అంటూ లేచింది సుగుణమ్మ.

“అబ్బే, ఇప్పుడు ఏమీ వద్దు…” అని మధు చెప్పినా వినలేదు.

ఈలోగానే లోపలినుంచి వచ్చేసాడు వేణుగోపాల్ ట్రిమ్ గా తయారై.

“అమ్మా, మేము వెడుతున్నాం… కాఫీ బయట తాగేస్తాం…” అంటూ లోపలికి  ఓ కేక పెట్టి, కారు తీయటానికి బయటికి వెళ్ళాడు.

“సరేలేరా… వెళ్ళి రండి… వచ్చేటప్పుడు అమ్మాయిని ఇంటి దగ్గర వదిలేసి రా…”  అంటూ ఇవతలికి వచ్చి, “వీడేడీ?” అంది మధుబాలతో.

“కారు తీస్తున్నారు అత్తయ్యా…” అంటూ వంగి ఆమెకు, గోవర్ధనరావుకూ  పాదాభివందనం చేసింది.

“వెళ్లి వస్తాను…” అంటూ వారి దగ్గర సెలవు తీసుకొని కారులో అతని ప్రక్కనే కూర్చుంది మధుబాల.

***

“వినత వాళ్ళ ఇల్లు నల్లకుంటలో…” డ్రైవ్ చేస్తూ అన్నాడు వేణు.

“ఓ, అలాగా? ఎవరెవరు ఉంటారు??”

“వినతా, దాని భర్త పవన్, అతని తల్లి సుందరమ్మ గారూ… ఆవిడ మంచం మీదనుంచి లేవలేరు. భర్త పోయిన తరువాత పూర్తిగా జబ్బుపడ్డారు. ఆవిడను చూసుకోవటానికి ఒక మనిషి పూర్తిగా ఇంట్లోనే ఉంటుంది. దీనికి పెద్ద బాధ్యత ఏమీ ఉండదు. అయినా భూభారం అంతా తానే మోసేస్తున్నట్టు ఫీల్ అవుతుంది. వాళ్ళు ఆగర్భ శ్రీమంతులు. అది కూడా దీని గర్వానికీ, నోటి దురుసుతనానికీ ఒక కారణం. మధూ, వినత ప్రవర్తన నిన్ను నొప్పించినట్లైతే మనసులో పెట్టుకోకు ఎప్పుడూ… దానిని ఇంట్లో చాలా గారాబం చేసి చెడగొట్టేసాము అందరం… ముఖ్యంగా నేనూ…” కుడి చేతిని స్టీరింగ్ మీద ఉంచి డ్రైవ్ చేస్తూ, ఎడమ చేత్తో మధు చేతిని సున్నితంగా తాకుతూ చెప్పాడు వేణు.

“అలాగేనండి… ఎప్పుడూ అలా అనుకోను. కానీ ఆమె కొంచెం సౌమ్యంగా మారటానికి మీరూ కాస్త చెబుతూ ఉండండి…” అంది నవ్వుతూనే.

మరో ఐదు నిమిషాల్లో పెద్ద భవంతి ముందు కారు ఆగింది. గేటు దగ్గర ఉన్న గూర్ఖా కారు చూడగానే గేటు తెరిచాడు. లోపలికి  వచ్చి పోర్టికో లో కారాపి,  తాను దిగి మధుబాలకు చేయి అందించాడు.

''హాయ్ అన్నయ్యా, మధూ...'' అంటూ పరుగుతో ఉత్సాహంగా ఎదురు వచ్చింది, వినత.

''ఏయ్ విన్నూ, వదినా అని పిలవాలే...'' ముద్దుగా వినత తల మీద చిన్నగా మొట్టాడు వేణుగోపాల్.

''నమస్తే బావగారూ, నమస్తే చెల్లాయ్...'' అంటూ పవన్ ఎదురు వచ్చాడు.

మెత్తని సోఫాల్లో కూర్చోగానే లోపలినుంచి జ్యూస్ గ్లాసులు వచ్చాయి.

ఏవో లోకాభిరామాయణం కబుర్ల మధ్యన జ్యూస్ తాగటం కొనసాగింది. ఇల్లంతా ఎంతో రిచ్ గా ఆధునికతనూ, ప్రాచీనతనూ కలబోసుకున్న అలంకరణతో ఎంతో బాగుంది. వాల్ టూ వాల్ కార్పెట్లు మెత్తగా ఉన్నాయి. హాల్లో మధ్యగా వేళ్ళాడదీసిన షాండిలియర్ పూల గుత్తిలా ఉంది... వెన్నెల దీపాల్లా తెల్లని వెలుగులను వెదజల్లుతూ వజ్రాభరణమల్లే వెలిగిపోతోంది.

అడుగడుగునా సిరి తాండవమాడుతున్న ఆ పరిసరాలలో ఎందుకో ఉక్కిరిబిక్కిరిగా ఫీలయింది మధుబాల.

''అత్తయ్య గారిని చూద్దామా?'' చేతిలో శుభలేఖతో లేచాడు, వేణు.

''అలాగే, అమ్మ కూడా ఎదురు చూస్తోంది...'' అంటూ పవన్ తల్లిగదిలోనికి దారి తీసాడు.

లోపల గదిలో సుందరమ్మ తెల్లని మల్లెపువ్వు లాంటి పక్క మీద దిళ్ళకు ఆనుకొని కూర్చున్నారు. నడుముకు బెల్ట్ ఉంది. జుట్టు బాబ్ కట్ చేయబడి ఉంది. నుదుట విభూది రేఖలు. తెల్లని నైటీ లో శాంతి దూతలా ఉన్నది. పక్కనే ఆమె అటెండెంట్ యాభై సంవత్సరాల విమలమ్మ కుర్చీలో కూర్చుని మహాభారతం చదివి వినిపిస్తోంది.

వీళ్ళను చూడగానే ఆమె లేచి నిలబడి, మరి కొన్ని కుర్చీలను తెచ్చి గదిలో వేసింది.

''నమస్తే అత్తయ్యా...'' ఆమె పాదాలను తాకి కళ్ళకి అద్దుకున్నాడు వేణుగోపాల్.

''చిరంజీవ! ఏం నాయనా, పెళ్ళి తేదీ కూడా ఖరారు అయిందట కదా...'' సౌమ్యంగా పలికింది ఆవిడ గొంతు.

''అవును అత్తయ్యా, ఇదిగో ఈమె మధుబాల, నాకు కాబోయే భార్య...''

మధుబాల చటుక్కున ఆమెకి పాదాభివందనం చేసింది.

''చక్కగా మహాలక్ష్మి లాగా ఉన్నావు తల్లీ...''

''మొట్టమొదటి శుభలేఖ మీకే ఇస్తున్నా అత్తయ్యా...'' పసుపురాసిన శుభలేఖను వేణు, మధు కలిసి ఆమె చేతుల్లో పెట్టారు. సంప్రదాయసిద్ధంగా దేవుళ్ళ బొమ్మలతో, 'జానక్యా: కమలామలాంజలి పుటే యా: పద్మరాగాయితా:' శ్లోకంతో ప్రారంభింప బడిన ఆ శుభలేఖను ఆనందంగా పరికించి చూసింది సుందరమ్మ.

''పెళ్ళికి వినతా, అబ్బాయి వస్తారు నాయనా...నేను రాలేను కదా, నా దీవెనలు ఇప్పుడే, ఇక్కడే...'' అంటూ సాభిప్రాయంగా విమలమ్మ వైపు చూసింది. ఆవిడ గిన్నెలో కొన్ని అక్షింతలు, ఒక పాకెట్ తెచ్చి ఇచ్చింది.

అక్షింతలు ఇద్దరి మీదా వేసి, ''అమ్మాయ్ వినతా, ఇదిగో ఈ చీరను పసుపు కుంకాలతో పాటుగా మీ వదినకి ఇవ్వమ్మా...'' అని చెప్పి ఇప్పించింది.

''చాలా థాంక్స్ అత్తయ్యా... మరి మేము వెళ్లి వస్తాము...'' లేచాడు, వేణు.

''భోజనం చేసి వెళ్ళండి వేణూ... వినతా, ఏర్పాట్లు చూడమ్మా...''

ఆమె దగ్గర సెలవు తీసుకుని ఇవతలికి వచ్చేసారు వేణు, మధుబాల.

''చాలా లేట్ అయింది కదా బావా, భోజనం మరో సారి చేస్తాం... వెళతాం...'' చెప్పాడు, వేణు వాచ్ చూసుకుంటూ.


''అబ్బే, అన్నీ రెడీ గానే ఉన్నాయ్ బావా... రండి... అదిగో ఆ వాష్ రూమ్ లో ఫ్రెష్ అవండి...'' అని పవన్ చూపించటం లో ఇక తప్పలేదు.

ఏమనుకుందో ఏమో వినత ఆప్యాయంగానే అన్నీ వడ్డించింది. నలుగురూ కలిసి భోజనం చేసారు. "థాంక్ యూ వినతా..." అంది మధుబాల మనస్ఫూర్తిగా...

''అదృష్టవంతురాలివి మధూ నువ్వు... మంచి పట్టుచీర కొట్టేసావ్...'' తగ్గు స్వరంలో అంటూ వంకరగా నవ్వింది వినత.

మధుబాల బాణం తగిలిన పక్షిలా విలవిలాడింది. ఏం జవాబు చెప్పాలో కూడా తోచలేదు. ఆ బాధ చూసిన వినత సంతృప్తిగా నవ్వుకొంది.

“వెళదామా?” మధు వైపు చూసాడు వేణు. సరేనన్నట్టు తలాడించి, పవన్ కూ, వినతకూ వెళ్ళి వస్తానన్నట్టు చూసి, వెళ్లి కారులో కూర్చుంది మధుబాల.
చేతిలోని చీర పాకెట్ పాముల బుట్టలా అనిపిస్తుంటే, నిస్సహాయంగా దాన్ని మోస్తూ కళ్ళు మూసుకుంది. దారిలో రెండు మూడు సార్లు వేణు పలకరించినా పలకలేదు. ‘ఏమైందో, ఏమో…’ అయోమయంగా అనుకుంటూ ఆమెను ఇంటి దగ్గర దింపేసి వెళ్ళాడు వేణుగోపాల్.




తన సెక్షన్ కి సంబంధించిన మెయిల్స్ అన్నీ ప్రింట్ తీసి, ఫైల్ చేసుకుంటోంది ఐశ్వర్య. పక్కనే ఎవరో నిలుచున్నట్టు అనిపించి తలతిప్పి చూసింది. అదోలా చూస్తూ, వెకిలిగా నవ్వుతూ మనోహర్. అతడంటే మంచి అభిప్రాయం లేని ఐశ్వర్య “యస్?” అంది భ్రుకుటి ముడిచి.

“ఏంటి పాపా, పెళ్ళవలేదు కానీ అన్నీ అయిపోయాయిట కదా!” అన్నాడు ముందుకు వంగి ముఖంలో ముఖం పెడుతూ…
చప్పున కుర్చీని దూరంగా జరుపుకుని, “చూడండి మిస్టర్, ఇట్ ఈజ్ నన్ ఆఫ్ యువర్

బిజినెస్…” అని తిరిగి తన పనిలో నిమగ్నమైంది.

“ఎవడో కార్తీక్ అనే వాడితో ఉంటున్నావటగా… మరి నాకూ ఒక ఛాన్స్ ఇవ్వకూడదూ? ఊరికే కాదులే, డబ్బిస్తా…”
గబుక్కున లేచి బాస్ గంగాధరం కేబిన్ లోకి వెళ్ళింది ఐశ్వర్య. “యస్, ఏం కావాలి?” అన్నాడు ఆయన ఆమెను చూస్తూనే.

“సర్… మనోహర్ నాతో మిస్ బిహేవ్ చేస్తున్నాడు…” తల వంచుకుని చెప్పింది దుఃఖం గొంతులో సుళ్ళు తిరుగుతుంటే.

“ఈజిట్?” బెల్ కొట్టి వెంటనే మనోహర్ని లోపలికి పిలిచాడు గంగాధరం.

“మిస్ ఐశ్వర్యతో తేడాగా ప్రవర్తిస్తున్నావట? ఉద్యోగం ఊడిపోతుంది జాగ్రత్త…” తీవ్రస్వరంతో అతన్ని హెచ్చరించాడు.

“మిస్ అని మీరు అనుకుంటున్నారు… పెళ్ళి కాకుండానే ఎవడికో మిసెస్ గా ఉన్నది ఈవిడ… ఇలాంటి వాళ్ళకు ఉద్యోగం ఇచ్చినందుకు మీ పరువే పోతుంది…” రెక్ లెస్ గా చూస్తూ సమాధానమిచ్చాడు మనోహర్.

“ఆమె వ్యక్తిగతజీవితం ఆమెది… వ్యతిరేకించటానికి కానీ, ఆమోదించటానికి కానీ నువ్వెవడివి? ఆఫీసు పనిలో ఎటువంటి అంతరాయం కలుగనంతవరకూ ఎవరి వ్యక్తిగత విషయాల్లోనూ కల్పించుకోను నేను…”

“అయితే నేను ఆఫీసు పని సక్రమంగా చేయటం లేదా? ఆమె కంప్లెయిన్ చేయగానే నన్ను లోపలికి పిలిచి వార్న్ చేస్తున్నారు?” పొగరుగా తలెగరేసాడు మనోహర్.

“నా ఆఫీసులోని ఒక తోటి ఉద్యోగినితో సరిగ్గా లేదు నీ ప్రవర్తన… నా ఉద్యోగులంతా నాకు ఒక్కటే… ఎవరికీ ఎవరివల్లా హాని కలగకూడదు… అసౌకర్యం జరగకూడదు… నీ వలన ఆమె

బాధపడుతోంది… బిహేవ్ యువర్ సెల్ఫ్… ఇట్ షుడ్ నాట్ బి రిపీటెడ్ వన్స్ అగైన్… నౌ యూ కెన్ గో…”

పొగరుగా తలెగరేసి డోర్ విసురుగా తీసి, వెళ్ళిపోయాడు మనోహర్.

మనోహర్ వెళ్ళిపోగానే, “ఐశ్వర్యా, ఏమిటమ్మా అతను చెబుతున్నది?” అని అడిగాడు గంగాధరం. “సర్… నేనూ, నా స్నేహితుడు కార్తీక్ పరస్పరం ఒకరినొకరం కోరుకుని ఒకే ఇంట్లో సహజీవనం చేస్తున్నామండి. అంతకన్నా ఏమీ లేదు…” అంది ఐశ్వర్య తేలికగా…
ఆయనకి ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. ఆమె కళ్ళలోని పసితనాన్ని గమనిస్తూ, “సరేనమ్మా, ఈ విషయం గురించి ఎప్పుడేనా తీరికగా చర్చిద్దాము… నువ్వెళ్ళి నీ పని చేసుకో…” అని తన పనిలో మునిగిపోయాడు.

‘‘అలాగే సర్, థాంక్ యు వెరీ మచ్…” అంటూ కేబిన్ లోంచి బయటకు వచ్చేసింది ఐశ్వర్య.

***

ఇంటికి వచ్చింది కానీ ఐశ్వర్యను రకరకాల ఆలోచనలు చుట్టుముట్టి సాగాయి. ఆఫీసులో ఒక్క మనోహర్ ప్రవర్తనే కాదు., సాటి లేడీ కొలీగ్స్  ప్రవర్తన  కూడా అదోలా ఉంటోంది. ఇదివరలో కలిసే లంచ్ చేసేవారు తామంతా… ఇప్పుడు ఏదో తెలియని దూరాన్ని వాళ్ళే మెయిన్ టైన్ చేస్తున్నారు. బాధగానే ఉన్నా, తనేం తప్పు చేయలేదన్న ధీమాతో తన సీట్ లోనే లంచ్ తీసుకుని, తన పనేదో తాను  చూసుకుని వస్తోంది. ఈ రోజు ఈ కొత్త సమస్య.

కార్తీక్ టూర్ వెళ్ళాడు మళ్ళీ. వారానికి కనీసం ఒకటి రెండు రోజులు వెళ్ళిపోతున్నాడు… ఒంటరిగా అనిపిస్తుంది తనకు. అక్కడికీ పిన్నిగారి ఇంటికి వెళ్ళి ఆవిడతో కబుర్లు చెబుతూ, ఆవిడ పాటలు వింటూ, కొత్త పాటలు నేర్చుకుంటూ గడుపుతూనే ఉంది… పిన్ని గారు చెప్పటం వల్లనో ఏమో ఆవిడ శిష్యురాళ్ళు అందరూ, అంటే ఈ ఫ్లాట్ లోని అమ్మాయిలు తనతో స్నేహం కలుపుకున్నారు. పై ఇంటి పాపలూ,  క్రింది ఫ్లాట్ అబ్బాయిలూ ‘అక్కా, కొంచెం ప్రాజెక్ట్ వర్క్

లో హెల్ప్ చెయ్యి,' 'అక్కా, వ్యాసం రాయాలి పాయింట్స్ చెప్పు…' అంటూ వస్తారు. పై ఫ్లాట్ లోని ప్రసన్నకి కొడుకు పుట్టాడు. వాడిని ఇరవై ఒకటో రోజు ఉయ్యాలలో వేసి, పేరు పెట్టినప్పుడు ఆ ఫంక్షన్ కి ప్రసన్న చెల్లెలు వచ్చి బొట్టు పెట్టి మరీ పిలిచింది. ప్రసన్న ఫోన్ చేసి ఐశ్వర్యను ఆహ్వానించింది. ఆ ఫంక్షన్ హడావుడి, సంబరం ఎప్పటికీ మరువలేదు తాను. ఆడపిల్లలంతా కలిసి బోలెడు పాటలు పాడారు. తాను నిర్వహించిన అంత్యాక్షరి కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని, తనిచ్చిన బహుమతులు పొంది సంతోషంగా కేరింతలు కొట్టారు.

తరువాత ప్రసన్న బుజ్జిగాడిని తన ఒడిలో పడుకోబెట్టినప్పుడు వాడి ముఖంలోకి అలాగే చూస్తూ ఉండిపోయింది ఐశ్వర్య. లేత గులాబీ రంగు జుబ్బా, డ్రాయర్ వేసారు వాడికి. నల్లని ఉంగరాల జుత్తు పట్టులా మెరిసిపోతోంది… ఆ జుత్తు లోంచి కమ్మని సాంబ్రాణి పరిమళం… వంటినిండా వేసిన బేబీ పౌడరు వాసన,  బుగ్గన పెట్టిన నల్లని దిష్టి చుక్కతో, కాళ్ళకు కట్టిన మువ్వల పట్టీలు ఘల్లు ఘల్లు మని మ్రోగుతూ సవ్వడి చేస్తూంటే, ముద్దులొలికి పోతూ ఉన్న ఆ చిన్న బాబును చూస్తూ ఉంటే ఆమెలో మాతృత్వం పెల్లుబికినట్టు అయింది. అప్రయత్నంగా వాడిని పైకి ఎత్తి గుండెకు హత్తుకుని మురిసిపోయింది. ఒక్కసారిగా ఆమె గుండెలు బరువెక్కాయి. కళ్ళలోకి నీళ్ళు వచ్చాయి… తానూ తల్లి అయితే… ఆహా… ఆ భావనే ఎంత అపురూపంగా ఉంది?

మొత్తానికి అన్నపూర్ణ గారి నేతృత్వంలో, సప్తగిరినిలయంలోని అమ్మాయిలంతా ఒక్కటై ఆ వేడుకను ఎంతో వైభవంగా జరిపించారు. ఐశ్వర్య అందరికీ దగ్గరయింది.

కార్తీక్ కి తనకూ ఎడం పెరుగుతున్నట్టు అనిపిస్తోంది. ఇంటికి వచ్చినా ఎపుడూ లాప్ టాప్ పెట్టుకొని పని చేసుకుంటూ ఉంటాడు తప్ప తన గురించి పట్టించుకోవటం మానేసాడు. ఎక్కడికైనా వెళదామని అనిపించి అడిగితే, తనకు టైం లేదని అంటాడు. గంటలు గంటలు ఫోన్ లో ముచ్చట్లు… అవతలి వాళ్ళు ఆడ ఫ్రెండ్స్ అని తనకు తెలుస్తూనే ఉంటుంది. ఆడదానికి సహజంగా ఉండే 'అసూయ', 'పొసెసివ్ నెస్' తనను బాధ పెడుతున్నాయి. కానీ అన్నీ ముందే తెలుసు. తాను విలాస పురుషుడనని, వెరైటీ కోరుకుంటానని, అందుకని తన ఒక్కదానికే

పరిమితం కాలేనని ముందే చెప్పాడుగా... అతని కాంపుల్లో బోలెడు అనుభవాలు... తిండి, తాగుడు, విలాసంగా పక్కనే ఒక యువతి ఉంటే చాలు అతనికి ఇంట్లో ఉన్న ఐశ్వర్య తలపులలోకి కూడా రాదు.

ఐశ్వర్య మనసు భారంగా మూల్గింది. అంతలోనే మధుబాల ఊరినుంచి మధ్యాహ్నం కొరియర్ లో వచ్చిన శుభలేఖ గుర్తుకు వచ్చింది.
ఎంతో ఆనందంగా తెరిచి చూసింది. మధుబాల ప్రస్తుతం లీవ్ పెట్టి ఇంటికి వెళ్ళింది. శుభలేఖ పైన అందమైన ఆర్ట్. ధనుర్ధారి అయిన రాముడి మెడలో తల వంచుకొని వరమాల వేస్తున్న మేలిముసుగులో  సీతాదేవి. ముగ్ధురాలే అయింది ఐశ్వర్య. లోపల వివరాలు చూసింది. ఇదివరకే ఊరికి వెళ్లేముందు వేణుగోపాల్ ని తనకు పరిచయం చేసింది మధు. మంచివాడు, యోగ్యుడులానే అనిపించాడు. మధు జీవితం ఆనందంగా గడవాలి అనుకుంది మనస్ఫూర్తిగా... పెళ్ళికి తప్పక వెళ్ళాలి. ఇంకా మూడు వారాలుంది... అనుకుంది. మధుబాల గురించి, తమ స్నేహం గురించి, హాస్టల్లో తాము గడిపిన చక్కని మధుర జీవితం గురించి, పంచుకున్న కష్టసుఖాల గురించి ఆలోచిస్తూంటే ఆమెకు ప్రశాంతంగా నిద్ర పట్టింది.

***

‘‘కార్తీ... వచ్చే శుక్రవారమే మధు పెళ్ళి వాళ్ళ ఊరిలో. మనం తప్పక పెళ్ళికి వెళ్ళాలి...” ఆఫీస్ కి తయారవుతూ చెప్పింది ఐశ్వర్య.
‘‘శుక్రవారమా? నాకు వేరే పనుంది ఐశూ... నువ్వు వెళ్ళి వచ్చేయ్...” అద్దంలో చూసుకుంటూ కాజువల్ గా చెప్పాడు కార్తీక్.
‘‘అదేమిటి కార్తీ, మధూ నాకు బాగా క్లోజ్ ఫ్రెండ్ అని నీకూ తెలుసు కదా... ఇద్దరం కలిసి వస్తామని మాటిచ్చాను నేను... ప్లీజ్ కార్తీ...”
‘‘ఏమిటి ఐశూ, నన్నడిగి ఇచ్చావా ఏమిటి నీ మాట? మీ మధుబాల అంటే నాకు కోర్ట్ లో జడ్జ్ గారు గుర్తు వస్తారు. నేనేదో తప్పు చేసినట్టు, ఆవిడ చూపులతోనే నిలదీస్తున్నట్టు అనిపిస్తుంది నాకు...”

‘‘ఛ! ఏదో నేనంటే ఉన్న ప్రేమ కొద్దీ, మనం అవలంబించబోయే కొత్త జీవితం పట్ల ఉన్న వ్యతిరేకత వలనా ఆరోజు అలా మాట్లాడింది కానీ, ఆమెకు నువ్వంటే చాలా గౌరవం కార్తీ... అలాంటివేవీ మనసులో పెట్టుకోకు. గురువారం బయలుదేరి, శుక్రవారం సాయంత్రం పెళ్ళి చూసుకుని, శనివారం ఉదయమే బయలుదేరి వచ్చేద్దాం... ఈ ఒక్కసారీ నా మాట కాదనకు...” వేడికోలు గా అంది ఐశ్వర్య.

ఐశ్వర్య ముఖం చూస్తూంటే కార్తీక్ కి ఎంతో జాలి వేసింది. తన గురించి సర్వం తెలిసీ, తన బలహీనతలను అర్థం చేసుకుంటూ, ఆమె మాత్రం తనను ప్రేమిస్తూనే ఉంది... తనకే లోటూ లేకుండా చూసుకుంటూనే ఉంది... అలాంటి ఐశ్వర్య కోసం ఈ ఒక్కసారి తనను పెళ్ళికి తీసుకు వెళితే ఏం? పిచ్చిపిల్ల! ఎంతో సంతోషపడిపోతుంది. అతని హృదయం మెత్తబడింది.

‘‘సరే... బాగ్ సర్దుకో... మంచి చీరలు పెట్టుకో... సరేనా?” ఉప్పొంగిన ప్రేమతో ఆమెను దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు.

‘‘థాంక్ యు కార్తీ... థాంక్స్ అ లాట్! అందుకే నువ్వంటే నాకింత ఇష్టం...” ప్రేమగా అతని బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది ఐశ్వర్య.

***

‘‘అమ్మాయ్ ఐశ్వర్యా...” అంటూ వచ్చింది అన్నపూర్ణ.

తలుపు తీసిన కార్తీక్, “ఐశూ, పిన్ని వచ్చారు చూడు...” అంటూ బెడ్ రూమ్ లోకి వెళ్ళిపోయాడు. పెళ్ళికని మధుబాల వాళ్ళూరు బయలుదేరబోతున్న ఐశ్వర్య హడావుడి గా లోపలినుంచి వచ్చింది.

‘‘పిన్నీ... చెప్పండి... ఏమైనా కావాలా?” అంది అమాయకంగా.

‘‘ఇదిగో ఈ పాకెట్ మధుబాలకి ఇవ్వమ్మా... ఇందులో పసుపు, కుంకుమ, అక్షింతలు, కొత్తచీరా ఉన్నాయి... నావీ, బాబాయివీ ఆశీస్సులతో పాటు అందించు...” అని ఒక పాకెట్ అందించింది.

ఐశ్వర్య వెర్రిదానిలా అన్నపూర్ణ వైపు చూస్తూ ఉండిపోయింది. తనతో కొంత అనుబంధం ఉన్నది అన్నపూర్ణకు, కానీ మధుబాలను కలిసింది రెండు మూడు సార్లు మాత్రమే... అయినా ఎంత ఆపేక్ష దాని మీద? ఒక్క క్షణం ఆవిడలో తన తల్లి కనిపించింది. అంతే కాదు, అమ్మకు దూరంగా ఉన్నానన్న భావన కలుగగా, కళ్ళలోకి నీళ్ళు వచ్చాయి.

“అరె, ఏమిటిరా, శుభమా అని పెళ్ళికి వెళ్ళబోతూ, ఈ కన్నీళ్లు? తుడుచుకో...” మందలింపుగా అంటూనే తన కొంగుతో ఐశ్వర్య కళ్ళు తుడిచింది అన్నపూర్ణ.

“పిన్నీ... మీరు నాకు మా అమ్మే అనిపిస్తున్నారు...ఇంత మంది కూతుళ్ళ పట్ల మీకున్న ప్రేమను తలచుకుంటే... ఏడుపు వచ్చేస్తోంది...” అన్నపూర్ణ గుండెల్లో గువ్వలా ఒదిగిపోయింది ఐశ్వర్య.

“ఛ, చిన్నపిల్లవి అయిపోతున్నావు రోజురోజుకీ... సరే సరే... టైమవుతోంది... బయలుదేరండి... జాగ్రత్తమ్మా, డ్రైవింగ్ చేసేటప్పుడు... అబ్బాయికి చెప్పు... అసలు డ్రైవర్ ని పెట్టుకోవలసింది... రాత్రిపూట కారు నడపటం కష్టమే కదా... మరి నేను వస్తాను, మీ బాబాయికి త్వరగా అన్నం వడ్డించేయాలి...త్వరగా వచ్చేయ్... సరేనా?” అంటూ ఐశ్వర్య తల నిమిరి, వెళ్ళిపోయింది అన్నపూర్ణ.

“ఐశూ... రెడీనా? ఐదు నిమిషాల్లో బయలుదేరాలి...” లోపలినుంచి కేక పెట్టాడు కార్తీక్.

***

కొన్ని గంటల ముందు మధుబాల ఇంటిలో...

పిన్నులూ, అత్తయ్యలూ, అక్కయ్యలూ, వదినా అంతా వచ్చి మధుబాలను పెళ్ళికూతుర్ని చేసారు. వంటికి, ముఖానికి పసుపు, నూనె రాసి, నలిచి, ఒకరి తర్వాత మరొకరు తల మీదుగా నీళ్ళు పోసి, తలంటారు. పాదాలకు పసుపు పూసి, పారాణి తో అలంకరించారు. నిడుపాటి జుత్తుకు చిక్కు తీసి అందమైన జడ అల్లి, దానికి పూలజడను కుట్టారు. చెవుల

నుంచి చెంపలవరకూ ఊగుతున్న జూకాలతో, పాపిటలో పాపిడి బిళ్ళతో, నుదుట కళ్యాణ తిలకంతో, బుగ్గన అమరిన చక్కని నల్ల చుక్కతో, మెడకూ, చేతులకూ బంగారు నగలతో, పట్టు చీరతో, పాదాలకు మంజీరాలతో లక్ష్మీదేవి పెళ్ళికూతురు అయిందా అన్నట్టుంది మధుబాల.

‘‘అబ్బా, ఎంత అందంగా ఉన్నావే చెల్లాయ్... మా దిష్టే తగిలేట్టుంది...” అని మురిసిపోయారు అక్కలిద్దరూ. నాయనమ్మ దగ్గరికి వచ్చి కళ్ళ నిండుగా మనవరాలిని చూసుకుంది.

‘‘మధూ పెళ్ళి అయిపోతోంది.. ఇక నాకు ఏమైనా ఫర్వాలేదు...” తృప్తిగా అనుకున్నాడు ఆమె తండ్రి అనంత రామయ్య. ఆమె అన్న గిరి సంబరానికి అంతే లేదు.

బంధువులూ, చుట్టుప్రక్కల ఇరుగుపొరుగు వారూ వచ్చి అక్షింతలు వేసాక, మధుబాల, నాయనమ్మకూ  అమ్మా నాన్నలకూ, అక్కలు, బావలకూ, అన్నా వదినలకూ,  పాదాలంటి నమస్కరించింది. వారు వేసిన పచ్చని అక్షతలతో ఆమె జుట్టు అంతా నిండిపోయింది.
‘‘నీ ఫ్రెండ్ ఎవరో వస్తారని చెప్పావు కదా మధూ?” అడిగింది నిర్మల.

‘‘అవును వదినా, సాయంత్రం బయలుదేరి రేపు ఉదయానికి వస్తారు వాళ్ళిద్దరూ...” చెప్పింది మధుబాల.

***

‘‘పిచ్చిపిల్ల! ఐశ్వర్యను చూస్తూంటే చాలా బాధ కలుగుతోందండీ...” విశ్వనాథం ప్లేట్ లో చపాతీలూ కూరా వడ్డిస్తూ దిగులుగా అన్నది అన్నపూర్ణ.

‘‘నిజమే అనూ... కానీ మనమేం చేయగలం... ఈ నాటి యువతకు మనం దిశా నిర్దేశం చేయలేము... వాళ్ళు ఎన్నుకున్న జీవన విధానం అది... అంతే...”

‘‘కానీ... అతను చాలా మంచి వాడండీ... ఆ పిల్లంటే ప్రేమ కూడా...”

‘‘కానీ స్వేచ్ఛా పురుషుడు... అలాంటి వారికి తమ తర్వాతే ఎవరైనా... అయినా ఈ పద్ధతి ఇప్పుడిప్పుడే ఇండియా లో బాగా ప్రాచుర్యమౌతోంది... ఇద్దరికీ ఇష్టమయ్యే కదా అలా కలిసి ఉంటున్నారు?”

‘‘కాదండీ, కార్తీక్ తో ఓ సారి మాట్లాడండి... మీరు చెప్పిన మాట కాదని అనడు...”

‘‘పిచ్చి అనూ... నువ్వు పాతకాలం దానివి... ఈ కాలం పిల్లలు తాము నమ్మిన దాన్ని ఆచరిస్తారు తప్ప ఎవ్వరి మాటా వినరు...”
‘‘ఐశ్వర్య...ఆడపిల్లండీ... అమాయకురాలు... ఉన్నన్నాళ్ళు ఉండి రేపు అతను ఆమెను విడిచి వెళ్ళిపోతే...”

‘‘వెళ్ళనీ... ఐశ్వర్య దానికి సిద్ధపడే ఉంటుందిలే...”

‘‘మీరు మగవాళ్ళు... ఆడదాని మనసు మీకేం తెలుసు?” ఉక్రోషంగా మజ్జిగ గ్లాసును టపీ మని శబ్దం అయ్యేలా టేబుల్ మీద పెట్టింది అన్నపూర్ణ.

గలగలా నవ్వేసాడు విశ్వనాథం...

‘‘ఎందుకు తెలియదు? నలభై సంవత్సరాలనుంచి నీతో కాపురం చేస్తూ... ఇంకా తెలుసుకోలేకుండా ఉన్నానా? పిచ్చి అనూ... పిచ్చి ఆలోచనలు మానేసి, ప్రశాంతంగా ఉండు... ప్రస్తుతం వాళ్ళిద్దరూ ఆనందంగానే ఉన్నారుగా... తర్వాత ఆలోచిద్దాం... సరేనా?” ఆమెను అనునయించాడు.

కోపంగా ఆయన వైపు చూస్తూ, ముడుచుకున్న ముఖంతో మూతిని ముప్పై ఆరు సార్లు తిప్పింది అన్నపూర్ణ, వజ్రాలు పొదిగిన ఆమె బేసరి తళుకు తళుక్కున మెరిసిపోతుండగా...

తెలతెలవారుతుండగా మధు వాళ్ళ ఊరి పొలిమేరలలోకి ప్రవేశించింది, కార్తీక్ కారు. "ఐశూ, నిద్ర లే... వచ్చేసాం..." ఫ్రంట్ సీట్ లో వెనక్కి తల వాల్చి నిద్రపోతున్న ఐశ్వర్య భుజమ్మీద తట్టి లేపాడు.

నిద్రభారంతో వాలిపోతున్న కనురెప్పలను ఓ సారి తెరచి అతని వైపు చూసి మళ్ళీ కళ్ళు మూసేసుకుంది, ఐశ్వర్య. కోరా రంగు కాటన్ డ్రెస్ లో వాలు జడలో సోలిపోయిన పూలమాలలతో, రేగిన జుట్టుతో ఉన్న ఐశ్వర్యను చూస్తే ఎంతో ఇష్టంగా అనిపించింది అతనికి. కారు స్లో చేసి ఒక పక్కగా ఆపాడు.

"ఐశూ... చూడు, లే... ఇదిగో ఈ నీళ్ళతో కళ్ళు కడుక్కో... వచ్చేసాం మధూ వాళ్ళ ఊరికి..." అని వాటర్ బాటిల్ అందించాడు. తెలివిలోకి వచ్చిన ఐశ్వర్య, నుదుటిపై పడుతున్న శిరోజాలనుపైకి తోసుకుంటూ అతన్ని చూసి చిరునవ్వు నవ్వింది.  ఇద్దరూ కారు దిగి బ్రష్ చేసుకున్నారు.

"హమ్మయ్య... హాయిగా ఉంది కదూ!" అంది ఫ్రెష్ కాగానే...

"అవును..." నవ్వాడు కార్తీక్, ఆమెను దగ్గరకు తీసుకుని చెక్కిలి ముద్దాడుతూ...

"ఎంత బాగుందో కదా ఇక్కడ? ఇంకా సూర్యోదయం కాలేదు... పైరు పాపలు చిరుగాలికి తలలూపుతూ ఆడుకుంటున్నాయి... ఆహా... ఆ చెట్టు నిండా ఎర్రటి పువ్వులు చూడు కార్తీ... అద్భుతం కదా... అల్లదిగో అక్కడ చూడు ఆ తెల్లావు, దాని దూడా... చెట్టు కింద... ఎంత బాగున్నాయి?"

"మనం ఇలా ఇక్కడే ప్రకృతిని చూస్తూ మురిసిపోతూంటే, అక్కడ మధూకి పెళ్ళి అయిపోతుంది... మరి మనం వెళ్లొద్దూ?"

"అమ్మో వెళ్ళాలి... పద పద! అవునూ... బాగా అలిసిపోయావు కదూ డ్రైవింగ్ లో?"  అతని మీదికి వంగి, నుదుట ముద్దు పెట్టింది...

నవ్వి, కారు స్టార్ట్ చేసాడు, కార్తీక్.

***

పెద్ద తాటాకు పందిరి వేసి ఉంది ఆ ఇంటి ముందు. పందిరి రాటలకు కట్టి ఉన్న పచ్చని తోరణాలు అతిథులకు స్వాగతం పలుకుతున్నట్టు గాలికి తలలూపుతున్నాయి. పందిరి కింద వేసి ఉన్న పెద్ద ఎర్రని తివాచి మీద కుర్చీలు వరసగా వేసి ఉన్నాయి.

కార్తీక్ కారు సరాసరి వచ్చి పందిరి పక్కనే ఆగింది.

అప్పటికే నిద్రలేచి, ముఖం కడుక్కుని కాఫీ తాగుతూ కూర్చుంది మధుబాల. గుమ్మం ముందు కారాగగానే, అరుగు మీదున్న సోఫాలో కూర్చుని ఉన్న మధుబాల ఒక్క ఉదుటున అరుగు దిగి, కారులోంచి దిగిన ఐశ్వర్యను రెండు చేతులతో చుట్టేసింది... ఇద్దరి కళ్ళూ చెమ్మగిల్లాయి. చెలి కౌగిలి విడిపించుకొని, కార్తీక్ వైపు చూస్తూ, "రండి...ప్రయాణం బాగా జరిగిందా?" అంది మధుబాల ఆహ్వానిస్తూ.

చిన్నగా నవ్వి, తలపంకించి, లోపలి వచ్చాడు కార్తీక్ తమ సూట్ కేసులతో. ఈలోగా వచ్చిన గిరి వారిని లోపలి తీసుకువెళ్ళి గదిలో సామాన్లు పెట్టించాడు.

"ఐశూ, ప్రయాణం బాగా జరిగిందా? ముఖాలు కడుక్కుని ఫ్రెష్ అవండి లోపల..." అంది మధుబాల.



"ఉహు, ముందు నిన్ను బాగా చూసుకోనీ..." అంటూ పక్కనే కూర్చుని మధును వాటేసుకుంది మళ్ళీ. పరీక్షగా చూస్తూ, "ఎంత బాగున్నావే! పెళ్లి కళ అంటే ఇదే కాబోలు..." అంది బుగ్గలు పుణుకుతూ.

స్వల్పంగా సిగ్గు పడింది మధుబాల. "బుగ్గలు మరీ ఎర్రబడుతున్నాయి... నేనే అబ్బాయిని అయుంటేనా? వేణూకి దక్కనిచ్చే దాన్ని కాదు..." అంది మేలమాడుతూ...

"ఐశ్వర్యా, కబుర్లు తర్వాత కానీ, ముందు లోపలికి రామ్మా... మీరు ఆ గదిలో ఫ్రెష్ అవండి..." పూర్ణమ్మ నవ్వుతూ చెప్పింది.

మరో అరగంట తరువాత చక్కగా రెడీ అయి వచ్చి కుర్చీల్లో కూర్చున్నారు, కార్తీక్, ఐశ్వర్య. ఫలహారం వేడి వేడి పొంగల్, మినపగారెలు వాళ్ళ దగ్గరకి వచ్చేసాయి...

టిఫిన్లు అవగానే "అమ్మా ఐశ్వర్యా, నేను మధూ చిన్నక్కను. నీకు కాఫీ యా, టీ యా? మీ ఆయన ఏం తాగుతారు?" అని అడిగింది చారుశీల.

'అబ్బే మా ఆయన కాదు...' అని చెప్పబోయి నవ్వుకుని మానేసింది ఐశ్వర్య. "ఇద్దరం కాఫీయే తాగుతాం చిన్నక్కా..." అంది వరస కలిపేస్తూ...

చిరునవ్వుతో కాఫీలు అందజేసింది చారుశీల.

మధ్యాహ్నం ఖాళీ దొరికినప్పుడు, అన్నపూర్ణ అందజేసిన కానుకను మధుబాలకు ఇచ్చింది ఐశ్వర్య. ఆ చీరను కళ్ళకు అద్దుకుని జాగ్రత్తగా తన పెట్టెలో దాచుకుంది మధుబాల.

"తల్లి మనసు అందరికీ ఉండదు ఐశూ... ఆవిడ అందరినీ తన వాళ్లుగా ప్రేమిస్తారు. దానికి నోచుకున్న మనం అదృష్టవంతులం... ముఖ్యంగా నీ గురించి నాకు ఇదివరలో చాలా భయాలు, బెంగలూ ఉండేవి... కానీ ఇప్పుడు అవి లేవు... నీకు అండగా పిన్నిగారున్నారు... ఎట్టి పరిస్థితులలోనూ ఆవిడని దూరం చేసుకోవద్దు ఐశూ..." చెమ్మగిల్లిన కళ్ళు రుమాలుతో అద్దుకుంటూ చెప్పింది మధుబాల.

"నిజం మధూ... ఆవిడే లేకపోతే నేను ఏమై పోయేదాన్నో!" తనలో తాను అనుకుంటున్నట్టుగా చెప్పింది ఐశ్వర్య.

***

"ఏమిటమ్మా ఇది? ఇలాంటి చీరలు నేనైతే ఎప్పుడూ కట్టలేదు.." విడిదింట్లో చీరను మంచం మీదికి విసిరి కొడుతూ అన్నది వినత, ఉక్రోషంగా ముక్కు ఎగబీలుస్తూ...

"ష్! ఏమిటే ఈ అల్లరి? తప్పు కదూ?? చక్కగా ఉన్నాయి చీరలు... వంక పెట్టేందుకు లేదు... ప్లీజ్ గొడవ చేయకు..." సముదాయించింది సురేఖ.

"అమ్మా, ముదినాప సానీ... నీకు నచ్చితే నువ్వు కట్టుకో... నాకు నచ్చలేదు... పెద్దాళ్ళ చీరలా ఉంది... అమ్మా, నాకు పెట్టిన ఈ పట్టుచీరను తిరగ్గొట్టి మంచిది తెప్పించవే!" హఠం చేస్తూ, తల్లితో అన్నది వినత.

"చిన్నపిల్లవా విన్నూ? మనం పట్నం వాళ్ళమనీ, మనకి సంస్కారం ఎక్కువనీ అనుకుంటున్నారు వాళ్ళు. ఆఫ్టర్ ఆల్ చీర కోసం పిచ్చి గోల చేస్తే మనం వాళ్లకి చులకన అయిపోతాం... నీకు ఎన్ని చీరలు కావాలో, ఎలాంటివి కావాలో అన్నీ నేను కొనిస్తానురా... నా మాట వినురా బంగారు తల్లీ..." బుజ్జగించింది సుగుణమ్మ.

ఎలా అయినా గొడవ చేయాలని అనుకున్న వినత ఆటలు సాగలేదు.

"నేను అన్నం తిననమ్మా ఈ రోజు... మరీ ఓవర్ చేస్తున్నారు మీరు... ఏంటి ఆ పెళ్ళి వాళ్ళని వెనకేసుకు వస్తారు?" అంది కోపంగా.

"పిచ్చి తల్లీ... వాళ్ళు పరాయి వాళ్ళు కాదమ్మా... మీ అన్నయ్యకి అత్తారు... వాళ్ళ పరువు తీయాలని అనుకుంటే, మన పరువే పోతుంది కదమ్మా? నా బంగారు తల్లి కదూ? ఇదిగో నువ్వు అడిగావని ప్రత్యేకంగా పూరీ కూరా పంపించారు... రా.. కాస్త నోట్లో వేసుకుందూ..." మళ్ళీ చెప్పింది సుగుణమ్మ.

"ఏమిటి, మా యువరాణి వినతా దేవిగారి ఆగ్రహానికి కారణాలు తెలుసుకోవచ్చునా?" అప్పుడే స్నానం చేసి వచ్చిన వేణు అడిగాడు నవ్వుతూ.

ముఖం కందగడ్డలా చేసుకుని కూర్చున్న వినత మాట్లాడలేదు.

"ఏమిటి ఇంకా అలాగే కూర్చున్నారు? అందరూ టిఫిన్లు కానివ్వండి... చాలా పనులున్నాయి..." అంతా గమనిస్తున్న గోవర్ధనరావు వరండాలోంచి లోపలికి వస్తూ గట్టిగా చెప్పటంతో, ఏమీ చేయలేక టిఫిన్ ప్లేట్ చేతిలోకి తీసుకుంది వినత.

“అద్భుతంగా ఉన్నాయి టిఫిన్స్... అరె... ఇదేమిటీ, నీకు స్పెషలా?” పక్కనే కూర్చుని అడిగాడు పవన్. “ఊ, చాల్లెండి... టిఫిన్ల మొహం ఎరగనట్టు...” తగ్గుస్వరంతో ఈసడింపుగా అన్నది వినత.

‘ఈ బ్రహ్మ జెముడు మొక్క పెళ్ళయే వరకూ ఏమీ గొడవ చేయకుండా ఉంటే బాగుండును...’ మనసులోనే వేయి దేవుళ్ళకు మొక్కుకున్నాడు పవన్.

***

రాత్రి భోజనాలు అయ్యాక, పెళ్ళి ఏర్పాట్లు కొనసాగాయి. ఐశ్వర్య, కార్తీక్ కుతూహలంగా ప్రతీ తంతునూ గమనిస్తున్నారు.

మధుబాలకు పూల జడవేసి, నుదుట కళ్యాణ తిలకం దిద్ది, దానిపైగా బాసికం అలంకరించారు. కుంకుమ రంగు పట్టు చీరలో, జరీ బుటాల మధ్య మిలమిలా మెరిసిపోతోంది మధుబాల. బుగ్గన చుక్క ఆమె అందానికి దిష్టి తీసే బాధ్యతను తాను స్వీకరించింది. గోరింట పండిన అరచేతులలో పచ్చని కొబ్బరి బొండాన్ని పట్టుకున్న ఆమెను, మేనమామలు బుట్టలో కళ్యాణ వేదిక దగ్గరకు తీసుకువచ్చారు.

సిగ్గు తెరల మేలిముసుగు చాటుగా మధుబాల ముఖారవిందం, నీలి మేఘ మాలల మధ్యన భాసిస్తున్న చంద్రబింబంలా అనిపిస్తోంది...

వధువు లోని ఆ సోయగాన్ని కన్నార్పకుండా తిలకిస్తోంది ఐశ్వర్య... ‘ఆడపిల్లకు వివాహమన్నది ఒక మధుర ఘట్టమే సుమీ...’ అనుకోకుండా ఉండలేకపోయింది ఆమెలోని కన్నె మనసు.

అనుకున్న ముహూర్తానికి నిర్విఘ్నంగా పెళ్ళి జరిగిపోయింది. బంధుమిత్రుల ఆశీర్వచనాలు, అక్షింతల మధ్య మధుబాల పచ్చని మెడలో మూడు ముళ్ళూ వేసాడు, వేణుగోపాల్.




రాత్రి పెళ్ళి వేడుకలన్నీ పూర్తయే సరికి ఇంచుమించుగా రెండు దాటిపోయింది. అప్పుడు రూమ్ కి వచ్చి నిద్రపోయారు ఐశ్వర్య, కార్తీక్. ఈలోగానే కార్తీక్ కి ఆఫీసునుంచి వరుసగా అర్జెంట్ కాల్స్ రావటంతో మధ్యాహ్నం భోజనం చేసి బయలుదేరాలని అనుకున్నవాళ్ళు కాస్తా ఉదయం బ్రేక్ ఫాస్ట్ చేసేసి బయలుదేరిపోయారు. పసుపు నీలిరంగు కాంబినేషన్ లో చిన్న చిన్న గళ్ళున్న మంగళగిరి జరీ చీర తన వదిన చేత బొట్టుపెట్టించి, ఐశ్వర్యకు ఇచ్చింది మధుబాల. మధుబాలను కౌగలించుకుని విడువలేక, విడువలేక కన్నీళ్ళతో కారెక్కింది ఐశ్వర్య. మధు పరిస్థితి అందుకు భిన్నంగా ఏమీ లేదు. కనురెప్పల ముందు పరచుకున్న మంచుతెరలలోంచి దూరమైపోతున్న కారును చూస్తూ చేయి ఊపింది.

సాయంత్రం ఆరు గంటలు దాటుతూ ఉండగా ఇంటికి చేరుకున్నారు. ఇంటికి చేరిన వెంటనే స్నానం చేసి, ఆఫీసుకు వెళ్ళిపోయాడు, కార్తీక్. అలసటగా పక్క మీద వాలింది ఐశ్వర్య.

***

పసుపు బట్టలతో తిరుమల వెళ్ళి ఆ ఏడుకొండలవాడిని దర్శించుకుని, ఆ నిత్య

కల్యాణచక్రవర్తి కి కళ్యాణం చేయించారు నవదంపతులు మధుబాల, వేణుగోపాల్. మరునాడు బయలుదేరి చెన్నై, బెంగుళూరు, మైసూరు, ఊటీ చూసుకుని తిరిగి హైదరాబాదు రావాలని ప్లాన్... మొత్తం మూడువారాల హనీమూన్ కార్యక్రమం. అందులో పున్నమి రోజు ఊటీలో ఉండేలా ప్లాన్ చేసాడు వేణు.

ఈ ప్రయాణం వలన పెళ్ళికి ముందు తాము అపరిచితులమని ఇద్దరూ మరచిపోయారు. ప్రాణస్నేహితులుగా మారిపోయారు. కంచిలో అత్తగారికి, ఆడబిడ్డలకూ, అక్కలకూ, వదినకూ పట్టుచీరలు కొన్నది మధుబాల. బెంగుళూరు లోని లాల్ బాగ్, కబ్బన్ పార్క్, బన్నెర్ ఘట్ట దేవాలయం, ఇస్కాన్ దేవాలయం సందర్శించాక, మర్నాడు విశ్వేశ్వరయ్య పారిశ్రామిక మరియు సాంకేతికవిజ్ఞాన పురావస్తుశాలను దర్శించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ అన్నిటినీ పరిశీలిస్తూ మైమరచి ఉండిపోయారు. తిరిగి తిరిగి కాళ్ళు నొప్పులతో బాగా అలిసిపోయి రూమ్ చేరి రాత్రి వరకూ నిద్రపోయారు. ఆ రాత్రి భోజనం అయ్యాక, హోటల్ ఆవరణలో ఉన్న లాన్ లో బెంచి మీద కూర్చుని ఏవేవో కబుర్లు చెప్పుకున్నారు. పడుకోబోయే ముందు తన గుండెల మీద తల ఆనించి, అరమోడ్పు కనులతో చూస్తున్న మధుబాల నుదుట ముద్దాడుతూ, “ఈ హెచ్చెంటీ కార్యక్రమం ఎందుకు పెట్టారో ఇప్పుడు అర్థమైంది...” అన్నాడు వేణు.

“హెచ్చెంటీ? అంటే వాచీల కంపెనీ యా?”

“నో... కాదు... H M T – HONEY MOON TRIP...”

“ఓహ్... భలే ఉంది... తమరే కాయిన్ చేసారా ఈ పదాన్ని?” అతని బుగ్గల మీద వేళ్ళతో సున్నాలు చుడుతూ అడిగింది మధుబాల.

“కాదురా, మనకన్నా పెద్దవాళ్ళూ, అనుభవజ్ఞులూ చాలా మంది పెట్టిన పేరు అది. బాగుంది కదూ...”

“ఊ! అవును... చాలా... ఇంతకీ ఈ హెచ్చెంటీ ఎందుకు పెట్టారట?”

“ఇలావన్ ప్లస్ వన్ ఈక్వల్ టూ టూ కాదని, ఒక్కటే అని నిరూపించటానికి... అద్భుతం కదూ?”

ఇక వేణూని మాట్లాడనీకుండా అతని పెదవులను మూసేసాయి మధు పెదవులు. మర్నాడు ఉదయమే మైసూరు బయలుదేరిపోయారు. మహిషుడిని అమ్మవారు మర్ధించిన స్థలం కనుక మైసూరు అని పేరు వచ్చిందని తెలుసుకుని, చాముండేశ్వరి దేవాలయానికి వెళ్లి దర్శనం చేసుకున్నారు. అక్కడ పెద్ద నందీశ్వరుడి విగ్రహాన్ని చూసి ఆశ్చర్యచకితులే అయ్యారు. రాత్రి పూట అత్యద్భుతమైన విద్యుద్దీపాలంకరణతో మెరిసిపోతున్న మహారాజా పాలెస్ దర్శించి, బృందావన్ గార్డెన్స్ కి బయలు దేరిపోయారు. కాసేపు విశ్రాంతి తీసుకున్న తరువాత వ్యాహ్యాళికి బయలుదేరారు. ఎటు చూసినా నవ యువ జంటలే. చేయీ చేయి కలుపుకుని, ఒకరి భుజమ్మీద తలవాల్చి మరొకరు, అమ్మాయి నడుము చుట్టూ చేయి వేసి అబ్బాయి...

ఇలా రకరకాలుగా కలిసి నడుస్తున్నారు. ఈ సువిశాలమైన తోట కృష్ణరాజసాగర్ డామ్ అనే అందమైన ఆనకట్టకు ఒకవైపు ఎంతో శోభానమాయంగా నిర్మించబడింది. బృందావన్ గార్డెన్స్ నిండా రకరకాల రంగురంగుల పూలు, వృక్షాలు, లతలు, మొక్కలూ... ఇంకా ఎన్నో ఫౌంటైన్స్... ఇప్పుడంటే హైదరాబాద్ లో సర్వసామాన్యం అయిపోయింది కానీ, ఒకప్పుడు బృందావన్ గార్డెన్స్ లో డాన్సింగ్ ఫౌంటైన్స్ అంటే ఎంతో క్రేజ్... రాత్రి ఒక గంట సేపు రకరకాల పాటలు వేస్తూ, వాటి లయకు అనుగుణంగా ఊగేలా, నీటి ధారలు చిమ్మేలా అమర్చిన వందల సంఖ్యలోని ఫౌంటెన్ లు, రంగురంగుల దీపాల వెలుతురులో, రకరకాల వేగాలలో, రకరకాల ఎత్తులకు ఎగురుతూ, రంగులలో నీళ్ళు చిమ్ముతూ కనులవిందు చేస్తాయి. ఇద్దరూ చెట్టపట్టాల్ వేసుకుని ఆ విన్యాసాలు తిలకించి, సంతోషం, సంతృప్తి నిండిపోయిన హృదయాలతో రూమ్ చేరుకున్నారు.

మరునాడే ఊటీ చేరుకున్నారు. చేరిన రోజు ఆ వాతావరణం చూసి థ్రిల్ గా ఫీల్ అయింది అప్పటివరకూ అక్కడికి రాని మధుబాల. ఆకాశం మేఘావృతం అయి ఉంది... సన్నగా

చినుకులు పడుతూనే ఉన్నాయి. మండువేసవిలో సైతం అక్కడ ఉష్ణోగ్రత ఇరవైకి మించదు.

"అబ్బ, చలేస్తోంది వేణూ..." రూమ్ లోకి చేరగానే సామాను పక్కన పడేసి, అతన్ని హత్తుకుపోయింది మధుబాల.

"అవును... నిజం... చాలా చల్లగా ఉంది మధూ..." అంటూ ఆమెను తనలో పొదువుకుని, మంచంమీద కూర్చోబెట్టాడు. అక్కడ నేల కూడా మామూలు ఫ్లోరింగ్ కాకుండా చెక్కలతో చేసిన ఫ్లోరింగ్ ఉన్నది.

"టైల్స్ కానీ, మామూలు ఫ్లోరింగ్ కానీ అయితే ఆ చల్లదనానికి తట్టుకోలేరని ఇలా చెక్కలతో ఏర్పాటు చేసారు... వేడి వేడిగా కాఫీ తాగుదాం ముందు... సరేనా?" అని రూమ్ సర్వీస్ కి ఫోన్ చేసి కాఫీ ఆర్డర్ చేసాడు.

ఒక పెద్ద ఫ్లాస్క్, మరో చిన్న ఫ్లాస్క్ లో ఫిల్టర్ డికాక్షన్, మరో ఫ్లాస్క్ లో పాలు, షుగర్ క్యూబ్స్ అన్నీ అమర్చిన ట్రాలీ ని త్రోసుకుంటూ వచ్చాడు ఆ నడివయస్కుడు. ట్రే లోనే స్టీలు గిన్నెలు, స్టీలు గ్లాసులు కూడా ఉన్నాయి.

"షల్ ఐ మేక్ ఇట్ సారు?" తమిళ యాస కలిసిన ఇంగ్లీష్ లో అడిగాడు. అతని ముఖం మీద పెద్ద గంధం బొట్టు, అడ్డంగా విభూదిరేఖతో అచ్చం వారి సాంప్రదాయానికి అద్దం పడుతున్నట్టుగా ఉన్నాడు.

"యస్... ప్లీజ్..." నవ్వుతూ తలూపాడు వేణు...

"కొత్తగా కల్యాణం జరిగినాదాప్పా, పొన్ను రొంబ నల్లా ఇరిక్కు..." మధుబాల వైపు వాత్సల్యంగా చూస్తూ, కొద్దిగా డికాక్షన్, కొద్దిగా పాలు కలిపి వేడి వేడి కాఫీని గ్లాసుల్లో పోసి, వేణూ సూచన ప్రకారం ఒక్కో పెద్ద షుగర్ క్యూబ్ వేసి చెంచాతో తిప్పి, గిన్నెల్లో పెట్టి అందించాడు.

"ఇదిదా నమ్మ ట్రెడిషన్ అప్పా... కాఫీ బాగుండాదా తంబి?" అని

అడిగాడు. ఘుమఘుమలాడిపోతున్న ఊటీ కాఫీని ఆస్వాదిస్తూ, ఆనందిస్తూ సేవించారు ఇద్దరూ...

“చాలా బాగుందండి, థాంక్స్...” చెప్పింది మధుబాల.

“యు ఆర్ వెల్కం మేడమ్!” అని ఖాళీ కప్పుల్ని ట్రే లో వేసుకుని వెళ్ళబోయాడు అతను.

“వి నీడ్ సమ్ డ్రింకింగ్ వాటర్...” చెప్పాడు వేణు.

“థిస్ బిగ్ ఫ్లాస్క్ కంటైన్స్ హాట్ వాటర్... నార్మల్ వాటర్ యు కాంట్ కన్జ్యూం...” చెప్పి, బల్ల మీద పెట్టిన ఫ్లాస్కు ను, పక్కనే ఉన్న గ్లాసులను చూపించాడతను.

అతను వెళ్ళగానే తలుపు మూసి వచ్చాడు వేణు...

“ఈరోజు ప్రోగ్రాం ఏమిటి వేణూ?” అడిగింది మధుబాల.

“బొటానికల్ గార్డెన్ కి వెళదాం కాసేపాగి... తర్వాత లంచ్ చేసి, లేక్ కి వెళదాం... సరేనా? ముందు.. కొంచెం... ఫ్రెష్ అవ్వాలి...” అంటూ ఆమెను చుట్టేసాడు.

***

ఆఫీసులో లంచ్ టైం... ఇంటి దగ్గరనుంచి లంచ్ బాక్స్ తెచ్చుకోకపోవటంతో ఆఫీసు కాంటీన్ కి వెళ్లి టిఫిన్ ఆర్డర్ చేసి, మొబైల్ లో అప్డేట్స్ చూస్తూ కూర్చుంది ఐశ్వర్య.

ఇంతలో ఫోన్ మ్రోగింది.

“హాయ్ మధూ... ఎలా ఉన్నావే? ఏమిటీ ఊటీలో ఉన్నావా? వావ్... చాలా బాగుందా? ఎక్సలెంట్... వేణూ ఎలా ఉన్నాడే? ఇంకా ఎక్సలెంటా? ఓహ్, వెరీ గుడ్... ఫోటో లు పంపావా, మెయిల్ చూసుకోలేదే, చూస్తాను. చాలా బాగుంది డియర్... ఆహా, అద్భుతం... నేను... నేను

బాగానే ఉన్నానే... కార్తీక్ ప్రస్తుతం ఊళ్ళో లేడు... సరే... సరేనే... బై... హేవ్ అ వండర్ ఫుల్ టైం డార్లింగ్..." నవ్వుతూ ఫోన్ పెట్టేసి, టిఫిన్ తినటం మొదలు పెట్టింది ఐశ్వర్య.

తరువాత మెయిల్ ఓపెన్ చేసి, కర్ణాటకలో మధుబాల, వేణు తీయించుకున్న ఫోటోలు చూసింది... మధు ముఖంలో ప్రతిఫలిస్తున్న ఆనందాన్ని చూసి మనసు ఉప్పొంగగా, ఎంతో ఉత్సాహంగా ఆమెకు మెయిల్ రాయటం మొదలుపెట్టింది.

***

"అబ్బా, ఎంత పెద్ద గార్డెన్స్... ఎంత గొప్ప వృక్షాలు! ఏమి పూలు, ఎన్ని రంగులు... చూడు, లాన్స్ ఇన్ని రకాలుగా కత్తిరించి ఇంత అద్భుతంగా పెంచటం ఎప్పుడైనా చూసామా వేణూ? అబ్బా... బంతి పూలను చూడు ఎన్ని డిజైన్స్ వచ్చేలా పెంచారో... ఆ హాంగింగ్ క్రీపర్స్ చూడు, నిండా పూలు పూచి, ఆ గోడంతా పూవుల మయం..ఇన్ని రంగుల పూలను ఒకే చోట చూడటం నాకిదే మొదటి సారి. నిజంగా నేను తట్టుకోలేకపోతున్నాను, ఈ అనంతమైన సౌందర్య రాశిని చూస్తూ... ప్రకృతి ప్రసాదించిన వనసంపదను, ఇంత మనోహరంగా మలచి యాత్రికులకు అందించటం వీరికే చెల్లింది... వేణూ, నీకు చాలా థాంక్స్... ఇంత మంచి ట్రిప్ ప్లాన్ చేసినందుకు..."

ఊటీ బొటానికల్ గార్డెన్స్ లో వేణూ చేయి పట్టుకుని నడుస్తూ చెప్పింది మధుబాల.

"ఒద్దికగా ఒక చక్కని బంధంలో ఒక్కటిగా మారిన ఆలుమగలకు ఇలాంటి ప్రేమయాత్ర మానసికంగా ఒకరికొకరు చేరువయ్యేలా మరింతగా దోహదం చేస్తుందనటంలో సందేహమేమీ లేదు మధూ..."

ఆ సాయంత్రం లేక్ లో బోట్ షికారు చేసి వచ్చి, భోజనం చేసి విశ్రాంతిగా కూర్చున్నారు. పున్నమి చంద్రుడు మేఘమాలికలతో దోబూచులాడుతున్నాడు. బాల్కనీ నిండా వెన్నెల మరకలు... మధుబాల జడనిండా అరవిరిసిన మల్లెమొగ్గలు... చల్లని చలి... ఉండీ ఉండీ

సన్నని చిరుజల్లు... ఇద్దరూ బాల్కనీ లో కూర్చుని నిండు చందమామను చూస్తూ తమకు వచ్చిన వెన్నెల పాటలన్నీ పాడేసుకున్నారు.

మనసు అలవకున్నా శరీరం విశ్రాంతి కోరటంతో పాన్పు చేరి ఒకరి చేతులలో ఒకరు సేదదీరుతూ నిద్రపోయారు.

***

రోజులు గడిచే కొద్దీ కార్తీక్, ఐశ్వర్యల మధ్య తెలియకుండా దూరం పెరగసాగింది. ఐశ్వర్యకు ఎప్పుడూ రెగ్యులర్ షిఫ్ట్... ఉదయం వెళ్ళి రాత్రి ఏడు లోపుగా ఇంటికి రావటమే. కార్తీక్ కి ఏదో ఒక షిఫ్ట్ లేదా టూర్స్ ఉంటాయి.  తాను ఇంటికి వచ్చేసరికి కార్తీక్ ఉండటం లేదు.  అతని కోసం ఎదురు చూస్తూ గంటలు గంటలు కాలం గడిపే ఐశ్వర్యకు చాలా సార్లు తన పరిస్థితి మీద తనకు జాలి కలుగుతోంది.   ఒక్కోసారి డ్యూటీ నుంచి డైరెక్ట్ గా ఇంటికి వస్తాడు, లేదా తెల్లవారి ఆరు ఏడు గంటల మధ్య వస్తాడు.  పలకరించబోతే బాగా విసుక్కుంటాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తున్నట్టుగా ఉంటోంది అతని ధోరణి. అతనికి వచ్చే కాల్స్ లో చాలా మటుకు ‘డాలి’ అనే అమ్మాయి నుంచి వస్తున్నట్టు గమనించింది ఐశ్వర్య.

తను గాక కార్తీక్ జీవితంలో మరో స్త్రీ... ఆలోచిస్తే చాలా బాధగా అనిపించినా, కార్తీక్ లాంటి వారికి సెంటిమెంట్స్ ఉండవేమో అని అనిపిస్తోంది... ప్రేమను చెల్లిస్తే రెట్టింపు ప్రేమను పొందగలమని అంటారు. కానీ... తానెంత మనస్ఫూర్తిగా అతన్ని ప్రేమించినా, కలలోనైనా తన పక్కన వేరే పురుషుడిని ఊహించుకోలేకపోయినా, ఎప్పటికీ జీవితమంతా అతనితోనే కలిసి ఉండాలని దృఢ నిశ్చయం చేసుకుని అందరినీ విడచి పెట్టి వచ్చేసినా... అతను మాత్రం తన చేయి విడచిపెడుతున్నట్టే భావన. ఆ భావన వలన ఐశ్వర్యకు అభద్రతా భావాన్ని, తెలియని భయాన్ని కలుగుతున్నాయి.

ఇప్పటికైతే తనకున్నది ఒక్క కార్తీక్ మాత్రమే. అతన్ని నమ్ముకొని జీవితాన్ని కొనసాగిస్తోంది... మరి భవిష్యత్తు ఎలా ఉండబోతోందో తెలియటం లేదు... ఈమధ్య తమ ఇద్దరి మధ్యా

సామరస్యత తగ్గింది. పడక సంబంధాలు కూడా సన్నగిల్లుతున్నాయి.
బాధగా నిట్టూర్చింది. ఒక కన్నీటి కణం కనురెప్పలను త్రోసుకొంటూ ఐశ్వర్య బుగ్గ మీదికి జారింది.

'అణువంతగా ఆవిర్భవించి, క్షణాలలో త్రివిక్రమ రూపం దాల్చిన


కన్నీటి కణానికే తెలుసు నీ అంతరంగ రంగాన చెలరేగే మథనం...

అందుకే జాలి పడుతున్నట్టుగా రాలి పడుతుంది...నీ చెక్కిలి పైకి...'

ఎప్పుడో ఎక్కడో చదివిన మినీ కవిత మనసులో మెదిలింది. ఆవేదనను బలవంతంగా అణచుకొని, ఒక గ్లాసుడు మంచి నీళ్ళు తాగి వచ్చి మళ్ళీ పడుకుంది ఐశ్వర్య. ఇంతలోనే ఏదో అనుమానం...

లైట్ వేసి, కేలెండర్ వైపు చూసింది. ఎందుకో ఈ సారి లేట్ అయిందే... అయితే... అయితే... తను తల్లికాబోతోందా? ఏదో తెలియని ఆనందపు కెరటం ఆమెను చుట్టేసింది. మనసులో సంతోష తరంగాలు నృత్యం చేసాయి. పై ఇంటి ప్రసన్న చేతిలో బాబుతో సగర్వంగా చూస్తున్న చూపులు గుర్తు వచ్చాయి...

'నేనూ అమ్మనౌతున్నానా! అబ్బ, ఎంత బాగుంది ఈ ఊహ? రేపు తప్పకుండా డాక్టర్ దగ్గరకు వెళ్లి కన్ఫం చేసుకోవాలి...' అనుకుంటూ కళ్ళు మూసుకుంది సంతృప్తి గా.




"ఏమిటే ఇల్లంతా ఇంత నిశ్శబ్దంగా ఉంది? అన్నయ్య ఈరోజు రావాలేమో, ఇంకా రాలేదా?" సుడి గాలిలా ఇంట్లోకి ప్రవేశించిన వినత తల్లిని ప్రశ్నించింది.

"ష్ ! ఇద్దరూ మంచి నిద్రలో ఉన్నారు... ట్రైన్ నాలుగు గంటలు లేట్ గా వచ్చింది. బాగా అలసిపోయారు... రా, లోపలికి... అబ్బాయి వచ్చాడా?"

"ఊ... వాళ్ళమ్మని వదిలి ఆయన వస్తాడుటే నీ పిచ్చి గానీ... అయినా ఇదేమిటమ్మా, తిరుపతి దర్శనం, హనీమూన్ అంటే మరీ ఇన్ని రోజులా? మీ మెత్తదనం చూసీ..." వంటగదిలో బైఠాయించింది వినత.

"ఇది మరీ బావుందే, నీ అన్నయ్య మీద కూడానా అంత అసూయ?"

"నా పెళ్ళి అయిన వెంటనే ఆయన్ని ఢిల్లీ పంపించేసారే వాళ్ళ ఆఫీసు వాళ్ళు... నా హనీమూను మూడు నెలలు లేట్ గా అయింది... ఆ తర్వాత ఆ మహాతల్లి మంచాన పడింది... ఇక ఎక్కడికీ తీసుకువెళ్ళటానికీ అతనికి ఖాళీయే లేదూ..." సాగదీసింది వినత...

‘‘ఇదేమిటి అమ్మా, భలే ఘుమఘుమలాడిపోతోంది!’’ మూత పెట్టిన గిన్నె తీసి, ‘‘వావ్, చక్కెరపొంగలి! ఏమిటే ఈరోజు విశేషం? బాగా జీడిపప్పులు వేసావుగా, పచ్చకర్పూరం దట్టించావు...ఏదీ, ఆ బౌల్ అందుకో...’’ అంటూనే బౌల్ లో ఇంత వడ్డించుకుని, జీడిపప్పులు అన్నీ ఏరుకుని వేసుకుంది...

‘‘ఇంట్లో తల్లి పరిస్థితి అలా ఉంటే సరదా ఎలా ఉంటుందే? నువ్వు కూడా బాధ్యత లేకుండా పనిమనిషి మీద వదిలి పెట్టకే ఆవిడని... అది పద్ధతి కాదు... ఇంతకీ ఎలా ఉన్నది ఆవిడ?’’ అన్నది సుగుణమ్మ.

‘‘అమ్మా, ప్లీజ్... నా వల్ల కాదమ్మా ఆవిడకి సేవలు చేయటం... ఆ మాట మాత్రం చెప్పద్దు...’’ గట్టిగా అన్నది వినత.

‘‘బాగా కుదిరిందా? అన్నయ్యకి ఇష్టమని చేసాను... వినతా... నీతో ఓ విషయం చెప్పాలని అనుకుంటున్నానే... ఏం లేదు... ప్రతీ నెలా నువ్వు గుడ్ న్యూస్ చెబుతావేమోనని ఎదురు చూస్తాను... ఆ మాటే లేదు... ఓ సారి డాక్టర్ దగ్గరికి వెళదామా?’’ జంకుతూనే అన్నది సుగుణమ్మ.

‘‘ఏమిటే నీ పిచ్చి? అప్పుడే పిల్లలా?? పుడతార్లే తొందర ఏముందీ?’’ తేలిగ్గా చప్పరించేసింది వినత.

‘‘నీ పెళ్లై మూడేళ్ళు దాటిందే... మరి మాకు తొందరగా ఉండదా?’’

‘‘సరి సర్లే... ఇంతకీ అన్నయ్య నాకేం తెచ్చాడే ఊరినుంచి చెప్పూ?’’

‘‘ఇంకా తెలియదే తల్లీ, పడుకున్నారుగా, లేచాక ఇస్తారులే... మధ్యాహ్నం భోజనంలోకి గోంగూర పచ్చడి, మజ్జిగపులుసూ, అరటికాయ వేపుడూ చేసాను... ఇంకేదైనా కూర చేయనా నీకోసం?’’

‘‘ఊహు...మధ్యాహ్నానికి మాత్రం గారెలు వండు... తిని చాలా రోజులైంది...అవునూ... అన్నయ్య గోంగూర తినడు కదే, ఎవరికోసం ఆ స్పెషలు?’’

‘‘మధుబాలకి ఇష్టమట...’’

‘‘ఓహో... కోడలు గారు పవళిస్తే అత్తగారు ఆమెకిష్టమైన స్పెషల్స్ చేస్తూ బిజీ... ఆహోహో, నువ్వేం అత్తగారివే, ఆమెగారికి వంటమనిషివి కానీ...’’

‘‘ఛీ, ఏమిటే ఆ మాటలు? కోడల్ని కూడా కూతురిలా చూసుకోవాలని అన్నారు... నీకు ఇష్టమైనవి చేసి పెట్టనా? నువ్వు మరీనే...’’

‘‘అవునమ్మా, ఆవిడకి చులకనైపోతే కానీ తెలియదులే ఎందుకు చెబుతున్నానో...సరే, నేను వెళ్లి టీవీ చూస్తా... వీళ్ళు తొందరగా లేస్తే బాగుండును...’’ వినత మాట పూర్తికాకుండానే మధుబాల వచ్చింది అక్కడికి, తలస్నానం చేసి, ఇస్త్రీ చీర కట్టుకుని.

‘‘హాయ్ వినతా, బాగున్నావా? ఎంత సేపైంది వచ్చి?’’ అంది నవ్వుతూ...

‘‘ఇప్పుడే పదినిమిషాలు... బాగా జరిగిందా మీ ట్రిప్ ?’’

‘‘హా చాలా బాగా అయింది... ఎలా ఉన్నారు మీ అత్తగారు? మా అన్నయ్యా??’’

‘‘బాగానే ఉన్నార్లే... అన్నయ్య ఇంకా లేవలేదా?’’

‘‘లేదు వినతా... కొద్దిగా జ్వరం వచ్చింది ఆయనకి... టాబ్లెట్ వేసుకుని పడుకున్నారు... లేస్తారు, ఓ పావుగంటలో... అత్తయ్యా, ఆయనకి మధ్యాహ్నం అన్నం పెట్టవద్దు... బ్రెడ్, పాలు ఇద్దాము...’’

‘‘అలాగే మధూ... బ్రెడ్ తెప్పిస్తాను... తిరగటం వలన, అలసట వలన అయి ఉంటుంది... జలుబు కూడా ఉన్నట్టుంది  కదా...’’

‘‘అవును అత్తయ్యా... విక్స్ రాసుకున్నారు... అయినా తగ్గలేదు...’’

‘‘ సరే, సొంఠీ మిరియాలూ కలిపి కషాయం కాచిస్తా...’’

‘‘మధూ, ఇంతకీ షాపింగ్ బాగా చేసావా?’’ ఉత్సుకత తో అడిగింది వినత.

‘‘అదేమిటే పేరు పెట్టి పిలుస్తావు? వదినా అని పిలవాలి...’’ సరిచేయబోయింది సుగుణమ్మ.

‘‘ఇంచుమించుగా ఒకే వయసు కదే... వదినా అని పిలవాలనిపించదు...’’

‘‘పర్వాలేదులే అత్తయ్యా... పెద్దగా షాపింగ్ అంటూ ఏమీ చేయలేదు వినతా... కంచిలో చీరలు కొన్నాం, మైసూర్ లో అగరువత్తులు, ఊటీలో అందరికీ స్వెట్టర్లూ, షాల్స్  ఇవే...’’ నవ్వింది మధుబాల.

‘‘అత్తయ్యా, కూరలు తరిగివ్వనా?’’ అని అడిగింది.

‘‘వంట అయిపోయింది మధూ... నీకు వీలుంటే నాలుగు గారెలు వేసిస్తావా? ఇప్పుడే కాదు, భోజనాల టైముకి వేస్తే చాలు... పిండి ఫ్రిజ్ లో ఉంది...’’ చెప్పింది సుగుణమ్మ...

‘‘సరే అత్తయ్యా...’’
ఇంతలో లేచి వచ్చాడు వేణు...
‘‘ఏంటిరా జ్వరమొచ్చిందటా?’’ అతని నుదుటిమీద చేయివేసి చూసింది వినత.
‘‘అవును కొద్దిగా... విన్నూ, ఎలా ఉన్నావే? బావ బాగున్నాడా?’’ ఆప్యాయంగా అడిగాడు వేణు.
‘‘అరే వేణూ, ఈరోజు టీ, కాఫీ లేదు నీకు...ఓన్లీ కషాయం... తయారు చేస్తున్నా...’’ కల్వంలో మిరియాలు నూరుతూ చెప్పింది సుగుణమ్మ...
‘‘కెవ్... వద్దే అమ్మా, అర్భకుడికి అంత శిక్షా?’’ భయం నటించాడు వేణు.
మధుబాల లోపలినుంచి చీరల పాకెట్లు తీసుకువచ్చి, వినత ముందు పెట్టింది.
‘‘ఇదిగో ఈ ఆకుపచ్చ రంగు చీర అత్తయ్యగారికి... ఈ ఆరెంజ్ కలర్ చీర వదినగారికి... ఈ నీలంరంగు చీర నీకు...’’ అన్నీ తెరిచి చూపించింది మధుబాల.
‘‘ఓ... మరి ఈ పాకెట్?’’ తెరచి చూసింది వినత. నెమలి కంఠం రంగు చీరకు గోరంచు జరీ ఉన్న చీర అది. చీరంతా చిన్న డిజైన్ తో బుటా ఉంది...
‘‘అది... అది... నా ఫ్రెండ్ కోసం తీసుకున్నాను వినతా...’’ సంశయంగా చెప్పింది మధుబాల ఆ చీరను పొరపాటుగా ఈ చీరలతో కలిపి ఉంచినందుకూ, గదిలోనే వదిలి రానందుకు చింతిస్తూ...
‘‘ఈ నీలం రంగు చీర ఆవిడకి ఇచ్చేయ్... ఈ చీర నేను తీసుకుంటా...’’
‘‘సారీ వినతా... ఈ చీర తనకోసమే సెలెక్ట్ చేసాను... నీకోసం మళ్ళీ వేరే చీర ఈ రంగులో తీసుకుంటాగా?’’ నచ్చజెప్పబోయింది మధుబాల.
‘‘ఓహో, ఆడపడుచు కన్నా ఎక్కువైన ఆ స్నేహితురాలు ఎవరమ్మా? పెళ్ళి కాకుండానే కాపురం చేస్తున్న ఆ ఐశ్వర్యేనా?’’ వ్యంగ్యంగా అంది వినత.
‘‘వినతా...ప్లీజ్...’’ వారించబోయింది మధుబాల.
‘‘ఏమ్మా, నిజమే కదా నేనన్నది? అసలు అలాంటి స్నేహాలేమిటి మధూ నీకు? పైగా ఆవిడగారికి బహుమతులు కూడానూ...’’ ఈసడించినట్టే అన్నది వినత.
మధుబాల ముఖం ఎర్రబడిపోయింది... ఓవైపు దుఃఖం వచ్చేస్తోంది... నిస్సహాయంగా భర్త వైపు చూసింది.

‘‘చీర కోసం ఇంత గొడవ ఎందుకూ? మధూ, వినతకి అదడిగిన చీరిచ్చేయ్...’’ క్లుప్తంగా చెప్పి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు వేణుగోపాల్.

మధుబాల హృదయం విలవిలలాడి పోయింది... అంటే ఐశ్వర్యను వినత ఏమీ అనకుండా ఉండాలంటే ఆ చీరను ఇచ్చేస్తే ఇక  గొడవ చేయదు... లేకపోతే ఇల్లుపీకి పందిరేస్తుంది... ఎంత అవమానం ఇది తనకు?

‘‘వినతా... ఐశ్వర్య పర్సనల్ విషయం అది... అది మనం మాట్లాడుకోవటం అంత అవసరమా?’’ వినత కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నది మధుబాల.

‘‘అంటే, అలాంటిదాన్ని నువ్వు సమర్థిస్తున్నావన్న మాట...’’

‘‘కాదు, అది ఆమె వ్యక్తిగతవిషయం అని చెబుతున్నాను. ఆమెను మంచి స్నేహితురాలిగా చూడాలి, ఆమె అభిప్రాయాలను గౌరవించాలి... అంతే కాని... ఇంకో విషయం వినతా... పెళ్ళి విషయంలో మా ఇద్దరి అభిప్రాయాలు వేరు కాబట్టే, నేను వివాహం చేసుకున్నాను... ఆమెకి కొన్ని కారణాల వలన ఆ బంధం ఇష్టం లేదు కనుక ఆమె చేసుకోలేదు...’’

‘‘సరేలే అయిందేదో అయింది... ఇక ముందు ఆమెతో స్నేహం చేయటం కానీ, ఆమెను ఇక్కడికి పిలవటం కానీ చేయకు... మా పరువు పోతుంది...’’ నెమలి కంఠం రంగు చీరను తీసి కవర్లో పెట్టుకొని, ‘‘అమ్మా, నేను వెళుతున్నా... గారెలు వచ్చే వారం చేద్దువులే...” అంటూ మధుబాల వైపు కళ్ళెగరేసి విజయగర్వంతో చూసి, బయటకు నడిచింది వినత.

అలా వెళ్ళిపోతున్న వినత వైపు ప్రాన్పడిపోయి చూస్తూ ఉండిపోయింది మధుబాల. ఆమె మనసంతా వికలమైపోయింది...

***

‘‘ఏమిటి భోజనం చేసి వస్తానన్నావుగా, అప్పుడే వచ్చేసావా? మీ అన్నయ్యా వాళ్ళు వచ్చారా ఊరినుంచి?’’ ఆశ్చర్యంగా అడిగాడు పవన్.

‘‘ఆహా, వచ్చేసాను... ఇదిగో ఇది చూడు!’’ చేతిలోని చీర పాకెట్ అతని చేతిలో పెట్టింది వినత.

‘‘చీరా, చాలా బాగుంది... మీ వదిన గిఫ్టా?’’ అన్నాడు నవ్వుతూ...

‘‘మా వదిన వేరే ఫ్రెండ్ కి ఇవ్వాలనుకున్న గిఫ్ట్... నేను కొట్టేసా...’’ గర్వంగా నవ్వింది.

‘‘ఛ! అదేమిటి విన్నూ? నీకేం తక్కువ, అలా తెచ్చేసుకోవటానికి? తప్పు కదూ?’’ మందలింపుగా అన్నాడు పవన్.

‘‘లేకపోతే ఇంత అందమైన చీరను అదెవత్తో తల మాసిందానికి ఇస్తానంటుందా? పైగా అదో కారెక్టర్ లెస్ లేడీ పవన్...’’

‘‘ఛీ, ఏమ్మాట్లాడుతున్నావు వినతా... ఒకమ్మాయి గురించి అందులోనూ మీ వదిన స్నేహితురాలి గురించి అలా మాట్లాడటానికి నీకు సభ్యత, సంస్కారం లేవా?’’ తీక్షణంగా చూసాడు పవన్.

‘‘ఎందుకూ? ఉత్తముడిని ఉత్తముడు అంటాము, బిచ్చగాడిని బిచ్చగాడు అంటాము... చెడిపోయిన వాళ్ళను మంచివాళ్ళు అనము కదా... ఆ ఐశ్వర్య గురించి మొన్ననే  తెలిసింది...  ఎవరిలోనో పెళ్ళి కాకుండా సహజీవనం చేస్తోందిట. అతన్ని పెళ్ళికి కూడా తీసుకువచ్చింది కదా పెద్ద గొప్పగా? అలాంటి వాళ్ళతో మా వదినకు స్నేహం ఏమిటి చెప్పండి? అందుకే ఆ స్నేహం వదిలేయమని కూడా గట్టిగా చెప్పి వచ్చాను...’’

‘‘ఒక బంధాన్ని వదిలేయమని చెప్పటానికి నువ్వెవరు వినతా? కొంచెమైనా బుద్ధి లేదు నీకు... ఆ అమ్మాయి వ్యక్తిగతానికి, వాళ్ళిద్దరి స్నేహానికీ ఏమాత్రం సంబంధం లేదు...’’

‘‘ఈవిడ గారూ అదే చెప్పార్లెండి ! అయినా సరే, అలాంటి వాళ్ళతో కలిసి తిరిగితే మన పరువేం కావాలి చెప్పండి? అవును పవన్... మనం కూడా టూర్ వెళదాం, ప్లాన్ చేయండి... ప్లీజ్...’’

‘‘అమ్మను అలా విడచిపెట్టి ఎలా వెళ్ళగలం చెప్పు విన్నూ... వచ్చే సెప్టెంబర్ లో మా అక్క అమెరికా నుంచి వస్తుంది కదా, అప్పుడు వెళదాం లే...’’

‘‘నువ్వెప్పుడూ ఇంతేగా... ఏదో వంక చెబుతావు... మీ అమ్మను చూసుకోవటానికి మనిషి ఉంది కదా... ఒక్క పదిరోజులు మనం లేకపోతే ఏమౌతుందేం?’’ కోపం వస్తే ఏకవచనమే వినతకు.

‘‘నువ్వెలాగూ బాధ్యతను ఫీల్ అవవు... కొడుకుగా నన్నైనా ఫీలవనీ... ఎలాగూ నీ ఎంజాయ్ మెంట్లు నీకున్నాయిగా?’’


‘‘ఊ.. ఈ పట్టు చీరకు డిజైనర్ బ్లౌజ్ వెంటనే కుట్టించాలి... మాచింగ్ సెట్ కొనుక్కోవాలి... ఆదివారం మా ఫ్రెండ్ కిట్టీ పార్టీకి కట్టేసుకుంటా...అంతే...’’

‘‘ఈ ఆదివారం మా ఫ్రెండ్ ఇంట్లో లంచ్ ఉంది కదా విన్నూ?’’
‘‘ఫ్రెండ్? ఓ ఆ బ్యాంకు క్లర్క్ రాఘవ ఇంట్లోనా? అలాంటి వాళ్ళు మీకు ఫ్రెండ్స్ ఏమిటి పవన్? మన స్థాయి వాళ్ళైతే లంచ్ లైనా డిన్నర్లైనా ఓకే కానీ... ఊహు, నేను రాను... మీరు వెళ్ళి వచ్చేయండి... అయినా నా ప్రోగ్రాము నాకుంది. అది మానే ప్రసక్తే లేదు...నేను అర్జెంట్ గా ఫోన్ చేసుకోవాలి...’’ అంటూ బెడ్ రూమ్ లోకి వెళ్ళిపోయింది వినత.
నెత్తి కొట్టుకున్నాడు పవన్.

***

తెల్లారగానే ఐశ్వర్య ఆశ అడియాస అయిపోయింది... బాత్ రూమ్ కి వెళ్ళి వచ్చి నిరాశగా కూర్చుంది. ఈ నెల కూడా వచ్చేసింది, కాస్త ఆలస్యంగా... ఇక ‘అమ్మా’ అని పిలిపించుకునే భాగ్యం ఎప్పటికి? దీర్ఘమైన నిట్టూర్పు వెలువడింది ఆమె కంఠంలోనుంచి...
ఇంతలో హాల్లోంచి లాండ్ లైన్ ఫోన్ మ్రోగసాగింది.
ఎప్పుడైనా కార్తీక్ చేస్తూ ఉంటాడు ఈ నంబర్ కి... అందుకే గబుక్కున పరుగు పెట్టింది...
ఫోన్ ఎత్తగానే అవతలినుంచి ఓ లేడీ వాయిస్ హస్కీగా... ‘‘కార్తీక్ ఉన్నాడా?’’ అంటూ...
‘‘టూర్ వెళ్ళాడు... మీరు?’’
‘‘ఎక్కడికి వెళ్ళాడో, ఎవరితో వెళ్ళాడో కూడా తెలుసు నాకు... అతని మొబైల్ ఫోన్ స్విచాఫ్ వస్తోంది... అందుకే దీనికి చేశా... అయామ్ మిస్ డాలీ... ఐ థింక్ యు వార్ మిస్ ఐశ్వర్య... యామై రైట్?’’ నవ్విందామె.
‘‘యస్... ఏ... ఏమైనా చెప్పాలా కార్తీక్ కి?’’ మెల్లగా అడిగింది ఐశ్వర్య...
‘‘నీ దగ్గరకు రాగానే మొబైల్ ఛార్జ్ చేసుకోమను యార్...అది చాలు... బై...” డిస్కనెక్ట్ చేసింది...
రిసీవర్ పెట్టేసి అలాగే కూర్చుంది ఐశ్వర్య.

***




“హలో, ఎవరు?” చాలా బిజీగా ఉన్న అమల ఫోన్ ఎత్తి అడిగింది కాజువల్ గా.

“నే...నేను... ఐశ్వర్యను...”

“ఓహ్... ఐశూ... నువ్వేనా? బాగున్నావామ్మా? ఏమిటి విశేషాలు?” ఆప్యాయంగా అమల అడుగుతూ ఉంటే ఐశ్వర్య మనసు అవ్యక్తమైన అనుభూతికి లోనయింది.

“బాగున్నాను... మీరు బాగున్నారా మేమ్?”

“మేమ్? ఊహు, అక్కా అని పిలవాలి నువ్వు... అవునూ ఒక్కసారి కూడా ఇంటికి రాలేదేమ్మా? రూప చాలా సార్లు అడిగింది నిన్ను... వేరే ట్యూటర్ ని పెట్టాం, చదువు సాగుతోంది కానీ, నీతో ఒకరకమైన అనుబంధం ఏర్పడిపోయింది దానికి...”

‘‘తప్పకుండా వస్తాను అక్కా ఓ సారి... మరి... ఒక విషయం... కార్తీక్ వారం రోజులుగా ఇక్కడికి రావటం లేదు... అక్కడికి వచ్చారా?’’ బిడియంగా అడిగింది.

‘‘కార్తీ ఇక్కడికీ రాలేదమ్మా... అత్తయ్య గారికి ఫోన్ చేసి అడుగుతాను... నీకేవిషయం తెలియజేస్తానులే... కొంచెం బిజీగా ఉన్నాను... ఉంటాను...’’ పెట్టేసింది అమల.

దీర్ఘంగా నిట్టూర్చింది ఐశ్వర్య.

***

రెండు రోజుల తర్వాత వచ్చాడు కార్తీక్. మాటల్లో తెలిసింది ఏమిటంటే అతను అఫీషియల్ టూర్ కి కాకుండా ఫ్రెండ్స్ (?) తో వెళ్ళాడని... చివరి రెండు రోజుల్లోనూ డాలీ కూడా అతన్ని జాయినైందనీ... రాత్రీ పగలూ తేడా లేక తాగేసినట్టు అతని ముఖం చెబుతోంది. తినటానికి కూడా ఓపిక లేనట్టు రాగానే వాష్ రూమ్ లోకి వెళ్లి వచ్చి బట్టలు మార్చుకుని మంచానికి అడ్డంగా పడిపోయాడు కార్తీక్.

అతన్ని అటువంటి పరిస్థితిలో చూసిన ఐశ్వర్యకు ఏం చేయాలో కూడా తెలియలేదు. దగ్గరకు వచ్చి పలకరించబోయింది.

‘‘డోంట్ డిస్టర్బ్ మీ...అయామ్ ఇన్ హెవెన్...’’ మగతగా కలల్లో తేలిపోతున్నట్టు చెప్పేసి నిద్రలోకి జారుకున్నాడు. ఉవ్వెత్తున దుఃఖం పొంగుకు వచ్చింది ఐశ్వర్యకు. ఇదేనా తాము కలలు కన్న జీవితం? పెళ్లి వద్దని అనుకున్నారు కానీ ఇలా విచ్చలవిడి జీవితం గడపాలని తాను ఎన్నడూ అనుకోలేదు... ఒకరికి ఒకరై చివరి వరకూ ఒకే బాటలో సాగాలని, అలా సాగుతామని అనుకుంది తాను. కానీ వ్యసనాలకు లోనై, ఎంత మందితో అనుభవాలైతే అవి అంత గొప్ప అనుభవాలని అనుకుంటున్న కార్తీక్ దిగజారుడు జీవితాన్ని చూస్తుంటే, చాలా బాధగా అనిపించింది ఐశ్వర్యకు...

అతను ఇంట్లో ఉన్నంత సేపూ అతనికి ఏం కావాలో అమరుస్తూ ఉంటుంది...అతను చెప్పే

కబుర్లను మంత్రముగ్ధయై వింటుంది... అతని స్పర్శను ఎంతో ఆనందిస్తుంది... అతనితో గడిపే ప్రతీ క్షణంలోనూ అమరానందాన్ని అనుభవిస్తుంది... మరి తనతో అతనికి ఇలాంటి అనుభూతులు కలగవా? తనతోనూ, రోజీతోనూ, డాలీ తోనూ ఒకేలా ఎంజాయ్ చేస్తాడా?  శృంగారం అనేది కేవలం రెండు శరీరాల మధ్యనేనా? మనసుతో దానికి పని లేదా? ఎవరితో పడితే వాళ్ళతో తిరగాటానికీ శారీరక సుఖాలు అనుభవించతానికీ మనం జంతువులం కాదు కదా... మనసున్న మనుషులం...  మనిషిని ఇష్టపడినప్పుడే మనసు స్పందించేది... స్పందన కలిగితేనే శృంగారంలో శిఖరారోహణ చేయగలిగేది... మరి ఈ మనిషికి ఇవేవీ లేవా?

ఆలోచనల్లోనే వంట ముగించి, కార్తీక్ ని లేపింది ఐశ్వర్య. బద్ధకంగా లేచి కూర్చుని నాలుగు మెతుకులు తిన్నాననిపించి, ఆమె భోజనం చేస్తూంటే పక్కన కూర్చున్నాడు.

‘‘ఏమిటోయ్ ఐశూ ఈ మధ్యన లావు అయినట్టున్నావు...ఫిజిక్ మైంటైన్ చేయకపోతే ఎలాగా?’’ అన్నాడు ఆమె జబ్బును పట్టి చూస్తూ...

‘‘ఏం నీకు నచ్చటం లేదా?’’

‘‘అబ్బే, నాకు నచ్చటం కోసం కాదు... నీకోసం నీవు మెయిన్ టైన్ చేసుకోవాలి కదా...’’

‘‘పోనీలే, నాజూకైన ఆడవాళ్ళు నీకు చాలా మంది ఉన్నట్టున్నారుగా, ఇంకెందుకూ బెంగ?’’ కచ్చగా అంది ఐశ్వర్య...

‘‘ఓ, ఓ... కట్టుకున్న పెళ్ళాంలా మాట్లాడుతున్నావు...’’ గలగలా నవ్వాడు.

‘‘హలో మిస్టర్.. కట్టుకోకపోయినా నేను పెళ్ళాం పాత్రనే పోషిస్తున్నాను...’’

‘‘అవునవును... నాకు ఆకలి వేసినప్పుడు తిండి పెడుతున్నావు... ఉదయమే టిఫిన్, కాఫీ ఇస్తున్నావు... ఇల్లు తీర్చి దిద్దుతున్నావు... నాకు కావలసినప్పుడు సుఖాన్ని కూడా

ఇస్తున్నావు...కానీ నేనే నీకు తగిన వాడిని కాదు కదా ఐశూ... నేను నీకు ఏమీ ఇవ్వటం లేదు, నాకు తెలుసు...''

''నువ్వే అన్నీ ఇచ్చావు... ఎప్పటికీ ఇస్తూనే ఉంటానని అన్నావు... ఈ కొత్తజీవితానికి నాంది పలికావు... ఇప్పుడు నీ కొత్తజీవితానికి ద్వారాలు తెరిచావు... నీ స్వేచ్ఛను హరించటానికని కాదు కాని, నీ అలవాట్లను కొంచెం తగ్గించు కార్తీ... ఆరోగ్యానికి మంచిది కాదు... చిన్నపిల్లాడివి కాదు కదా, మంచీ చెడ్డా తెలిసినవాడివి...''

''అబ్బో... ఐశ్వర్య చాలా పెద్దది అయిపోయిందే? సరే, నేను పడుకుంటాను నాకు నిద్ర వస్తోంది...''

''సరే కార్తీ...''

ఆ రాత్రి తన దగ్గరకు జరిగిన కార్తీక్ ని దూరంగా తోసేయాలని అనిపించినా, మనస్కరించక అతని కోర్కెను తీర్చడానికి ఉద్యుక్తురాలయింది ఐశ్వర్య.

***

అత్తవారింట్లో కొత్త జీవితానికి అలవాటు పడిపోయింది మధుబాల. తిరిగి జాబ్ లో కూడా జాయిన్ అయింది.

ఉదయం ఐదున్నర – ఆరు మధ్య నిద్ర లేస్తుంది... ముఖ ప్రక్షాళన తో పాటుగానే స్నానాదికాలు కూడా ముగించుకుని వంటింట్లోకి వచ్చి, కాఫీ తాగేసి, వంటలో అత్తగారికి సాయం చేస్తుంది. మామగారి పూజకు తులసీ దళాలు, పెరట్లో పూచిన పూలతో సజ్జను సిద్ధం చేస్తుంది. ఏడు గంటలకు లేచిన వేణు ఏడున్నర వరకూ వ్యాయామాలు చేసి, పాలు తాగి, పేపర్ చదువుకుని, ఎనిమిదికల్లా రెడీ అయి, టిఫిన్ తినేసి, వెళ్ళిపోతాడు. మధుబాల ఆఫీస్ వేరే వైపు ఉండటం వలన ఆమె ఆటోలో వెళుతుంది. తానూ టిఫిన్ తినేసి, బాక్స్ లో లంచ్ సర్దుకుని తొమ్మిదికల్లా బయలుదేరిపోతుంది. సాయంత్రం ఇద్దరూ ఇంటికి వచ్చేసరికి ఆరున్నర అవుతుంది. కాఫీ

తాగుతూ కాసేపు కబుర్లాడుకుని, సాయంత్రం వంట ప్రయత్నం లో పడుతుంది మధుబాల. సాధారణంగా అన్నాలు ఎవరూ తినరు రాత్రి పూట. అందుకని అందరికీ కలిపి ఒకే రకం టిఫిన్ తయారు చేసేస్తారు అత్తాకోడళ్ళు కలిసి. టిఫిన్ తిన్నాక, టీవీ చూసి ఎవరి పడకగదుల్లోకి వాళ్ళు వెళ్ళిపోతారు.

ఈ మధ్యకాలంలో మధుబాలకు చాలా గిల్టీగా అనిపిస్తోంది. ఐశ్వర్యను ఇంటికి రమ్మని పిలవలేదు ఇప్పటివరకూ... తానూ ఆమెను కలవటానికి వెళ్ళలేదు... ఫోన్ చేసి మాట్లాడే సమయమూ చిక్కటం లేదు... ఓ సారి వెళ్ళాలి అనుకుంది గట్టిగా...

అలా అనుకున్నా కాని, మరో నెలరోజుల వరకూ కుదరనే లేదు ఆమెకు.

***

వినత అంత స్వార్థంగా సురేఖ, వేణుగోపాల్ ఉండకపోయినా వేణు మరీ అంత సౌమ్యుడు కాదు. కోపం చాలా త్వరగా, తీవ్రంగా వస్తుంది. చాలా సార్లు కోపంలో తండ్రితో కూడా ఘర్షణ పడుతూ ఉంటాడు. తల్లితో మాట్లాడటం మానేస్తాడు... ఇవన్నీ చూసి మధుబాలకు చాల సిల్లీగా, చిరాగ్గా అనిపించింది భర్త ప్రవర్తన.

చిన్నపిల్లల్లా మాట్లాడుకోవటం మానేయడాలేమిటో అర్థం కాదు... అలాగే వినత మొండిది, స్వార్థపరురాలు అని అందరికీ తెలిసి మందలిస్తూనే ఉంటారు కానీ ఆమె ప్రభావం కూడా ఆ ఇంటి సభ్యుల మీద చాలా ఉన్నట్టు గమనించింది మధు. ఇంట్లో ఏ వస్తువు కొనాలన్నా ఆమెకి ఇష్టమైన బ్రాండ్ మాత్రమే కొనాలి. వినతకి ఇష్టం లేని బంధువులకు ఈ ఇంట్లో తావు లేదు... వాళ్ళతో సరియైన సంబంధ బాంధవ్యాలు ఎవ్వరూ పాటించరు.

ఐశ్వర్య మీద వినతకున్న వ్యతిరేక భావన తన భర్తకి కూడా ఉన్నదన్న విషయం తెలిసిన మధుబాల భయంతో వణికిపోయింది... వినతలా ఐశ్వర్యను తేలిక చేసి మాట్లాడకపోయినా, ‘‘చూడు మధూ... పెళ్ళికి ముందు కలిసి చదువుకున్నారు కాబట్టి, కలిసి హాస్టల్లో ఉండాల్సి

వచ్చింది కాబట్టి తనతో స్నేహం చేసావు. అది కొనసాగించాల్సిన అవసరం ఏముంది? అందులోనూ అలాంటి జీవన విధానాన్ని ఎన్నుకున్న అమ్మాయిల మీద అట్టే సదభిప్రాయం ఉండదు ఎవరికీ... అంచేత తనని ఇంటికి పిలవకూ, నువ్వు వెళ్ళకూ...'' అని చెప్పేసాడు.

''మీ స్నేహితుల విషయంలో నేను అలాంటి ఆంక్షలు పెట్టలేదు కదా...'' అన్న మధుబాల రోష పూరితమైన ప్రశ్నకు అతని సమాధానం ఏమిటంటే, ''ఈ ఇంట్లో ఎవరికీ స్నేహితులు ఉండరు. పరిచయస్తులూ కొలీగ్స్ మాత్రమే ఉంటారు... ఇంటి కోడలిగా ఆ విషయం గుర్తు పెట్టుకుని మసలుకోవాలి...:'' అని మెత్తగా హెచ్చరించాడు.

ఈ సంభాషణ జరిగిన తరువాత తాను ఐశ్వర్యను ఒక్కసారైనా కలవలేకపోయినందుకు ఎంతో చింతించిన మధుబాల ఆ సాయంత్రమే ఆఫీస్ అయ్యాక ఐశ్వర్య దగ్గరకు వెళ్ళాలి అనుకుంది.

***

ఒకనాటి శుభోదయాన తన నిర్ణయం చెప్పేసాడు కార్తీక్.

ఇక తాను ఐశ్వర్యతో కలిసి ఉండలేననీ, డాలీ ఇంటికి వెళ్ళిపోతున్నాననీ...

''నీ పిచ్చి గానీ కార్తీ, నువ్వు నాతో కలిసి ఉన్నది కొద్ది కాలం మాత్రమే... ఇప్పుడైనా మనమిద్దరం ఒక ఇంటికప్పు కింద కలిసి ఉన్నాం అంతే... నువ్వు నాతో కలిసి ఉండటం లేదు.... ఇప్పుడు ఫిజికల్ గా వేరు అవుతానంటావు. అలాగే కార్తీ, నీ ఇష్టం... నేనేం అనగలను?'' నిర్లిప్తంగా చెప్పింది ఐశ్వర్య.

''పిచ్చిదానివి అమాయకురాలివి... నిన్ను ఎవరైనా మోసం చేస్తారని నా బెంగ... జాగ్రత్త ఐశూ... నా జీవితం ఇంతే ఇలాగే ఉంటుంది... నేనేం చేయలేను...''

''నా గురించి నీవు ఆదుర్దా పడటం చిత్రంగానే ఉన్నా చిన్న సంతోషం కూడా కలుగుతోంది కార్తీ... ఓకే, నీ సామానంతా సర్దుకో... వెళ్ళి రా...'' చెప్పేసింది ఐశ్వర్య.

‘‘ఆరు నెలల అద్దె ముందుగానే కట్టేశాం... అందువలన నువ్వు దాని గురించి ఆలోచించకు... నీ ఆరోగ్యం జాగ్రత్త... ఎవరైనా మంచివాడు దొరికితే అంటే నాలాంటి వాడు కాక మనసున్న వాడు... ప్రపోజ్ చేస్తే ఒప్పుకో... సరేనా?’’ వెళ్ళబోతూ చెప్పాడు కార్తీక్.

అతను వెళ్ళగానే కుళ్ళి కుళ్ళి ఏడ్చింది ఐశ్వర్య. వైవాహిక బంధం లేకపోవచ్చు... మానసిక బంధం కూడా లేదా తమ మధ్య? ఇదేనా ప్రేమంటే??

***

మధుబాల, ఐశ్వర్య ఇంటికి చేరుతుండగానే చిరుచీకట్లు ముసురుకోసాగాయి. ఐశ్వర్య అపార్ట్మెంట్ తలుపులు దగ్గరికి వేసి ఉన్నాయి. పక్కనే పిన్ని గారింటికి తాళం వేసి ఉంది. తలుపు తోస్తూ ‘ఐశూ...’ అని పిలిచింది మధు.

హాల్లో చీకటిగా ఉంది. బెడ్ రూమ్ లోంచి మూలుగు వినిపించింది.

‘అమ్మా... అమ్మా...నొప్పి అమ్మా... భరించలేకపోతున్నాను... అమ్మా...’

చేతిలోని బాగ్ ని సోఫా లోకి విసిరేసి, ఒక్క ఉదుటున బెడ్ రూమ్ లోకి వెళ్లి చూస్తే అక్కడ నేల మీద అస్తవ్యస్తంగా పడుకుని ఉంది ఐశ్వర్య.

‘‘ఐశూ ఐశూ... ఏమైంది?’’ ఆమె తలను ఒడిలోకి తీసుకుంది మధుబాల.

‘‘అమ్మా...విపరీతమైన కడుపు నొప్పి... అమ్మా...చాలా బ్లీడింగ్ మధూ... నొప్పి భరించలేక...అమ్మా... ఇందాక పాక్కుంటూ వచ్చి బోల్ట్ తీసి పెట్టాను. నీకు ఫోన్ చేద్దామని అనుకుంటున్నాను... అబ్బా... మధూ... చచ్చిపోతానా? నాకేమీ తెలియటం లేదే నొప్పి తప్ప... అమ్మా...’’

‘‘వెంటనే డాక్టర్ దగ్గరకి వెళదాం... పిన్ని ఎక్కడికి వెళ్ళారు?’’


‘‘కాశీయాత్ర కి వెళ్ళారు... అబ్బా... మధూ.. ప్లీజ్ భరించలేక పోతున్నా... నన్ను హాస్పిటల్ కి....’’

‘‘ఒక్క నిమిషం ఉండు ఐశూ...’’ అంటూ పైకి వచ్చి ప్రసన్న వాళ్ళ ఫ్లాట్ కి వెళ్ళి విషయం చెప్పింది వాళ్ళమ్మతో. అప్పటికే ప్రసన్న బాబుతో అత్తారింటికి వెళ్ళిపోయింది.

‘‘అరెరే అవునా అమ్మా? మా కారును, డ్రైవర్ ని ఇచ్చి పంపుతాను... నువ్వు తీసుకువెళ్లగలవా?’’ అందావిడ ఆదరంగా.

‘‘అలాగే ఆంటీ, చాలా థాంక్స్ అండీ... పిన్ని గారు కూడా లేరు కదా సమయానికి... అందుకే మిమ్మల్ని ఇబ్బంది పెట్టాల్సి వస్తోంది...’’ అని, కావాల్సిన కొన్ని వస్తువులు సర్ది, ఆవిడ సహాయంతో ఐశ్వర్యను లేవదీసింది. నిజానికి రక్తపు మడుగులో ఉంది ఐశ్వర్య.

‘అబార్షన్!’ అస్పష్టంగా గొణుక్కుంది తనలో తానే మధుబాల.




రెండవ రోజు మధ్యాహ్నానికి వాడిపోయిన ముఖంతో, నలిగిపోయిన బట్టలతో, రేగిపోయిన జుట్టుతో ఇంట్లోకి అడుగుపెట్టింది మధుబాల.
సుగుణమ్మ ముఖంలో కోపచ్ఛాయలు. వేణూ కూడా ఇంట్లోనే ఉన్నాడు. మధుబాలను చూడగానే తిరస్కారంగా ముఖం తిప్పుకున్నాడు. మామగారు ఇంట్లో లేరు.

మధుబాల మౌనంగా తన బెడ్ రూమ్ లోని స్నానాల గదిలోకి వెళ్ళి స్నానం చేసి, ఇస్త్రీ చేసిన కాటన్ చీర కట్టుకుని బయటకు వచ్చింది.
టీవీ చూస్తున్న వేణుగోపాల్ "మధూ, నీకు బుద్ధి ఉందా అసలు?" అని అడిగాడు కోపంగా.

"అది... అసలు ఏం జరిగింది అంటే... వివరంగా చెబుతాను వేణూ... ప్లీజ్, కోపం వద్దు..." అతని ఎదురుగా కూర్చుని జరిగింది చెప్పింది.

‘‘ఆ పరిస్థితులలో ఐశూని వదిలి ఎలా రాగలను? తన వాళ్ళు ఎవ్వరూ లేరు అక్కడ... హాస్పిటల్ కి తీసుకువెళితే ఇన్ పేషెంట్ గా జాయిన్ చేసుకున్నారు. అప్పటికే దానికి చాలా రక్తం పోయింది. అప్పటికప్పుడు రక్తం ఎక్కించాలి అన్నారు. బ్లడ్ బ్యాంకు లో దొరకలేదు. ఎవరికో ఫోన్ చేస్తే డోనర్ ని పంపించే సరికే ఆలస్యం అయింది. తనతో పాటుగా పక్కనే ఉండాల్సి వచ్చింది... మీకు ఫోన్ చేసాను రెండు సార్లు... రెండు సార్లూ స్విచ్ ఆఫ్ వచ్చింది... నా ఫోన్ లో తర్వాత ఛార్జ్ అయిపోయింది. అదీ గాక అటూ ఇటూ తిరగడం... చాలా హడావుడి రాత్రంతా... నిద్దర లేదు అసలు... మిడ్ నైట్ దాటాక దానికి నిద్ర పట్టింది. అప్పుడే నేనూ కాస్త కునుకు తీశాను...ఉదయం ట్రీట్మెంట్... అన్నీ అయేసరికి ఈ వేళ అయింది... అయామ్ వెరీ సారీ వేణూ...”

‘‘ఆవిడని చూడటానికి వెళ్ళటం ఓ తప్పు... అదీ నాకు చెప్పకుండా... రాత్రంతా ఎక్కడో ఉండిపోవటం మరో తప్పు... అయినింటి కోడలు అడ్డమైన వాళ్ళ కోసం ఇలా తిరగటం ఎవ్వరూ సహించరు! అది గుర్తు పెట్టుకో మధూ...” తీక్షణంగా అన్నాడు వేణుగోపాల్.

‘‘తను నాకు స్నేహితురాలు... అడ్డమైన మనిషి కాదు...” గొంతు రుద్ధమౌతూ ఉండగా ఉక్రోషంగా అంది మధుబాల.

‘‘ఎందుకు కాదు? ప్రపంచమంతా ఓ తీరుగా ఉంటే, డిఫరెంట్ గా ఉండి ఏదో సాధించేద్దామని కొత్త జీవన విధానం మొదలుపెట్టింది అడ్డగోలుగా... అలాంటి మనిషిని ఎవరైనా గౌరవంగా చూస్తారా మధూ? ఓకే, తనకి కష్టం వచ్చింది... మరి పక్కనే ఉండే ఆవిడగారి బాయ్ ఫ్రెండ్... లేదా కంపానియన్... ఆ కార్తీక్ గారు ఎక్కడ? కనీస స్నేహధర్మాన్ని నిర్వర్తించాలి కదా ఆయనగారు?” వ్యంగ్యంగా అన్నాడు వేణు.
‘‘ఐశ్వర్య చాలా దురదృష్టవంతురాలు వేణు... ఇంతకన్నా నేనేమీ చెప్పలేను... నాకు కొంచెం విశ్రాంతి కావాలి... కాసేపు పడుకోవచ్చునా?”
‘‘భోజనం చేసి వచ్చి పడుకో... అమ్మకి వివరంగా విషయాలన్నీ చెప్పు. అమ్మా, నాన్న ఇద్దరూ కోపంగానే ఉన్నారు. రాత్రి సర్ది చెప్పలేక చచ్చాను నేను...” మెల్లగానే చెప్పాడు వేణు.

‘‘చూడు, మనం ఉమ్మడికుటుంబం లో ఉన్నాం... అందరికీ అనుగుణంగా మసలుకోవాలి... నిన్న జరిగింది రిపీట్ కానీయకు... ప్లీజ్... నాకు కోపం రానీయకు... నేను కూడా కంట్రోల్ చేసుకోలేను... మన మధ్య ఎడం రావటం కూడా భరించలేను మధూ... ఆల్రెడీ నీ మీద వినతకి కోపం, అసూయ అని తెలుసు కదా... దానికి ఎందుకు ఛాన్స్ ఇస్తావు? వద్దురా... ఎవ్వరూ వద్దు... మనం ఒకరికొకరం మిగలాలి అంటే నువ్వు కొన్ని బంధాలు తెంచుకోవాలి... ముఖ్యంగా ఐశ్వర్యతో అనుబంధం...”

తల వంచుకుని నిస్సహాయంగా కన్నీళ్లు కార్చింది మధుబాల.

‘‘వాస్తవాన్ని చెప్పాను నేను... నీకు నచ్చినా నచ్చకున్నా సరే... వెళ్ళు, భోజనం చేసి రా...”

కళ్ళు తుడుచుకుని, వంటగదిలోకి వెళ్ళి అత్తగారికి జరిగింది అంతా చెప్పింది మధుబాల.

‘‘సారీ అత్తయ్యా, ఎలాంటి సమాచారం లేకుండా నేను అక్కడ ఉండిపోవటం తప్పే కానీ, పరిస్థితి అలాంటిది...” అంది.

‘‘సరేలేమ్మా... ఆడపిల్ల, పక్కన ఎవ్వరూ లేరని అన్నావుగా... నీవు చేయాల్సిందే చేసావులే... కాకపోతే మీ మామగారికి మాట రానీయకు... రా భోజనం చేద్దువు... అన్నం తినేసి, హాయిగా పడుకో... మనసు కుదుటపడుతుంది...” మధుబాల తల నిమిరింది సుగుణమ్మ.

***

కళ్ళముందు తెల్లని దూది గుహలు... ఆ గుహలలో తాను ఎక్కడికో జారిపోతోంది... ఆధారం లేదు... ఎవ్వరూ పట్టుకోవటం లేదు... ప్రచండ వేగంతో జారిపోతోంది...

‘‘అమ్మా అమ్మా... ప్లీజ్ అమ్మా... నన్ను పట్టుకోవా... భయమేస్తోంది... పడిపోతున్నాను... అమ్మా... నన్ను గట్టిగా పట్టుకో...” పలవరిస్తూ చేయి ఎత్తింది ఐశ్వర్య. ఆ చేతిని ఎవరో

పట్టుకున్నారు...

‘‘స్పృహ వస్తోంది... భయం లేదు... ఆమెకి ఏమీ కాదు...’’ ఎవరో బహుశా డాక్టర్ కాబోలు చెబుతున్నారు... తనను పట్టుకున్న చేయిని తానూ గట్టిగా పట్టుకుంది ఐశ్వర్య...

‘‘అమ్మా బుజ్జీ...’’ తన తల్లి గొంతు లీలగా వినిపిస్తోంది...

‘‘అమ్మా, అమ్మా... నువ్వు వచ్చావా? నాకు దాహం వేస్తోంది... కొంచెం నీళ్ళు...’’

‘‘అయ్యో ఆ అమ్మాయికి ఇప్పుడు నీళ్ళు ఇవ్వకండి... వాంతులు అవుతాయి... డ్రిప్స్ ఇస్తున్నాం కదా... లేకపోతే ఒక్క రెండు చెంచాల మంచి నీళ్ళు పోయండి...’’ నర్స్ చెబుతోంది.

పెదాలు రెండు చుక్కల నీళ్ళతో తడిసాయి... నాలుకతో వాటిని చప్పరిస్తూ... కనులు తెరవబోయింది... మళ్ళీ మంచు గుహలు... అగాధాలు... జారిపోతోంది... జారిపోతోంది.... ఆ... మగత... నిద్ర...

మళ్ళీ ఐశ్వర్యకు మెలకువ వచ్చేసరికి గదిలో దీపం వెలుగుతోంది. అతి కష్టం మీద కనులు విప్పి చూసింది. మంచం పక్కనే కుర్చీలో కూర్చున్న తల్లి కనిపించింది. ఐశ్వర్య కళ్ళు తెరవగానే ఆ కన్నతల్లి ముఖం విప్పారింది.

‘‘అమ్మా... బుజ్జీ... లేచావా? ఎలా ఉందిరా?? ఎలా ఉంది నీకు...’’ ఆ అమాయకపు తల్లి కళ్ళు నీళ్ళతో నిండిపోయాయి...

‘‘అమ్మా, నువ్వు ఎప్పుడు వచ్చావు? అసలు నీకు ఎలా తెలిసింది?’’ చాలా కాలం తర్వాత కనబడిన తల్లి చేతిని గట్టిగా పట్టుకుంది ఐశ్వర్య.

‘‘నీ ఫ్రెండు మధుబాల హాస్పిటల్ వాళ్లకి మా నెంబర్ ఇచ్చి ఫోన్ చేయించింది రాత్రి... వెంటనే బయలుదేరి ఈరోజు మధ్యాహ్నం వచ్చేసాం... మధు మేము వచ్చాకే తన ఇంటికి వెళ్ళింది

తల్లి....”

‘‘అమ్మా... నాకు నాకు...” పొట్ట తడుముకుని భోరున ఏడవసాగింది ఐశ్వర్య...

‘‘ఛ, ఊరుకోమ్మా... పోనీలే...ఏమీ కాలేదుగా ఇప్పుడు? నువ్వు మాకు దక్కావు అంతే చాలు...” ఐశ్వర్య కళ్ళు తుడుస్తూ అంది అలిమేలమ్మ.

‘‘కాదమ్మా... ఎన్నెన్నో కలలు కన్నాను అమ్మను కావాలని... ఇదిగో ఇలా అయిపోయింది...”

‘‘ఎందుకురా బాధ? ఎంతో మంచి జరుగుతుందిలే ముందు ముందు... తీసుకున్న దేవుడే తిరిగి మంచి ఫలాలు ఇస్తాడు...” దూరమైన కార్తీక్ ని తలచుకుంటూ భారంగా నిట్టూర్చింది ఐశ్వర్య.

‘‘నాన్న ఎలా ఉన్నారు?”

‘‘ఆయన కూడా వచ్చాడు. బయట కూర్చున్నాడు... పంపించనా నేను వెళ్లి?”

‘‘అమ్మా... నువ్వు కాసేపు ఉండు... తర్వాత ఆయన్ని పిలుద్దువు గాన్లే... నీకు నా మీద కోపంగా లేదామ్మా?”

‘‘కోపమెందుకు బుజ్జి?”

‘‘అదేనే, నా ఇష్టం వచ్చినట్టు  మీకు చెప్పకుండా... కార్తీక్ తో... నాన్నగారు కోపంగా ఉత్తరం కూడా రాసారు...”

‘‘ఒక వయసు వచ్చాక పిల్లల మీద పెద్దలు తమ ఇష్టాలు రుద్దకూడదు... అలాని వాళ్ళు తప్పు మార్గం లో వెళుతూ ఉంటే చూస్తూ కూడా ఊరుకోకూడదు... నీ విషయంలో ఆయన ఉత్తరం రాసి ఊరుకున్నారు కానీ తనలో తానే  ఎంతో మథన పడటం నాకు తెలుసు. నా ప్రాణం

కొట్టుకు పోయేది తల్లీ... నేను నీ దగ్గరకు రావాలని చాలా ప్రయత్నించాను... కానీ వీలు కాలేదు... పరిస్థితులు...” చెప్పింది అలమేలమ్మ.

“అమ్మా... నువ్వు నాక్కావాలమ్మా... మూర్ఖత్వం ఎక్కువై నీ గురించి పట్టించుకోలేక పోయాను... స్వచ్ఛమైన ప్రేమకు ఇన్నాళ్ళూ దూరమయ్యాను. అమ్మా, మధూ కూడా నీలాంటి అమ్మ మనసున్నదేనే... అది నిన్న రాకుంటే నా పరిస్థితి ఏమిటి అమ్మా? దేవుడు పంపినట్టే నా దగ్గరకు వచ్చింది మధు...” దుఃఖం సుళ్ళు తిరిగింది ఐశ్వర్య కంఠంలో.

“అవునమ్మా, ఆ బంగారు తల్లి నూరేళ్ళూ పసుపు కుంకాలతో, పిల్లా పాపలతో వర్ధిల్లాలి...” మనస్ఫూర్తిగా దీవించింది అలిమేలమ్మ.

తిరుపతయ్య లోపలికి వచ్చి కూతురి తల మీద చేయి వేసి నిమిరాడు...

“బుజ్జి తల్లీ, ఎలా అయిపోయావమ్మా...”

“నాన్నా... నన్ను క్షమించు...” దీనంగా పలికింది ఐశ్వర్య.

“జరిగిందేదో జరిగిపోయింది... రేపు నిన్ను డిశ్చార్జ్ చేస్తారట... మనింటికి వెళదాం తల్లీ... కొన్నాళ్ళుండి మళ్ళీ జాబ్ లో జాయిన్ అవుదువు లే...”

“సరే నాన్నా...” అలసట గా కళ్ళు మూసుకుంది ఐశ్వర్య.

***

“డియర్ మధూ...

నీకు ఎలా థాంక్స్ చెప్పాలో కూడా తెలియటం లేదు మధూ... సరియైన సమయంలో వచ్చి, నన్ను ఆస్పత్రిలో చేర్పించి, నా ప్రాణాన్ని కాపాడావు. అంతే కాకుండా అమ్మా నాన్నలకు కబురు చేసి, మళ్ళీ వాళ్ళ దగ్గరకు నన్ను చేర్చావు. నీ ప్రేమ, స్నేహం దొరకటం నా పూర్వ జన్మ సుకృతం తప్ప మరేమీ కాదే...

ఇక్కడ అమ్మ నన్ను చాలా జాగ్రత్తగా చూసుకుంటోంది... శారీరకంగా కన్నా మానసికంగా మరింత బలహీనంగా ఉన్నాను మధూ... కోలుకోవటానికి కొద్దిగా సమయం పడుతుంది. ఒక రెండు వారాలు ఇక్కడే ఉండి వస్తాను.

ఎందుకు మధూ, ఇలా జరిగింది? సహజీవనం అంటే పెళ్ళి కాకుండా ఎప్పటికీ కలిసే ఉంటామని అనుకున్నాను. మా ప్రేమ అంత బలమైనది అని భావించాను. కానీ చూసావా కార్తీక్ ఎంత అమానుషంగా నన్ను వదిలేసి వెళ్ళిపోయాడో... ఇదే చాలని అనుకున్నాడా? నేను అతనికి సరైన ఆనందాన్ని ఇవ్వలేకపోయానా? ఏమీ అర్థం కావటం లేదు... పిచ్చి మనసు... నన్ను విడచి వెళ్ళినా అతన్నే ప్రేమిస్తోంది చూడు... దానికసలు బుద్ధి లేదు మరి...

మనసును రాయి చేసుకోవాలి... వేదనలకు అతీతంగా ఉండాలి... గట్టిగానే అనుకుంటున్నాను కానీ ప్రాక్టికల్ గా సాధ్యం కావటం లేదు. అయినా ప్రయత్నిస్తాను...

నువ్వెలా ఉన్నావు? జాగ్రత్త... రిప్లయ్ ఇస్తావు కదూ...

నీ ఐశూ..."

మెయిల్ చదివిన మధూ మనసంతా భారంగా అయింది. పోనీలే, ఈ సమయంలో అమ్మానాన్నల వాత్సల్యం దానికి చాలా అవసరం... వాళ్లకి కబురు చేసి తాను మంచి పనే చేసింది... అనుకుంది.

తన పరిస్థితి కూడా అంత బాగాలేదు. అత్తగారింట్లో రొటీన్ గా గడచిపోతోంది. మొన్న ఐశ్వర్య వైద్యానికని తమ జాయింట్ అకౌంట్ లోంచి యాభై వేలు హాస్పిటల్ వారికి అడ్వాన్స్ గా ఇచ్చింది. అది పెద్ద ఇష్యూ అయి కూర్చుంది. వేణు బాగా కేకలు వేసాడు. తానెంత ఖర్చు పెట్టుకున్నా ఫర్వాలేదట... 'అలాంటి' వారికి ఖర్చు పెట్టకూడదుట. ప్రతీ సారి అలాంటి వాళ్ళు, అలాంటి వాళ్ళు అంటుంటే సభ్య సమాజంలో 'అస్పృశ్యత ఎక్కడికి పోయింది?'

అనిపిస్తోంది తనకు. తాను నమ్మిన సిద్ధాంతాలకు లోబడి జీవిస్తోంది ఐశ్వర్య… ఎవరికీ హాని చేయటం లేదే… వీళ్ళకి ఎందుకంత చులకన?

ఒక్కో సారి తనకీ అనిపిస్తోంది ఈ యావజ్జీవ కారాగార శిక్ష లాంటి వివాహ జీవితం కన్నా అదే మంచిదేమో అని… పెళ్ళాం అంటే కట్టుకున్న బానిస… వాళ్ళు ఏం చెప్పినా నో అనకూడదు… వాళ్ళ చట్రం లోంచి బయటకు రాకూడదు… తను కష్టపడి సంపాదించిన డబ్బును కూడా తన ఇష్టానికి ఖర్చు పెట్టుకోకూడదు. తన భావాలకు విలువ లేదు… తనకి స్నేహాలు ఉండకూడదు… ఇంట్లోనే అటూ ఇటూ తిరుగుతూ, బయట నుంచి ఉద్యోగంలో కష్టపడి తెచ్చిన డబ్బును యజమాని చేతుల్లో పోస్తూ… హాయిగా కాలం గడిపివేయాలి… ఆడపడుచులూ, అత్తమామలు ఏమన్నా సర్దుకు పోవాలి… ఇలా ఉండగలిగితే, మనసును చంపేసుకోగలిగితే ప్రతి భార్య జీవితమూ స్వర్గ ధామమే మరి!
‘‘అమ్మాయ్ మధూ… తులసి మొక్కకి నీళ్ళు పోసావా?” అత్తగారి పిలుపుకు బరువుగా నిట్టూర్చి మెయిల్ లోంచి లాగ్ అవుట్ అయి తన లాప్ టాప్ ను మూసేసి, లేచింది మధుబాల.




రోజులు గడచిపోతున్నాయి. మధు ఇంట్లోని పనులూ, ఆఫీసులోని పనులూ ఈ రెంటికీ సమన్వయము చేసుకోవటం అలవాటు చేసుకుంది. కానీ ఇంట్లో వాతావరణం చాలా తరచుగా పాడవుతోంది.  కొత్తలో ఉన్న తీయదనం తగ్గిపోయి వేణుకు తనకూ మధ్య బంధం యాంత్రికత లోకి దిగిపోతున్నట్టు అనిపిస్తోంది మధుబాలకు.

నూటికి తొంభై శాతం మగవాళ్ళలాగానే అతనూ ఇంటిపని ఒక్కటి కూడా చేయడు. బహుశః ఉమ్మడికుటుంబంలో ఉండటం వలన కూడా కావచ్చు... వంటపనిలో, ఇంటిపనిలో మధుబాల ఎంతగా అత్తగారికి సహాయం చేస్తున్నా, వినత వచ్చిందంటే మాత్రం అందరి మూడ్సూ ఆమెకి అనుగుణంగా మారిపోతాయి. అప్పటివరకూ సయోధ్యగా ఉన్న అత్తగారు కూడా  వినతకు ప్రాధ్యాన్యం ఇచ్చి, తనను అంతగా పట్టించుకోదన్న భావన ఒకటి రెండు సార్లు గమనించిన

మీదట మధుబాలను బాధించసాగింది.

నిజానికి సుగుణమ్మ మంచిదే... మధును కన్న కూతురిలాగానే చూసుకుంటుంది. కానీ కన్నకూతురు కాబట్టి వినత మాటలకే ప్రాధాన్యత... తానున్నంత సేపూ మధు గురించి కామెంట్ చేస్తూనే ఉంటుంది వినత. మొదట్లో వినతను ఖండించి మందలించే కుటుంబ సభ్యులు ఇప్పుడు ఆమెతో కలసి మధును ఆట పట్టిస్తున్నట్టు నవ్వుతున్నారు. మామగారున్నప్పుడు మాత్రమే, ఆయనంటే ఉన్న భయభక్తుల వలన... వినత తనతో సామరస్యంగా ఉంటుంది అని గమనించింది మధుబాల. ఒక్కోసారి నవ్వుతూనే మధుబాల కూడా వినతకు సరియైన సమాధానం ఇస్తూ ఉంటుంది. ఒక్కోసారి గొడవ ఎందుకని నిస్సహాయంగా ఊరుకుంటుంది.

ఇది ఇలా ఉండగా తన కొలీగ్స్ అంతా చేరుతూ ఉంటే, హై టెక్ సిటీ లోని ఒక అపార్ట్మెంట్ వెంచర్ లో జాయిన్ అయ్యాడు వేణుగోపాల్. తన దగ్గరున్న డబ్బంతా అటువైపు తరలించాడు. ఇంకాస్త డబ్బు కావలసి వచ్చినపుడు బ్యాంకు కు వెళ్ళి చూస్తే, ఐదు లక్షలు ఉండాల్సిన తమ జాయింట్ ఎకౌంటు లో కేవలం యాభై వేలు మాత్రమే ఉన్నాయని తెలిసి ఆగ్రహోదగ్రుడయ్యాడు.

మధుబాల ఆఫీసునుంచి వచ్చాక, భోజనాలై గదిలోకి రాగానే గొడవ మొదలయింది.

‘‘ఎవరినడిగి తీసుకున్నావు అంత డబ్బు? కనీసం నాకు మాట మాత్రంగానైనా చెప్పాల్సిన అవసరం లేదా?’’ తీవ్రంగా ప్రశ్నించాడు భార్యను.
అయోమయంగా చూసింది మధుబాల.

‘‘అప్పట్లో మా నాన్నగారి వైద్యం కోసం కొన్ని అప్పులు చేయాల్సి వచ్చింది. మా పొలం తనఖా పెట్టాడు మా అన్నయ్య. అది విడిపించటం కోసం నేను సాయం చేస్తానని అన్నాను. అందుకే అన్నయ్యకి ఆ డబ్బు పంపించాను. నేను పెళ్ళికి ముందే చెప్పాను కదండీ, మా వాళ్లకు చేదోడు వాదోడు గా ఉండాల్సి వస్తుంది అని...మొన్న నేను అన్నయ్యకి ట్రాన్స్ఫర్ చేసేటప్పుడు కూడా మీతో చెప్పాను. మీరు న్యూస్ పేపర్ చదువుతూ అంతగా పట్టించుకోలేదు. అదీ గాక... మన

అకౌంట్ లోని డబ్బు అంతా నా జీతం లో సేవ్ చేసినదే కదా…''
''అంటే? నీ జీతమైతే మాత్రం నువ్వు ఖర్చు పెట్టేసుకోవచ్చా? నాకో మాట మాత్రం చెప్పాల్సిన అవసరం లేదా?''

''అరె ఖర్చు పెట్టుకోలేదు మహానుభావా… మా అన్నకు అవసరానికి ఇచ్చాను… నేను వద్దన్నా రెండు సంవత్సరాలలో తిరిగి ఇస్తాడు వాడు. పైగా మీకు మాట చెప్పలేదని అనటం అన్యాయం… మీరు వినకపోతే నేనేం చేయను? మీకు పేపర్ సఖియ కళ్ళముందు ఉంటే చాలు ఇంకెవరూ అక్కరలేదు, ఏ మాటా వినిపించదూ… నేనేం చేయను?'' కొంచెం విసురుగానే జవాబు చెప్పింది మధుబాల.

''నాకేం తెలుసు నువ్వు మీ అన్నకే ఇచ్చావో, నీ స్నేహితురాలికే ఇచ్చావో?'' పదునుగా వస్తున్నాయి వేణు మాటలు.

''అంటే? ఐశ్వర్యకి ఇచ్చాననా? దానికి అంత ఖర్మమేమీ పట్టలేదు… వాళ్ళమ్మా నాన్నలకి దానికి వైద్యం చేయించే తాహతు ఉంది లెండి…అప్పుడు ఎమర్జెన్సీ వలన హాస్పిటల్లో నేను డబ్బు కట్టినా, పది రోజుల్లోనే వాళ్ళ నాన్నగారు పంపించేసారుగా…. నేను అబద్ధం ఆడాల్సిన అవసరం నాకు లేదు… అయినా ఎందుకు మీకిప్పుడు డబ్బు?''

''నీకు చెప్పాలా?'' చిరాగ్గా అడిగాడు.

''చెప్పాలి… నేను మీకు చెప్పలేదనే కదా ఇప్పుడు మీరు చిందులు వేసేది?''

''అర్జెంట్ గా నేను బిల్డర్ కి డబ్బు కట్టాలి…'' బింకంగా చెప్పాడు వేణు.

''బిల్డర్ ఏమిటి?'' అయోమయంగా చూసింది మధు.

''అదే… హైటెక్ సిటీలో ఫ్లాట్ తీసుకుంటున్నాను. ఇన్ కమ్ టాక్స్ బాధలు పడలేక… మనమిక్కడే ఉన్నా, అది రెంట్ కి ఇస్తే నెలకి పదిహేను ఇరవై వేలు ఆదాయం గారంటీ…

ఇప్పుడు అతనికి ఇవ్వాల్సిన  డబ్బు తక్కువ పడింది... నువ్వేమో నాకు చెప్పకుండా సొంత పెత్తనాలు చేసేస్తావు...”

‘‘శభాష్... కొత్త ఇల్లు కొంటూ భార్యకి చెప్పకపోవటంలో తప్పేమీ లేదు... నేను కష్టపడి సంపాదించిన డబ్బు మా అన్నకి చేబదులుగా  ఇస్తే అది అపరాధం... ఏమి న్యాయమో ఇది...’’ ఉక్రోషంగా అన్న మధుబాల కళ్ళల్లో నీళ్ళు నిండాయి. గబుక్కున కొంగుతో తుడుచుకుంటూ తల తిప్పుకుంది...

‘‘చేసిందంతా చేసి సిగ్గు లేకుండా ఏడుపు ఒకటి!’’ కోపంలో ఇష్టం వచ్చినట్టు మాట్లాడతాడు వేణుగోపాల్ చాలా మంది భర్తల్లానే.
భర్త మాటకు సమాధానం ఇవ్వకుండా అప్పటికే రాత్రి పది దాటటంతో మౌనంగా పడుకుంది మధుబాల.

***

మర్నాడు ఆఫీసు నుంచి రాగానే భర్తను నిలదీసింది మధుబాల.

‘‘మా అన్నయ్యకు ఫోన్ చేసారా?’’

‘‘ఊ.. అదీ...’’ తడబడ్డాడు వేణుగోపాల్.

‘‘అంటే నేను మీకు అబద్ధం చెప్పాననా? నిర్ధారణ చేసుకోవటానికి మా అన్నయ్యకు ఫోన్ చేసారా? పైగా డబ్బు తిరిగి ఎప్పుడు ఇస్తారని అడిగారట... ఇచ్చి ఇంకా వారమైనా కాలేదు...’’దుఃఖం అడ్డుపడగా మధుబాల గొంతు పూడుకుపోయింది.

వేణు ఏమీ మాట్లాడలేదు.

‘‘వాడు పొలం అమ్మేసి డబ్బిచ్చేస్తానని అంటున్నాడు. ఉన్న రెండెకరాలు అమ్మేస్తే వాడికి వచ్చే

జీతంతో గడవటం కష్టం... నాన్నకి సరిగ్గా జీతం రావటం లేదు... పైగా రిటైర్ మెంట్ దగ్గర పడింది... మీరెందుకు అర్థం చేసుకోరు?''

''ఏం బాధ్యతంతా నీ ఒక్కదానికేనా? మీ అక్కలూ ఉన్నారు కదా?''

''మా అక్కలు నా అంత చదువుకోలేదు... ఉద్యోగాలు చేసి డబ్బు సంపాదించేంత సామర్థ్యం వాళ్లకి లేదు. పిల్లలతో, భర్తలతో వాళ్ళ బాధలు వాళ్లకి ఉన్నాయి. మొదటినుంచి కుటుంబ బాధ్యతలు నేనే పంచుకున్నాను. మా నాన్న నన్ను మొగపిల్లాడిలా చదివించారు. ఈరోజు ఇలా ఉన్నానంటే అది ఆయన చలవే. అలాంటప్పుడు వాళ్ళ కష్టాలు పంచుకోవటంలో తప్పు ఏముంది?''

''మధూ.. నన్ను విసిగించకు... ఆడపిల్ల ఓ సారి పెళ్లి అయ్యాక అత్తింటి వారినే చూసుకోవాలి కానీ పుట్టింటి వాళ్ళంటూ ప్రాకులాడకూడదు...''

''అవును... మీ వినతలా అస్తమానూ పుట్టింటికి వచ్చి కానుకలు తీసుకుపోవాలి. మొన్న నేను కొత్త మిక్సీ కొనుక్కు వస్తే ఆవిడ మోజు పడిందని నన్ను ఒక్క మాటైనా అడక్కుండా తనకి ఇచ్చేసారు...''

''పుట్టింట్లో ఆడపిల్లకి ఆ హక్కు ఉంటుంది మధూ... నిన్నే చూస్తున్నాను మరీ ఇంత వ్యతిరేకంగా... పెళ్లి అయ్యాక మీ అన్న ఏం పెట్టాడు నీకు?''

''నేను వినతను కాను... అస్తమానూ పుట్టింటికి పరుగుతీసి వస్తువులన్నీ తెచ్చేసుకోవటానికి... పుట్టింటిలో హక్కే కాదు, బాధ్యత కూడా ఉండాలి ఆడపిల్లకి... ఏది ఏమైనా మీరు అన్నయ్యను అడగటం నాకు నచ్చలేదు...''

''నీకు నచ్చే పనులు మాత్రమే చేయలేను నేను... నా అవసరాలు నాకుంటాయి... అప్పుగా తీసుకున్నప్పుడు ఎప్పుడు తిరిగిస్తారని అడిగితే  తప్పు ఏమిటి?''

‘‘అవతలి వాళ్ళు బాధ పడతారని మీరు క్షణమైనా ఆలోచించరా? పైగా నాకు తెలియకుండా మీరు అడిగారు అన్నయ్యను... రెండేళ్ళ తర్వాతే ఇస్తాడు... మరోసారి మీరు అన్నయ్యకు ఫోన్ చేయకండి...’’ ఖరాఖండీ గా చెప్పింది మధుబాల.

***

ఐశ్వర్య తిరిగి వచ్చి కొత్త ఉద్యోగంలో జాయిన్ అయింది. ప్రస్తుతానికి కార్తీక్ తో ఎలాంటి సమాచారమూ లేదు. ఆమె మనసు చాలా గాయపడింది. తల్లికావాలని తపించినంత సేపు కాలేదు... దురదృష్టం అంటే తనదే... చిక్కిపోయి, పాలిపోయిన ఐశ్వర్యను చూసి అన్నపూర్ణ మనసు నీరైపోయింది. ఐశ్వర్యను చేతుల్లోకి తీసుకుని, గాఢంగా గుండెకు హత్తుకుని తలపై ముద్దు పెట్టుకుంది.

‘‘పిన్నీ... అంతా అయిపోయింది... నేను నమ్మిన సిద్ధాంతాలు అన్నీ మట్టిలో కొట్టుకుపోయాయి. ప్రేమంటే ఇలా క్షణంలో ఆవిరి అయిపోయే తేలికైన విషయమని నేను అనుకోలేదు పిన్నీ... కార్తీక్ నేను అక్కరలేదని వెళ్ళిపోయాడు... నా కడుపులోకి వచ్చిన బుజ్జి బాబు కూడా నేను వద్దని వెళ్ళిపోయాడు... నేను ఒంటరినైపోయాను పిన్నీ...’’ భోరుమని ఏడ్చింది ఐశ్వర్య.

తన కన్నతల్లి దగ్గరకూడా మనసు పరువలేని ఐశ్వర్య పిన్ని గారి దగ్గర మనసు తేలిక పడేలా ఏడ్చింది.

‘‘అవునమ్మా, అప్పుడు మేము లేకపోవటంతో నీకు చాలా కష్టం, ఇబ్బంది వచ్చాయి...’’ తానూ కనులు తుడుచుకుంటూ అంది అన్నపూర్ణ.

‘‘అమ్మా, ఐశూ, చిన్నపిల్లవి కావు కదమ్మా... చక్కగా చదువుకొని ఉద్యోగం చేస్తున్నావు... విజ్ఞతతో వ్యవహరించాలి. అయిందేదో అయిపోయింది. గతమొక కల అనుకుని మరచిపోయి, కొత్త జీవితం ప్రారంభించు తల్లీ...’’ అనునయంగా చెప్పాడు విశ్వనాథం.

“అంత కన్నా చేసేది కూడా ఏమీ లేదు కదా బాబాయ్, అలాగే చేస్తాను...” పేలవంగా నవ్వింది ఐశ్వర్య.

“తల్లీ, నువ్వు కోలుకునే వరకూ బ్రేక్ ఫాస్ట్, డిన్నర్ ఇక్కడ చేసేయ్ అమ్మా, లంచ్ ఎలాగూ కాంటీన్ లోనే తింటావు కదా...” ఆప్యాయంగా అన్నది అన్నపూర్ణ.

“వద్దు పిన్నీ. వంట పని కూడా లేకపోతే నాకు పిచ్చి ఎక్కుతుంది... నేనే చేసుకుంటాను...”మృదువుగా తిరస్కరించింది ఐశ్వర్య.
ఏమీ అనలేక ఊరుకున్నారు విశ్వనాథం దంపతులు. కానీ ప్రతీరోజూ ఐశ్వర్య దగ్గరకు వెళ్ళి ఎలా ఉన్నదో, తిన్నదో లేదో విచారించటం మానలేదు అన్నపూర్ణ.




.
వేరే ఉద్యోగంలో చేరింది ఐశ్వర్య. పూర్తిగా తన పనిలోనే నిమగ్నమౌతూ తనను పరిహసిస్తున్న పరిస్థితులనూ, విలపించే మనసునూ నియంత్రించుకోవటానికి ప్రయత్నిస్తోంది.

ఆఫీసులో ఉన్నంత సేపూ ఫర్వాలేదు కానీ ఇంటికి వచ్చిన తరువాత మాత్రం ఆమె మనసు

ఆమె అధీనంలో ఉండటం లేదు. అనుక్షణమూ ఆ ఇంటిలో కార్తీక్ తో గడపిన మధురమైన జ్ఞాపకాలు... ప్రతీ పనిలో తోడుండే వాడు. వర్షం పడినప్పుడు ఉరుముల శబ్దానికి తను భయపడితే గుండెల్లో దాచుకొని, భయం లేదంటూ ఊరడించేవాడు. అలాంటి వాడు ఇప్పుడు ఒంటరితనం అనే చీకటిలో వదిలేసి నిర్దయగా వెళ్ళిపోయాడు.

ఆలోచించే కొద్దీ మనసు మరింత భారమై, కళ్ళు నదులు అవుతున్నాయి... ఎంత ఏడ్చినా మనసుకు శాంతి కలగటం లేదు... ఓ రోజు అలాగే నిద్ర పట్టక, బాధతో కొట్టుకుంటున్న ఐశ్వర్యకు అరలో కనిపించింది కార్తీక్ సగం తాగి వదిలేసిన విస్కీ బాటిల్... 'ఇది తాగితే కొంచెం నిద్ర పడుతుందేమో... బాధ తగ్గుతుందేమో...' చిన్న స్టీల్ గ్లాసులో కొంచెం పోసుకుని కొద్దిగా నీరు కలుపుకుని టానిక్ తాగినట్టు తాగేసింది. కాసేపట్లో మత్తు... ఏదో తెలియని సుఖం... మనసు ఏమీ  ఆలోచించటం లేదు... హాయిగా అనిపించింది...

'ఓహో, ఇందుకేనేమో ఆ దేవదాసు పార్వతిని కోల్పోయిన బాధలో ఇలా దీనికి అలవాటు పడి బాధను తగ్గించుకున్నాడు... నేను దేవదాసునా, పార్వతినా? పార్వతి కూడా దేవదాసును కోల్పోయింది కదా... మరి తను ఎలా తగ్గించుకుంది బాధను? ఏమిటో ఆ శరత్ చంద్ర కూడా దేవదాసు వైపే రాసాడు కానీ పార్వతి వైపు రాయలేదు... ఆడదానిది ప్రేమ కాదా? ఆమెకి వలపు బాధ లేదా? ప్రేమించిన ప్రియుడు వదిలిపెట్టి వెళ్ళిపోతే ఆ సమయంలో వేరే పెళ్లి చేసుకోవలసి వచ్చిన పార్వతి మనసు ఎంత ముక్కలై పోయి ఉండాలి? ప్రియుడి తిరస్కృతికి గురి అవటం కన్నా వేరే నరకం ఉంటుందా ప్రేమించిన ఇంతికి?' ఇలా ఏవేవో ఆలోచనలతో నిద్రలోకి జారిపోయింది ఐశ్వర్య.

ఉదయం నిద్ర లేవగానే రాత్రి జరిగింది తలచుకొని, చాలా సిగ్గు పడిపోయింది ఐశ్వర్య. ఛ! తను తాగటం ఏమిటి? పల్లెటూరి వాడైనా తన తండ్రే తాగడు, ఆయన కడుపున పుట్టిన తాను... మద్యపానమంటే అసహ్యించుకునే తను... ఇదేమిటి ఇలా? తనమీద తనకే చిరాకు,  కోపం కలిగాయి. గబగబా బాత్ రూమ్ లోకి వెళ్లి తలారా స్నానం చేసి వచ్చింది. దేవుడి పటం ముందు నిలబడి క్షమించమంటూ చెంపలు వేసుకుంది.

కానీ పదిహేను రోజుల తర్వాత మళ్ళీ మరోసారి తాగింది. ఇలా అప్పుడప్పుడూ జరుగులోంది.

***

మధుబాలకు చాలా సంతోషంగా ఉంది. పెళ్ళి అయి ఆరునెలలు అయింది... అనుమానంగా ఉండి డాక్టర్ దగ్గరకు వెళితే తను తల్లి కాబోతోంది అని నిర్ధారణ అయింది. ఎంతో సంతోషంగా, కొద్దిగా భయంగా, కించిత్ గర్వంగా ఎన్నో భావాలు కలబోసిన అనుభూతి కలుగులోంది. గాలిలో తేలిపోతున్నట్టు అనుభూతి చెందుతూ ఇంటికి వచ్చింది.

హాల్లో కూర్చుని టీవీ లో సీరియల్ చూస్తూ రాత్రి టిఫిన్ చపాతీలలోకి కూర తరుగులోంది సుగుణమ్మ. కోడలిని చూడగానే ఓ చిరునవ్వు నవ్వి మళ్ళీ టీవీ వైపు దృష్టి సారించింది. పక్కనే సోఫా లో మామగారు కూర్చుని ఉన్నారు.

తనూ నవ్వి తమ రూమ్ లోకి వెళ్లి వేణు కోసం వెదికింది. ఇంకా రాలేదులా ఉంది... అనుకుంటూ త్వరత్వరగా స్నానం చేసి బట్టలు మార్చుకుని ఇవతలికి వచ్చింది. అప్పటికి వచ్చేసాడు వేణు. డెస్క్ టాప్ లో న్యూస్ పేపర్ చదువుకుంటూ కనిపించాడు.
అంతులేని అనురాగం ముప్పిరిగొనగా వెనకాలే వెళ్ళి అతని కళ్ళు మూసింది. వీపు మీదుగా వంగి అతని చెంపను తన పెదాలతో స్పృశించింది.

“ఏయ్... ఏమిటోయ్ ఈ హుషారూ? రోజూ ఇలాగే ఉంటే ఎంత బావుంటుంది నువ్వూ?” ఆమె శరీరం నుంచి వచ్చే సురభిని ఆఘ్రాణిస్తూ, కళ్ళ మీదనుంచి ఆమె చేతులు తీసేసి తనవైపు లాక్కున్నాడు ఆమెను.

“వేణూ... ఈరోజు చాలా సంతోషంగా ఉన్నాను నేను...” అతన్ని అల్లుకుపోతూ చెవిలో గుసగుసగా చెప్పింది.

“అవునా, ఏమిటీ విశేషం?”

అకస్మాత్తుగా సిగ్గు ముంచుకు వచ్చింది మధుబాలకు. ముఖం రాగరంజితమైంది. పెదవులు ముసిముసిగా నవ్వాయి...

‘‘ఏయ్, సస్పెన్స్ నాకు నచ్చదు అని తెలుసు కదరా మధూ... ప్లీజ్ చెప్పు...’’ ఆమెకు కితకితలు పెట్టాడు.

‘‘అబ్బా... ఏయ్ ఆపు... నువ్వు పాసయ్యావోయ్...’’ అంది కొంటెగా...

‘‘అవునా, ఏ పరీక్షలో నబ్బా?’’

‘‘ఒక మెట్టు ఎక్కావులే... నీకు ప్రమోషన్ ఇస్తున్నాను భక్తా... తండ్రివి కాబోతున్నావు...’’ గబుక్కున చెప్పేసి రెండు చేతుల్లో ముఖం దాచుకుంది మధు.

‘‘హేయ్ నిజమా?’’ వేణు మనసు, శరీరం రెండూ పులకరించిపోయాయి... మధుబాల ముఖం నిండా ముద్దులు కురిపించాడు. ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని గుండెలకు హత్తుకున్నాడు.

‘‘థాంక్స్ మధూ... నిజంగా ప్రమోషన్ ఇచ్చావు... థాంక్స్ అ లాట్...’’ అప్రయత్నంగా అతని కళ్ళు చెమ్మగిల్లాయి.

తనను తాను సంబాళించుకొని, ‘‘ఈ శుభ సందర్భంలో నీకేం కావాలన్నా ఇచ్చేస్తాను... కోరుకో మధూ...’’ అన్నాడు ప్రేమగా...

‘‘మన మధ్య ఎలాంటి అరమరికలు ఉండకూడదు... ఈ స్వచ్ఛమైన ప్రేమ ఇలాగే ఎప్పుడూ కొనసాగాలి. అంతే... అంతకన్నా ఏమీ వద్దు వేణూ... ఇది ఒక్కటీ చాలు...’’ అన్నది మధుబాల.

‘‘అలాగే మధూ... మరి అమ్మకి ఈ విషయం చెప్పాలి కదా...’’

‘‘అమ్మో… నేను చెప్పలేనండి… నాకు సిగ్గు…’’

‘‘ఎందుకూ నేనే చెప్పేస్తా… నాకు సిగ్గు లేదుగా?’’ అంటూ ఫక్కున నవ్వి, ‘‘అమ్మా!’’ అని పిలిచాడు.

‘‘ఏమిట్రా?’’ ఆవిడా గొంతు పెంచి బదులిచ్చింది.

‘‘అర్జెంట్ గా రా, నీతో మాట్లాడాలి…’’

‘‘వెళ్ళు వెళ్ళు, ఏదో వస్తువు పోగొట్టుకుని ఉంటాడు, వెదికి పెట్టటానికి పిలుస్తున్నాడు అమ్మ కూచి…” సుగుణమ్మను ఆట పట్టిస్తూ అన్నాడు గోవర్ధన రావు.

‘‘చాల్లెండి…’’ చిన్నగా నవ్వుకొని లేచి గదిలోకి వచ్చింది సుగుణమ్మ…

‘‘అమ్మా, రా… ఇలా కుర్చీలో కూర్చో…’’ అంటూ తల్లిని కూర్చోబెట్టి, మధుబాలకి సైగ చేసాడు. ఇద్దరూ కలిసి సుగుణమ్మ కి పాదనమస్కారం చేసారు.

అర్థం కాక అయోమయంగా చూస్తున్న తల్లితో ‘‘మా ముగ్గురినీ ఆశీర్వదించమ్మా…’’ అన్నాడు వేణు నవ్వు దాచుకుంటూ.

‘‘ముగ్గురా? ముగ్గురేమిటీ?’’ ఉన్నట్టుండి ఆవిడ తలలో బల్బ్ వెలిగింది…

‘‘అవునమ్మా, నువ్వు బామ్మవి కాబోతున్నావే…’’ అన్నాడు చిన్నపిల్లాడిలా తల్లి ఒడిలో తలపెట్టుకుని నవ్వుతూ… సుగుణమ్మ ఆనందానికి అవధులు లేవు…

‘‘ఏమండోయ్ త్వరగా రండి…’’ అంటూ భర్తను పిలిచింది.

‘‘హూ…నేనూ వచ్చి వెదకటంలో నీకు సహాయం చేయాలా ఏమిటే?’’ అంటూ వచ్చాడు గోవర్ధనరావు.

''రండి తాతగారూ... రండి రండి...'' గంభీరంగా పలికింది సుగుణమ్మ.

''తాతగారూ...'' విషయం అర్ధమైపోయింది గోవర్ధనరావుకు.

''ఏరా వేణూ? నిజమా! హార్టీ కంగ్రాట్స్ మై సన్...'' వేణును కౌగలించుకున్నాడు ప్రేమగా...

''థాంక్స్ నాన్నా...''

''కంగ్రాట్స్ అమ్మా మధూ...'' ఆప్యాయంగా ఆమె భుజం తట్టాడు గోవర్ధన రావు.

ఆయన పాదాలకి నమస్కరించింది మధుబాల.

***

మధుబాల ఫోన్ చేసి తల్లికీ, అక్కలకిద్దరికీ విషయం చెప్పింది. పూర్ణమ్మ ఎంతో సంబరపడిపోయింది.

సుగుణమ్మ పెద్దకూతురు సురేఖకూ, చిన్న కూతురు వినతకూ ఫోన్ చేసి శుభవార్తను చెప్పింది.  సురేఖ ఎంతో సంతోషపడింది కానీ వినత మనసు ఉడికిపోయింది.భర్త బయటనుంచి రాగానే తగువేసుకుంది.

''విన్నారా? ఆ మాయలాడి నెలతప్పింది!'' అంది అక్కసుగా..

''మాయలాడి? నిన్నుమించిన ఆ లక్షణాలు గలవారు ఎవరు చెప్మా?'' అన్నాడు పవన్  నవ్వేస్తూ.

''అదే... మా అన్నయ్య పెళ్ళాం మధుబాల...''

''మధు చెల్లాయా? ఓ, శుభవార్త... ఎంతో  సంతోషం గా ఉండాల్సింది పోయి, ఈ అసూయ

ఏమిటి వినతా?''

''హు... మనకి పెళ్ళి అయి ఇంతకాలం అయింది... నన్ను తల్లిని చేయలేకపోయావు...'' అంది ఈసడిస్తూ...

''నీకు నిలువెల్లా అహంకారమే తప్ప మంచితనం ఏ కోశానా లేదు... నువ్వు తల్లివి కాకపోవటమే మంచిది. లేకపోతే పుట్టబోయే పిల్లలూ నీలాంటి వాళ్ళే పుడతారు...'' అన్నాడు సూటిగా ఆమె ముఖంలోకి చూస్తూ...

''పవన్... కొంచెం జాగ్రత్తగా మాట్లాడు!'' తోక తొక్కిన తాచులా లేచింది వినత.

''అవును వినతా... నీకు మొగుడితో ఎలా ఉండాలో తెలియదు. అత్తగారిని ఆదరించటం తెలియదు. అమెరికాలో ఉన్న ఆడపడుచు ఫోన్ చేసినప్పుడు పలకరించటం ఇష్టం లేదు... అసలు ప్రేమగా  ఎప్పుడైనా నాకు అన్నం పెట్టావా? అనురాగంతో నాదరికి చేరావా? నీకు మూడ్ వస్తే నా దగ్గరికి వస్తావు, లేకపోతే దూరంగా తోసేస్తావు... పరస్పరం మమతానురాగాలు, సానుకూలమైన అవగాహన లేనప్పుడు పిల్లలు కూడా మన ఒడిలోకి రారు వినతా... అది గ్రహించు...''

''హు! లోపం నీలో పెట్టుకుని, అది కవర్ చేసుకోవటానికి ఇన్ని ఉపన్యాసాలు దంచుతున్నావు పవన్... నాకు తెలుసులే... నీకు నాలో లోపాలు ఎంచటం తప్ప ఏం పని లేదు... మీ అమ్మకు సేవ చేస్తానని నీకు నేను అగ్రిమెంట్ రాసివ్వలేదు... అసలు ఈ జబ్బులు, రోగాలు అంటేనే నాకు అలెర్జీ... నీకు వంట చేసి పెట్టటానికి నేను వంటలక్కని కాదు... దేవుడి దయవలన మనుషుల్ని  పెట్టి చేయించుకునే స్తోమత ఉంది. నన్ను వేలెత్తి చూపిస్తున్నావు... నువ్వే ఓ సారి డాక్టర్ దగ్గరకి వెళ్లి చూపించుకో...'' బుసలు కొడుతూ అక్కడినుంచి వెళ్ళిపోయింది వినత.

ఆమె వెళ్ళిన వైపే చూస్తూ దీర్ఘంగా నిట్టూర్చాడు పవన్.




బాస్ తనను పిలిచాడని హడావుడి గా లేచి అతని కాబిన్ లోకి వెళ్ళింది ఐశ్వర్య.

ఫోన్ లో ఏదో మాట్లాడుతున్న వాడల్లా అది హోల్డ్ చేసి, "కమాన్ ఐశ్వర్యా... టేక్ యువర్ సీట్..." కూర్చోమని చెప్పి, తిరిగి కాల్ ని కొనసాగించాడు మల్ హోత్రా.

"యస్, చెప్పండి సర్..." వినయంగా అడిగింది అతని ఫోన్ కాల్ అయిపోగానే...

"ఏమీ లేదు, ఊరికే నీతో కొన్ని విషయాలు మాట్లాడాలి అని..."

ఇద్దరి సంభాషణ ఆంగ్లంలో సాగుతోంది.

"నాతోనా?" అనుమానంగా అడిగింది. ఎందుకో అతని చూపులో, మాటలో తేడా గోచరించింది.

"ఐ హార్డ్ దట్ యు ఆర్ అలోన్!" అసహనంగా కదిలింది ఐశ్వర్య. అయినా సభ్యత కాదని

వింటూ ఉండిపోయింది.

“నీకు సహజీవనం అంటే ఇష్టమని తెలిసింది. నీతో ఉన్న తను నిన్ను విడిచి వెళ్లిపోయాడని కూడా తెలిసింది. ఒంటరిగా ఎలా ఉంటావు? అందుకని, నాది ఒక ప్రపోజల్... నా భార్య అనారోగ్యం మూలంగా నాకు సంసార సుఖం కొరవడింది. అందుకని నీకో బంగ్లా చూస్తాను. అక్కడ ఇద్దరం కలిసి ఉందాము... నీకు కావలసినన్ని నగలూ, డబ్బూ ఇస్తాను... నిన్ను ఎంతో అపురూపంగా చూసుకుంటాను... సరేనా?”
ఐశ్వర్య ముఖం జేవురించింది. రక్తం సలసల మరిగిపోవటం మొదలైంది. ముక్కుపుటాలు కోపంతో ఆదరసాగాయి.

“అసలు మీరు నా గురించి ఏమని అనుకుంటున్నారు? నేను ఆ టైపు కాదండి. ప్రేమించిన వాడితో కలిసి బ్రతకాలని అనుకున్నాను.

దురదృష్టవశాత్తూ మా దారులు వేరైనాయి... అంతే కానీ, ‘ప్రేమ’ అనేది లేకుండా డబ్బు కోసమో, నగల కోసమో నన్ను నేను అమ్ముకునేంత నీచురాలిని కాను. నా చదువు నాకు ఉద్యోగం ఇచ్చింది. దానివలన నాకు తిండికి, బట్టకూ లోటు లేదు... అయామ్ సారీ... మీ ప్రపోజల్ కి నేను కనుక  కాదని ఇంత సౌమ్యంగా చెబుతున్నాను. వేరే ఎవరైనా అయితే చెప్పు తీసి ఉండేవాళ్ళు...”

“ఏయ్... ఎంత ధైర్యం నీకు? పోనీ పాపం అని నా అంతటి వాడు ప్రపోజ్ చేస్తే...”

అప్పటివరకూ మెత్తగా మాట్లాడుతున్న ఐశ్వర్య అపర కాళిక అయిపోయింది.

“ఛీ...సిగ్గుందా నీకు? నీ భార్య కూడా నువ్వు వద్దని వేరే దారి చూసుకుంటే నీ పరిస్థితి ఏమిటో ఆలోచించుకో... మీ మగవాళ్ళు అందరూ ఇంతే... చపల చిత్తులు... మీకసలు  నీతీ జాతీ లేదు... ఇంకో సారి  హద్దులు దాటితే విషయం మీ నాన్నగారికి చెప్పాల్సి వస్తుంది... మైండ్ ఇట్...” గబుక్కున లేచి తన సీట్ కి వచ్చేసింది.

ఆమెకి ఉవ్వెత్తున ఏడుపు తన్నుకు వచ్చింది. అసలు...అసలు... అసలేమని అనుకుంటున్నాడు తన గురించి? మేనేజింగ్ డైరెక్టర్ అయిన మల్హోత్రా తండ్రి దృష్టికి తీసుకువెళితే?

ఛ ! అప్పటికప్పుడు రిజిగ్నేషన్ లెటర్ రాసి రెడీ చేసింది. లోపలికి పంపబోతూ, మధుబాలకి ఫోన్ చేసి విషయం చెప్పింది, కన్నీళ్లు జలజల రాలుతూ ఉంటే...

కొంచెం ఆగమనీ, సంయమనంతో వ్యవహరించమనీ, ఉన్న ఉద్యోగాన్ని హఠాత్తుగా వదులుకోవద్దనీ, మరో ఉద్యోగం చూసుకునేవరకూ ఆవేశాన్ని ఆపుకోమనీ మధుబాల గట్టిగా చెప్పటంతో, రాజీనామా కాగితాన్ని బాగ్ లోకి తోసేసి, ఎవరికీ చెప్పకుండా ఇంటికి వెళ్ళిపోయింది ఐశ్వర్య.

ఆ పరిస్థితిలో తాను అమ్మ కాబోతున్నానన్న శుభవార్తను ఐశ్వర్యతో పంచుకోలేకపోయింది మధుబాల.

***

మర్నాడు ఆఫీసుకు రాగానే ఇంటర్ కామ్ లో 'సారీ' చెప్పాడు మల్ హోత్రా. విషయాన్ని తన తండ్రివరకూ తీసుకు వెళ్లవద్దనీ, అలాగే ఉద్యోగాన్ని కూడా వదిలిపెట్టి వెళ్ళవద్దనీ బ్రతిమాలుకున్నాడు. అప్పటికి ఐశ్వర్య ఆవేశం తగ్గి, మనసు శాంతించింది.

ఎవరితోనూ మాట్లాడకుండా మౌనంగా తన పని తాను సక్రమంగా చేసుకుని ఇంటికి వచ్చేయటం అలవాటు చేసుకుంది. ఆమె గాంభీర్యాన్ని చూసి అందరూ భయపడటం మొదలుపెట్టారు. లేట్ అవర్స్ ఉండటం కానీ, సెలవు దినాల్లో వచ్చి పని చేయటం కానీ ఎవరు చెప్పినా చేసేది కాదు ఐశ్వర్య. ఎంత పని అయినా తన పనిగంటలలోనే చేసేసుకునేది. ఎక్కువ పని కానీ, లేట్ అవర్స్ ఉండి చేయాల్సిన పనులు కానీ ఉంటే మర్నాడు ఉదయమే త్వరగా వచ్చి చేసుకునేది.

హాండ్ బాగ్ లో ఎప్పుడూ ఒక మడత పెట్టిన చురకత్తి, కారం పొట్లం ఉంచుకోవటం అలవాటు చేసుకుంది. తన దగ్గరకు దుష్ట శక్తులేవీ రాకుండా ముందు జాగ్రత్తలన్న మాట.

క్రమంగా ఆమెలో అభద్రతా భావం పోయి కాఠిన్యం చోటు చేసుకోసాగింది.

ఇంటికి వెళ్ళాక తనకి నిద్రాసమయం అయేవరకూ మంచి పుస్తకాలు చదవటమో, పిన్నీ బాబాయిలతో గడపటమో చేయసాగింది. తాగటం కూడా మానేసింది.

***

'మనుజుడై పుట్టి మనుజుని సేవించి

అనుదినమును దుఃఖమందనేలా?'

అభోగి రాగంలో యమ్మెస్ గారి కంఠంలోంచి అమృతోపమానంగా జాలువారుతున్న అన్నమయ్య పాటను యు ట్యూబ్ ఛానెల్ లో ఎంతో తన్మయత్వంతో వింటున్న ఐశ్వర్యకు కాలింగ్ బెల్ శబ్దం చికాకును కలిగించింది.

లాప్ టాప్ ఆఫ్ చేసి, లేచి వెళ్లి తలుపు తీసింది విసుగ్గా... ఎదురుగా నిలుచుని ఉన్న మధుబాలను చూడగానే ఐశ్వర్య ముఖంలో విసుగంతా మాయమైపోయి, పున్నమి వెన్నెల నిండిపోయింది...

"హేయ్ మధూ... రావే... వాటే సర్ ప్రైజ్? ఆదివారం మీ జైలరు బాబు ఎలా వదిలాడే బాబూ..." అంది మధుబాలను ఆనందంగా హగ్ చేసుకుంటూ... జైలర్ అని వేణుకు ముద్దుగా పేరు పెట్టుకుంది ఐశ్వర్య...

"ఈ రోజు కాస్త పనుండి ఆఫీసుకు వెళ్లానే... పనై పోయిందని నిన్ను చూద్దామని వచ్చాను. ఏమిటే ఇలా అయిపోయావు? అసలు తిండి తినటంలేదా?" బాధగా అంటూ, ఐశ్వర్య

చెంపలు నిమిరింది మధు.

“నాకేమే నేను హాయిగా ఉన్నాను... ఒంటరితనం తప్ప పెద్ద సమస్యలు ఏమీ లేవు... ఈ మధ్య సంగీతం వింటూ, పాడుకుంటూ దాన్నీ అధిగమించటానికి ప్రయత్నిస్తున్నాను. అలాగే నీ అంత మంచి నేస్తాలు నా పుస్తకాలు కూడా నాకు మంచి తోడు...”

ఐశ్వర్య మాటలకు బరువుగా నిట్టూర్చింది మధుబాల.

“ఒంటిగంట అవులోంది... లంచ్ రెడీ గా ఉంది, ఇద్దరం తిందాం... కాదనకు మధూ!”

“అయ్యో, అలాగేనే... సాయంత్రం వరకూ ఉంటాను. తిందాం లే ఓ అరగంటాగి... ఇటు రా... కొంచెం సేపు కబుర్లు చెప్పుకుందామే...” సోఫాలో కూర్చుని ఐశ్వర్య పక్కనే కూర్చుంది మధుబాల.

మధుబాల భుజమ్మీద తలవాల్చి కళ్ళుమూసుకుంది ఐశ్వర్య.

“ఈ ప్రపంచంలో అత్యంత భాగ్యవంతుడు ఎవరూ అంటే, ఒక్కడైనా స్నేహితుడు ఉన్నవాడని అంటాను నేను... నేను చాలా అదృష్టవంతురాలిని మధూ ఈ విషయంలో... దేవుడికి ఎంతో థాంక్స్...” మధు బుగ్గ మీద ముద్దు పెట్టుకుంది ఐశ్వర్య.
“పిచ్చి ఐశూ... ఆ విషయంలో నేనూ అంతే కదే... భగవంతుడు అమ్మను స్నేహితులరూపంలో సృష్టిస్తాడు... అమ్మ దగ్గరకు అస్తమానూ వెళ్ళలేము కదా మరి?”

“నిజం మధూ... ఆ ఇంతకూ ఏమిటి విశేషాలు? ఎలా ఉంది కాపురం? మీ అత్తగారు, మామగారూ బాగున్నారా? మీ లేడీ విలన్ వినత గారి విశేషాలు ఏమిటి? జైలర్ ఎలా ఉన్నాడూ?” ప్రశ్నల వర్షం కురిపించింది ఐశ్వర్య.

అన్నింటికీ జవాబుగా ఓ నవ్వు నవ్వేసింది మధుబాల. తరువాత ఐశ్వర్య కుడిచేతిని తన పొట్ట మీద పెట్టుకుని, “ఐశూ, నేను అమ్మను కాబోతున్నాను...” అని చెప్పింది పరవశంగా...

ఐశ్వర్య మనసు ఆనంద సాగరమై ఉప్పొంగింది...

“అబ్బా, కంగ్రాట్స్ మధూ... ఎంత మంచి వార్త చెప్పావు? మరి పాపాయి పుట్టాక నన్ను ఆడుకోనిస్తావా?”

“భలే దానివేనే ఐశూ... పాపాయి మనిద్దరికీ పాపాయే...”

“ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవే మధూ... నెలనెలా చెకప్ కి వెళ్ళు. అశ్రద్ధ చేయకుండా డాక్టర్ ఇచ్చిన మందులు వాడు... సరేనా?” ఆరిందాలా జాగ్రత్తలు చెప్పింది ఐశ్వర్య.

“సరే గానీ వంట ఏం చేసావే?” ఆసక్తిగా అడిగింది మధుబాల.


“సాంబారు, వంకాయ కూర... తింటావ్ గా?”

“తింటా కానీ, పుల్లగా ఏమైనా తినాలని ఉంది ఐశూ... పికిల్స్ ఏమీ లేవా?”

“ఎందుకు లేవు? పిన్నిగారు ఇచ్చిన చింతకాయ పచ్చడి ఉంది... ఉండు ఫ్రెష్ గా ఇంగువ పోపు వేసి తెస్తా... నువ్వు వెళ్ళి ఫ్రెష్ అయి రావే... నేను కంచాలు పెట్టేస్తా...” హుషారుగా లేచింది ఐశ్వర్య.

“పిన్నీ, బాబాయి గార్లు బాగున్నారా?”

“ఓ, చక్కగా ఉన్నారు... నువ్వు వచ్చినట్టు చూడలేదేమో... లేకపోతే పిన్ని ఈ పాటికి వచ్చి ఉండేవారు...” అంటూ ఉండగానే తలుపు చప్పుడు అయింది. తలుపు తెరవగానే నవ్వు ముఖంతో అన్నపూర్ణ లోపలి వచ్చింది.




సాయంత్రం వరకూ తన ప్రియ నేస్తంతో, అన్నపూర్ణతో గడిపి ఇంటికి తిరిగి వచ్చిన మధుబాల ఇంటికి వచ్చేసరికి అందరూ హాల్లో కూర్చుని టీవీ లో సినిమా చూస్తున్నారు. మధు రాగానే ఆమె వైపు ఎర్రగా చూసాడు వేణు.

కొంచెం కలవరపాటుకు గురి అయినా అదేమీ పట్టించుకోకుండా లోపలికి వెళ్లి కాళ్ళూ, చేతులూ ముఖమూ కడుక్కుని వచ్చి కూర్చుంది మధుబాల.

సుగుణమ్మ వంటింట్లోంచి స్టీలు గ్లాసులో కాఫీ తెచ్చి ఇచ్చింది. "అయ్యో, మీరు తెచ్చారెందుకు అత్తయ్యా, నేను కలుపుకుందును కదా…" కొద్దిగా నొచ్చుకుంటూ అందుకుంది. వేణు సీరియస్ గా టీవీ చూస్తున్నాడు. మధుబాలకు అర్థమైంది, తాను ఐశ్వర్య దగ్గరకు వెళ్లినట్టు తెలిసి ఉంటుంది… అందుకే ఈ కోపం అనుకుంటూ, మెల్లగా కాఫీ సిప్ చేస్తూ, తాను కూడా టీవీ చూడసాగింది.

"మధూ, ఒకసారి డాక్టర్ దగ్గరకు వెళ్లి రండి అమ్మా…" చెప్పింది సుగుణమ్మ.

‘‘అలాగే అత్తయ్యా, రేపు వెళతాము...’’

‘‘ రోజే వెళ్ళి ఉండేవాళ్ళం నువ్వు ఊరంతా పెత్తనాలు చేసి ఆలస్యంగా ఇంటికి రాకపోతే...’’ విసురుగా అన్నాడు వేణు.

‘‘వేణూ...’’ వారింపుగా అన్నాడు గోవర్ధన రావు.

‘‘సారీ, అనుకోకుండా వెళ్ళాల్సి వచ్చింది...’’ క్లుప్తంగా చెప్పింది మధుబాల.

ఈలోగా వేణు మొబైల్ కి కాల్ రావటంతో వరండాలోకి వెళ్లి మాట్లాడసాగాడు.

‘‘మధ్యాహ్నం మీ ఆఫీసుకు వచ్చాడు... పని అయిపోయి, నువ్వు వెళ్ళిపోయావని చెప్పారట... నీ మొబైల్ రింగ్ అయినా నీవు తీయలేదట... అప్పట్నుంచి ఈ చిందులు...’’ చెప్పింది నవ్వుతూ సుగుణమ్మ.

‘‘బాగ్ లో ఉండిపోయింది అత్తయ్యా... చాలా రోజులు అయిందని ఐశ్వర్య దగ్గరకు వెళ్లాను...’’

‘‘ఐశ్వర్య అంటే... ఓ ఆ అమ్మాయా?’’ సుగుణమ్మ ముఖం అప్రసన్నంగా అయింది.

‘‘అవును అత్తయ్యా, విధి వంచితురాలు... పాపం చాలా మంచి అమ్మాయి...’’ నచ్చజెబుతున్నట్టు అన్నది మధుబాల.

‘‘ఒక సారి మనింటికి తీసుకురామ్మా...’’ చెప్పాడు గోవర్ధన రావు.

‘‘ప్చ్... మీ అబ్బాయి ఇష్టపడరు మామయ్య గారూ... వద్దులెండి...’’ అన్నది మధుబాల.

వేణు లోపలికి వచ్చేయటం తో సంభాషణ ఆగిపోయింది.

‘‘పదమ్మా, కొంచెం కూర తరిగి ఇద్దూగాని...’’ అంటూ లేచింది సుగుణమ్మ...

ఆవిడ వెనకాలే వంటింట్లోకి వెళ్ళింది మధుబాల.

***

‘‘సారీ వేణూ... చెప్పకుండా వెళ్ళినందుకు...’’ ఎడముఖంతో ఉన్న భర్త గడ్డం పట్టి బ్రతిమిలాడింది మధుబాల.

‘‘నువ్వెప్పుడూ ఇంతే మధూ... ఈరోజు నువ్వు త్వరగా వస్తే డాక్టర్ దగ్గరకు వెళ్లి అటునుంచి సినిమాకి వెళ్ళాలని అనుకున్నాను... నీకు నా కన్నా నీ స్నేహితులే ఎక్కువలే...’’

‘‘లేదు వేణూ... అలా అనుకోకు. స్నేహితులను వాళ్ళ బలహీనతలతో సహా స్వీకరించాలి అట... జీవిత భాగస్వామిని వాళ్ళ స్నేహితులతో సహా స్వీకరించాలి మరి... ఒక మంచి మాట, నాతో కాసేపు కలిసి గడపటం ప్రస్తుతం ఐశ్వర్యకు ఎంతో సాంత్వన కలిగిస్తోంది... అయినా నేను వెళ్ళింది ఎప్పుడని? చాలా కాలం తర్వాత ఇప్పుడే కదా... నువ్వు ముఖం ముడుచుకోకు... ప్లీజ్...’’

‘‘ఊ...’’

‘‘అయితే రేపు వెళదామా డాక్టర్ గారి దగ్గరకు?’’

‘‘సరే వెళదాం లే... ఈ శనివారం నేను టూర్ కి వెళ్ళాల్సి రావచ్చు...’’

‘‘అరె అవునా? ఎక్కడికి??’’

‘‘తిరువనంతపురం.’’

‘‘ఆహా, కేరళా! నేనూ రానా?’’

‘‘వద్దులే మధూ... ముందు ముందు నీకు లీవు చాలా కావలసి వస్తుంది కదా... నేను కూడా ఆఫీసు పని మీద మూడు రోజులే వెళ్లి వస్తాను... తర్వాత ప్లాన్ చేసుకుందాం...’’

‘‘సరే... నీ ఇష్టం...మంచి పేర్లు రాయి నీ టూర్ లో... అందంగా, అర్థవంతంగా, మోడరన్ గా ఉండాలి... మన బిడ్డ కోసం...’’

‘‘అలాగే... రాస్తాను... ఇంతకూ, పాపని ఇస్తున్నావా, బాబునా?’’ కొంచెం ప్రసన్నమైంది వేణు మూడ్.

‘‘నీకు ఎవరు కావాలేం?’’

‘‘అమ్మకీ, నాన్నకీ అబ్బాయి కావాలని ఉంది... నాకు ఎవరైనా ఒక్కటే మధూ... అచ్చు నీలాగే ఉండాలి...’’ మధుబాల తల నిమురుతూ దగ్గరకు తీసుకున్నాడు.

ఆ  ఆప్యాయతకు ఆనంద బాష్పాలతో, అతని గుండెల్లో తలదాచుకుంది మధుబాల.

***

గిరి భార్య నిర్మల కూడా నెల తప్పింది. పూర్ణమ్మ కోడలిని అపురూపంగా చూసుకుంటూ కాలు నేల  మీద పెట్టనీయడం లేదు. ఒక సారి మధుబాలను ఇంటికి తీసుకురమ్మని చెప్పాడు కొడుకుతో అనంతరామయ్య.

సరేనన్నాడు గిరి.

***

‘‘అత్తయ్యా, మామయ్యా, బాగున్నారా?’’ వారికి ఎదురేగి పాదాభివందనం చేసింది అమల.

‘‘ఏదో ఇలా ఉన్నాము తల్లీ... అరుణ్ ఉన్నాడా?’’ సోఫాలో కూర్చుంటూ అన్నాడు, పరమేశ్వర రావు.

“లేదండి, బయట ఏదో పని ఉండి వెళ్ళారు. లంచ్ కి వచ్చేస్తారు. మీ ఆరోగ్యం బాగుందా అత్తయ్యా?”

“అవే కీళ్ళ నొప్పులు, అమలా... ఈ చిన్నాడిలో అవే బాధలూనూ...” మూలిగింది కాత్యాయని.

“ఏమైంది అత్తయ్యా, చిన్నా బాగున్నాడా?”

“ఏమో ఎవరికి తెలుసు?” నిరసనగా అన్నాడు పరమేశ్వర రావు.

“అదేమిటి మామయ్యా?”

“అవునమ్మా, వాడు ఇంటికి వచ్చి ఈ సారి పదిహేను రోజులు దాటింది. ఫోన్ చేసినా తీయడు... మీ అత్తయ్య ఆరోగ్యం వాడి మీద బెంగ వల్లనే ఇంకా దిగజారిపోతోంది. వాడికి పెళ్ళి చేసి కోడల్ని ఇంటికి తెచ్చుకుందామని అనుకుంటే, ఏవేవో పిచ్చి జీవన విధానాలు వీడివి సహజీవనాలు అంటూ... ఆ సహజీవనం చేసే అమ్మాయినే చేసుకోవచ్చును కదా... మాకు కులమత పట్టింపులు ఏవీ లేవు... వాళ్ళిద్దరూ సామరస్యంగా ఉంటే అదే చాలు... ప్చ్... వీడు వినడమ్మాయ్...” బాధగా నిట్టూర్చాడు పరమేశ్వర రావు.

అమల కనుల ముందు ఐశ్వర్య మెదిలింది... అయితే కార్తీక్ ఇంటికి కూడా వెళ్ళనంత బిజీగా ఎక్కడో ఎవరితోనో ఉన్నాడన్న మాట... ఏ రకంగా చూసినా ఐశ్వర్య మాత్రమే కార్తీక్ కి తగిన జోడీ... ఇద్దరూ పెళ్ళి చేసుకుని ఉంటే ఎంత బావుండేది? ఏమిటో అర్థం లేని ఆదర్శాలు... పెళ్ళి అనే వ్యవస్థ మీద నమ్మకం కోల్పోయి, విదేశీ సంస్కృతిలో ఒక భాగమైన లివిన్ బంధాన్ని నమ్మారు ఇద్దరూ... అసలు ఇందులో ‘ప్రేమ’ అనే పదానికి స్థానం ఎక్కడ ఉంది?

“అమలా, ఏమిటమ్మా ఆలోచనలో పడ్డావు? రూప ఎలా ఉంది? ఏదీ?” అడిగింది కాత్యాయని.

‘‘రండి అత్తయ్యా, రూమ్ లోనే పడుకుని ఉంది, టీవీ చూస్తూ…’’ ఇద్దరినీ రూప గదిలోకి తీసుకుపోయింది అమల.

‘‘నాన్నమ్మా…’’ రెండు చేతులూ చాచిన మనవరాల్ని చూడగానే కాత్యాయని కళ్ళు సజలాలు అయ్యాయి.

‘‘బంగారు తల్లీ, బాగున్నావా?’’ దగ్గరకు వచ్చి మంచం మీద కూర్చుని, వంగి మనవరాలిని గట్టిగా హత్తుకుంది కాత్యాయని.

‘‘తాతయ్యా, బాగున్నారా?’’ ప్రేమగా పలకరించింది.

‘‘బాగున్నానురా… బాగా చదువుకుంటున్నావా తల్లీ?’’ రూప తల నిమిరాడు.

‘‘ఎప్పుడూ ఇక్కడే ఉండవచ్చు కదా నాన్నమ్మా… బాబాయ్ కి ఎప్పుడూ టూర్లే కదా… మీరు ఒంటరిగా అక్కడ ఎందుకు? ఇక్కడికి వచ్చేయండి…’’

‘‘అలాగే అమ్మా… వచ్చేస్తాము… మేమూ ఒక్కళ్ళం ఉండలేకపోతున్నాము…’’

‘‘అబ్బ, ఎంత మంచి మాట చెప్పారు అత్తయ్యా… మీరు వచ్చేస్తే నాకెంతో హాయి అండీ… ముఖ్యంగా రూపకు తోచక పిచ్చెక్కుతోంది పాపం…’’ ఇద్దరికీ చెరో మజ్జిగ గ్లాసూ అందించింది అమల.

‘‘అప్పటికీ నేను ఇంట్లో ఉన్నంత సేపూ తనతోనే ఉంటాను… సాయంత్రం క్లబ్ పనుల మీద బయటకు వెళతాను… ట్యూటర్ వచ్చి వెళ్ళేంత వరకూ చదువుకుంటుంది… ఆ తర్వాత డిన్నర్ చేసి పడుకుంటుంది… నేను లేనప్పుడు మాత్రం చాలా బోర్ ఫీల్ అవుతుంది…’’
‘‘డాక్టర్ ఏమన్నారమ్మా?’’

‘‘ఇంకా ట్రీట్మెంట్ అవుతోంది మామయ్యా…’’ క్లుప్తంగా చెప్పింది అప్పటికి అమల.

‘‘ఈరోజు ఇక్కడే ఉండిపోండి తాతయ్యా…’’ అడిగింది రూప.

‘‘సాయంత్రం వరకూ ఉంటాము తల్లీ… మళ్ళీ వస్తాముగా…’’

‘‘అయితే త్వరగా వంట చేసేస్తాను. రండి అత్తయ్యా…’’ అమల కాత్యాయనిని వంటింట్లోకి తీసుకువెళ్ళింది.

‘‘రూప బెడ్ రిడెన్ కావటానికి మానసికంగా బాగా దెబ్బ తినటమే కారణం అని చెప్పారు అత్తయ్యా… యాక్సిడెంట్ లో కాలికి తగిలిన దెబ్బ కన్నా, తలకు తగిలిన దెబ్బ వలన మానసిక స్థైర్యం కోల్పోయింది. ఎప్పుడూ ఎవరో ఒకరు పక్కన ఉండాలి… అందుకే చదువులోనూ పెద్ద చురుకుగా ఉండటం లేదు… ఐశ్వర్య దగ్గర పాఠాలు బాగా నేర్చుకునేది… తర్వాత వచ్చిన ట్యూటర్స్ నామమాత్రమే… మందులు పని చేస్తున్నాయి… ఇదివరకటి కన్నా చురుగ్గా ఉండగలుగుతోంది… త్వరలోనే వీల్ చెయిర్ లో కూర్చోబెట్టి తిప్పవచ్చు అన్నారు…’’

‘‘అవునా అమ్మా… అయితే వచ్చే నెలలో మేము వచ్చి ఉంటాము కొన్ని రోజులు…’’

‘‘అంతకన్నానా అత్తయ్యా? వచ్చేయండి…’’

‘‘అమ్మాయ్, ఆ ఐశ్వర్య అంటే…’’

‘‘అవును అత్తయ్యా, కార్తీక్ ఆమెను ప్రేమించి కొన్నాళ్ళు…’’

‘‘ఓహ్.. అవును… అన్నీ బాగుంటే నాకు చిన్న కోడలు అయి ఉండేది అన్నమాట…’’

‘‘అసలు మీ కడుపున పుట్టిన ఈ కార్తీక్ కి ఇలాంటి ఆలోచనలు ఎలా వచ్చాయో ఏమో అత్తయ్యా… మీ పెద్దబ్బాయికీ నాకూ అదే ఆశ్చర్యంగా, బాధగా ఉంటుంది…’’

‘‘అవును అమ్మా... మంచినీళ్ళు తాగినట్టు తప్ప తాగుతున్నాడు... డ్రెస్సులు మార్చినట్టు అమ్మాయిల్ని మారుస్తున్నాడు... నా కడుపున చెడబుట్టాడు. ఆరోగ్యం అంతా నాశనం చేసుకుని... ఎప్పుడో... ఎక్కడో...” దుఃఖంతో ఆవిడ మాట పూర్తి చేయలేకపోయింది.
‘‘అయ్యో, అంత మాట అనకండి అత్తయ్యా... కన్నతల్లి మీరు...”

‘‘మరి అలాంటి తల్లిని నన్ను, ఆయన్నీ ఈ పండు వయసులో క్షోభ పెట్టవచ్చునా?” ఆవిడ పచ్చటి బుగ్గల మీదుగా కన్నీళ్లు జలజలా రాలాయి.

‘‘లేదులే అత్తయ్యా, చిన్నా మారతాడు... తన తప్పు తెలుసుకుని తిరిగి వస్తాడు...” అంది ఓదార్పుగా అమల.

‘‘అదే జరిగితే భగవంతుడు మన మీద కరుణ చూపినట్టే తల్లీ...” కళ్ళు తుడుచుకుని, “ఏమైనా పని చెప్పమ్మా చేస్తాను...” అంది కాత్యాయని.

‘‘వద్దు అత్తయ్యా, అలా విశ్రాంతిగా కూర్చోండి... మీ అబ్బాయి వచ్చేస్తారు కాసేపట్లో... కబుర్లు చెబుతూ ఉంటే వంట చేసేస్తాను...”




"ఏరా అబ్బాయ్, మధూ కి ఫోన్ చేసారా?" అచ్యుతరామయ్య దగ్గరగా వచ్చి అడిగింది అంజమ్మ.

"గిరి చేస్తానని అన్నాడమ్మా..."

"అది నెల తప్పిందని తెలిసినప్పటి నుంచి చూడాలని ప్రాణం కొట్టుకుంటోంది రా... ఒక సారి రమ్మని చెప్పండి..."

"గిరి వెళ్లి తీసుకువస్తాడు అత్తా... రా నువ్వు అన్నం తిందూ గాని..."

"ఏం కూర చేశావూ?"

"నీకు ఇష్టమని వంకాయ కూర చేసాను... చల్లారిపోతోంది...రా..."

‘‘సరే వస్తున్నా… అబ్బాయ్ నువ్వు కూడా ఓ సారి వియ్యాల వారితో మాట్లాడు… అది పద్ధతి గా ఉంటుంది…’’ కొడుకును హెచ్చరించి, భోజనానికి వెళ్ళింది అంజమ్మ.

నిర్మలకి కూడా వేవిళ్ళు కావటంతో, నీరసం వలన ఏ పనీ చేయలేకపోతోంది… పని భారమంతా పూర్ణమ్మ మీదనే పడింది. ఈ మధ్యనే ఆమె తమ పాలేరు భార్య పైడితల్లిని ఇంటిపనుల కోసం పెట్టుకుంది.

ఆ రాత్రి గిరి రాగానే దగ్గరకు పిలిచాడు అనంత రామయ్య. ఒక నాలుగైదు రోజుల్లో పట్నం వెళ్ళి కూతుర్ని ఇంటికి ఓ సారి తీసుకురమ్మని చెప్పాడు.

***

‘‘ఐశూ, నేను అమలను…’’ అటునుంచి వినిపించిన అమల స్వరం వినగానే చాలా సంతోషంగా అనిపించింది ఐశ్వర్యకు.

‘‘నమస్తే అక్కా, బాగున్నారా?’’ అంది అప్రయత్నంగా.

‘‘బాగున్నాం ఐశూ… ఒక సారి ఇంటికి రాకూడదూ? రూప చాలా సార్లు అడుగుతోంది…’’ అంది అమల.

‘‘నేనా? మీ ఇంటికా…’’ మొహమాటంగా అన్నది ఐశ్వర్య.

‘‘అవును… తప్పక రామ్మా ఓ సారి…’’ చెప్పింది అమల.

‘‘సరేనక్కా…’’ అంది అయిష్టంగానే…

‘‘సరే, ఉంటాను మరి… వచ్చే ముందు నాకు ఫోన్ చేయి… ఆదివారం అయితే బెటర్…మరి ఉంటాను…’’ ఫోన్ కాల్ డిస్కనెక్ట్ అవగానే మనసంతా అదోలా అయిపోయింది…

చదువుకునే రోజుల్లో రూపకి ట్యూషన్ చెప్పినందుకు వాళ్ళిచ్చే జీతం డబ్బు తనకి ఎంతో ఉపకరించేది... అమల చాలా ప్రేమగా ఉండేది తనతో... ఆరోజులు గుర్తు రాగానే, కార్తీక్ తో తన పరిచయం, స్నేహం, ప్రేమ అన్నీ అక్కడినుంచే అయ్యాయన్న విషయం గుర్తు వచ్చి మనసంతా విషాదంగా అయిపోయింది ఐశ్వర్యకు.

రూప అమాయకమైన ముఖం కళ్ళ ముందు కదిలింది. చక్కని పాపకు ఆ వైకల్యం... ఎంత ముద్దుగా ఉంటుందో రూప... చదువులో కూడా చురుకుగా ఉండేది... ఇప్పుడు ఎలా ఉన్నదో... వెళ్ళి చూస్తే ఎంతో సంతోషపడుతుంది... వెళితే బాగానే ఉంటుంది... కానీ... వాళ్ళంతా కార్తీక్ కుటుంబ సభ్యులు... వాళ్ళతో అనుబంధం ఎందుకు? రకరకాల ఆలోచనలు మనసును తేనెటీగల్లా కుడుతూ ఉంటే కళ్ళు మూసుకుని నిద్రకుపక్రమించింది ఐశ్వర్య.

***

‘‘నేను రానంటే తీసుకువచ్చావ్... నాకిక్కడ ఎవరూ తెలియదు కదరా...” కొలీగ్ రమణతో అన్నాడు వేణుగోపాల్ కొంచెం ఇబ్బందిగా...
రమణ తన ఫ్రెండ్ బర్త్ డే పార్టీ కి వేణును కూడా ఆఫీసు నుంచి లాక్కొచ్చాడు బలవంతంగా...

‘‘అరె, పరిచయం అయితే తెలుస్తారుగా అందరూ... వాళ్ళూ మన లాగే సాఫ్ట్ వేర్ పక్షులేరా...” అని బర్త్ డే జరుపుకుంటున్న తన స్నేహితుడి దగ్గరకు తీసుకువెళ్ళాడు రమణ.

‘‘మీట్ మై ఫ్రెండ్ వేణూ... వేణూ... వీడేరా అభిషేక్... నా బెస్ట్ ఫ్రెండ్...” పరస్పర పరిచయాలు చేసాడు. ఆనందంగా కరచాలనం చేసాడు అభిషేక్... వేణు అతనికి బర్త్ డే విషెస్ చెప్పి కాసేపాగి అంతా డ్రింక్స్ సేవిస్తూ ఉంటే, అక్కడ ఉండలేక కొంచెం దూరంగా వచ్చి నిలుచున్నాడు. చేతిలో బొకేతో, పక్కన అధునాతనంగా అలంకరించుకున్న ఓ సుందరాంగితో అప్పుడే లోపలికి వస్తున్న గడ్డం యువకుడిని చూస్తూంటే ఎక్కడో చూసినట్టు అనిపించింది వేణుకు.

కాసేపటి తర్వాత బఫే డిన్నర్ లో అతనే పలకరించాడు, “బాగున్నారా?” అంటూ. తల

ఊపాడే కానీ అతన్ని ఎక్కడ చూసాడో మాత్రం ఎందుకో గుర్తు రావటం లేదు వేణుకి... అసహనంగా తల విదిల్చాడు.

"మీరు నన్ను గుర్తు పట్టలేదనిపిస్తోంది..." అన్నాడు అతను మళ్ళీ దగ్గరగా వచ్చి. మొహమాటంగా నవ్వాడు వేణు.

"నా పేరు కార్తీక్... నేను మీ పెళ్ళికి వచ్చాను..." నవ్వుతూ చేయి చాచాడు.

"ఓహ్... అవును... ఇప్పుడు మీరు గడ్డం పెంచారు కదా... అందుకే వెంటనే గుర్తు పట్టలేక పోయాను..." అన్నాడు వేణు నవ్వుతూ...

"మధుబాల గారు బాగున్నారా?"

"యా, బావుంది...మీరు, ఐశ్వర్య..." ఇంకేమని అనాలో తెలియక ఆపేసాడు వేణు...

"అవును... ఆ కథ అయిపోయింది... మేము లివిన్ రిలేషన్ లో ఉండేవాళ్ళం... ఇప్పుడు మరో అమ్మాయితో ఉంటున్నాను... తనే డాలి..." అంటూ దూరంగా డ్రింక్ సిప్ చేస్తున్న అమ్మాయిని చూపించాడు కార్తీక్. అతని స్వరంలో ఎలాంటి భావమూ లేదు. చాలా కాజువల్ గా చెప్పాడు.

వేణుకు ఐశ్వర్య మీద బోలెడు జాలి కలిగింది... ఆమె పరిస్థితుల గురించి మధుబాల చెప్పినవన్నీ గుర్తు వచ్చి హృదయం ద్రవించింది...

"కార్తీక్, మీరు మళ్ళీ ఐశ్వర్యను కలవలేదా?"

"ఉహు... ఆమె కూడా నన్ను కలవలేదు... ఇన్ ఫాక్ట్ ఆ అవసరమేముంది?"

"అదేమిటి? బేసికల్లీ యు బోత్ ఆర్ గుడ్ ఫ్రెండ్స్..."

‘‘అఫ్ కోర్స్... బట్ అంత టైం ఎక్కడ దొరుకుతుందండీ? మన ప్రొఫెషన్ ఎంత బిజీయో మీకూ తెలుసు కదా...”

‘‘కానీ ఆ అమ్మాయి...”

‘‘కార్తీ... కమ్ హియర్...” అంటూ డాలి పిలవటంతో, “ఎక్స్ క్యూజ్ మీ... మళ్ళీ కలుస్తా...” అంటూ అటువైపు వెళ్ళిపోయాడు, కార్తీక్.

‘‘ఈ దేశంలో అత్యంత చవకయినది ఆడదాని శరీరం...” బాధగా అనుకున్నాడు వేణుగోపాల్. వికలమైన మనసుతో ఏమీ తినకుండానే తన స్నేహితుడు రమణకి చెప్పేసి బయటపడ్డాడు.

పార్టీలో కార్తీక్ ని కలిసినట్టు మధుబాలతో మాత్రం చెప్పలేదు వేణు. ఐశ్వర్య పరిస్థితి మీద తనకి ఎంత జాలి కలిగినా ఆమెతో స్నేహాన్ని మధుబాల కొనసాగించటం అతనికెంత మాత్రమూ ఇష్టం లేదు... ఎందుకంటే సమాజంలో ఐశ్వర్య లాంటివారిని అందరూ ఎలా ట్రీట్ చేస్తారో అతనికి తెలుసు...

***

ఆఫీసు నుంచి వచ్చిన వెంటనే, తమ బెడ్ రూమ్ లోని వాష్ రూము లోకి అడుగుపెట్టి, గోడకు ఉన్న లైటు స్విచ్ వేసేలోపున మధుబాలకు కాలు జర్రున జారిపోయింది. “అమ్మా!” అని గట్టిగా, భయంగా అరిచింది...

గబుక్కున కొళాయి గొట్టాన్ని పట్టుకుంటూ కిందికి జారిపోయింది...

వాష్ రూమ్ అంతా ఒకటే జిడ్డు, చిరపరిచితమైన వాసన... అదేమి వాసనో తెలియటంలేదు... కిందికి జారిపోగానే నడుము కలుక్కుమంది... జాగ్రత్తగా వెనక్కి ఆనుకుంటూ గోడకి జేరబడిపోయింది మధుబాల. మోకాలు వంకర తిరిగిపోయి గోడకు కొట్టుకుంది... అంతే ప్రాణం పోయినంత పని అయింది...

గట్టిగా "అత్తయ్యా..." అని గావుకేక వేసింది మధుబాల.

సుగుణమ్మ పరుగున వచ్చింది...

"అయ్యో, అమ్మాయ్, ఏమైందీ?" అంటూ...

"లోపలికి రాకండి... ఇక్కడంతా ఏదో ఒలికింది... బయటినుంచే స్విచ్ అందుకుని లైట్ వేయండి..." వగరుస్తూ అన్నది మధుబాల.
లైట్ వేసిన సుగుణమ్మ నిశ్చేష్టురాలై నిలబడిపోయింది. షాంపూ సీసా, కొబ్బరి నూనె సీసా కిందపడి ఉన్నాయి. రెండింటికీ మూతలు లేవు... రెండింట్లోంచీ వరదలా ప్రవహించి నేలంతా పరచుకున్నాయి షాంపూ, నూనె...

లోపల బట్టల మూటలా ఉండ చుట్టుకుపోయి పడి ఉంది మధుబాల... లేవలేక పోతోంది...



‘‘అయ్యయ్యో ఇదేమిటే అమ్మాయ్! ఇప్పుడెలాగ?? సమయానికి మీ మామయ్య గారు, వేణూ కూడా ఇంట్లో లేరు కదా…’’ అందావిడ ఆదుర్దా పడుతూ.

‘‘అవునత్తయ్యా…’’ అంది మధుబాల, కాలి నొప్పి వలన వచ్చే కన్నీటిని ఆపుకుంటూ… ఆమెకంతా అయోమయంగా ఉంది… ఏదీ ఆలోచించనీయటం లేదు నొప్పి.

ఆవిడే ఆపసోపాలు పడుతూ హాల్లో ఉన్న బాత్ రూము లోంచి బకెట్ లో సగానికి నీళ్ళు, ప్లాస్టిక్ చీపురు మోసుకు వచ్చింది. బయట నుంచే నీళ్ళు పోస్తూ, జాగ్రత్తగా కాస్త మేర కడిగింది.

‘‘అమ్మా మధూ… నువ్వు మెల్లగా పాక్కుంటూ తలుపు దాకా వచ్చేయి అమ్మా…’’

ఆవిడ మాట పూర్తి కాకుండానే, “అమ్మా… ఏమిటే హాలంతా చీకటి? లైట్ వేయలేదూ?” అంటూ వచ్చాడు వేణు.

‘‘వేణూ… ఇలా రా నాయనా త్వరగా…’’ ఒక్క కేక పెట్టింది సుగుణమ్మ…

తల్లి గొంతులో ధ్వనించిన ఆరాటాన్ని గమనించి ఒక్క ఉదుటున లోపలికి వచ్చిన వేణు ఆ పరిస్థితిని చూసి ఖంగారు పడిపోయాడు.

‘‘అయ్యో… ఏమిటిది? ఏమైంది?? ఏయ్ మధూ… ఆర్యూ ఆల్రైట్?’’ వాష్ రూమ్ లోకి దూసుకుపోబోతున్న కొడుకును ఆపింది సుగుణమ్మ లోపల జారుతోంది అని విషయాన్ని వివరిస్తూ.

వంగి తన చేతిని మధుకు అందిస్తూ, “ముందుకు జరుగు మధూ… అమ్మ ఇక్కడివరకూ కడిగింది కదా… నా చేయి పట్టుకో… నేను లేవదీస్తాను…’’ అన్నాడు వేణు.

కాలినొప్పిని బలవంతాన ఓర్చుకుంటూ, బాధతో మూల్గుతూ, మెలమెల్లగా జరుగుతూ గడప

దగ్గరకు వచ్చింది మధుబాల.

ఆమెను లేవదీసి నిలబెట్టాడు వేణు. పాదాన్ని నేలమీద మోపలేకపోయింది మధుబాల. ఆమె తడిసిన చీరను తానే విప్పేసి, నైటీని ఇచ్చాడు. అత్తగారు పట్టుకోగా ఎలాగో బట్టలు మార్చుకుంది మధు. ఆమెను రెండు చేతులలతో ఎత్తుకుని మంచం మీద పడుకోబెట్టి, మోకాలు పరీక్షించాడు. మోకాలి కింది భాగం కొద్దిగా వాచింది.

సుగుణమ్మ కు బెదురుగా ఉంది...

"అమ్మాయ్, కడుపులో నొప్పి ఏమీ లేదు కదా..." అంది ఆత్రంగా...

"ఉహు... కాలు నొప్పి అత్తయ్యా..." నీరసంగా జవాబు చెప్పింది మధు.

వేణు వెళ్లి త్వర త్వరగా వీధి చివర ఉండే తెలిసిన డాక్టర్ ను తీసుకువచ్చాడు.

అతను మధును పరీక్షించి, కాలు బెణుకు మాత్రమే అనీ, నొప్పి తగ్గటానికి, నిద్ర పట్టటానికి ఇంజెక్షన్ ఇచ్చాడు. వేడిగా ఇడ్లీ లాంటిది పెట్టి, పాలు తాగించమని చెప్పాడు.

అదృష్టం కొద్దీ కడుపులో బేబీ కి ఏమీ కాలేదని, మధు అనుకోకుండా పట్టు కోసం కొళాయి పట్టుకోవటం, క్రిందికి కూర్చుండిపోవటం వలన అబార్షన్ ప్రమాదం తప్పిందని డాక్టర్ చెప్పటంతో తేలికగా నిట్టూర్చారు తల్లీ కొడుకులు ఇద్దరూ.

టిఫిన్ తినేసి, పాలు తాగేసి ఆదమరచి నిద్రపోయింది మధుబాల. వేణు, సుగుణమ్మ ఇద్దరూ భోజనం చేయలేదు.

ఆ తర్వాత తానే బాగా నీళ్ళు పోసి రుద్దుతూ వాష్ రూమ్ నేలంతా కడిగేసాడు వేణు. ఖాళీ అయిన సీసాలు రెండూ చెత్తబుట్టలో పడ్డాయి.

***

తెల్లవారిన తరువాత నిద్ర లేచిన మధుబాలకు కాలునొప్పి కాస్త నెమ్మదించి, మెదడు పనిచేయటం ఆరంభమైంది. అసలు ఎలా పడిపోయింది తను? ఐశూకి జరిగినట్టు తనకీ గర్భస్రావం జరిగి ఉంటే? అమ్మో... ఆ ఆలోచనే తట్టుకోలేని విధంగా ఉంది తనకు...

అసలు ఆ షాంపూ, కొబ్బరినూనె ఎలా వొలికాయి? మూతలు కూడా లేవు వాటికి... అంటే ఎవరైనా కావాలని చేసారా? కా-వా-ల-ని...?

మధుబాల మెదడులో స్పార్క్... వినత... వినత చేసి ఉంటుందా? వినత అసూయాపరురాలే కానీ స్వంత అన్న భార్య మీద ఇంత దారుణానికి ఒడిగడుతుందా? భయంతో వణికిపోయింది మధుబాల. అత్తగారి మీద కూడా పిచ్చి కోపం వచ్చేసింది.

‘‘అత్తయ్యా...” గట్టిగా పిలిచింది మధు.

‘‘ఏమ్మా, లేచావా? బ్రష్ చేసుకుంటావా? బకెట్ తీసుకువస్తాను... ఇక్కడే ఉండు... అందులో కడుక్కుందువులే... బాత్ రూమ్ కి వెళ్ళాలంటే చెప్పు, నేను తీసుకు వెళతాను...” అంది సుగుణమ్మ  ఆప్యాయంగా.

‘‘నడవగలుగుతున్నాను లెండి... వెళ్లి వచ్చాను వాష్ రూమ్ కి... మిమ్మల్ని ఒకటి అడుగుతాను నిజం చెప్పండి... నిన్న వినత ఇక్కడికి వచ్చిందా?”

‘‘అంటే? వినత అవి అక్కడ పోసి ఉంటుందనా నీ అనుమానం?” కోపంగా అడిగింది ఆవిడ.

‘‘వచ్చిందా లేదా, అది చెప్పండి ముందు...” కోడలి స్వరంలో తీవ్రతకి జంకింది సుగుణమ్మ.
“వచ్చింది... ఫ్రెండ్స్ తో షాపింగ్ కి వెళుతూ వచ్చి పది నిమిషాలు ఉండి వెళ్ళిపోయింది...”

‘‘రెండు నిమిషాలు చాలు లెండి, తాను చేయదలచుకున్న పని చేసి వెళ్ళిపోవటానికి!” విసురుగా అంది మధుబాల.

‘‘మధూ, నువ్వు అనవసరంగా దాన్ని అనుమానిస్తున్నావు. వినత అలాంటిది కాదు... అయినా అది నా కళ్ళ ముందే ఉంది... మీ రూములోకి రాలేదు...” గట్టిగా చెప్పింది సుగుణమ్మ. నిజానికి వినత హాల్లో ఫ్రెండ్స్ తోనే కూర్చుందో, మధు వాళ్ళ రూమ్ లోకి వెళ్ళిందో సుగుణమ్మ చూడలేదు... కానీ కన్న కూతురి మీద నింద పడుతుంటే భరించలేక అలా చెప్పేసింది.

‘‘మీరే సమర్థించాలి మీ అమ్మాయిని...” ఈసడింపుగా అంది మధుబాల.

‘‘మధూ... ఏమిటా మాటలు? బుద్ధి ఉందా నీకు??” హాల్లోంచి వచ్చిన వేణూ గట్టిగా అన్నాడు.

‘‘నేనేం తప్పుగా మాట్లాడాను? నా కడుపులో బిడ్డనూ, వీలైతే నన్నూ హతమార్చాలని చూసింది ఆ రాక్షసి... ఆమెకి వత్తాసు మీ తల్లిగారు... నేనే కదా మీకు పరాయిదాన్ని...” ఆక్రోశంగా అంది మధుబాల.

‘‘కిటికీలోంచి కోతులు అప్పుడప్పుడూ వచ్చి నానా కంగాళీ చేసి పోతూ ఉంటాయి కదా మధూ, నీకూ తెలిసిందే... అలా జరిగి ఉండవచ్చు కదా... అనవసరంగా వినతను అంటావేం?”

‘‘కోతులు వస్తాయి, కాదని అనను... అవి జాగ్రత్తగా నూనె సీసాని, షాంపూ సీసాని మూతలు తీసి, ద్వారం తెరవగానే జారి పడిపోయేలా ఒంపవు వేణూ... వాటికంత ప్లానింగ్ ఉండదు... ఇది ఖచ్చితంగా వినత పనే...”

‘‘ఎందుకు? నీకు అబార్షన్ అయితే దానికేం వస్తుందని? అనవసరమైన నిందలు మానేయ్... పిచ్చి పిచ్చిగా ఆలోచించకు...

”‘‘ఇదిగో అత్తయ్యా, వేణూ... ఇద్దరూ వినండి... ఈరోజు మా అన్నయ్య నన్ను మా ఇంటికి తీసుకు వెళ్ళటానికి వస్తున్నాడు. నేను వెళ్ళిపోతాను, పంపించేయండి... ఇంకేమీ మాట్లాడ వద్దు దయచేసి...” ఉద్వృతంగా దుఃఖం పొంగుకు వచ్చింది మధుబాలకు. రెండు చేతులలో ముఖం

కప్పుకుని భోరున ఏడవసాగింది.

‘‘ఏయ్ మధూ? ఏమిటిది పిచ్చి! ఇటీజ్ జస్ట్ యాన్ యాక్సిడెంట్...అంతే...ఇప్పుడేమీ కాలేదు కదరా... చిన్న దెబ్బ తగిలింది అంతే... తగ్గిపోతుంది... లక్కీగా మన బేబీకి ఏమీ కాలేదు... ఇప్పుడెందుకు మీ ఇంటికి? మీ అన్నయ్యను రావద్దని ఫోన్ చేసేయి...

’’ అనునయంగా ఆమె భుజం మృదువుగా నొక్కుతూ ఆమెను తన వైపుకు తిప్పుకోవాలని ప్రయత్నించాడు వేణు.ట్టిగా విదిలించుకుంది మధుబాల... “ప్లీజ్, నన్ను ఒంటరిగా వదిలేయండి...’’.

తల్లి వైపు చూసి భుజాలు ఎగరేసాడు వేణు...

‘‘సరే... అయితే ఏమీ ఆలోచించకుండా కాసేపు పడుకో... టిఫిన్ తీసుకువస్తాను... తిందూగాని...” తల్లితో బయటకు వెళుతూ తలుపులు చేరవేశాడు వేణు.

***

‘‘ఏమిటమ్మా ఇది? నాన్నగారు కూడా ఊర్లో లేరు సమయానికి... ఫోన్ చేస్తే నాట్ రీచబుల్ అని వస్తోంది... వాళ్ళ అన్నయ్య వచ్చాడుగా, సాయంత్రం టాక్సీ చేసుకుని అతనితో వెళ్ళిపోతానని అంటోంది అమ్మా... ఎలాగ?” దిగులుగా అన్నాడు వేణు...

‘‘అవునురా... ఎంత చెప్పినా వినటం లేదు... వాళ్ళ మామ్మగారు చూడాలని ఉందని తీసుకురమ్మన్నారని అంటున్నాడు గిరి.  ఈ పిల్ల ఇప్పుడు వెళితే ఎలా? అసలే కాలు నొప్పితో ఉంది...” గొంతు పెగల్చుకుంటూ అంది సుగుణమ్మ.

‘‘అది కాదమ్మా... వెళ్లి నాలుగు రోజుల్లో వచ్చేస్తే బాధే లేదు... కానీ... కానీ... తను వినతను అనుమానిస్తోంది అమ్మా...” బాధగా కళ్ళు మూసుకున్నాడు వేణు. “ఇక్కడుంటే తన ప్రాణాలకే ప్రమాదమని, వెళ్ళిపోతానని అంటోంది... ఏం చేయనమ్మా?” తల్లి గుండెల్లో తల

దాచుకున్నాడు వేణు...


కొడుకు తల నిమురుతూ, "అలా జరగదులే వేణూ... మధుకి నేను నచ్చజెబుతాను..." అందామె.

***

కానీ, ఎవరు ఎన్ని చెప్పినా వినకుండా, అన్నతో పాటుగా ప్రయాణమై పుట్టింటికి వెళ్ళిపోయింది మధుబాల. భర్తను సరే, తనను కూడా లెక్క చేయకుండా, ఒక శత్రువును చూసినట్టు చూసి, మాట వినిపించుకోనందుకు సుగుణమ్మకూ బాగా కోపం వచ్చింది.

గిరికి విషయం తెలియదు కనుక, కొన్నాళ్ళు విశ్రాంతిగా ఉంటుందని, వారం తర్వాత తీసుకు వచ్చేస్తానని చెప్పి, మరీ మరీ అడగటంతో ఏమీ మాట్లాడలేక ఊరుకున్నాడు వేణు.

ఊరినుంచి వచ్చిన గోవర్ధన రావు జరిగినదంతా తెలుసుకొని మ్రాన్పడిపోయాడు... జరిగిన విషయం దేనికి దారి తీస్తుందో అంతుపట్టటం లేదు ఆ ఇంట్లో ఎవ్వరికీ...




"సుగుణా, నువ్వు వినతతో మాట్లాడావా?" ప్రశ్నించాడు గోవర్ధనరావు. అవునన్నట్టు తలూపింది సుగుణమ్మ.

"అయితే కోడలు అనుమానించింది నిజమే కదూ?" సూటిగా ప్రశ్నించాడు గోవర్ధనరావు. జవాబుగా నిస్సహాయంగా, మౌనంగా తల దించుకుంది సుగుణమ్మ… ఆమె కనుల వెంట కన్నీరు…

"అర్థమైంది సుగుణా… అది చిన్నదీ, మంకుదీ అనుకున్నానే కానీ ఇంత దుర్మార్గంగా ప్రవర్తిస్తుందని నేను ఎన్నడూ ఊహించలేదు… అరె… అక్కడ సయోధ్యగా కాపురం చేసుకోవటం ఎప్పుడూ లేదు… అంత ఉత్తముడికి దీన్ని కట్టబెట్టి అన్యాయం చేసామన్న బాధ ఎప్పుడూ తొలుస్తూనే ఉన్నది నన్ను… ఇప్పుడీ సంఘటన! తెలిసి కానీ, తెలియక కానీ చీమకైనా అపకారం చేయకూడదు…

చూడు, పెద్ద దాన్నీ, వేణు గాడినీ కూడా ఈ చేతులతోనే పెంచాము కదా… వీళ్ళిద్దరిలో లేని విపరీత బుద్ధి దానిలో ఎలా వచ్చింది? ఎప్పటికప్పుడు దాని తప్పులన్నీ కప్పేస్తూ, దాన్ని

వెనకేసుకు వస్తూ దానిలో బీజమెత్తిన ఆ స్వార్థమనే విషవృక్షాన్ని పెంచి పెద్ద చేసిన దానివి నువ్వే కదా...

ఇక్కడ ఉన్నన్నాళ్ళూ దాని షోకులకి, షికార్లకి నన్ను అడక్కుండానే డబ్బు ఇచ్చేదానివి. దాని ఇష్టప్రకారం నువ్వుండే దానివి... నేను ఉన్నప్పుడు ఒకలాగ, లేనప్పుడు ఒకలాగా ఉండేది దాని ప్రవర్తన... అయినా కాలమే దానిలో మార్పు తీసుకువస్తుందని, ఎదిగిన పిల్లలని స్నేహితులుగా భావించి, మెత్తగా చెప్పే వాడిని... అది విన్నట్టే విని నా మాటలన్నీ గాల్లో కలిపేసేది... పెళ్ళయ్యాకైనా మారుతుందని అనుకున్నాను... ఉహు...

దురదృష్టవశాత్తూ మంచం పట్టిన అత్తగారు, ఆవిడని కంటికి రెప్పలా చూసుకునే మనసున్న భర్త... దీనికి మాత్రం ఆవిడని, మొగుడిని లెక్కచేయని తలబిరుసుతనం. ఆ పెద్దావిడని చూసుకోవటానికి ఒక మనిషి, దీనికి ఇద్దరు పనిమనుషులు, ఒక వంట మనిషి... అయినా దానికి ఇల్లు సమర్థించుకోవటం రాదు... అత్తగారి దగ్గర అయిదు నిమిషాలు కూర్చుని గడిపే సంయమనం, మంచితనం లేవు... భర్తతో సయోధ్య లేనే లేదు... ఎంతసేపూ క్లబ్బులూ, స్నేహితులూ, షికార్లు, షాపింగులూ... అయినా దానికి తృప్తి లేదు... పిచ్చి మానవుడు పవన్ కాబట్టి దాంతో కాపురం చేస్తున్నాడు... ఏడు సముద్రాల అవతల ఎక్కడో అమెరికాలో ఉన్న ఆడబిడ్డను అప్పుడప్పుడూ పలకరించాలనే ఇంగితం అసలే లేదు... ఎప్పుడూ అందరినీ దూషిస్తూ, ద్వేషిస్తూనే ఉంటుంది... విపరీతమైన అహంకారం!

ఇప్పుడు ఈ సంఘటన... వినత తల్లి కాలేకపోవటానికి కారణం దాని స్వయంకృతమే తప్ప అది ప్రచారం చేస్తున్నట్టు పవన్ లో లోపం మాత్రం కాదు... మధుబాల తల్లి కాబోతుంటే దీని ద్వేషం పడగ విప్పి, విచక్షణ పూర్తిగా నశించి... ఓ మై గాడ్! చెప్పు సుగుణా, దీనికి ఏం జవాబు చెబుతావో చెప్పు... ఇప్పుడు కూడా క్షమాపణే లేని దాని తప్పుల్ని నీ కొంగులో కప్పేస్తావా?

అందరినీ మంచి బుద్ధులూ, సుద్దులూ చెబుతూనే పెంచాను కదా... దేవుడా, నా పెంపకంలో తేడా ఉన్నదా?" సోఫాలో కూలబడిపోయాడు గోవర్ధనరావు. ఆయన వళ్ళంతా చెమటలు

పట్టేసాయి...

వేణు గబగబా ఫాన్ స్పీడు పెంచాడు... సుగుణమ్మ వెంటనే చల్లని నీళ్ళు తెచ్చిచ్చింది...

“మీరు ఆలోచనలతో బుర్ర పాడు చేసుకోకండి ప్లీజ్... తప్పు నాదేనండి...దాని మాటకు వత్తాసు పలుకుతూ, అది ఏదంటే దానికి వంత పాడుతూ దాని మొండి తనాన్ని నాకు తెలియకుండానే పెంచి పోషించిన పాపిష్టి దాన్ని... నన్ను క్షమించండి దయచేసి...” తన చేత్తో ఆయన పాదాలు తాకింది సుగుణమ్మ ఏడుస్తూ...

“ఇటీజ్ టూ లేట్ సుగుణా! సరే, జరిగిందేదో జరిగింది... జరగబోయేది ఆలోచించండి... నేను రేపు ఉదయమే వినత ఇంటికి వెళ్ళి వస్తాను... ఒక సారి మాట్లాడి రావాలి...”

“నాన్నా... మీరు అక్కడ ఆవేశపడితే కష్టం... మీకు బిపీ పెరగకుండా చూడమని డాక్టర్ మరీ మరీ చెప్పారు... మధు వచ్చేస్తుంది లెండి... మీరు ప్రశాంతంగా ఉండండి...” నచ్చజెప్పాడు వేణుగోపాల్.

“సరేలే వేణూ... ఇద్దరమూ వెళదాం వీలుంటే... అక్కయ్య గారిని చూసి కూడా చాలా రోజులు అయింది కదా... నేను కాసేపు పడుకుంటాను...” అలసటగా తమ బెడ్ రూమ్ వేపు నడిచాడు గోవర్ధనరావు.

***

“నాన్నగారూ... నేను మనింటికి వచ్చిన మాట నిజమే కానీ, ఆ పని నేను చేయలేదు...” గట్టిగా చెప్పింది వినత.

“వినతా... నా సహనాన్ని పరీక్షించకు... అమ్మ దగ్గర ఒప్పుకున్నావుగా? నేను అడుగుతుంటే అలా బ్లఫ్ చేయటానికి బుద్ధి లేదూ?”

‘‘నాన్నా, మధుబాల మీద నాకేం కోపం ఉంటుంది చెప్పండి? నేను చేయలేదు...’’ మరింత గట్టిగా అన్నది వినత.

ఆమెను చూస్తూంటే, చిన్నప్పుడు ‘నేను ఒట్టుగా  చాక్లెట్ తినలేదు నాన్నా...’ అని చాక్లెట్ పాకంతో నిండిన ముఖంతో అమాయకంగా చెప్పే పసి వినత గుర్తు వచ్చింది.

నిస్సహాయంగా నిట్టూర్చాడు గోవర్ధనరావు... పెళ్ళయిన కూతురు తల్లిదండ్రులకి ఎప్పటికీ పరాయిదే... కమ్మరి ఇనుమును వంచినట్టు వంచే అధికారం తనకిప్పుడు లేదు... సాభిప్రాయంగా వేణు వైపు చూసాడు.

‘‘వినతా, నువ్వు లోపలికి  వెళ్ళు...’’ చెల్లెల్ని లోపలికి  వెళ్ళమని సైగ చేసి, ‘‘ఏమిటిది నాన్నా, ఇక్కడ దీని అత్తవారింట్లో పంచాయితీ?’’ అన్నాడు వేణు తగ్గుస్వరంతో...

‘‘నువ్వు కూడా దాన్ని చాలా చెడగొట్టావురా... ఎంతగా అంటే, నీ బిడ్డని నాశనం చేయాలని అది అనుకున్నా ఏమీ అనలేనంత, అననీయనంతా...’’ ఆవేదనగా అన్నాడు గోవర్ధనరావు.

‘‘మామయ్యా, నేను వినతకు నచ్చజెబుతాను. మీ దగ్గర భయపడి అలా మొండిగా మాట్లాడులోంది కానీ, తనలో ఈ సంఘటన తప్పక మార్పు తీసుకువస్తుంది...’’ చెప్పాడు పవన్. తలపంకించాడు ఇక ఏమీ చేయలేక గోవర్ధనరావు.

‘‘అమ్మ దగ్గరకు వెళదాం పవన్...’’ అన్నాడు గోవర్ధనరావు.

‘‘సరే మామయ్యా, రండి...’’ తల్లి గదిలోకి తీసుకువెళ్ళాడు పవన్.

అప్పుడే జావ తాగి, మందులు వేసుకుని విశ్రాంతిగా మంచం మీదనే కూర్చుని, వాల్మీకి  రామాయణం చదువులోంది సుందరమ్మ. పక్కనే విమలమ్మ కుర్చీలో కూర్చుని, ఆవిడ పైకి చదువుతూ ఉంటే తానూ వింటూ ఆనందిస్తోంది. ఇప్పుడిప్పుడే ప్రతీ రోజూ ఫిజియోతెరపిస్ట్ వచ్చి చేయించే ఎక్సర్ సైజుల వల్లా, పవన్, విమలమ్మా తీసుకునే కేర్ వల్లా

సుందరమ్మ మంచం మీద లేచి కూర్చోగలుగుతోంది.

‘‘నమస్కారం అక్కయ్యా… ఎలా ఉన్నారు?’’ రెండు చేతులూ జోడించి నమస్కారం పెట్టాడు గోవర్ధనరావు.

‘‘రా తమ్ముడూ… అంతా కులాసానా? నేను బాగున్నాను…’’ చిరునవ్వుతో చెప్పి, ‘‘పవన్, నాన్నా, మామయ్య గారికీ, బావగారికీ కుర్చీలు వేయించు…’’ అని కొడుకుతో చెప్పింది.

‘‘సారీ అక్కయ్యా… ఈ మధ్యన బాగా బిజీగా ఉండి రాలేకపోయాను…’’ క్షమాపణగా చెప్పి, ‘‘మందులు అవీ సక్రమంగా వాడుతున్నారు కదా…’’ అన్నాడు గోవర్ధనరావు.

‘‘వాడుతున్నాను తమ్ముడూ… సుగుణ రాలేదా? నీ ఆరోగ్యం ఎలా ఉంది?’’

‘‘ఫర్వాలేదు అక్కయ్యా… అందరం బాగానే ఉన్నాము. సుగుణ రాలేదు… చాలా రోజులైందని మిమ్మల్ని చూడాలని వచ్చాను…’’ అబద్ధం చెప్పినందుకు కించిత్ గిల్టీగా ఫీలయ్యాడు గోవర్ధనరావు.

‘‘కాఫీ తాగారా? పవన్…’’

‘‘చెప్పానమ్మా, సావిత్రి తయారు చేస్తోంది…’’ వినమ్రంగా చెప్పాడు పవన్.

‘‘అమ్మాయి ఎప్పుడు వస్తుంది అక్కయ్యా? చూసి చాలా కాలం అయింది!’’

‘‘రెండు మూడు నెలల్లో వస్తానని ఫోన్ చేసింది తమ్ముడూ… పిచ్చి పిల్ల! దాని మనసంతా ఎప్పుడూ ఇక్కడే ఉంటుంది…’’ కూతుర్ని తలచుకుని తృప్తిగా నిట్టూర్చింది సుందరమ్మ.

‘‘అవును అక్కయ్యా, మీ పిల్లలిద్దరూ మణి మాణిక్యాలు!’’

ఈలోగా సావిత్రి ట్రే లో కాఫీలు పట్టుకుని వచ్చింది.

‘‘అమ్మా, మీ వంట పూర్తి  అయింది, భోజనం వడ్డించమంటారా?”

‘‘లేదు సావిత్రీ… ఇందాకే టిఫిన్ అయింది కదా… కాసేపాగి తింటాను… చూడు తమ్ముడూ, అల్లుడు గారూ  వచ్చారు కదా, భోజనం లోకి మంచి కూరలు, స్వీటు చేయి…” చెప్పింది సుందరమ్మ.

‘‘అబ్బే, లేదు అక్కయ్యా… అక్కడ సుగుణ ఒక్కతే ఉంది కదా, మేము వెళతాము… మళ్ళీ అందరం కలిసి వచ్చినపుడు భోజనం చేస్తాము…” కాఫీ తాగి  లేచాడు గోవర్ధనరావు.

‘‘నువ్వు వెళ్ళు వేణూ… పవన్, నేను అమ్మతో కాస్త మాట్లాడాలి… పర్సనల్…” అన్నాడు గోవర్ధనరావు. వేణు తండ్రివైపు కించిత్ కోపంగా చూస, పవన్ తో  బయటకు వెళ్ళాడు.

సావిత్రి, విమలమ్మా కూడా గదిలోంచి వెళ్ళిపోయాక, “అక్కయ్యా… వినత మీతో ప్రవర్తించే తీరు నాకు తెలుసు… ఎన్నిసార్లు ఎంతగా చెప్పినా అది మారలేదు… ఇక మారుతుంది అన్న ఆశా లేదు… అలాంటి దాన్ని కన్న ఈ నికృష్టుడిని క్షమించండి…” ఆర్తిగా సుందరమ్మ చేతులు పట్టుకున్నాడు గోవర్ధన రావు.

‘‘తమ్ముడూ… ఛ, ఇదేమిటి? నాకు వినత రెండో కూతురు… దాని ప్రవర్తన నన్ను ఎన్నడూ బాధించదు. ఫర్వాలేదు… అయినా నన్ను చూసుకోవటానికి ఇంత మంది ఉన్నారు… అది చిన్నపిల్ల… జీవితాన్ని ఎంజాయ్ చేయనీ… నువ్వు క్షమాపణ అడిగేంత పెద్ద విషయమేమీ కాదు…” మనస్ఫూర్తిగా అంది సుందరమ్మ.

‘‘మీరంతా చాలా పెద్ద మనసున్న వాళ్ళు అక్కయ్యా… నేనే అల్పుడిలా కనబడుతున్నాను మీ మంచితనం ముందు…” గిల్టీ గా అన్నాడు గోవర్ధనరావు.

‘‘సరే, నీ ఆరోగ్యం జాగ్రత్త తమ్ముడూ… బీపీ తగ్గించుకునే ప్రయత్నం చేయి… అనవసరంగా ఆదుర్దా పడకు… అన్నీ సర్దుకుంటాయి… వినత కూడా తన బాధ్యత తెలుసుకుని

మసలుకుంటుంది... నువ్వేమీ హైరానా పడుతూ ఆరోగ్యం చెడగొట్టుకోవద్దు... సరేనా?"

"సరే అక్కయ్యా.. నేను వస్తాను మరి..." రెండు చేతులూ జోడించి మరోసారి నమస్కరించాడు గోవర్ధనరావు.

వారం రోజుల తరువాత –

''మధూ, బావ ఫోన్ చేసాడు... నువ్వు ప్రయాణానికి సిద్ధంగా ఉండు...వచ్చి తీసుకు వెళతాడు...'' చెప్పాడు గిరి.




''సారీ అన్నయ్యా, నాకు అక్కడికి వెళ్ళే ఉద్దేశ్యం లేదు...'' ఖరాఖండీగా చెప్పింది మధుబాల.

''మధూ, నీకేమైనా పిచ్చెక్కిందా? కాపురాన్ని వదులుకుని ఇక్కడ ఉండటం ఏమిటసలు? నాన్న వింటే ఎంత బాధ పడతారు?'' తగ్గు స్వరంతో మందలింపుగా అన్నాడు గిరి.

''నాన్న కోసమని, మీ పరువు ప్రతిష్టల కోసమనీ నా కడుపులోని పసిపాపనీ, నా ప్రాణాన్నీ పణంగా పెట్టలేను అన్నయ్యా... ఇంకా పుట్టకుండానే నాలోని బిడ్డ నాకు బంధాలు వేస్తోంది...'' చెప్పింది మధుబాల.

‘‘చెల్లాయ్, నువ్విక్కడ ఉండటం నాకు ఏమాత్రం భారం కాదే... కానీ, నువ్వే ఆలోచించు... అక్కడ నీ భర్త, అత్తగారూ, మామగారూ ఎంత బాధపడతారు? సంఘంలో ఉన్నత స్థాయిలో ఉన్న వారి పరువు ఏమవ్వాలి?’’

‘‘ఆ జ్ఞానం వాళ్లకి కూతురు అలా తయారవుతున్నప్పుడు ఉండాలి... కోడలిని మనిషిగా చూడనప్పుడు, తప్పు చేసి దొరికిపోయినా ఇంకా తన కూతురు అలాంటిది కాదని వెనకేసుకు వచ్చే అత్తగారి దగ్గర నా భవిష్యత్తు ఎలా ఉంటుందో నాకు తెలుసు... తరువాతి సంగతి చెప్పలేను... కానీ డెలివరీ అయ్యే వరకూ ఇక్కడే ఉంటాను నేను... ‘‘ స్థిరంగా చెప్పింది.

‘‘అసలు ఏమిటి నీ భయం?’’

‘‘అన్నయ్యా, నీకు అర్థం కావటం లేదు... మా అత్తగారికి, వేణుకీ వినత అంతే ప్రాణం... ఇంట్లో ఎప్పుడూ ఆమె ఆడింది ఆటా, పాడింది పాటా... ఆమె ఇంటికి రాకుండా ఉండదు... వీళ్ళు రావద్దని కూడా చెప్పరు. ఆమె వస్తే ఏ అఘాయిత్యానికి ఒడిగడుతుందో నాకు తెలియదు. అనుక్షణం ప్రాణభయంతో వణికిపోతూ నేను గడపలేను... నీకూ తెలుసు కదా, గర్భిణీ స్త్రీకి భయాందోళనలు పనికి రావని... నేను ఒళ్ళు దాచుకోకుండా అమ్మకి సహాయం చేస్తాను. నిర్మల వదినకు ఏ పనీ చెప్పను... ప్లీజ్, నన్ను ఇక్కడే ఉండనీయండి... కాన్పు అయ్యాక వెళతాను...’’ వేడికోలుగా చెప్పింది మధుబాల.

‘‘సరేరా... నువ్వు మరీ అంత బ్రతిమాలనక్కర లేదు... ఈ ఇంట్లో నాకెంత హక్కుందో నీకూ అంతే... అయితే ఒక్క సారి బావ ఫోన్ చేస్తే ఆన్సర్ చేసి మాట్లాడు... అంత కన్నా నేనేమీ చెప్పలేను... ఏదో ఒకటి నీ వైపు నుంచి జవాబు కూడా వాళ్లకి వెళ్ళాలి కదా... అలాగే, అమ్మా నాన్నలకి నేను చెబుతాను... డెలివరీ అయ్యాక చూద్దాము...’’ అన్నాడు గిరి ఆమె తల నిమిరి.

ఆ మధ్యాహ్నం వేణు ఫోన్ చేసినప్పుడు అయిష్టంగానే ఆన్సర్ చేసింది మధుబాల.

‘‘మధూ, గిరి చెప్పాడు, నీవు రానని అంటున్నావని... నిజంగానే మా వలన తప్పు జరిగింది... వినతను అతిగారాబంగా పెంచి నేనూ, అమ్మా చెడగొట్టాము... అందుకు రియల్లీ వెరీ సారీ... నేను వచ్చి నిన్ను తీసుకువస్తాను... నువ్వు వచ్చేయి... నాన్నగారు కూడా చాలా బాధపడుతున్నారు...’’

‘‘వేణూ… కాదన్నంటున్నందుకు నన్ను క్షమించు… బేబీ పుట్టాక నేనే వస్తాను… అంతవరకూ ఓపిక పట్టు…’’

‘‘ఇన్ని వసతులున్న ఈ సిటీలో కాకుండా ఆ పల్లెటూరిలో పురుడు పోసుకుంటావా? అంత కాలం ఉద్యోగం వదిలేస్తావా? ఇటీజ్ టూ మచ్ మధూ…’’

‘‘ఉద్యోగానికి లీవు పెట్టాను వేణూ… అదెక్కడికీ పోదు… కాకపోతే పల్లె అని అంటున్నావు కానీ ఇక్కడా డెలివరీలు అవుతున్నాయి, పిల్లలూ పుడుతున్నారు… అక్కడ క్షణం క్షణం భయంతో ఛస్తూ నే బ్రతకలేను…’’

‘‘నన్ను వదిలి నువ్వెక్కడో ఉండటం నీకు భావ్యమా?’’

‘‘ఎందుక్కాదు, అక్కడ నాకు రక్షణ లేనప్పుడు? పెళ్ళయిన ఆడపిల్లకు అయితే అత్తగారిల్లు, లేదా అమ్మగారిల్లు ఇవే కదా ఉండేవి? నిజం చెప్పు, నువ్వు కానీ, మీ అమ్మగారు కానీ నా డెలివరీ అయ్యేదాకా వినతను ఇంటికి రానీయకుండా ఉండగలరా?’’

‘‘అదెలా కుదురుతుంది? వినత ఈ ఇంటి ఆడపిల్ల… దాన్ని రావద్దని చెప్పటం కుదరదు…’’ నిష్కర్షగా అన్నాడు వేణు.

‘‘థాంక్స్… మళ్ళీ కలుద్దాం…’’ కసిగా ఫోన్ పెట్టేసింది… అతను మళ్ళీ మళ్ళీ కాల్ చేస్తున్నా జవాబు ఇవ్వకుండా ఏడుస్తూ ఉండిపోయింది మధుబాల.

***

‘‘అమ్మా!’’ వెనకనుంచి వచ్చి వీపు మీదపడి కౌగలించుకుంది వినత.

సుగుణమ్మ చిరాగ్గా ఆ చేతుల్ని వెనక్కి నెట్టింది.

‘‘ఏమిటే, ఇంత కోపంగా ఉన్నావు?’’ ఆశ్చర్యంగా చూస్తూ డైనింగ్ చైర్ లాక్కుని కూర్చుంది వినత.

‘‘అమ్మా… నేనేదో బ్రేక్ అయి నీకు చెప్పానే అనుకో… నాన్నకి ఎందుకమ్మా చెప్పావు? ఆయన అక్కడికి వచ్చి క్లాసు పీకాడు…’’ కోపంగా అంది వినత.

‘‘అందుకేగా నేనస్సలు ఆ పని చేయలేదని ఆయన దగ్గర బొంకావు?’’ కటువుగా అంది సుగుణమ్మ.

‘‘అమ్మా, ఇదేమిటే నీలో ఇంత మార్పు? అసలు నేనేం చేసానని?? ఏదో కోపంలో... ఉక్రోషంగా...’’

‘‘వినతా, నువ్వింక మారవా?  నిన్ను కన్నందుకు ఈ వయసులో ఆయన నాతో మాటలే మానేసారే... నీ ఆకతాయి తనాన్ని, చిన్నపిల్లతనంగా చూసాను... పోనీ నువ్వే ఎదిగిన తర్వాత మారతావని ఆశించాను... అలాంటిది మంచి మానవత్వం లేకుండా, ఆ పిల్ల పడిపోవాలని బాత్ రూమ్ నిండా అవి పోయాలని నీకెలా అనిపించిందే? ఇంతవరకూ టీవీ సీరియల్స్ లోనే అలాంటి విలన్లు ఉంటారని అనుకున్నాను... నా కడుపునే పుడతారని నేను అనుకోలేదమ్మా...’’ భోరున ఏడ్చింది సుగుణమ్మ.

‘‘అమ్మా ఈ ఇంటికి నేనే మహారాణిలా ఉండాలని అనుకున్నాను... మీ అటెన్షన్ అంతా ఆవిడ వైపు తిరిగేసరికి నన్ను మర్చిపోయారు. తనకి ప్రాధాన్యత... తనకి మీ అపురూపాలు... కొన్నాళ్ళకి వైభవంగా సీమంతం చేస్తారు... ఆ తర్వాత పుట్టిన పిల్లకో పిల్లాడికో బారసాల వేడుకలు... అన్నీ వాళ్ళకే... మరి నేను వెనకబడిపోతాగా, నాకు పిల్లలు పుట్టలేదు, ఎప్పుడు పుడతారో తెలియదు... అందుకే అలా చేసాను... అసలు ఆ మధూ ఇంటికి వచ్చినప్పటి నుంచి అన్నయ్య కూడా మారిపోయాడు. ఎప్పుడూ ఆవిడ కొంగు పట్టుకు తిరగడమే... నాకు మధూ అంటే అస్సలు ఇష్టం లేదమ్మా... అర్థం చేసుకో...’’

కూతురివైపు భయంగా చూసింది సుగుణమ్మ. చేసిన దానికి ఎలాంటి పశ్చాత్తాపం లేదా పిల్లలో. పైగా అన్నతో కాపురం చేస్తున్న వదినగార్ని చూసి అసూయ పడుతోంది... ఏమిటి దీని మానసిక స్థితి?

‘‘చూడు విన్నూ, నువ్వు అక్కడ నీ ఇంట్లో ఎలా అడుగు పెట్టావో, ఇక్కడ మధూ కూడా అలాగే మన ఇంట్లో అడుగు పెట్టింది... అక్కడ నీ మాటే చెల్లాలని, నువ్వు హాయిగా ఉండాలని ఎలా అనుకుంటావో, ఇక్కడ మధు కూడా అంతే... అది ఈ ఇంటి కోడలమ్మా... నీ తల్లి తర్వాత అంతటి స్థానం తనకి ఇచ్చి తీరాలి... మన వంశానికి అంకురాన్ని ఇవ్వబోయే అమ్మ తను... అలాంటి దాని మీద ఇలాంటి అఘాయిత్యం చేసిందే కాకుండా పిచ్చి పిచ్చిగా మాట్లాడతావా? ఎంత అహంకారమే నీకు? అవునులే, ఆ పాముపిల్లకి పాలుపోసి పెంచింది, నేనే కదా...’’

‘‘అమ్మా!’’ అసహనంగా అరచింది వినత.

“మొన్న ఆయన పాఠం చెప్పాడు, ఇప్పుడు ఇక నీ వంతా? ఆకలేస్తోంది... ఏమైనా చెయ్యి...” హఠంగా అంది వినత.
“మీ ఇంటికి వెళ్ళి వాళ్ళు వంచి వండుకో... నేను చేసి పెట్టలేను... మీ నాన్న వస్తే ఆయనతో గొడవ... వెళ్ళు తల్లీ...” విసుగ్గా అంది సుగుణమ్మ.
“అమ్మా, నువ్వేనా నన్ను వెళ్ళిపొమ్మని అంటున్నావు?” నమ్మలేనట్టు చూసింది వినత.
“నువ్వే ఆ పరిస్థితి తెచ్చుకున్నావు వినతా... ప్లీజ్... అమ్మ మీద ఏమాత్రం గౌరవం ఉన్నా కాస్తయినా మారటానికి ప్రయత్నం చెయ్యి...” బాధగా కళ్ళు మూసుకుంది సుగుణమ్మ.
“అది మీకందరికీ ఏదో మందు పెట్టి మార్చేసిందే... అందుకే నెత్తి మీద పెట్టుకునే నన్ను కాలి కిందేసి తొక్కుతున్నారు... సరే, వెళ్తాలే...” విసవిసా నడుచుకుంటూ వెళ్ళిపోయింది వినత.
‘ఇంటి పరిస్థితి ఎప్పటికి మారుతుందో? ఆయన కోపం ఎప్పటికి చల్లారుతుందో? కోడలు డెలివరీ అయ్యే వరకూ రానని కబురు చేసింది... ఆ తర్వాతయినా వస్తుందా అసలు? దాని ఆరోగ్యం ఎలా ఉందో ఏమిటో... అన్నీ ప్రశ్నలే...’ బరువుగా అనుకుంది సుగుణమ్మ.

***

మధుబాలకి ఐదవ నెల వచ్చింది. ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకుంటూ, టౌన్ హాస్పిటల్ లో రెగ్యులర్ గా చెకప్ చేయించుకుంటోంది మధు. అవసరమైన మందులు, విటమిన్లు వాడుతూ, మంచి ఆహారం తీసుకుంటూ, దిగులుగా ఉండకుండా మంచి పుస్తకాలు చదువుతూ, ఇంట్లో అందరితో కలసి మెలసి ఉంటూ కాలం గడుపుతోంది. పూర్ణమ్మ పనుల్లో వద్దన్నా సాయపడుతుంది.
నిర్మల కూడా చాలా మంచి అమ్మాయి. ఆడపడుచు ఎలాంటి పరిస్థితుల్లో వచ్చిందో తెలుసు... అందుకనే, సాధ్యమైనంత వరకూ ఆమెను బాగా చూసుకోవటానికే ప్రయత్నం చేసేది. తానూ వట్టి మనిషి కాకున్నా మధూ చేతుల్లో పనిని బలవంతంగా లాక్కునేది.
“వదినా, నీ సహకారం, స్నేహం లేకపోతే నేను ఇంత స్వతంత్రంగా ఇక్కడ ఉండగలిగేదాన్ని కాదు...” సజల నేత్రాలతో చెప్పేది మధుబాల.
“ఇది ముందు నీ ఇల్లు మధూ... నీ తర్వాతే నాది... ఏ ఆలోచనలూ లేకుండా ప్రశాంతంగా ఉండు...” చెప్పేది నవ్వుతూ నిర్మల.

అనంతరామయ్యకు కూతురి కాపురం గురించి దిగులు పట్టుకుంది...

ఒక సారి వేణుగోపాల్ వచ్చి చూసి వెళ్ళాడు. మరోసారి తన తల్లితో కలిసి వచ్చేడు...

'కాన్పు కాగానే ఇంటికి వచ్చేయాలని' మరీ మరీ చెప్పి వెళ్ళింది సుగుణమ్మ.

మధుబాలను కలవక ముందేమో కానీ కలిసిన తర్వాత ఆమెకు తృప్తిగా అనిపించింది... మధుకి పుట్టింట్లోనే కావలసిన నిశ్చింత... ఆమె, ఆమె తల్లి పూర్ణమ్మ తీసుకుంటున్న కేర్, ఆరోగ్యం పట్ల జాగ్రత్త, పుట్టబోయే బిడ్డ మీద శ్రద్ధా తమ ఇంట్లో ఉంటే నిజంగానే కుదిరేవి కాదు... ఎంతైనా తల్లి తల్లే... వియ్యపురాలికి వెయ్యి జాగ్రత్తలూ, కృతజ్ఞతలూ చెప్పి మరీ బయలుదేరింది సుగుణమ్మ.

మనవరాలితో ఎంతో అనుబంధం ఉన్న అంజమ్మ కూడా మధుబాలకు ఎవరి మీదా కోపం పెట్టుకోకుండా వెళ్లి కాపురం చేసుకోమని నచ్చజెప్ప సాగింది.

మధుకి కూడా మనసులో ఏ మూలో వెళ్లిపోవాలనే అనిపిస్తోంది కానీ, వంటికి బాగా నీరు పట్టి, డాక్టర్ బెడ్ రెస్ట్ అని చెప్పటం వలన తన ఆలోచనను కాన్పు అయ్యే వరకూ వాయిదా వేసుకుంది. వినత, ఆమె చేసిన పనులు జ్ఞాపకం వస్తే మాత్రం రక్తం మరిగిపోతూ ఉంటుంది...



‘‘చూసావా అమలా, రూప పుట్టిన రోజని తెలిసి కూడా వీడు రాలేదు…” బాధగా అన్నాడు అరుణ్ తమ్ముడు కార్తీక్ ని తలచుకుంటూ…

‘‘అవునండి… ఫోన్ కి రెస్పాన్స్ లేదు… ఎందుకిలా తయారయ్యాడో తెలియటం లేదు…’’

‘‘ఏముందిలేమ్మా, తిన్నది అరక్క… అసలు మా పెంపకం సరిగ్గా లేదులే, ఎవర్ననుకుని ఏం లాభం?’’ పరమేశ్వర రావు నిట్టూర్చాడు.

కాత్యాయని కళ్ళు తుడుచుకుంది.

‘‘ఈ రోజు లంచ్ కి ఓ ప్రత్యేకమైన అతిథిని పిలిచాను అత్తయ్యా…’’ అంది అమల మాట మారుస్తూ…

‘‘ఎవరమ్మా? నీ క్లబ్ మెంబర్స్ లో ఎవరైనానా?’’

‘‘కాదు, కాసేపట్లో వస్తారు... రూప ను హాల్లోకి తీసుకు వస్తాను...’’ అని లోపలికి వెళ్ళి, రూపను వీల్ చైర్ లో కూర్చో బెట్టి తీసుకు వచ్చింది అమల.

ఉదయమే రూపకు తలంటి స్నానం చేయించి కొత్త బట్టలు ధరింప జేసింది అమల. బంగారు వర్ణంలో ఉండే రూప ఆకు పచ్చని డ్రెస్ లో విరిసిన పూల కొమ్మలా ఉంది. బాల్యం దాటి కౌమార ప్రాయం లోనికి అడుగు పెట్ట బోతున్న రూపకు నడవ లేదన్నది ఒక్కటే లోపం.

‘‘నాన్న గారూ, ఇక్కడ మీకు సదుపాయంగానే ఉంది కదా...’’ అడిగాడు అరుణ్.

పరమేశ్వర రావు, కాత్యాయని ఇక్కడికి వచ్చేసి వారం రోజులు దాటుతోంది.

‘‘చాలా హాయిగా ఉన్నాముురా అబ్బాయి... కోడలు తీసుకునే శ్రద్ధ వలన మా ఆరోగ్యాలు కూడా బాగున్నాయి. రూపతో మంచి కాలక్షేపం అవుతోంది... దాంతో చెస్ ఆడుతూ ఉంటే సమయమే తెలియదు...’’ చెప్పాడు పరమేశ్వర రావు.

‘‘కానీ మన ఇంట్లో ఉన్నట్టుగా పచ్చని చెట్లు, గాలి తక్కువయ్యాయి కదా… అయినా మనమందరం కలిసి ఉంటేనే మంచిది నాన్నా…’’

‘‘నిజంరా… ఏముందిలేరా… మీ అపార్ట్ మెంట్స్ ఎదురు గానే పచ్చని చెట్లతో నిండిన ఆ పార్క్ ఉంది కదా… అందుకే లిఫ్ట్ లో ఉదయమే వెళ్లి కాసేపు అక్కడ తిరిగి వస్తున్నాను…’’ అన్నాడు పరమేశ్వర రావు.

‘‘అత్తయ్య గారు అన్నీ చూసు కోవటం వలన సాయంత్రాలు క్లబ్ కి సంబంధించిన పనులు ఈజీ గా చేసుకో గలుగుతున్నానండి…’’ చెప్పింది అమల.

‘‘తాతయ్యా, బామ్మా, మీరు ఎప్పటికీ ఇక్కడే ఉండాలి… మీరు వచ్చాక నాకెంత బాగుందో…’’ అమాయకంగా చెప్పింది రూప.

‘‘తప్పకుండా బంగారు తల్లీ… ఇక ఇక్కడే ఉంటాం…’’

కాలింగ్ బెల్ మ్రోగింది. అమల వెళ్ళి తలుపు తీసింది.

చేతిలో గిఫ్ట్ ప్యాక్ తో, చిరునవ్వుతో అడుగు పెట్టింది ఐశ్వర్య.

అందరినీ విష్ చేసి, సరా సరి రూప దగ్గరికి వెళ్ళి గిఫ్ట్ చేతిలో పెట్టి, ''హాపీ బర్త్ డే బంగారు తల్లి రూపా...'' అని వంగి,ఆమె తలను గుండెలకు హత్తుకుంది.

''థాంక్స్ టీచర్... మీరు వస్తారని తెలియ లేదు... బాగున్నారా?'' అంది ఆనందంగా రూప.

''రూపా, తను ఇప్పుడు టీచర్ కాదు... నీకు పిన్ని అవుతుంది... అలానే పిలవాలి...'' చెప్పింది అమల.

ఐశ్వర్యను అత్తా మామలకు పరిచయం చేసింది. అప్రయత్నంగా ఇద్దరికీ పాదాభివందనం చేసింది ఐశ్వర్య.

‘‘నువ్వేనామ్మా ఐశ్వర్య?’’ ఆమె తల నిమిరి దగ్గరకు తీసుకుంది కాత్యాయని.

ఐశ్వర్యకు కాస్త మొహమాటంగా అనిపించింది.

‘‘వస్తూ ఉండమ్మా ఇక నుంచి...’’ చెప్పాడు అరుణ్.

‘‘సరేనండి...’’

‘‘పిన్ని, నాకు జాగ్రఫీలో కొన్ని లెసన్స్ అర్థం కాలేదు. కొంచెం చెప్ప గలరా?” అడిగింది రూప.

‘‘తప్పకుండా చెబుతాను రూపా...’’

‘‘అయితే సరే, మీరిద్దరూ నీ రూములో చదువుకోండి... నా వంట పూర్తి కాగానే భోజనం చేద్దాం...’’ అంటూ, వీల్ చెయిర్ ని గది లోకి తీసుకు వెళుతూ, తనతో రమ్మన్నట్టు ఐశ్వర్యకు సైగ చేసింది అమల.

ఒక రెండు గంటల సేపు రూపతో పాటున్న ఐశ్వర్యకు కాలం తెలియ లేదు. తన కొత్త పిలుపు మొదట్లో ఇబ్బందిగా తోచినా కాసేపటికి అలవాటై పోయింది.

వాళ్ళతో కలిసి భోజనం చేసి, ఆనందంగా అందరితో గడిపి, తిరిగి తన ఫ్లాట్ కి వచ్చింది ఐశ్వర్య. ఆరోజు ఆమెకు చాలా తృప్తిగా అనిపించింది. అది మొదలు కనీసం పది రోజులకో సారి అమల ఇంటికి వెళ్ళటం పరిపాటి అయిందామెకు.

*************************

‘‘నెలలు నిండుతున్న  పిల్ల, దానికీ విషయం చెప్పకండి...’’ చిన్న గొంతుతో భర్తతో అంటోంది పూర్ణమ్మ.

అప్పుడే నిద్ర లేచి తన గది లోంచి బయటకు వస్తున్న మధు బాల చెవిలో ఆ మాటలు పడనే పడ్డాయి...

‘‘ఏమైంది నాన్నా?’’ అంది ఖంగారుగా...

‘‘అబ్బే ఏమీ లేదమ్మా... నువ్వు గాబరా పడకు...’’ అన్నాడే కానీ ఆయన ముఖంలో అలముకున్న విషాదం ఏదో జరగ రాని సంఘటన జరిగినట్టు మధు బాలకు చెప్పకనే చెప్పినట్టు అయింది.

మౌనంగా నిలుచున్న పూర్ణమ్మతో, ‘‘అమ్మా... ఏమిటి విషయం? చెప్పండి ఫర్వాలేదు...’’ అంది మధు బాల.

‘‘మీ మామ గారికి యాక్సిడెంట్ అయిందిట మధూ...’’ చెప్పాడు అనంత రామయ్య.

‘‘అరె... ఇప్పుడు ఎలా ఉన్నారు?’’

‘‘సారీ అమ్మా... వారు మనకిక లేరు... ఇందాకే అన్నయ్యకు ఫోన్ చేసి చెప్పారు అల్లుడు

గారు...'' పై తువ్వాలుతో కళ్ళు తుడుచు కున్నాడు అనంత రామయ్య.

మధు బాలకు కళ్ళు తిరిగినట్టు అయింది. ద్వార బంధాన్ని ఆసరాగా చేసుకుంటూ నిల బడింది. పూర్ణమ్మ త్వర త్వరగా వచ్చి కూతుర్ని పట్టుకుంది.

''కాసేపు ప్రశాంతంగా పడుకోమ్మా... నువ్వు చూడటానికి వెళ్ళ కూడదు... నాన్న గారు, అన్నయ్య వెళ్లి వస్తారు...'' అనునయంగా చెప్పింది పూర్ణమ్మ.

''వెళ్ళ కూడదా? నాకు ఆయన్ని చూడాలని ఉంది అమ్మా... ఆయన వేణుకు కాదమ్మా నాకు నాన్న గారిలా నిల బడ్డారు అన్నింట్లో... ప్లీజ్ అమ్మా...'' గోవర్ధన రావును తలచుకుని వెక్కి వెక్కి ఏడవ సాగింది మధు బాల.

ఏమనాలో తెలియక అక్కడే ఉన్న కొడుకు వైపు చూసింది పూర్ణమ్మ.

''నానమ్మా, నిర్మలా ఇక్కడ ఉంటారు. అందరం వెళదాము... దాని కోరిక కూడా కాదన లేము

అమ్మా… టాక్సీ బుక్ చేస్తాను…” అన్నాడు గిరి.

*********************************

ఇంటికి తిరిగి వచ్చినప్పటి నుంచి కంటికీ మంటికీ ఏక ధారగా ఏడవ సాగింది మధు బాల.

అక్కడ చలన రహితంగా పడుకుని ఉన్న మామ గారిని చూస్తే మనసంతా వికలమై పోయింది… ఎవరెవరో చుట్టాలు వస్తున్నారు. అందరూ ఏడుస్తున్నారు. అత్త గారిని చూస్తే చాలా బాధ కలిగింది. దగ్గరగా వెళ్లి ఆమె భుజమ్మీద చేయి వేసింది తాను. ఈ లోగా వినత వచ్చి, తనను లోపలి రూము లోకి లాక్కుపోయి గొడవ పెట్టుకుంది.

“ఎందుకు వచ్చావు? ఇంకా ఏం మిగిలిందని చూడటానికి వచ్చావు?” అంది కర్కశంగా…

“వినతా… అదేమిటి? మామయ్య గారు…” తన మాట పూర్తి కాకుండానే, “నా మీద నింద వేసి నువ్వు ఇల్లు వదిలి వెళ్ళి పోయావు… అది మొదలు మా నాన్న నన్నే దోషిగా ఎంచి నానా మాటలు అన్నారు. అంతే కాదు, మా అమ్మను కూడా అనరాని మాటలు అన్నారు. ఆయన

మానసికంగా చాలా దెబ్బ తిన్నారు మధు బాలా… అందుకనే స్థిమితం లేని మనసుతో బైక్ డ్రైవ్ చేస్తూ యాక్సిడెంట్ కి గురి అయ్యారు… ఆయన చావుకు కారణం ఖచ్చితంగా నువ్వే… నన్ను తండ్రిలేని దానిగా చేసింది నువ్వే… నువ్వే…” తర్జనితో నిలదీస్తూ కింద కూల బడి ఏడవ సాగింది వినత.

లోపలికి వచ్చిన వేణు కూడా వినతను ఓదార్చటంలో మునిగి పోయాడే కాని తననసలు  పట్టించుకో లేదు.

“వేణూ, అయామ్ సారీ…” అంటున్న తనతో, “చూసావు కదా? నీ కోసం, నీ కడుపులోని బిడ్డ కోసం ఆలోచించి, ఆలోచించి ఆయన మరణం పాలయ్యాడు… నువ్వు వెళ్ళి పోయాక, ఆయన ఒక్క రోజు కూడా సరిగ్గా భోజనం చేయ లేదు. బీపీ బాగా హెచ్చయింది… బయటకు వెళ్ళ వద్దు అని ఎంత చెప్పినా వినకుండా నిన్న బైక్ తీసుకు వెళ్ళారు… తిరిగి ఇలా వచ్చారు… చాలా థాంక్స్ మధూ…” అన్నాడు కోపంగా.

తనకేం అర్థం కాలేదు. జరిగిన దాంట్లో తన తప్పు ఏముందని అంతగా దూషిస్తున్నారు? వినత సరే, వివేకం లేనిది... మరి వేణు బుద్ధి ఏమైంది? తండ్రి పోయిన దుఃఖం అనుకుందామన్నా, ఆ పరుషపు వాక్యాలేమిటి? మనసును కోసేస్తున్నాయే! వేణుకి కోపంలో ఒళ్ళూ పై తెలియదు... చెల్లెలి ఏడుపునే చూస్తున్నాడు కానీ విలపించే తన మనసును అసలు గమనించక పోగా ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడు.

అంతా గమనిస్తున్న అన్నయ్య తన దగ్గరకు వచ్చాడు.

‘‘వెళదాం చెల్లాయ్... నువ్వు ఉండలేవిక్కడ...’’ అన్నాడు మెల్లగా.

‘‘బావుండదు అన్నయ్యా...’’ దీనంగా చూసింది అన్న వైపు.

‘‘ఫర్వాలేదు... నాకు నీ ఆరోగ్యం ముఖ్యం... ఇంకా మాటలు పడి మనస్థాపం చెందటం అవసరం లేదు... అసలు కడుపుతో ఉన్న పిల్లవి నువ్వు రానక్కర లేదు...అయినా చివరి చూపంటూ

వచ్చావు, చూసావు... ఇక చాలు... నిన్నూ, అమ్మను టాక్సీ ఎక్కించి పంపిస్తాను... జాగ్రత్తగా వెళ్ళండి... నేనూ, నాన్న గారూ తర్వాత వస్తాము..."


"కానీ వేణు బాధ పడతాడు..."

"బాధ పెడతాడు కూడా... వినత తూట్లు పొడుస్తుంది... కావాలా అవన్నీ? నువ్వేం ఆలోచించకుండా వెంటనే బయలుదేరు... ఇక్కడ నీకు కాఫీ చుక్క ఇచ్చే వాళ్ళు కూడా ఎవ్వరూ లేరు..."

ఆఘ మేఘాల మీద టాక్సీ బుక్ చేయించి తల్లినీ తననూ పంపేసాడు గిరి.

ఇదేమిటి? వేణుకి తానంటే ప్రేమ లేదా? పోనీ తన కడుపులో పెరుగుతున్న అతని బిడ్డ మీద కూడా మమత లేదా? ఎంత కటువుగా మాట్లాడుతున్నారు వాళ్ళు? అసలు వినత పక్కనుంటే అందరూ అలాగే మాట్లాడతారా?

మధు బాల మనసు కృంగి పోసాగింది.




నిర్మలకు మహాలక్ష్మిలాంటి ఆడపిల్ల పుట్టిన పదిహేను రోజులకే మధుబాలకు పనస పండంటి మగపిల్లవాడు పుట్టాడు. వెంటనే వియ్యాలవారికి కబురుచేసాడు అనంతరామయ్య. కానీ తండ్రి ఆస్తి వ్యవహారాలలో బాగా బిజీగా ఉన్నానంటూ వేణుగోపాల్ పసిబిడ్డను చూడటానికి రాలేదు. సుగుణమ్మ బయలుదేరబోయినా ఆమెను వెళ్ళనీయకుండా ఆపేసాడు.

మధుబాలకు చాలా వేదనగా అనిపించింది. అసలు ఈ అకారణ కోపం ఏమిటో తెలియటం లేదు. తనకూ భర్తకూ కనబడని అగాధం, తన ప్రమేయమేమీ లేకుండానే  పెరిగిపోయింది. మనసు చంపుకొని, తానే భర్తకు ఫోన్ చేసింది మధుబాల.

“వేణూ... నా మీద కోపం ఎందుకు మీకు? అన్నీ మరచిపోయి, బాబును చూడటానికి రండి... మీకోసం మేమిద్దరం ఎదురుచూస్తున్నాము...”

“తీరిక లేదు మధూ... వారం రోజుల్లో వస్తాను... బై ద వే, మీ అన్నయ్యను అడిగి ఆ డబ్బు రెడీ

చేయి... వచ్చి తీసుకువెళతాను...'' ముక్తసరిగా అన్నాడు వేణుగోపాల్.

‘‘అది కాదు... సంవత్సరం తర్వాత తానే ఇచ్చేస్తాడు... ఇప్పుడు అడగటం బావుండదు... వాడికీ కూతురు పుట్టింది... బారసాల ఖర్చులూ అవీ ఉంటాయి... మా వదిన పుట్టింటివాళ్ళు చాలా పేదవాళ్ళు... ఇటు మన బాబుకూ, అటు వాడి పాపకూ ఖర్చులన్నీ వాడే భరిస్తున్నాడు... అర్థం చేసుకోండి...'' దీనంగా అన్నది మధుబాల.

‘‘అసలు చెల్లెలి దగ్గర డబ్బు తీసుకోవటమే మీ అన్నయ్య తప్పు... నీకేం ఎక్కువ చేసేయటం లేదు మీ అన్న... మొదటి పురుడు పుట్టింటివారు పోయటం ఆనవాయితీ... మీ అక్కలకు పోయలేదూ? డబ్బు సిద్ధం కాగానే ఫోన్ చేయమను... వచ్చి తీసుకుంటాను... మూడో నెలలో నిన్నూ, బాబునూ తీసుకువెళతాను...''

వేణుగోపాల్ మాటలు మధుబాలను చాలా బాధించాయి. ఇదేమిటి? తాను కష్టపడి ఉద్యోగం చేసి సంపాదించిన డబ్బు తన పుట్టింటివారికి ఇవ్వకూడదా? అది అప్పుగానే అన్నయ్య భావించి తిరిగి ఇచ్చేస్తాననే అన్నాడు... కానీ ఒకదానితర్వాత మరొకటి ఖర్చులు ముంచుకు రావటం వలన కూరుకుపోతున్నాడు... ఎంత వివరంగా చెప్పినా తన భర్త అర్థం చేసుకోవటం లేదు... ఛ! అంత ప్రేమా గాలిలో కలిసిపోయిందా? తన రక్తంలో రక్తం...తొలి సంతానం... కడుపున పుట్టిన బిడ్డను చూడాలని అతనికి అనిపించటం లేదు... ఎన్ని వంకలు చెబుతున్నాడు?

పచ్చి బాలింత అయిన మధుబాల తట్టుకోలేక వెక్కి వెక్కి ఏడవసాగింది.

***

చిలికి చిలికి గాలివాన అయినట్టు మధుబాల, వేణుగోపాల్ ల మధ్య మొదలైన అపార్థాలు ఇద్దరి మధ్యా కనిపించని అగాధాలను సృష్టించాయి. కొడుకును చూడటానికి తల్లితో వచ్చిన వేణు, మధుబాలతో చాలా ముభావంగా వ్యవహరించాడు. సుగుణమ్మ మనవడిని ఎత్తుకొని

సంబరపడిపోయింది. వేణుగోపాల్ కొడుకును చూసి ఊరుకున్నాడు. ముమ్మూర్తులా తల్లిని పోలి ఉన్న పసివాడిని చూస్తే, అకారణంగా కోపం వచ్చింది. మళ్ళీ తనను తాను తిట్టుకుంటూ వాడి బుగ్గలను తాకాడు ప్రేమగా... వాడు చిరునవ్వులు చిందించాడు... బుగ్గల్లో సొట్టలు పడగానే, ఆ బోసి నవ్వుల్లో  తండ్రి పోలికలు కనిపించాయి. అప్పుడు ఒక్కసారిగా ప్రేమ ఉప్పొంగినట్టు అయింది అతనికి.

మూడవ నెలలో చలిమిడి చేసి, కూతుర్ని, మనవడినీ దిగబెడతామని చెప్పింది పూర్ణమ్మ. బారసాలంటూ జరగలేదు కానీ బాబును 'బాబి' అని పిలుస్తున్నామని చెప్పారు. తమకు బంధు బలగం ఎక్కువ కాబట్టి ఇంటికి వచ్చాకే నామకరణ మహోత్సవం చేస్తామని చెప్పింది సుగుణమ్మ.

అంజమ్మ పేరున ఉన్న రెండెకరాల చెలక అమ్మకానికి పెట్టాడు గిరి. వారసత్వంగా వచ్చే ఆస్తి కాబట్టి పత్రాల మీద అందరూ సంతకాలు పెట్టాలి. పొలం అమ్మకం విషయం తెలిసిన మధు నిర్ఘాంతపోయింది. గట్టిగా అడిగితే తెలిసిన  విషయం ఏమిటంటే, వేణు తన అన్నతో  డబ్బు విషయంలో చాలా అవమానంగా మాట్లాడాడు అని. మధుకు చాలా ఉక్రోషంగా, అవమానంగా అనిపించింది.

డబ్బుకి ఇంత ప్రాధాన్యత ఇచ్చే వేణుగోపాల్, అనుబంధాలను, మానవ సంబంధాలను  విస్మరించటం శోచనీయం. అసలు తమ ఇద్దరి అభిప్రాయాలకు, మనస్తత్వాలకు ఎక్కడా పొంతన అన్నది లేనే  లేదు... అంత ఆస్తిపరులకు ఇప్పుడు ఈ  డబ్బు అవసరం ఏం వచ్చిందని? కేవలం తన మీద పంతం కొద్దీ అన్న మీద ఒత్తిడి తీసుకువచ్చాడు... తన బ్యాంకు ఖాతాలో ఒక్క రూపాయి లేదు... జాయింట్ అకౌంట్ కాబట్టి అతనే వాడేసుకున్నాడు. తనకి ఆరునెలలుగా జీతం లేదు... ఇప్పుడు అన్నయ్య చెప్పిన చోట్ల సంతకాలు పెట్టటం తప్ప గత్యంతరం లేదు తనకు... ఈరోజు వేణు మూర్ఖత్వం వల్ల, ధన దాహం వల్ల  అన్నం పెట్టే  భూమాతను అమ్ముకోవలసి వస్తోంది... ఎంతటి దౌర్భాగ్యమిది?

ఆ రాత్రి ఐశ్వర్య ఫోన్ చేస్తే మాటల్లో అన్ని విషయాలూ ఆమెతో చెప్పి బాధపడింది మధుబాల.

‘‘అరె, రెండు లక్షల భాగ్యానికి పొలం అమ్ముకోవటం ఎందుకే? అమ్ముకంటే మళ్ళీ సంపాదించుకోగలమా?’’ మందలింపుగా అన్నది ఐశ్వర్య.

‘‘ఏం చేయాలి ఐశూ? అయినవాళ్ళే పగవాళ్లై, అప్పు కాని అప్పును తీర్చమంటూ  పీకల మీద కూర్చుంటుంటే ఏమి చేయాలి? డబ్బు చెల్లించక పోతే మా కుటుంబ పరువు తీసేలా ఉన్నాడు వేణు... మా అన్నయ్య కడుపు నిండా అన్నం తిని ఎన్నాళ్ళు అయిందో... తొలిచూలు కూతురు పుట్టిందన్న సంతోషం లేదు... వెయ్యి టన్నుల భారాన్ని గుండెల మీద మోస్తున్నట్టు తిరుగుతున్నాడు... ఈ పరిస్థితుల్లో పొలాన్ని అమ్మేయమని మా నాన్నమ్మే చెప్పింది... అంతకన్నా గత్యంతరం లేదు కూడా...’’ దిగులుగా అంది మధు.

‘‘రేపు నేను ఎక్కడైనా ప్రయత్నించి,  డబ్బు అరేంజ్ చేసి మీ అన్నయ్య అకౌంట్ కి పంపిస్తాను... తొందర పడకండి... భూమిని అమ్మటం అంత మంచిది కాదు... ప్లీజ్... నేను మీ అన్నయ్యతో మాట్లాడనా?’’ అంది ఐశ్వర్య.

‘‘వద్దు ఐశూ... అప్పు చేయటమనేది నా నిఘంటువులోనే లేదు... ఇలాగే కానిద్దాం...’’ అయిష్టంగా అన్నది మధుబాల.

‘‘కాదులే, ఒక్క రెండు రోజులు ఆగండి... ఆ తర్వాత ఏ మార్గం లేకపోతే ఇలాగే చేద్దాం...  అన్నయ్య ఫోన్ నెంబర్ మెసేజ్ చేయి...’’ ఫోన్ డిస్కనెక్ట్ చేసింది ఐశ్వర్య.

ఏం చేయాలో తెలియక కంట నీరు నింపుకుంది మధుబాల.

‘‘అయ్యో,  బాబు ఏడుస్తున్నాడు కదమ్మా మధూ... వాడికి పాలివ్వు...’’ బాబీని తెచ్చి ఒడిలో వేసింది పూర్ణమ్మ.

కూతురి హృదయంలో చెలరేగుతున్న పెను తుఫాను ఆమెకు తెలుసు.

***

ఏం చేసిందో, ఎలా చేసిందో కాని గిరి బాంకు ఖాతాలోకి మర్నాటికల్లా రెండు లక్షల రూపాయలు జమ చేసింది ఐశ్వర్య. ఆ డబ్బును వెంటనే వేణుగోపాల్ కి పంపించివేసాడు గిరి. ఐశ్వర్యకు ఎన్నెన్నో కృతజ్ఞతలు కూడా చెప్పాడు మరీ మరీ.

మధుబాల మనసు ఐశ్వర్య పట్ల కృతజ్ఞతను, ప్రేమను మించిపోయిన భావంతో నిండిపోయింది... అవధులు లేని ఆనందంతో, దుఃఖంతో ఐశ్వర్యకు ఫోన్ చేసి గట్టిగా ఏడ్చేసింది... పరిస్థితులు అన్నీ చక్కబడతాయని చెబుతూ, ఆమెను సముదాయించింది ఐశ్వర్య.

***

మధుబాల లీవ్ అయిపోవచ్చింది. బాబుకు మూడో నెల వచ్చింది. సుగుణమ్మ ఫోన్ చేసింది, మధుబాలను, బాబునూ పంపించమంటూ...

కానీ, మధుకు తిరిగి అత్తవారింటికి వెళ్ళడానికి, వేణుతో ఏమీ జరగనట్టుగా ఇదివరకటిలా మాట్లాడుతూ, కాపురం చేయటానికి మనస్కరించటం లేదు... అటు ఆఫీసు నుంచి ఫోన్ లు వస్తున్నాయి, ఎప్పుడు జాయిన్ అవుతారంటూ...

చివరికి ఒక నిర్ణయానికి వచ్చిందామె. తనను భర్త ఇంటికి పంపించవద్దనీ, కొన్నాళ్ళు విడిగా ఉంటాననీ, తండ్రినీ, అన్ననూ కోరింది. ఆమె కోరిక విన్న ఇంటిల్లిపాదీ నిర్ఘాంతపోయారు. కాపురం చెడగొట్టుకోవద్దని మరీ మరీ బ్రతిమిలాడి చెప్పింది పూర్ణమ్మ.

మధు సమాధానం ఒక్కటే... ఇక్కడే ఉంటే ఉద్యోగం పోతుంది... అక్కడే అత్తవారింట్లో ఉంటే మనశ్శాంతి కరువౌతుంది... అంచేత కొన్నాళ్ళు విడిగా ఉండి, మనసు కుదురుకున్నాక తిరిగి తానే అత్తవారింటికి వెళతానని, ప్రస్తుతానికి ఐశ్వర్య ఫ్లాట్ కి వెళతానని అందరికీ నచ్చజెప్పింది.

తనను బలవంతం చేయవద్దనీ, మనసులేని కాపురం చేయలేననీ గట్టిగా చెప్పింది. ఏమనాలో తెలియక ఊరుకున్నారు అంతా... ఎందుకంటే, గిరి ఫోన్ చేసినా వేణు ఆ కాల్స్ కట్ చేసేస్తున్నాడు. మధుబాలకీ అతనికీ మాటలే లేవు... ఈ పరిస్థితుల్లో అక్కడికి పంపాలన్నా భయమే... ఆ వినత పసికందును ఏమైనా చేస్తే ఎలాగన్నది మరో ప్రశ్న...

బాబును తన దగ్గర వదిలేసి వెళ్ళమని అడిగింది పూర్ణమ్మ.

"వద్దే, పసివాడు, తల్లిపాలకు దూరం చేయకు..." అని గట్టిగా చెప్పింది అంజమ్మ... నిస్సహాయంగా ఊరుకుంది పూర్ణమ్మ.

మధు కోరిక ప్రకారం గిరి ఆమెను ఐశ్వర్యకు అప్పగించి వెనుదిరిగాడు.
***

బాబును 'ఊయల' అనే బేబీ కేర్ సెంటర్ లో వేసి, తాను ఉద్యోగంలో తిరిగి జాయిన్ అయింది మధుబాల. ఐశ్వర్య ఎంత నచ్చ జెప్పినా అత్తవారింటికి వెళ్ళలేదు.

ఆ రెండు లక్షల కోసం ఐశ్వర్య తన బంగారం అంతా పెట్టి బ్యాంకులో గోల్డ్ లోన్ తీసుకుందన్న విషయం పిన్ని గారి ద్వారా తెలిసింది. బాబాయ్ గారే ఆ అప్పును ఇప్పించారని కూడా తెలిసింది.

మధుబాల గుండె ఐశ్వర్యకు పాదాక్రాంతమై పోయింది... స్నేహానికి మారు రూపుగా నిలిచిన ఐశ్వర్య ఋణాన్ని తానెప్పటికి తీర్చుకోగలదు? ఇంత గొప్ప స్నేహితురాల్ని తనకు కానుకగా ఇచ్చిన ఆ దైవానికి పదే పదే  కృతజ్ఞతలు తెలియజేసుకుంది. ఇంత మంచి అమ్మాయిని ఎన్ని సార్లు దూషించారు వినత, వేణు? అసలు వాళ్లకి ఐశ్వర్య పేరు ఎత్తే అర్హత కూడా లేదనుకుంది కసిగా...

తనకి ఇద్దరు పిల్లలు... అందులో పెద్దది ఐశ్వర్య... దాన్ని బాగా చూసుకోవాలి... రెండోవాడు బాబీ... తామిద్దరూ ఉండగా వాడికి లోటు లేదు... బాబీని ఆడిస్తూ, వాడికి పాలు పడుతూ, నిద్ర

పుచ్చుతూ... తాను కూడా వాడికి మరో తల్లిగా మారిపోయింది ఐశ్వర్య...

అన్నీ ఇప్పుడిప్పుడే ఒక దారిలో పడుతూ ఉండగా... ఇదిగో ఇప్పుడు ఇలా దొంగతనంగా బాబీని తీసుకువెళ్ళాడు వేణు.

జరిగిందంతా నెమరు వేసుకున్న మధుబాల, బాబీ ఊసులూ, కేరింతలూ, నవ్వులూ పదేపదే గుర్తు వస్తూ ఉంటే వెక్కి వెక్కి ఏడవసాగింది.




రాత్రి చీకటయ్యాక మొదలైంది అగ్నిపరీక్ష! బాబిగాడికి  సీసాతో పాలు పడుతూంటే దాన్ని తోసేస్తూ తల్లికోసం వెదుక్కుంటూ ఏడవసాగాడు. వేణుకు ఏం చేయాలో తెలియలేదు. సుగుణమ్మ కూడా తల్లడిల్లిపోయింది... వాడిని భుజాన వేసుకుని అటూ ఇటూ తిరుగుతూ, లాలిస్తూ ఎలాగో గోరువెచ్చగా కాసిని పాలు పట్టింది... తల్లికోసం ఏడుస్తూనే నిద్రలోకి జారాడు బాబి.

వాడిని ఉయ్యాలలో వేసి, కొడుకు దగ్గరకు వచ్చింది సుగుణమ్మ.

‘‘వేణూ... పాపం మూటగట్టుకోకురా... రేపు వీడిని తీసుకువెళ్ళి మధుకు ఇచ్చేసి రా...’’ అంది అనునయంగా.
అయిష్టంగా తల తిప్పుకున్నాడు వేణు.
‘‘ఆవిడే పరుగు పరుగున వస్తుంది లేమ్మా... ఇప్పటికే రెండు నెలలుగా పంతం పట్టి, మన దగ్గరకి రాకుండా ఆవిడగారి స్నేహితురాలి దగ్గర ఉంటోంది కదా... ఇప్పుడు పిల్లాడి కోసం వస్తుందిలే...’’ నిర్లక్ష్యంగా అన్నాడు.
‘‘ఎప్పటికి మారతార్రా మీరు? ఎందుకిలా నన్ను శిక్షిస్తున్నారు? పసివాడిని చూసుకోవటం చాలా కష్టం నాయనా... అది కన్నతల్లికి తప్ప సాధ్యం కాదు...’’
‘‘అయితే నువ్వు చూసుకోలేనంటావా? ఆయాను పెడతానులే...’’ తేలికగా అన్నాడు వేణు.
నెత్తి కొట్టుకుంది సుగుణమ్మ.
***
‘‘ఏమిటి సిస్టర్, అదోలా ఉన్నారు?’’ సర్వం పోగొట్టుకున్న దీనురాలిలా ఉన్న మధుబాలను పరికిస్తూ అడిగాడు స్వరూప్.
సమాధానం చెప్పబోయింది మధుబాల... ఈలోగా అటు వచ్చిన కన్నన్ వీళ్ళను వంకరగా  చూస్తూ, ‘‘చెప్పేవి శ్రీరంగనీతులు... చేసేవి తప్పుడు పనులూ...’’ అన్నాడు జనాంతికంగా...
‘‘మిస్టర్ కన్నన్, వాటార్యూ టాకింగ్?’’ తీవ్రమైన కంఠస్వరంతో అన్నది మధుబాల.
వంకరగా నవ్వుతూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు కన్నన్.
‘‘సారీ సిస్టర్... కన్నన్ మీ మీద దురుద్దేశ్యంతో ఉన్నాడు... నిన్ననే వాడి కుటిలపు ఆలోచనలన్నీ తెలిసాయి... మీరు కొంచెం జాగ్రత్తగా ఉండడం మంచిది... వీలుంటే మీరు మీ భర్త దగ్గరకు వెళ్ళిపొండి...అదే మంచిది...’’ కన్సర్న్ గా అన్నాడు స్వరూప్.
‘‘నా భర్తా? స్వంత కొడుకును కిడ్నాప్ చేసి ఎత్తుకుపోయినవాడు, నాకు అనుక్షణము రంపపు కోతను కలిగించిన వాడూ నా భర్త... అటువంటి మనిషి దగ్గరకు ఎలా వెళ్ళమంటారు స్వరూప్?’’ నిర్వేదంగా అన్నది మధుబాల.
‘‘సిస్టర్, ప్రతి మనిషీ తప్పులు చేస్తాడు... అవి తెలుసుకునే క్షణం రాక మానదు... ఇప్పుడు

బాబును అతను తీసుకువెళ్ళారా?"
"అవును స్వరూప్ గారూ... ఊయల కేర్ సెంటర్ నుంచి నిన్న తీసుకువెళ్ళాడు... ఇప్పుడు నేను వెళ్ళి అడుక్కుంటే, తనకి ఇష్టమైతే ఇస్తాడు... లేకపోతే బాబు కోసం నాకు ఇష్టం లేకపోయినా అక్కడ ఉండాలి... అదే అతని వ్యూహం..."
"మరి...మీరు ఇప్పుడు ఏం చేయదలచుకున్నారు?"
"పోలీస్ రిపోర్ట్ ఇవ్వాలని..."
"అయ్యో... అదేమిటి సిస్టర్? అలా చేయకండి... మీ అత్తగారు, మామగారు... వారి పరువు ప్రతిష్టలు ఏం కావాలి? వారి గురించి ఆలోచించండి..."
"న్యాయం నా వైపు ఉన్నదనీ, నేను గెలుస్తాననీ తెలిసినా నేను న్యాయస్థానానికి వెళ్ళకూడదు... వాళ్ళ పరువు కాపాడాలి... భగవంతుడా, ఎలాంటి సమాజంలో సృష్టించావు నన్ను ఒక స్త్రీగా, దగా పడిన భార్యగా, అసహాయురాలైన తల్లిగా..." ఉప్పొంగి వస్తున్న దుఃఖాన్ని మునిపంట పెదవి నొక్కి ఆపుకుంది మధుబాల.
"అయ్యో, బాధపడకండి సిస్టర్... ఈరోజు సాయంత్రం వెళ్ళి బాబును చూసి రండి... బాబును మీకు దూరం చేయరని అనుకుంటున్నా..."
"సరే స్వరూప్ గారూ..." తల పంకించి పనిలో పడింది మధుబాల.
***
ఉదయమే ఊరినుంచి వచ్చింది సుచిత్ర. బాబును చూసి ఎంతగానో మురిసిపోయింది. పది గంటలకల్లా వచ్చేసిన వినత కూడా బాబిని చూసి సంబరంగా గంతులు వేసింది... తమ నాన్నగారి పోలికలతో బాబి కనిపించటమే అందుకు కారణం.
వాడిని ఎత్తుకుంటూ, ఆడిస్తూ, పాలు పడుతూ, జోల పాడుతూ, ఊయల ఊపుతూ ఎంతో ఆనందాన్ని అనుభవించారు అక్కా చెల్లెళ్ళు ఇద్దరూ... వేణూ సరే సరి...
"అయితే అన్నయ్యా, మధుబాల ఇక రానందా?" ఆరా తీసింది వినత.
"ఎవరికి తెలుసు? ఇక్కడికి రావటం ఇష్టం లేకనే కదా తన ఫ్రెండ్ ఇంట్లో చేరింది? మధ్యలో నేను, అమ్మా ఫోన్ చేసినా తీయలేదు... ఇప్పుడు వస్తుందిలే... పిల్లాడి కోసం..." ఘనకార్యం చేసినవాడిలా నవ్వాడు వేణు.

‘‘వేణూ... నీకు డబ్బుకేం తక్కువరా? వాళ్ళ అన్నయ్య తీసుకున్న డబ్బుకోసం అంత గొడవ ఎందుకు చేసావు? అసలు అయిన వాళ్ళ మధ్య అప్పులేమిట్రా? పాపం మధూ ఎంత బాధ పడి ఉంటుందో... అందుకే దాని మనసు విరిగిపోయి ఉంటుంది...’’ అంది సుచిత్ర తమ్ముడితో...

‘‘అక్కయ్యా... నీకు తెలియదా, తమ్ముడు తమ్ముడే, పేకాట పేకాటే... బావ బావే, అప్పు అప్పే... అప్పు తీర్చమన్నంత మాత్రాన నన్ను ద్వేషించేయనక్కరలేదు నీ మరదలు... అయినా గట్టిగా అడిగేసరికి మర్నాడే నాకు డబ్బు పంపేశాడు మా బావమరిది... అతని దగ్గర లేకపోతే కదా... కాకపోతే మధు మద్దతు తీసుకుని, డబ్బు లేదంటూ ఎగవేయటానికి ప్రయత్నించాడు...’’

‘‘మనకేం తెలుసు, ఎక్కడ అప్పు తీసుకువచ్చి కట్టారో? మీ ఇద్దరూ ఒకేలా తయారయ్యారు...’’ మార్చి మార్చి తమ్ముడినీ, చెల్లెలినీ చూస్తూ బాధగా అంది సుచిత్ర.

‘‘అలా గడ్డి పెట్టవే పెద్దపాపా, నీ తమ్ముడికి, చెల్లెలికీ... కొరకరాని కొయ్యల్లా తయారయ్యారు... అసలు వీడికి అనవసరంగా పెళ్లి చేసాం... అలా బ్రహ్మచారిగా వదిలేసి ఉంటే, ఈరోజు ఈ బాధలు ఉండేవి కావు...’’ కోపంగా అన్నది సుగుణమ్మ.

‘‘అమ్మా, నువ్వు పిచ్చి దానివి... నాన్నగారిని మనకి దూరం చేసింది మధుబాలే... ఆ విషయం నువ్వు మరచిపోతున్నావు...’’ అంది వినత.

‘‘కానీ నాన్న ఆరోగ్యం దిగజారిపోవటానికి, అపరాధభావనతో ఆయన కృశించి పోవటానికి కారణం నీ వికృత చేష్టలే అన్న సంగతి మాత్రం నీవు మర్చిపోతున్నావు వినతా...’’ కోపంగా అంది సుగుణమ్మ.

‘‘అసలు నువ్వు కన్న తల్లివేనా?’’ తల్లి మీద విస్ఫులింగాలు కురిపిస్తూ అన్నది వినత.

‘‘దురదృష్టవశాత్తూ అవునమ్మా... నిన్ను కన్న పాపిష్టి తల్లిని నేనే...’’ కళ్ళు వత్తుకుంది సుగుణమ్మ.

‘‘అబ్బా, నీ చాదస్తం ఏమిటమ్మా? అయిన వాళ్లకి ఆకుల్లోనూ, కాని వాళ్లకు కంచాల్లోనూ వడ్డిస్తావు! వినత నీ ముద్దుల కూతురు... ఎప్పుడూ దాన్ని తప్పు పడతావేమిటి?’’ గుడ్డిగా చెల్లెలిని వెనకేసుకు వస్తున్న వేణును చూసి ముఖముఖాలు చూసుకున్నారు సుచిత్ర, సుగుణమ్మ...

***

ఆ సాయంత్రం తడబడే అడుగులతో ఆ  ఇంట్లోకి వచ్చింది మధుబాల.

‘‘ఓ... మధుబాల గారా? చాలా రోజులకి గుర్తు వచ్చినట్టుంది మా ఇల్లు!’’ వ్యంగ్యంగా అన్నాడు వేణు.

‘‘వేణూ, ప్లీజ్... బాబును ఇవ్వండి...’’ తగ్గు స్వరంతో తనలోని ఆవేశాన్ని నియంత్రించుకొంటూ అన్నది మధుబాల.

‘‘బాబు నీకే కాదు, నాకూ కొడుకే... వాడిని నాకు దూరంగా పెంచటానికి నేను ఒప్పుకోను... నువ్వు ఇక్కడికి వచ్చేయాలి...’’ శాసిస్తున్నట్టుగా అన్నాడు వేణు.

‘‘నేనంటే ఇష్టం లేని నీకు, నా కొడుకు ఎలా ఇష్టమయ్యాడు?’’ కసిగా ప్రశ్నించింది.

‘‘నువ్వంటే కాదు... నీ పద్ధతులంటే నాకు ఇష్టం ఉండదు... నీ ఇష్టం వచ్చినట్టు డబ్బును అందరికీ పంచటం ఇష్టం ఉండదు... నీ ఇష్టం వచ్చిన వాళ్ళతో పిచ్చి స్నేహాలు నాకిష్టం ఉండదు...’’

‘‘నాక్కూడా... మీలోని ధనదాహం అంటే ఇష్టం ఉండదు... అయిన వాళ్ళను డబ్బుకోసం అవమానించటం ఇష్టం ఉండదు... స్నేహంలోని మాధుర్యాన్ని అర్థం చేసుకోకపోగా, దురదృష్టవంతులను అర్థం చేసుకునే మనసు నీలో  లేకపోవటం నాకు ఇష్టం ఉండదు...’’

‘‘అయితే ఇప్పుడు ఏమంటావు?’’

‘‘మ్యూచువల్ కన్సెంట్ మీద విడాకులు తీసుకుందాం... స్వంత ఆలోచనలన్నవి లేకుండా మీకు లోబడి ఉండే ఒక అనుకూలవతిని చేసుకుని సుఖపడండి...’’

‘‘ఏం, నువ్వు కూడా ఎవరినైనా చూసుకున్నావా? అంత తేలికగా నన్ను వదిలేయటానికి సిద్ధ పడుతున్నావు?’’ వెటకారంగా అన్నాడు వేణు.

బాణం దెబ్బ తిన్న లేడిలా విలవిలలాడింది మధుబాల.

‘‘వేణూ... ఎందుకింత అమానుషంగా హర్ట్ చేస్తున్నావు నన్ను? ఇట్ ఈజ్ బ్రూటల్ యు నో?’’ ఆమె మాట పూర్తి అవుతూ ఉండగా పెరట్లోంచి వచ్చిన సుగుణమ్మ ‘‘అమ్మా, మధూ, ఎలా ఉన్నావే?’’ అంటూ ఆమెను దగ్గరకు తీసుకుంది.

‘‘అత్తయ్యా...’’ ఆమె నిస్సహాయత ఆక్రందనగా మారగా తల్లి లాంటి అత్తగారి భుజమ్మీద తల

వాల్చి రోదించింది.

"ఊరుకోమ్మా... ఊరుకో..." వీపు నిమురుతూ ఓదార్చింది సుగుణమ్మ.

"ఆఫీసు నుంచే వస్తున్నావా తల్లీ? బాబు పడుకున్నాడు... చాలా సేపైంది... ఇప్పుడు లేస్తాడేమో.. వాడు లేచే లోపుగా నువ్వు వేడిగా కాస్తంత కాఫీ తాగు..."

"ఉహు, వద్దత్తయ్యా..." అయిష్టంగా అన్నది.

మధ్యాహ్నం అన్నం తిన్నట్టు లేవు... రామ్మా..." అంది చేయి పట్టి వంటింట్లోకి తీసుకు వెళుతూ...

ఆమె మాట కాదనలేక వెంట వెళ్ళింది మధుబాల.

***




స్టీలు ప్లేట్ లో మిక్స్చర్ పోసిచ్చి, వేడి వేడి చిక్కని కాఫీ స్టీలు గ్లాసునిండా ఇచ్చింది సుగుణమ్మ.

ఆకలి మీద ఉండటం చేతనూ, అత్తగారిని బాధ పెట్టకూడదనీ త్వరత్వరగా తినేసి, కాఫీ

తాగేసింది మధుబాల. ఇంతలో లోపలికి వచ్చింది సుచిత్ర, "ఏమ్మా మధూ, ఎలా ఉన్నావు?" అంటూ...

"నేను బాగానే ఉన్నాను వదినా, మీరు ఎలా ఉన్నారు? ఎప్పుడు వచ్చారు??" అడిగింది మధు.

"ఉదయం వచ్చాను. రేపు వెళ్ళిపోతాను... ఇక్కడ మా దూరపు బంధువులుంటే అక్కడికి వెళ్ళి వస్తున్నాను. బాబు చాలా బాగున్నాడు మధూ... హార్టీ కంగ్రాట్స్..." అభిమానంగా భుజం చుట్టూ చేయివేసింది సుచిత్ర.

ఇంతలో ఉయ్యాల్లోంచి బాబు ఏడుపు వినపడింది... త్వరత్వరగా అక్కడికి వెళ్ళింది మధుబాల. బాబు పక్క తడిచేసి ఏడుస్తున్నాడు... త్వరత్వరగా వాడిని ఎత్తుకుని పొడైన నేపీని తీసి పక్కనే ఉన్న పొడి టవల్ తో తుడిచింది మధుబాల.

ఉయ్యాలలో తడిసిన బట్టలను తీసి బాత్రూమ్ లో బకెట్ లో వేసి వచ్చింది. సుగుణమ్మ అందించిన పొడి నేపీని వాడి మొలకు కట్టి, నేల మీదనే కూర్చుని, వాడిని అడ్డాలలో వేసుకుని జాకెట్ హుక్స్ విప్పి పాలివ్వసాగింది మధుబాల. అలవాటైన తల్లి పరిష్వంగం, స్పర్శ వాడికి భద్రతను కలిగిస్తున్నట్టు... ఉంగా ఉంగా శబ్దాలు చేస్తూ, ఆనందంగా పాలు తాగసాగాడు బాబి.

వాడిని మరీ మరీ ఎదకు హత్తుకుంటూ, కన్నీటిని అదుపులో పెట్టుకుంటూ... వాడి తల నిమురుతూ, కాళ్ళూ చేతులూ సవరిస్తూ కూర్చుంది మధుబాల. అరగంట తరువాత, వేణు వంటగదిలోకి వెళ్ళి తల్లితో ఏదో గుసగుసగా చెప్పి బయటకు వెళ్ళాడు. అతని బైక్ స్టార్ట్ చేసిన శబ్దం వినిపించింది.

"అమ్మా, మధూ... ఇదే మంచి తరుణం... వాడు ఏదో ఫోన్ కాల్ వచ్చిందనీ, అర్జెంట్ గా వెళ్లాలని, గంటలో వస్తానని, నిన్ను కదలనీయవద్దనీ చెప్పి వెళ్ళాడు... వాడికిప్పుడు వెళ్ళటం ఇష్టం లేదు కానీ తప్పనిసరి అయిందట. నువ్వు బాబును తీసుకుని, టాక్సీ లో వెళ్ళిపో

అమ్మా... మళ్ళీ నీ దగ్గరకు వచ్చి గొడవ చేస్తే పోలీస్ కంప్లైంట్ ఇస్తానని చెప్పు... తల్లిని, బిడ్డను విడదీసే హక్కు ఎవ్వరికీ, చివరికి ఆ బిడ్డ కన్నతండ్రికి కూడా లేదు. కొన్ని రోజులు సెలవు పెట్టి బిడ్డను కనిపెట్టుకో... వీలైతే మీ అన్నగారిని పిలిపించుకొని పుట్టింటికి వెళ్ళు... గొడవలన్నీ పోయి, మీ ఇద్దరి మధ్యా సామరస్యమంటూ ఏర్పడితే అప్పుడు ఇక్కడికి రావచ్చు... ఇంతకన్నా నేనేమీ చెప్పలేను... ఇదిగో వేడివేడిగా అన్నం తినేసి వెళ్ళు...” అంటూ కంచం లో అన్నం పెట్టి చారు పోసి, కూర పెట్టి అందించింది సుగుణమ్మ.

ఆమె సౌజన్యానికి మనసులోనే వేయి దండాలు పెట్టుకొని, రెండు నిమిషాల్లో అన్నం తినేసి, ఆమె పాదాలకు మ్రొక్కింది మధుబాల.
‘‘వెళ్ళిరా మధూ... బాబు, నువ్వూ జాగ్రత్త...” ఆప్యాయంగా భుజం తట్టింది సుచిత్ర...

‘‘థాంక్ యూ వదినా...” అప్రయత్నంగా ఆమె భుజమ్మీద తలవాల్చింది.

కాబ్ బుక్ చేసుకోగానే ఐదు నిమిషాల్లో వచ్చేసింది. అత్తా, ఆడబిడ్డలకు చెప్పేసి, బాబుతో సహా కారెక్కింది మధుబాల.

***

‘‘నేను చెప్పిందేమిటి, మీరు చేసిందేమిటి అమ్మా?” ఆగ్రహంగా అరవయ్యో సారి ప్రశ్నించాడు వేణుగోపాల్. అప్పటికి అరగంట అయింది అతను ఇంటికి వచ్చి. రాగానే ఉయ్యాలలో బాబు, ఇంట్లో మధుబాల లేకపోవటంతో ఏం జరిగిందో అతనికి అర్థమై పోయింది. తల్లిని భస్మం చేసేలా చూసాడు. ఆవిడ లెక్క చేయలేదు. నిర్లక్ష్యంగా తనను కానట్టు ఊరుకుంది. అక్క మీద అరిచాడు. అభావంగా చూసి మౌనంగా ఉండిపోయింది సుచిత్ర.

బిడ్డను అడ్డం పెట్టుకుని మధుబాలను అట్టి పెట్టుకోవచ్చు అన్న అతని ఆలోచన ఇలా భంగపడేసరికి తట్టుకోలేక తల్లిని దూషించటం మొదలు పెట్టాడు. కడుపున పుట్టిన సంతు కన్నా బయటి నుంచి వచ్చిన వాళ్ళపై చూపే ప్రేమ తన తల్లికి తగదని చెప్పాడు. ఈ రోజు

తప్పించుకున్నా, మళ్ళీ వెళ్లి బిడ్డను తీసుకువచ్చేస్తానని చెప్పాడు. అన్నీ వింటూ ఊరుకుంది సుగుణమ్మ.

గంట గడిచింది. అలసిపోయి, కుర్చీలో వెనక్కు జారగిల బడి కూర్చున్నాడు వేణుగోపాల్. అనుక్షణమూ కనుల ముందు పసివాడి ముద్దు ముఖం, బోసి నవ్వులూ కదలాడుతున్నాయి. రాక్షసి... తన బిడ్డను తన నుంచి వేరు చేయటానికి ఆమెకి ఏం హక్కుందని? ఎందుకో అకస్మాత్తుగా తండ్రి గుర్తు వచ్చి ఏడుపు ముంచుకు వచ్చింది... రెండు చేతుల్లో ముఖం దాచుకొని కన్నీరు కార్చసాగాడు...

అన్నీ చూస్తూనే ఉన్న సుగుణమ్మ మనసు నీరైపోయింది... చటుక్కున దగ్గరకు వచ్చి, దగ్గరగా నిలబడి, అతని ముఖాన్ని తన పొట్టలో దాచుకుంది.

‘‘అమ్మా...” ఏదో తెలియని దుఃఖంలో రోదించాడు వేణు.

‘‘ఎందుకు? ఎందుకమ్మా ఇలా అయింది? నాన్న మనల్ని విడిచి ఎందుకు వెళ్ళిపోయారు? ఇప్పుడు బుజ్జిగాడు కూడా మనకి దూరమై పోయాడా? మధూ ఎందుకమ్మా వెళ్ళిపోయింది? బాబును ఇక నేను ఎప్పటికీ చూడలేనా?” అంటూ ఏదేదో అడుగుతూ ఉంటే, ఆ ఉధృతి తగ్గే వరకూ అతని క్రాఫ్ లో చేతివేళ్లు దూర్చి, రాస్తూ ఉండిపోయింది సుగుణమ్మ.

‘‘వేణూ, ఏదైనా స్నేహంతో సాధించాలి బాబూ... మధుబాల మీద పగ పెట్టుకుని నువ్వు చేసేదేం ఉండదు. చూడు, మొన్న  బేబీ కేర్ సెంటర్ నుంచి బాబును తీసుకు వచ్చేశావు. అది ఎంత నేరమో తెలుసా? నీ మీద కిడ్నాపింగ్ నేరం క్రింద మధు కేస్ పెడితే? మంచి అమ్మాయి కాబట్టి చట్టం ద్వారా కాకుండా తనంతట తాను  ఇక్కడికి వచ్చి బాబును తనతో తీసుకుపోయింది. కన్నతండ్రివి అయినంత మాత్రాన ఆ తల్లిని మానసిక క్షోభకు గురి చేసి పిల్లాడిని ఎత్తుకురావటం సబబు కాదు, గొప్ప కాదు...

చూడు, రెండు రోజుల స్పర్శకు నువ్వే బాబును వదిలి ఉండలేకపోతే, కన్న కడుపు... పాలిచ్చే

తల్లి... తనకి ఎంత బాధాకరంరా ఆ వియోగం? వినత మాటలు వినకు... దానికి వంటి నిండా స్వార్థం నిండిపోయింది... అది చెప్పిన ప్లాన్లు అన్నీ అర్థరహితాలు... వివేకంతో ఆలోచించు నాయనా... పగతో సాధించలేనిది ప్రేమతో సాధించవచ్చు... అనవసరమైన పంతాలకు పోయి ఆఫ్టర్ ఆల్ రెండు లక్షల రూపాయల కోసం మధుకి పగవాడివి అయ్యావు... ఆ పిల్ల ఎంతో ఉత్తమురాలు... మీరిద్దరూ విడిపోతే, నువ్వే దురదృష్టవంతుడివి అవుతావు కానీ ఆ పిల్ల కాదు...

నేనూ నీకు శాశ్వతం కాదురా... మీ నాన్నగారి వెంటే నేనూ వెళ్ళిపోవలసిన దాన్ని... తల్లిలా నిన్ను చూసుకునే నీ భార్యను దూరం చేసుకోకురా బాబూ... తనకు  దగ్గరవటానికి ప్రయత్నించు... నీ తప్పులు ఎలా సరిదిద్దుకోవాలో, ఆమెకి ఎలా చేరువ కావాలో నువ్వే నిర్ణయించుకో... నీ తల్లిగా ఇంతకన్నా ఇంకేమీ చెప్పలేను..." కొంగుతో కన్నీరు తుడుచుకుంది సుగుణమ్మ.

ఏమీ మాట్లాడలేనట్టు కళ్ళు మూసుకుని అలాగే ఉండిపోయాడు వేణు.

***

మూడు నెలల అనంతరం ఆరోజు...

బయట బాగా వర్షం పడులోంది.

డాలి ఫ్లాట్ లో కూర్చుని తాగుతున్నాడు కార్తీక్. మనసును ఎవరో రంపం పెట్టి కోసేస్తున్నట్టుగా అనిపిస్తోంది. చిత్రం ఏమిటంటే ఎంత తాగినా అతని మనసులోని బాధ తగ్గటం లేదు.

డాలీ మీద ఉన్న మోహం కొద్దీ, ఐశ్వర్యను వదిలి ఇక్కడికి వచ్చేసాడు. డాలీకి ఉన్న స్నేహాలు, అఫైర్స్  తనకు తెలుసు. తనకూ డాలీ కాకుండా నిమ్మీ, సిమీ లతో అఫైర్స్ ఉన్నాయి. కానీ అవి కేవలం కాలక్షేపం మాత్రమే. డాలీ అందం, శరీరం మీదున్న మోహం తనకి ఇంక ఎవరి మీదా కలగలేదు... ఈ మధ్య డాలీ ప్రవర్తన మరీ విశృంఖలంగా తయారైంది. నిన్న పబ్ కి తామిద్దరూ

వెళ్ళారు. అక్కడ డాన్స్ చేస్తూ తన కళ్ళ ముందే ఇద్దరు కొలీగ్స్ తో చాలా విచ్చలవిడిగా ప్రవర్తించింది డాలీ... అంతే కాక, వాళ్ళతో కలిసి కారులో ఎక్కడికో వెళ్ళిపోయింది...
తన జీతం, సేవింగ్స్ అంతా డాలీ కోసమే ఖర్చు పెట్టాడు తను. ఆమె కోసం రోజూ వంటలు చేసి పెట్టాడు. ఇతర స్త్రీల వంక చూడటం మానేసాడు కూడా. అయినా  ఆమెకి ఈ మధ్య తనంటే నిర్లక్ష్య ధోరణి ప్రబలమై పోయింది.

'నిజం చెప్పు, డాలీని నువ్వు ప్రేమించావా?' మనసు అతన్ని నిలదీసింది.

'ఊ... ఏమో నాకు తెలియదు...'

'కాదులే, నిజం చెప్పు... ఆమె బావుంటుంది... ఎక్కడి అవయవాలు అక్కడ అమర్చినట్టు సొంపుగా ఉంటాయి... ఆమెతో శారీరక అనుభవం మరింత బాగుంటుంది... సిగ్గు అనేది పడకుండా, మగవాడికి ఎలా ఇష్టమైతే అలా ప్రవర్తిస్తూ, శృంగార పూరితమైన మాటలతో రెచ్చగొడుతూ... నిన్ను సుఖాల అంచున నిలబెడుతుంది అని నీ భావన... ఆ ఒక్కటే నీవు ఆమెను ఇష్టపడటానికి కారణం తప్ప, నీది ప్రేమ కానే కాదు... కేవలం వ్యామోహమే...'

'ఏమో మరి... కావచ్చు...'

'మీరంతా పలాయన వాదులు... పెళ్ళి అనే బంధంలో చిక్కుకుంటే ఇలా ఇష్టం వచ్చినట్టు వ్యభిచరించకూడదు... ఇష్టం వచ్చినవాళ్ళతో కోర్కెలు తీర్చుకోవటానికి వీలు కాదు. బంధాలు, బాధ్యతలు ఏర్పడతాయి... ముద్దైనా, ముచ్చటైనా భార్య ఒక్కరితోనే... పిల్లా, పాపా పుట్టుకు వస్తారు... ఇల్లూ, సంసారం, పిల్లల చదువులూ, తిండీ తిప్పలూ... ఇలా ఎన్నో పనుల్లో రకరకాల విధులు నిర్వర్తించాల్సి వస్తుంది... అది తప్పించుకోవటానికే మీ యువత 'లివిన్' అంటూ పారిపోతున్నారు... మీకంటూ స్వంత అభిప్రాయాలు లేవు... లేవు గాక లేవు...' మనసు రెచ్చిపోయి తనను నిలదీస్తుంటే, ఆ ఆలోచనలను ఆపుకోవటానికి టీవీ ఆన్ చేసాడు కార్తీక్. అతని తలపుల్లో ఐశ్వర్య కదలాడింది.
ఐశ్వర్య ఇలాగే ఉండేదా? ఉహు... ఐశు తనను నిజంగా ప్రేమించింది. ఎప్పుడూ తన డబ్బును

ఆశించలేదు… ఎన్నో రకాల వంటలు చేసి, ఏ సమయంలోనైనా సరే కొసరి కొసరి వడ్డించేది… ప్రతీ వారం తలకు నూనె రాసి, నలుగు పెట్టి, తల అంటి స్నానం చేయించేది… తనకు ఎప్పుడేనా జ్వరం వస్తే అల్లాడి పోయేది.  ఆమెను ఒంటరిని చేసేసి తన దారి తాను చూసుకుని వచ్చేసాడు. తనసలు మనిషేనా? కనీసం స్నేహధర్మాన్ని అయినా పాటించలేదే!  ఆమె పేరు తలవటానికి అయినా తనకి అర్హత లేదు గాక లేదు…




“ఏమిట్రా మధూ, ఎన్నాళ్ళని ఉద్యోగానికి లీవు పెడతావు?” టిఫిన్ ప్లేట్ చేతికి అందిస్తూ

అడిగింది పూర్ణమ్మ.

బాబుతో పుట్టింటికి మధూ వచ్చి వారం దాటుతోంది...

‘‘ఏమిటోనమ్మా, నాకేమీ అర్థం కావటం లేదు... వీడిని  బేబీ కేర్ సెంటర్ లో వేస్తే, వేణు తీసుకు వెళ్ళకుండా ఉండడు. నాకతనితో కాపురం చేయాలని లేదు... అటు ఉద్యోగం వదులుకునే పరిస్థితీ కాదు... ఏం చేయనమ్మా  నేను?’’ నిస్సహాయంగా చూసింది మధుబాల.

‘‘పోనీ, కొన్నాళ్ళ పాటు నేను నీతో వచ్చి ఉండనా మధూ?’’ అడిగింది పూర్ణమ్మ.

‘‘వద్దమ్మా, నాన్నగారిని చూసుకోవాలి నువ్వు. నాన్నమ్మా, ఇంకా చంటి పాప... నీ అవసరం ఇక్కడే ఎక్కువ అమ్మా... నేనే ఏదో ఒక మార్గం ఆలోచించుకుంటాను...’’ అంది మధుబాల.

‘‘వదినా, చూసావా, వీళ్ళిద్దరికీ ఎన్ని పోలికలో?’’ ఇద్దరు పిల్లల్నీ ఒడిలో కూర్చో బెట్టుకుని, బేబీ ఫుడ్ తినిపిస్తు న్న నిర్మల అంది.

అవును... ఆరు నెలలు నిండుతున్న పసివాళ్ళు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నారు.  కీర్తి, బాబి

ఇద్దరూ ఒకరి జుట్టు మరొకరు పట్టుకుని లాగుతూ బోసి నవ్వులు నవ్వుతూ, కేరింతలు కొడుతూ ఫుడ్ తింటున్నారు. గిరి, మధు ఒకేలా ఉంటారు. చిన్నప్పుడు గిరికి ఫ్రాక్ వేసి, కృష్ణుడి జడ వేసి తీసిన ఫోటో, మధు చిన్నప్పటి ఫోటోలు ఒక్కరివే అనిపించేలా ఉంటాయి పోలికలు... అందుకే తండ్రి పోలిక వచ్చిన కీర్తి, తల్లి పోలిక వచ్చిన బాబి ఒకేలా ఉన్నారు, కవల పిల్లలు అంటే నమ్మేలా...

‘‘అవును వదినా...’’ నవ్వింది మధుబాల.

‘‘నువ్వేమీ అనుకోకపోతే...’’ సంశయంగా ఆగింది నిర్మల.

‘‘ఫర్వాలేదు వదినా, ఏమీ అనుకోను చెప్పు...’’ ప్రశ్నార్థకంగా వదిన గారివైపు చూసింది మధుబాల.

‘‘నువ్వు వేణు అన్నయ్య దగ్గరకు వెళ్ళిపోవటం మంచిది... ఆహా, నువ్విక్కడ ఉండటం నాకు

అభ్యంతరం కాదు... ఎన్నాళ్ళయినా ఉండొచ్చు... కానీ చూడు... మన ఇరుగూ పొరుగూ గుసగుసలాడుతున్నారు... అత్తయ్య చాలా ఇబ్బంది పడుతున్నారు...'' చెప్పలేక చెప్పింది నిర్మల.

మధుబాలకు ఉప్మా మింగుడు పడటం లేదు... చెంచాతో అటూ ఇటూ కెలుకుతూ కూర్చుంది...

''అయామ్ సారీ వదినా... మామయ్య గారి ఆరోగ్య పరిస్థితి నీకు తెలియంది కాదు కదా... నీ కాపురం గురించి చాలా బెంగ పడుతున్నారు. బీపీ కంట్రోల్ అవటం లేదు. మొన్న డాక్టర్ గారు కూడా వచ్చి చాలా కోప్పడ్డారు... మళ్ళీ స్ట్రోక్ రాకుండా జాగ్రత్త పడాలి మనం... నువ్వెళ్ళి కాపురం చేసుకుంటే ఆయన కన్నా సంతోషపడేవారు ఎవ్వరూ ఉండరు... ఒక్క సారి సామరస్యంగా ఆలోచించు...

మా బాబాయ్ లాగా తాగుడూ, పేకాట వ్యసనాలు లేవు వేణు అన్నయ్యకు... మా మావయ్య

లాగా అనుమానరోగం లేదు. నిన్ను ప్రేమగా చూసుకుంటారు. అత్తగారి సాధింపులు కూడా లేవు  నీకు. వినతతోనే సమస్య. ఆమెను రానీయకుండా ఉంటే చాలు... ఆ విషయం నేను సుగుణ పిన్నిగారితో మాట్లాడతాను...

జీవితం అంటే మన హక్కులూ, వ్యక్తిత్వాలే కాదు కదా వదినా... కొంచెం రాజీ, చాలా సర్దుబాటు కూడా... నువ్వు చదువుకున్నదానివి... క్షమాగుణం ఎంత ముఖ్యమో నేను చెప్పాల్సిన అవసరం లేదేమో...  అదీగాక...'' ఆగింది నిర్మల...

''ఊ.. చెప్పు వదినా...''

''బాబికి తండ్రి ప్రేమను దూరం చేసే హక్కు నీకు లేదు వదినా...'' కొరడా దెబ్బలా తగిలింది ఈ మాట మధుబాలకి.

''అవున్రా మధూ, నిర్మల చెప్పింది నిజమే... నాన్నలందరూ కూతుళ్ళకి మంచి వాళ్లేనే...

వాళ్ళతో ఎన్ని బాధలు పడ్డారో అమ్మలకే తెలుసు...” చెప్పింది పూర్ణమ్మ కాఫీ గ్లాసు అందిస్తూ...

నిజమేనా? అమ్మకి నాన్న వలన కష్టాలు వచ్చాయా? ఇబ్బందులు పడిందా? ఏమో తనకు తెలియదు... ఇది ఇంటింటి రామాయణమా? సర్దుకుపోయి, బట్టలు సర్దుకుని వెళ్ళాల్సిందేనా? తల విదిలించింది మధుబాల.

నిర్మల కాబట్టి తన శ్రేయస్సును, కుటుంబ పరిస్థితిని ఆలోచించి ఇంత సవివరంగా చెప్పింది... ఆమె స్థానంలో వేరే ఎవరున్నా తనకు నిత్యం సాధింపులు తప్పి ఉండేవి కావు... ఆలోచనలో పడింది మధుబాల.

ఆ రాత్రి బాబిని ఉయ్యాలలో వేసి, వాడు పడుకున్నాక, తాను నాయనమ్మ పక్కలో పడుకుంది మధుబాల.

‘‘నానమ్మా, నాకేం చేయాలో తెలియటం లేదు...’’ అంది బేలగా...

‘‘అమ్మీ, నీకు మీ అత్తగారితో ఏం లేదు కదా...’’ మనవరాలి వీపు రాస్తూ అడిగింది అంజమ్మ.

‘‘లేదు నానమ్మా... అమ్మలాగే చూసుకుంటుంది... ఇప్పుడు వినత మీద తనకీ కోపమే... మామయ్య గారు పోయాక ఆవిడ ఆరోగ్యమూ అంత బాగుండటం లేదు... దానికి తోడు ఈ బాధ కూడా...’’

‘‘మధూ... మీ ఆయన నిలబెట్టి డబ్బులు అడిగాడనే కదమ్మా నీ బాధంతా? ఏ సమస్యనైనా అన్ని వైపుల నుంచి ఆలోచించాలి కదా... అతనికి ఏం అవసరం వచ్చి అడిగాడో మనకేం తెలుసు? అదీగాక, గిరి తీసుకు వచ్చింది అప్పుగానే కదా...దానికి నువ్వు మనసు పాడుచేసుకోకూడదు...’’

‘‘కానీ నానీ, అవి నేను కష్టపడి సంపాదించిన డబ్బులు కదా... వాటి మీద అతనికి ఏం

హక్కుంటుంది?''

''పెళ్లి అయి, మీరిద్దరూ ఏకమయ్యాక ఇంకా నీదీ, నాదీ ఏమిటే? ఇద్దరికీ హక్కుంటుంది... నీ డబ్బు, నా డబ్బు అనే తేడా ఉండదు... ఇప్పుడు నీ బాబు నీ స్వంతమని ఎలా అనుకుంటున్నావో, అతనూ అలాగే అనుకుంటాడు కదా...''

''ఎలా? కష్టపడి, నవమాసాలు మోసి, నొప్పులు పడి  కన్నది నేను... పాలిచ్చి పెంచుకుంటున్నది నేను... ఇప్పుడు వచ్చి హక్కు అనగానే వస్తుందా?'' ఉక్రోషంగా అన్నది మధుబాల.

బోసినోటితో నవ్వింది అంజమ్మ...

''ఎందుకు రాదు? అతనే కదా నీకీ బాబును ఇచ్చింది? పంతాలకు పోయి బాబుకు తండ్రిని దూరం చేయకు మధూ... నువ్వు వెళ్ళటమే మంచిది అమ్మా...''

‘‘కానీ, అతను చాలా కోపిష్టి వాడు నానమ్మా... చాలా పరుషంగా మాట్లాడతాడు... ఎంత బాధగా, అవమానంగా అనిపిస్తుందో తెలుసా?’’

‘‘పిచ్చి పిల్లా... నువ్వు ఉద్యోగం చేసే ఆఫీసులో యజమాని నిన్ను ఎప్పుడూ కోప్పడడా? నీ తప్పున్నా, లేకపోయినా కూడా... అదిలించటం అతని లక్షణం కదా... మరి నువ్వు ఆఫీసుకు వెళ్లనని, ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేయాలని అనుకున్నావా ఎప్పుడైనా?’’

‘‘అదీ, ఇదీ ఒక్కటేనా?’’

‘‘ఊహు, జీవితం ఉద్యోగం కన్నా చాలా ముఖ్యమైనది... జీతం ఇచ్చే యజమాని కోప్పడితే పట్టించుకోము... జీవిత భాగస్వామి కోపానికి మనసు బాధ పెట్టుకుంటాము... దీన్ని కూడా తేలికగా తీసుకుంటే, నువ్వు అతన్ని చాలా సులువుగా జయించగలవు మధూ... మనుషుల బలహీనతలను క్షమిస్తేనే వాళ్ళని ప్రేమించగలం...’’

అంజమ్మ మాటలు చేదుగా ఉన్నా, వాటిల్లోని నిజం మధుబాలకు అవగతం అయింది.

‘‘సరే, మీరంతా చెబుతున్నారు కాబట్టి రేపు నేనోసారి మా అత్తగారితో మాట్లాడతాను...’’ చెప్పింది మధుబాల కళ్ళుమూసుకుంటూ...

పెళ్ళి అయాక పుట్టిల్లు పరాయిదే అన్న విషయం మరోసారి అర్థమైంది మధుబాలకు.

*******************************************

‘‘ఏమ్మా ఐశూ, మధూ ఎలా ఉంది?’’ కాల్చిన వంకాయ పచ్చడి గిన్నెలో తీసుకు వచ్చి డైనింగ్ టేబుల్ మీద పెడుతూ అడిగింది అన్నపూర్ణ.

‘‘మధు బావుంది పిన్నీ... రేపో ఎల్లుండో వచ్చేస్తుంది... వాళ్ళ అత్తగారింటికే వెళుతుంది బహుశ:’’

‘‘ఓ, మంచి వార్త చెప్పావు ఐశూ... చిన్న చిన్న విషయాలకు పంతాలకు పోవటం అంత

మంచిది కాదు... ఆ ఆడపడుచును దూరంగా ఉంచితే సరి...''

‘‘అవును పిన్నీ... మధు వాళ్ళ అత్తగారు దానికి హామీ ఇచ్చారట... ఇక వినతను రానీయను అని...''

‘‘పోనీలే పాపం... అవునూ, పది దాటుతోంది, నువ్వింకా తయారు కాలేదేమ్మా? ఆఫీసుకు సమయం కావటంలా?''

‘‘ఈరోజు సాయంత్రం నాలుగింటికి ఒక ఇంటర్వ్యూ ఉంది పిన్నీ... కంపెనీ మారాలని అనుకుంటున్నాను. కొత్తగా పెట్టిన ఒక కంపెనీలో ఇంటర్వ్యూ... జీతం బాగుంది... కొంత చేంజ్ కావాలనిపిస్తోంది... ఇదిగో సబ్జెక్ట్ చదువుకుంటున్నాను...'' చేతిలో బుక్ చూపిస్తూ అన్నది.

‘‘బాగా చెయ్యి అయితే... నేను వెళతానులే... నువ్వు చదువుకో... వేడి వేడిగా అన్నం తినేయ్ పచ్చడి వేసుకుని...నెయ్యి కలుపుకో... సరేనా?''

“సరే పిన్నీ, థాంక్ యు...” నవ్వింది ఐశ్వర్య.

సాయంత్రం నాలుగైదు విడతలుగా సాగిన ఇంటర్ వ్యూ లో, గ్రూప్ డిస్కషన్ లో ఐదుగురిని సెలెక్ట్ చేసారు. ఐశ్వర్య కూడా సెలెక్ట్ అయింది. ఒక నాలుగైదు రోజుల్లో జాయిన్ అవమని చెప్పారు.

ఆరాత్రి అమ్మానాన్నల్ని చూసి చాలా రోజులైందని ఊరికి బయలుదేరింది ఐశ్వర్య.

తన కోసమే బెంగ పెట్టుకున్న అమ్మా నాన్నల్ని ఓదార్చి, మూడో రోజు వెనక్కి వచ్చేసింది ఐశ్వర్య. ఆ మర్నాడే కొత్త ఆఫీసుకు వెళ్ళి జాయినింగ్ రిపోర్ట్ ఇచ్చి ఉద్యోగంలో చేరింది.

కొత్తగా పెట్టిన ఫర్మ్ కాబట్టి అంతా కొత్త స్టాఫ్... ఇంకా వర్క్ పూర్తిగా మొదలవలేదు. అంచేత పెద్దగా పనులేవీ లేవు. ఆఫీసు వాతావరణం కూల్ గా, రిలాక్స్డ్ గా అనిపించింది.

రాత్రి ఇంటికి వచ్చిన తరువాత చాలా ప్రశాంతంగా తల స్నానం చేసి, పున్నమి వెన్నెలను

చూస్తూ బాల్కనీలో కూర్చుంది. ఈరోజు ఎందుకో తెలియదు పదే పదే కార్తీక్ గుర్తు  వస్తున్నాడు. ఎడారి ఇసుకతిన్నెలను, సరస్సు అలలుగా భావించి పరుగు తీసే అమాయకపు పాంథుడిలా తోచాడు. ఎక్కడున్నాడో, ఎలా ఉన్నాడో...

ప్రతీ వారం అమల ఇంటికి వెళ్ళటం బాగా అలవాటు అయింది తనకు... రూపతో ఆడుకోవటం, చదువు చెప్పటం, కార్తీక్ అమ్మానాన్నలతో కలిసి గడపటం... ఇవన్నీ మనసుకు ఎంతో సాంత్వన కలిగిస్తున్నాయి. అమల కూడా తోడబుట్టిన దానిలాగే తనను ఆదరిస్తోంది... ఒక్కోసారి అనిపిస్తుంది, తనకి ఎందుకీ బంధాలు అని... కానీ నిష్కల్మషమైన వారి ప్రేమను కాదని అనటానికి మనసూ ఒప్పటం లేదు...

అప్పట్లో ఇలా బాల్కనీలో, ఉయ్యాలలో కూర్చుని వెన్నెలను చూస్తూ పాటలు పాడేది తను... నైట్ క్వీన్ గుబాళింపులను మనసు నిండా నింపుకుంటూ, తన జుట్టుతో ఆడుకుంటూ, హాయిగా ఆనందించే వాడు కార్తీక్. ఉన్నట్టుండి అకస్మాత్తుగా ఆకలేస్తోంది అనేవాడు... వంటింట్లోంచి వేడి పాలు, బిస్కట్లు తెచ్చిచ్చేది తను. కార్తీక్ కోసమని ఎప్పుడూ ఫ్రిజ్ లో పాలు రెడీ గా ఉంచేది.

అలాగే వంటింటి స్టీలు డబ్బాల్లో స్నాక్స్, బిస్కట్స్ కూడా... ఇప్పుడు ఎలా ఉన్నాడో... ఆ డాలీతో సంతోషంగా ఉన్నాడా?

అసలు నిన్ను వదిలేసిన వాడి గురించిన ఆలోచనలు నీకెందుకు? – అంతరాత్మ నిలదీసింది.

'కానీ వాడు నావాడు... మంచి చెడూ తేడా తెలియని పసివాడు... తనకేం కావాలో తనకే తెలియని అమాయకుడు...' అనుకుంది ఐశ్వర్య... గుండెలోతుల్లోంచి వెలువడిన నిట్టూర్పు కనురెప్పలను తోసుకుంటూ కన్నీటి ముత్యంగా మారి బుగ్గపై నిలిచింది...



‘‘అత్తయ్యా, బాబుని మీ చేతుల్లో పెడుతున్నాను. తప్పని సరి కావటం వలన, మీరు మరీ మరీ రమ్మని చెప్పటం వలనా ఇక్కడికి వచ్చాను… నా మనసు ఇంకా కుదుట పడలేదు… అంచేత… అంచేత…”

‘‘చెప్పమ్మా మధూ… ఏమీ సంకోచ పడకు…”

‘‘కొన్నాళ్ళపాటు మీ గదిలో పడుకుంటాను… ఈ విషయంలో నన్ను బలవంత పెట్టకండి…” దీనంగా అన్నది మధుబాల.

అర్థం చేసుకున్నట్టుగా తల పంకించింది సుగుణమ్మ. కొడుకు మీద రవంత జాలి వేసింది కానీ, ‘కాలమే అన్ని సమస్యలకూ పరిష్కారం చూపించగలదు’ అనుకొంది.

మనవడు ఇంటికి వచ్చిన శుభ సందర్భంగా ఆరోజు భోజనంలోకి పాయసం చేసింది.

వేణుకి కూడా, కొడుకును ఎత్తుకుని మధు ఇంటికి వచ్చేసినందుకు ఎంతో సంతోషం కలిగింది. మధు తనతో మాట్లాడకపోయినా పెద్దగా బాధ అనిపించలేదు… ఇద్దరి మధ్యా అపార్థాలు పోవటానికి కొంచెం సమయం పడుతుంది. ఆమె ఇంట్లో మళ్ళీ తిరుగుతూ ఉంటే హాయిగా అనిపిస్తోంది. ఇక తాను బాబుకి దూరంగా ఉండిపోనక్కర లేదు… బాబిని ఎత్తుకుంటుంటే అతని గుండె పితృ గర్వంతో ఉప్పొంగుతున్నది.

అతనికి చాలా చికాగ్గా ఉంది. ఆ రోజు కూడా బిల్డర్ అర్జెంట్ గా డబ్బు తెచ్చి కట్టమంటేనే బావమరిదిని డబ్బు కోసం తొందర చేసి తీసుకున్నాడు. ఇప్పుడు సగం సగం అపార్ట్మెంట్ కట్టి, డబ్బు తీసుకుని ఆ బిల్డర్ పరారీ అయిపోయాడు. మొత్తం యాభై లక్షలు తానిచ్చినవి… వాడు ఎప్పుడు దొరుకుతాడో, అసలు తన డబ్బు వెనక్కి వస్తుందో లేదో తెలియదు… డబ్బు పోయినందుకు చాలా బాధగా ఉంది కానీ, దాన్ని అధిగమించేందుకు, కోపాన్ని చిరాకును అణచుకోవటానికి ధ్యానం చేయటం అలవాటు చేసుకుంటున్నాడు.

మధుబాలను చూస్తూంటే అతనికి పెళ్ళైన తొలిరోజులు గుర్తు వస్తున్నాయి. తమ హనీమూన్ గుర్తు వచ్చింది. మధు కోడలిగా ఆ ఇంట అడుగుపెట్టిన రోజుల్లో, మహాలక్ష్మిలా ఆమె ఇంట్లో తిరుగుతూ ఉంటే, ఆమ పద మంజీర నాదాలు తన గుండెల్లో మ్రోగుతూ ఉంటే... ఎంత బావుండేవో ఆ రోజులు... తనకి వేరే అమ్మాయిలు తెలియరు. నిజానికి తాను అంత రొమాంటిక్ పర్సన్ కాదు కూడా... అలాంటిది మధు సంబంధం వచ్చిన వెంటనే బిర్లా మందిర్ లో ఆమెను కలిసిన తొలి క్షణాలు ఏమిటో కానీ, మనసు ఆమె వశం అయిపోయింది... కాకపోతే తన నెత్తి మీదనే తిష్ట వేసుకున్న 'కోపం' అనే దేవత వలన, వినత చెప్పిన మాటలు విని, ఆ గుడ్డి ప్రేమ వలన మధును దూరం చేసుకున్నది తానే... వేణు మనసు బాధగా మూల్గింది.

***

"ఏమిటిది బావా, కూరగాయలతో యుద్ధమా?" పరిహాసంగా అన్నాడు పవన్ ఎదుట కూర్చుంటూ వేణు. ఉల్లిపాయలు చాకుతో కోస్తున్న పవన్ కళ్ళ వెంబడి నీళ్ళు కారుతున్నాయి. కళ్ళు నులుముకుంటూ అవునన్నట్టు నవ్వాడు.

"ఏమైంది, మీ వంటామె సావిత్రి లేదా?"

"లేదు బావా... వాళ్ళ తల్లిగారు చనిపోతే ఊరికి వెళ్ళింది..."

"మరి వినత? వినతను తరిగి ఇమ్మనలేక పోయావా?"

"వినత ఎక్కడుంది బావా? నాలుగు రోజులు అయింది ఫ్రెండ్స్ తో 'అరకువేలి టూర్ కి వెళ్ళి... రేపు అక్కయ్య వస్తోంది... నేను ఆఫీస్ కి లీవ్ పెట్టి వంట చేస్తున్నాను... వినతను టూర్ పోస్ట్ పోన్ చేసుకోమని ఎంత బ్రతిమిలాడినా వినలేదు..." శుష్కంగా నవ్వాడు పవన్.

మొట్టమొదటి సారిగా పవన్ వైపు నుంచి ఆలోచిస్తే వినత ప్రవర్తన చాలా విరుద్ధంగానూ, తనకు అవమానకరంగానూ అనిపించింది వేణుకు. తనూ, తల్లీ కలిసి అతి గారాబం చేసి వినతకు ఆడింది ఆటా, పాడింది పాటా అయ్యేలా చేసారు. దాంతో మొండిగా తయారైంది... తన

గురించే తప్ప ఎదుటివారి గురించి ఆలోచించటం మానేసింది.

“అయామ్ సారీ బావా... అదిలా తయారవటానికి కారణం తొంభై శాతం నేనే... నన్ను క్షమించు...” పవన్ రెండు చేతులూ పట్టేసుకున్నాడు పశ్చాత్తాపంతో వేణు.

“ఇట్స్ ఆల్రైట్ బావా... మా ఖర్మ ఇలా ఉంటే నువ్వు మాత్రం ఏం చేస్తావ్?” అని తరిగిన కూరలతో పాటుగా వంటింట్లోకి నడిచాడు పవన్.

“అత్తయ్య ఎలా ఉన్నారు?” గిల్టీ గా ఫీల్ అవుతూనే అడిగాడు వేణు.

“ఫర్వాలేదు... నిద్రపోతున్నట్టుంది...” ముక్తసరిగా చెప్పాడు పవన్.

వేణుకి మాత్రం, ‘ఇంక నువ్వు వెళ్ళొచ్చు’ అని చెప్పినట్టు అయింది. బరువుగా నిట్టూరుస్తూ లేచి వెళుతున్నానని చెప్పి, అక్కడనుండి ఇంటికి వచ్చేసాడు.

ఇంటికి వచ్చేసరికి, సోఫాలో కూర్చుని టీవీ లో రామాయణ ప్రవచనం వింటున్న తల్లీ, వంటింట్లో నిలబడి, స్టవ్ మీద గిన్నెలో  కూర కలుపుతున్న భార్యా కనిపించారు. వినతకీ, మధుకీ ఉన్న వ్యత్యాసం బాగా అర్థమైంది వేణుకి.

***

ఆఫీసుకు రాగానే ఐశ్వర్యకు బాస్ నుంచి కబురు వచ్చింది.

“నిన్న రాత్రి మీ కొత్త టీం లీడర్ జాయిన్ అయాడు... వెళ్లి కలిసి రా ఐశ్వర్యా...”

“ష్యూర్ సర్...” చెప్పి టీం లీడర్ డెస్క్ దగ్గరికి వచ్చి వెయిట్ చేస్తూ  కూర్చుంది. సీట్ ఖాళీగా ఉంది...

“యస్... వాట్ కాన్ ఐ డూ?” చిరపరిచితమైన గొంతు వినగానే చివ్వున తలెత్తి చూసి

ఆశ్చర్యపోయింది. అటు అతని పరిస్థితీ ఇంతే...

‘‘ఐశూ... నువ్వు... నువ్విక్కడ?’’

‘‘నేను వారం క్రితం ఇక్కడ జాయిన్ అయ్యాను... అయితే నువ్వు కూడా...’’

‘‘అవును... రాత్రి జాయిన్ అయ్యాను...’’ నవ్వాడు కార్తీక్.

‘‘పాత కంపెనీలో బోర్ కొట్టేసింది... కొత్త ఫర్మ్ లో చేరి, కొత్త జీవితం ప్రారంభించాలని...’’ గంభీరంగా అన్నాడు.

‘‘సరే... ఆల్ ది వెరీ బెస్ట్... మిమ్మల్ని కలవమని యం డీ చెప్పారు...’’

‘‘అందరూ రానీ... కొన్ని డిస్కషన్స్ చేయాలి... అందాకా నువ్వు నీ సీట్ లోనే కూర్చో... నేను పిలుస్తాను...’’ చేతిలోని ఫైల్ తీసి స్టడీ చేయసాగాడు కార్తీక్.

అతని వైపు ఓ సారి చూసి తన సీట్ కి వచ్చేసింది ఐశ్వర్య.

‘ఇప్పుడు ఈ ఫర్మ్ లో కంటిన్యూ అవటమా? మరో జాబ్ చూసుకోవటమా?’ డైలమాలో పడింది...

‘ఎందుకు మరో జాబ్ చూసుకోవాలి? కష్టపడి, అన్ని రౌండ్స్ దాటి వస్తే, జాబ్ చేతికి వచ్చింది. అతనికోసం దీన్నెందుకు వదులుకోవాలి? అతని పని అతనిది, నీ పని నీది... నువ్వు అనవసరమైన టెంప్టేషన్స్ పెట్టుకోకుండా నిగ్రహం గా పని చేసుకో...’ ఎవరో చెప్పినట్టు అనిపించింది... సిస్టం ఆన్ చేసి, వర్క్ మొదలు పెట్టింది ఐశ్వర్య... రెండు నిమిషాల్లో పనిలో లీనమై పోయింది.

***

డాలీ కార్తీక్ కి ఉద్వాసన చెప్పేసింది. తాను మరొక ఫ్రెండ్ ఫ్లాట్ కి షిఫ్ట్ అవుతున్నానని, నెలాఖరు కల్లా ఇప్పుడున్న ఫ్లాట్ ఖాళీ చేయాలి కాబట్టి, 'నీ దారి నీవు చూసుకో…' అని చెప్పింది. మన రిలేషన్షిప్ బ్రేక్ అవుతుంది అని చెబుతున్నప్పుడు ఆమె ముఖంలో ఎలాంటి భావమూ లేదు… చాలా మామూలుగా చెప్పింది. అంత తేలికగా తీసుకోలేకపోయాడు కార్తీక్.

"నిజంగా మనం విడిపోవాలంటే నీకేమీ బాధగా లేదా డాలీ?" అని అడిగాడు బాధగా…

"ఊహు… మనం కలిసి ఉండేది కొద్దికాలమే అని మనం కలిసినప్పుడే ఇద్దరికీ తెలుసు కదా కార్తీక్? నేను అలాంటి సెంటిమెంట్స్ పెట్టుకోను. నాకు నా ఆనందమే ముఖ్యం… అయినా… నువ్వు నా దగ్గరకు వచ్చినప్పుడు ఐశ్వర్య ఎలా ఫీల్ అయిందో నువ్వూ పట్టించుకుని ఉండవు కదా…" అంది తేలికగా తీసేస్తూ…

ఎవరో చెళ్ళు మని చెంప మీద కొట్టినట్టు అయింది కార్తీక్ కి.

'నిజమే… ఎదుటి వారిని నొప్పించకుండా ఉండలేని తనకు ఇప్పుడు డాలీ తనను నొప్పించిందనే అర్హత లేదు… ఎల్లప్పుడూ బలవంతులదే రాజ్యం… అప్పుడు తనూ, ఇప్పుడు డాలీ మానసికంగా బలవంతులు…' తనలో తానే అనుకున్నాడు.

ఆ రాత్రి అరుణ్ కి ఫోన్ చేసి, తాను కొద్ది రోజుల పాటు అమ్మా నాన్నలతో పాటుగా అరుణ్ ఇంట్లోనే ఉంటానని రిక్వెస్ట్ చేసాడు. సంతోషంగా ఆహ్వానించాడు అరుణ్. అమల కూడా కార్తీక్ కి ఫోన్ చేసి, త్వరగా వచ్చేయమని కోరింది. వాళ్ళ మంచితనం ముందు తానెంతో అల్పుడిలా తోచాడు తనకు తానే కార్తీక్.

***

వినతా, ఆమె స్నేహితురాళ్ళు అరకువేలీ వచ్చి రెండు రోజులు అయింది.  హైదరాబాద్ నుంచి ఫ్లైట్ లో విశాఖ వచ్చి అక్కడి నుంచి రెండు కార్లు తీసుకుని అరకు వచ్చారు. ఘాట్ రోడ్ లోకి ప్రవేశించ గానే రెండువైపులా చిక్కని, చక్కని పచ్చదనం… నీలి రంగు ఆకాశంలో తేలియాడే

తెల్లని మబ్బులు... అనంతమైన ప్రకృతి సౌందర్యం. ప్రతీ పది నిమిషాలకీ ఆగి ఫోటోలు తీసుకున్నారు. దారికి రెండు వైపులా ఆకాశాన్ని అంటే పెను వృక్షాలు... వాటిని అల్లుకున్న బలమైన అడవి తీగలు... నిలువెల్లా ఆకు లేకుండా పూచిన రంగు రంగుల తరువులు...పసుపు రంగులో కొన్ని, నారింజ రంగులో కొన్ని... ఊదా రంగులో కొన్ని... వాటి అందం మనసును దోచేస్తూ ఉంటే, ఆ సొగసులను కెమెరాలో బంధించటంతో పాటుగా, గుండెల్లో నింపేసుకోవటం మొదలు పెట్టారు వాళ్ళంతా...

ఆగుతూ ఆగుతూ బొర్రా గుహలు చేరే సరికి మధ్యాహ్నం అయిపోయింది. ప్రకృతి సహజంగా ఏర్పడ్డ గుహలు బొర్రా గుహలంటే...దట్టమైన దండాకారణ్యం లో కొండను తొలిచినట్టు ఏర్పడ్డ ఈ గుహలలో సున్నపు రాయి నుంచి వెలువడే కాల్షియం కార్బొనేట్ ద్రావణం గుహ పైకప్పు నుంచి నేల వరకూ రకరకాల ఆకృతిలో వ్యాపించి సుమనోహరమైన దృశ్యాలను ఏర్పరచింది.

ఇప్పుడంటే యాత్రా దర్శన శాఖ వారు దీపాలంకరణను లోపల ఏర్పాటు చేసారు కానీ, ముప్పై నలభై ఏళ్ళ క్రితం చీకటి గుయ్యారం లా ఉండేది లోపల...




వినతా, ఆమె మిత్ర బృందం అందరూ, గైడ్ లీడ్ చేస్తూండగా, ఒకరి చేయి మరొకరు చేయి పట్టుకుని మెట్ల మీదుగా క్రిందికి దిగారు. ఎన్నో తెలుగు సినిమాల్లో అత్యంత వైభవంగా చూపబడ్డ ఆ బొర్రా గుహల అందాల్ని తిలకించి ఆనందంతో పులకించిపోయారు...
బయటికి వచ్చి, లంచ్ చేసి, కాసేపు విశ్రాంతి తీసుకుని, మూడు గంటలకల్లా మళ్ళీ బయలుదేరారు. అనంతగిరి కాఫీ రిసార్ట్స్ మీదుగా ఆ కాఫీ గింజల పరిమళాలను పీల్చుకుంటూ, చిక్కటి అడవి లోంచి వెళుతూ ఉంటే కొంత దూరం పోయాక పనస పళ్ళ వాసన గుప్పుమంది. వినతకు తానెప్పుడో చదివిన 'వంశీ' కథల్లోని అరుకు పరిమళం గుర్తు వచ్చింది... స్నేహితులతో వంశీ నవలల గురించీ, కథల గురించీ, సినిమాల గురించి చర్చిస్తూ ఉండగానే, సుంకరి మెట్ట వచ్చేసింది. ఒక వైపు పెద్ద పెద్ద కొండల వరుస, మరో వైపు క్రిందికి పెద్ద లోయ... ఆ లోయలో పచ్చిక మైదానం... భగవంతుడి సృష్టి చిత్రానికి ఇంతకన్నా వేరే భాష్యం ఉండదు అనిపించింది.
వీళ్ళు వెళ్ళే సరికి మెయిన్ రోడ్ మీద సంత జరుగుతోంది. గిరిజనులు స్త్రీలూ, పురుషులూ,

పిల్లలూ... రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు పెట్టి అమ్ముతున్నారు. చింతపండూ, కుంకుడు కాయలూ, అడ్డాకులూ, అడవి జామ పళ్ళూ లాంటివి. మరో వైపు పట్నం నుంచి తెచ్చినవి కావచ్చు, క్రీములూ, పౌడర్లూ, దువ్వెన్లూ, చీరలూ, బట్టలూ మరో దుకాణంలో అమ్ముతున్నారు. వాటిని ఈ గిరిజనులు కొనుక్కుంటున్నారు.

గిరిజన స్త్రీల ఆహార్యం అంతా ఒక్క లాగే... చీరను వంటికి చుట్టుకుని, పైకి తీసుకువచ్చి, దాన్ని భుజమ్మీద జాకెట్టు పైభాగం లో ముడి వేసారు. పన్నెండు పదమూడేళ్ళ పిల్లనుండీ అలాగే ఉంది వేషధారణ... జుట్టు అడ్డకొప్పుగా ముడిచి, ప్రతీ కొప్పులోనూ అడవి పూవులు తురిమారు. అడవితల్లి స్వచ్ఛమైన, సుందరమైన  అమాయకపు బిడ్డలు వాళ్ళంతా...

అక్కడ కాసేపు కార్లు ఆపి వాళ్ళతో ఫోటోలు తీసుకున్నారు మిత్ర బృందమంతా... అక్కడ రోడ్డు ప్రక్కన చితుకుల మంట మీద కాచిన టీ కొనుక్కుని తాగి మళ్ళీ బయలుదేరారు. స్నేహితులతో రావటం వలన కానీ అదే మరెవ్వరితోనైనా అయితే రోడ్డు ప్రక్కన అమ్మే అలాంటి టీ ని చచ్చినా తాగి ఉండేది కాదు వినత.

దారిలో ఎంతో మంది గిరిజన యువతులు అడవి నుంచి బరువైన కట్టెల మోపులు, నెత్తి మీద పెట్టుకొని చులాగ్గా  మోసుకుపోతూ కనిపించారు.  వీళ్ళంతా అరుకు చేరే సరికి సాయంత్రం ఐదున్నర అయింది. గెస్ట్ హౌస్ లో చేరి హాయిగా ఊపిరి పీల్చుకున్నారు.

అప్పటికే చిరుచలిగా ఉండటంతో వేడి వేడి నీళ్ళు స్నానాలు చేసి, డిన్నర్ రూమ్ కే తెప్పించుకున్నారు. కాసేపు కబుర్లు చెప్పుకుని, చుట్టూ ఉన్న అడవిలోని అందాల్ని మసక వెన్నెల్లో చూసి ఆనందిస్తూ, నిద్రలకు ఉపక్రమించారు.

***

‘‘వచ్చే సోమవారం నుండీ నేను బాంబే ట్రైనింగ్ కి వెళుతున్నాను మూడు రోజులు... మీకిచ్చిన పనులన్నీ చక్కగా స్టడీ చేసి, రిపోర్ట్స్ రాసి ఉంచండి... సరేనా?” టీమ్ లో అందరికీ సూచనలు ఇచ్చాడు కార్తీక్.

అందరూ సరేనన్నట్టు తలలూపి, అతనిచ్చిన సూచనలు స్క్రిబ్లింగ్ పాడ్స్ లో నోట్ చేసుకున్నారు. అవసరమైతే తనను కాంటాక్ట్ చేయమని చెబుతూ తన ఫోన్ నెంబర్ కూడా ఇచ్చాడు కార్తీక్.

ఆ మరునాడు ఐశ్వర్య, అమల ఇంటికి వెళ్లేసరికి అక్కడ కనిపించాడు కార్తీక్. ఆఫీసులో ఎప్పుడూ బిజీగా ఉంటాడు... మీటింగ్ లో కూడా మాట్లాడే అవకాశం అంతగా రాదు... కానీ ఇక్కడ కనిపించే సరికి ఎందుకో తెలియదు, అక్కడినుండి వెళ్ళిపోవాలని అనిపించింది ఐశ్వర్యకు. గుండెల్లో కొద్దిగా గుబులు... అంతలోనే, తానేం తప్పు చేయనప్పుడు ఎందుకు పారిపోవాలి? అనుకుంది.

తాను రూప కోసం, ఆంటీ అంకుల్స్ కోసం ఇక్కడికి వస్తోంది... బెదిరిపోనక్కర లేదు... అనుకుంటూ లోపలి వచ్చింది.

“హాయ్ ఐశూ, వచ్చావా? నాక్కొంచెం హెల్ప్ చేస్తావా?” హడావుడిగా ఎదురు వచ్చింది అమల.

“ఏమిటక్కా? తప్పకుండా చేస్తాను, చెప్పండి...” అంది ఐశ్వర్య.

“నేను చాలా అవసరంగా బయటకు వెళ్ళాలి. వంట మొదలు పెట్టబోతూండగా ఫోన్ వచ్చింది. నేను వెళ్ళాలి... నీకేం అభ్యంతరం లేకపోతే కొంచెం వంట చేసి పెట్టవూ? నేను ఒక్క రెండు గంటల్లో వచ్చేస్తాను... ఇదిగో ఇప్పుడు పదకొండు అయింది కదా, ఒంటిగంటకల్లా ఇక్కడుంటాను... ప్లీజ్...”

“అది కాదు అక్కా... వంటంటే... అదీ... నా చేతి వంట...పెద్ద వాళ్ళు...” ఇబ్బందిగా కదిలింది ఐశ్వర్య.

“అత్తయ్యగారికి, మామయ్యగారికి అలాంటి పట్టింపులు ఏమీ లేవు ఐశూ... నువ్వు మా ఇంట్లో మనిషివే ఎప్పుడూ... సరేనా? నీకు హెల్ప్ చేయటానికి బంగారి ఉంది... ఏం లేదు, ఒక మంత్రి గారిని కలవాలి... మా క్లబ్ సెక్రటరీ ఫోన్ చేసింది... పన్నెండింటికి అప్పాయింట్మెంట్ ఇచ్చారట... నేను వెళుతున్నా...” జుట్టు పైన పైన దువ్వేసుకుని, డ్రెస్ మార్చుకుని, కారులో వెళ్ళిపోయింది అమల.

భయం భయంగానే వంట గదిలోకి అడుగు పెట్టింది ఐశ్వర్య. పనమ్మాయి బంగారి ఉల్లిపాయలు, కూరగాయలు కోస్తోంది... ఐశ్వర్యను చూడగానే పలకరింపుగా నవ్వింది. తనూ నవ్వి, “ఏం కూరలు చేయమన్నారు అమలమ్మ?” అని అడిగింది ఐశ్వర్య.


“ఇదిగోండి, అరటికాయ వేపుడు చేయమని చెప్పారండి... ముక్కలు తరుగుతాను...

ఇంకానేమో సాంబారు, ఏదైనా పచ్చడి... ఇంకో కూర ఏదైనా... ఆలుగడ్డలు, కాప్సికం ఉన్నాయండి... మీరు ఏం చెబితే అది తరిగి పెడతా... ముందు నాకు కొంచెం చాయ్ పోయండి... అమ్మ మిమ్మల్ని అడగమని అన్నారు..." అందామె వినయంగా...
వెంటనే త్వరత్వరగా పాలు వేడి చేసి టీ తయారు చేసింది. బంగారి కోసం విడిగా కొంత తీసి, చక్కెర వేసిచ్చి మిగిలిన దాంట్లో రెండు ఇలాచీలు దంచి వేసింది. మరిగిన తర్వాత పంచదార వేయకుండా టీ వడగట్టి రెండు కప్పుల్లో పోసి, హాల్లో కూర్చున్న కాత్యాయని, పరమేశ్వర రావులకు అందించింది.
"అమ్మాయ్, నేను కూడా రానా వంటింట్లోకి? నిలబడి ఉండలేను... కుర్చీలో కూర్చుని చేస్తాను..." అంది కాత్యాయని.
"అబ్బే, వద్దు ఆంటీ... పెద్ద పనేమీ లేదు. బంగారీ నేను చేస్తాం లెండి..." అని మిగిలి ఉన్న టీలో పంచదార వేసి, కప్పుల్లో పోసి తెచ్చి అరుణ్ కి, కార్తీక్ కి ఇచ్చింది.
"ఓ, ఇలాచీ ఫ్లావర్... థాంక్ యు ఐశూ..." అని కార్తీక్ అంటుంటే చాలా ఇబ్బందిగా తోచింది ఐశ్వర్యకు. తమ మధ్య ఏమీ జరగనట్టే కాజువల్ గా మాట్లాడేస్తూ ఉంటాడు కార్తీక్.
తాను కూడా ఒక కప్పు టీ తాగి, రూపకు చదువుకుంటూ ఉండమని చెప్పి, మళ్ళీ పనిలో ప్రవేశించింది.
అరటికాయల్ని పైన తొడిమలు కట్ చేసి, రెండు భాగాలుగా చేసి కుకర్ లో వేసింది ఐశ్వర్య. రెండు విజిల్స్ రాగానే తీసి తొక్కలు తీసి చక్రాల్లా కోసి, పోపులో వేసి ఎర్రగా వేయించింది. కందిపప్పును కమ్మని వాసన వచ్చేలా కొద్ది పాటి నూనెలో వేయించి, ఎండుమిరపకాయలతో కంది పచ్చడి రుబ్బింది. మజ్జిగతో చిక్కగా పులుసు పెట్టింది. కాప్సికం, ఆలూ ముక్కలు కోయించి, గ్రేవీ కర్రీ చేసింది. టమాటాలు వేసి, ఘుమఘుమలాడే చారు పెట్టింది. చివరగా అన్నం రైస్ కుకర్ లో పెట్టి స్విచాన్ చేసి హాల్లోకి వచ్చింది.
"అబ్బా, ఎంత జల్దీ చేసేసారమ్మా..." బుగ్గలు నొక్కుకుంది బంగారి, తానుతికిన బట్టల్ని బాల్కనీలో ఆరేసి వస్తూ. చిన్నగా నవ్వింది ఐశ్వర్య.
వండిన ఐటమ్స్ అన్నీ గిన్నెల్లో సర్ది వాటిని డైనింగ్ టేబుల్ మీద పెట్టింది ఐశ్వర్య.
"ఆంటీ, రైస్ కూడా మరో పావు గంటలో రెడీ అయిపోతుంది..." చెప్పింది కాత్యాయనితో.

‘‘థాంక్స్ అమ్మా… మీ అంకుల్ కి త్వరగా పెట్టేయాలి… షుగర్ పేషెంట్ కదా, ఆకలికుండలేరు…’’ అందావిడ.
అన్నం రెడీ కాగానే ముందుగా పరమేశ్వర రావు గారికి వడ్డించేసారు.  తర్వాత కంచంలో అన్నం పెట్టుకుని అన్ని కూరలూ వడ్డించి రూప దగ్గరకు తేసుకు వెళ్ళి, స్పూన్ తో తినిపించింది ఐశ్వర్య.
ఈలోగా అమల వచ్చేసింది. వచ్చిన వెంటనే కాళ్ళు కడుక్కుని వచ్చి, భోజనం చేస్తున్న మామగారినీ, లోపల రూమ్ లో తింటున్న రూపనూ చూసి సంబరపడిపోయి, ఐశ్వర్యను గట్టిగా కౌగలించుకుంది ఆనందంతో.
తరువాత అందరూ కలిసి లంచ్ చేసారు. ప్రతీ ఆధరువునూ చాలా మెచ్చుకుంది తింటూ అమల.
‘‘అరటికాయ వేపుడు చాలా బాగుంది ఐశూ… నువ్విలా చేస్తావా?’’
‘‘అవునక్కా, మజ్జిగ పులుసు లోకి ఇలా బాగుంటుంది… మా అమ్మ రెసిపీ ఇది…’’ చెప్పింది ఐశ్వర్య.
‘‘ఇలా బావుంది అమలా… ఈ సారి నువ్విది ట్రై చేయి… ఐశూ, అన్నీ బావున్నాయమ్మా… చారు కూడా… అమలా, నాకో బౌల్ లో పోసివ్వు,  తాగుతాను… ఐశూ, నీ వంట సింప్లీ సూపర్బ్…’’ అన్నాడు అరుణ్.
చాలా రోజుల తర్వాత ఐశ్వర్య చేతి వంట తింటున్న మెరుపు కనిపించింది కార్తీక్ కళ్ళలో.
కాత్యాయని కూడా ఐశ్వర్యను చాలా మెచ్చుకుంది కంది పచ్చడి బాగుందంటూ…
సాయంత్రం వరకూ రూపతో కేరమ్స్ ఆడి, అమల ఇచ్చిన టీ తాగి తన ఫ్లాట్ కి బయలుదేరింది ఐశ్వర్య. కార్తీక్ అప్పటికే బయటకు వెళ్ళిపోయాడు…
***
మర్నాడు ఉదయమే కాఫీ, టిఫిన్లు అయ్యాక స్నానాలు చేసి ట్రిమ్ గా తయారై సైట్ సీయింగ్ కి వెళ్ళారు వినతా వాళ్ళు.
పద్మాపురం నర్సరీ, బొటానికల్ గార్డెన్ మొత్తం తిరిగి చూసారు. ఎన్నో పేర్లు తెలియని వృక్షాలు, మొక్కల జాతులు ఉన్నాయి అక్కడ. బృందంలో ఒకరిద్దరు బోటనీ స్టూడెంట్స్

ఉన్నారు. వాళ్ళందరూ ఎంతో  ఆనందంగా ఆయా చెట్ల పేర్లు డైరీ లో రాసుకుని, ఫోటోలు తీసుకున్నారు.
మధ్యాహ్నం హోటల్ లో లంచ్ చేసి, ట్రైబల్ మ్యూజియం కి వెళ్ళారు. అక్కడ సజీవంగా కనిపిస్తున్న మూర్తులను చూసి ఆశ్చర్యపోయారు. ఆ మ్యూజియం దగ్గరే 'థింసా' నృత్యాన్ని ఏర్పాటు చేసారు టూరిజం డెవలప్ మెంట్ వారు. రంగురంగు చీరలు వారి పద్ధతిలో కట్టుకున్న గిరిజన యువతులంతా, ఒకే వరుసలో నిలబడి,  ఒకరి చేతులు మరొకరు పట్టుకొని, లయబద్ధంగా ఆడే నృత్యమే థింసా అంటే.  డప్పుల శబ్దం, కొమ్ము బూరా శబ్దం మ్రోగుతూ ఉండగా వాటికి అనుగుణంగా అడుగులు వేస్తూ, వంగి, లేస్తూ ఆడుతూ ఉంటే చూడటానికి ఎంతో బావుంది.
వినతా, ఆమె ఫ్రెండ్స్ కోమల, రాజీ వీళ్ళంతా ఆ నృత్యాన్ని వీడియో తీసుకున్నారు. తరువాత సరదాగా వాళ్ళతో అడుగులు కలిపి లయబద్ధంగా అడుగులు వేసి మురిసిపోయారు.
ఆ మర్నాడు చుట్టు ప్రక్కల ఉన్న రెండు మూడు జలపాతాల దగ్గరకు వెళ్లి చూసి వచ్చారు. ప్రకృతిలో మమేకం అయిపోయిన వారంతా, మౌనంగా, నిశ్శబ్దంగా ఉన్న  ఆ సెలయేళ్ల అందాలను కంటి కెమెరాలో బంధించి, హృదయాల్లో నిక్షిప్తం చేసుకుని గెస్ట్ హౌస్ కి తిరిగి వచ్చారు. ఆ మధ్యాహ్నం అంతా మబ్బులు పట్టి చిరుజల్లులు కురవసాగాయి.
ఆ చిరు జల్లుల్లో తడుస్తూ, గంతులు వేసింది వినత.
''అప్పుడప్పుడు మన వాళ్ళని వదిలి ఇలా దూరంగా వచ్చేయాలి…" అంది.
''అవును నిజమే… మన ఈ ట్రిప్ మాత్రం ఎప్పటికీ మరువలేనిది…" అంది కోమల.
''నేను మాత్రం నా పుట్టినరోజుకు మా ఆయన్ని తీసుకుని వస్తాను… ఈ ప్రదేశం ఎంత నచ్చిందో నాకు…" అంది రాజీ…
ఆ రాత్రి డిన్నర్ చేస్తూ ఉంటే గుర్తు వచ్చింది మర్నాడు ఆడపడుచు అవంతి, పిల్లలతో  అమెరికా నుంచి వస్తుందన్న విషయం. 'వస్తే వచ్చింది లే… తాను ఎలాగూ రేపు ఫ్లైట్ ఎక్కేస్తోంది కదా…' అనుకుంది చప్పరించేసి…
డిన్నర్ అయ్యాక, ఫ్రెండ్స్ తో కార్డ్స్ ఆడుతూ ఉంటే ఫోన్ మ్రోగింది. చిరాగ్గా తీసి చూసింది.

పవన్... పవన్ నంబర్ నుంచి వస్తోంది తనకి ఫోన్ కాల్... ఇప్పుడు ఫోన్ ఆన్సర్ చేస్తే క్లాస్ తీసుకుంటాడు...
చటుక్కున సైలెంట్ మోడ్ లోకి మార్చేసి, మొబైల్ ని దిండు క్రిందకి తోసేసింది. తర్వాత ఆటలో మునిగిపోయింది.
***




మర్నాడు మధ్యాహ్నం రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ లో, డొమెస్టిక్ ఫ్లయిట్ దిగి టాక్సీ లో వినత ఇంటికి వచ్చే సరికి, సమయం మూడైంది. రాగానే, నౌకర్ల ద్వారా ఆమెకి తెలిసిన వార్త ఏమిటంటే, సుందరమ్మ ముందురోజు సాయంత్రం నుంచి హాస్పిటల్ లో ఉందని, ఉదయం ఆడపడుచు అవంతి ఎయిర్ పోర్ట్ నుంచి రాగానే తాను కూడా హాస్పిటల్ కి వెళ్ళి, తమ్ముడు పవన్ తో పాటుగా అక్కడే ఉందనీ...
వినతకి గుండెల్లో బండరాయి పడింది. అసలు పవన్ వద్దు వద్దంటున్నా టూర్ పెట్టుకుని వెళ్ళిపోయింది తను. పైగా రాత్రి అతను ఫోన్ చేసినా, తాను తీయనే లేదు... ఉదయమే ఛార్జ్ లేక మొబైల్ కాస్తా స్విచాఫ్ అయింది. దాన్ని పవర్ బ్యాంక్ కి కనెక్ట్ చేసి, బాగ్ లో

పడేసింది.  గబుక్కున ఫోన్ తీసి కాల్ హిస్టరీ చూస్తే పాతిక మిస్డ్ కాల్స్ ఉన్నాయి పవన్ ఇచ్చినవి. ఒక్క క్షణం చాలా గిల్టీగా అనిపించింది వినతకు. కొద్దిగా భయం కూడా కలిగింది. ఇదేమిటి? అసలు ఆవిడకి ఇప్పుడు ఎలా ఉందో... అనుకుంటూ పవన్ మొబైల్ కి రింగ్ చేసింది కానీ  జవాబు లేదు.

త్వరత్వరగా స్నానం చేసి, బట్టలు మార్చుకుని, టాక్సీ లో అత్తగారిని రెగ్యులర్ గా తీసుకువెళ్ళే హాస్పిటల్ కి వెళ్ళింది. అక్కడ రిసెప్షన్ లో అడగ్గానే మూడో ఫ్లోర్ అని చెప్పారు. లిఫ్ట్ లో అక్కడికి చేరుకొని, అక్కడున్న స్టాఫ్ ను వాకబు చేసి, అత్తగారినుంచిన స్పెషల్ రూమ్ కి చేరుకుంది. బెడ్ మీద కదలిక లేకుండా పడుకుని ఉంది సుందరమ్మ. పక్కనే పవన్ కూర్చుని ఉన్నాడు. అవంతి తల్లి  చేయి పట్టుకుని నిలబడి ఉంది. ముంజేతికి అమర్చిన ట్యూబ్ లోంచి  డ్రిప్స్ వెళుతున్నాయి.

‘‘రామ్మా వినతా... బాగున్నావా?’’ ఎప్పటిలాగే ఆత్మీయంగా పలకరించింది అవంతి.

బాగున్ననన్నట్టు తలూపి, పవన్ వంక పలకరింపుగా చూసింది... అతను  కోపంగా ముఖం తిప్పేసుకున్నాడు. ‘‘మీరు... మీరెప్పుడు వచ్చారు?’’ అంది ఆడపడుచుతో...

‘‘ఉదయమే వచ్చాను... ఆయాసం ఎక్కువై, అమ్మను రాత్రంతా ఐసిసియు లో ఉంచారట... ఇక్కడ వీడు ఒక్కడే ఉన్నాడు పాపం... ఉదయానికి పరిస్థితి కాస్త మెరుగవటంతో రూమ్ లోకి మార్చారు. ఇప్పుడు అవుటాఫ్ డేంజర్... ఏమీ కంగారు పడనక్కర లేదు...’’ చెప్పింది అవంతి.

దీర్ఘంగా ఒక నిట్టూర్పు వదిలింది వినత. ఆమె మనసులో మొట్టమొదటిసారిగా ఒక అపరాధ భావన కదలాడింది.

‘‘నేనుంటాను... మీరు ఇంటికి వెళ్లి పడుకోండి... మీకు జెట్ లాగ్ కదా వదినా...’’ అంది అవంతితో పీక్కుపోయినట్టున్న ఆమె ముఖాన్ని, నిద్రలేని కళ్ళను చూస్తూ.

‘‘ఫర్వాలేదు అమ్మా... నీ టూర్ అంతా బాగా జరిగిందా?’’

తలూపింది వినత. పవన్ లేచి బయటకు వెళ్ళిపోయాడు. వినత మనసులో గుబులు మరింతగా పెరిగింది.

***

“హమ్మయ్య, మన టీయల్ ట్రైనింగ్ కి వెళ్ళిపోయాడు… మనం ఫ్రీ…రా ఐశూ, కాఫీకి వెళ్దాం…” ఐశ్వర్య కొలీగ్ షామిలి అంది.

కార్తీక్ అప్పజెప్పిన పనిని కంటిన్యువస్ గా చేస్తున్న ఐశ్వర్య, కాస్త తలనొప్పిగా ఉన్నట్టు అనిపించటం తో  సరేనన్నట్టు తలూపి లేచింది. ఇద్దరూ కలిసి కెఫేటేరియాకి వెళ్ళారు.

కాఫీ తాగుతూ అంది షామిలి… “ఇదే నాకు మొదటి జాబ్… బాగానే ఉంది… నీ విషయం ఏమిటి?”

“నేను ఇదివరకు రెండు చోట్ల చేసాను. ఇది మూడవ కంపెనీ…” చెప్పింది ఐశ్వర్య.

“ఓహ్ అవునా? అయితే నీకు ఎక్స్ పీరియన్స్ బాగానే ఉంది అన్న మాట… నిజానికి నాకు జాబ్ చేయాల్సిన అవసరమేం లేదు… ఊరికే కాలక్షేపానికి…” అంది షామిలి నవ్వుతూ… చిన్నగా నవ్వింది ఐశ్వర్య…

“మన టీమ్ లీడర్ బాగుంటాడు కదా?” షామిలి మాటలకు ఉలిక్కిపడింది ఐశ్వర్య.

“ఊ…” అంది ముక్తసరిగా…

“కొంచెం పరిచయం పెంచుకొని, ఆపైన ప్రపోజ్ చేద్దామని ఉంది… ఎలాగూ మా వాళ్ళు సంబంధాలు చూస్తున్నారు… ఇలాంటి వాడైతే బావుంటుంది కదా…”

“కానీ, కార్తీక్ నీకన్నా చాలా పెద్దవాడు… కనీసం ఏడెనిమిది సంవత్సరాల తేడా ఉంటుంది…” చెప్పింది ఐశ్వర్య.

“అయితేనేం? నాకేం ఫర్వాలేదు…”

“నీ ఇష్టం… ముందు వర్క్ బాగా నేర్చుకో… తర్వాత మిగిలిన విషయాలు చూసుకో…” నవ్వుతూనే అంది ఐశ్వర్య.

“నీ సంగతి ఏమిటి? నువ్వింకా ఎందుకు పెళ్ళి చేసుకోలేదు?” ఐశ్వర్య ముఖంలోకి చూస్తూ అడిగింది షామిలి.

నవ్వింది ఐశ్వర్య.

“అన్నట్టు మన బాచ్ లో ఆ నీరూ ఉంది కదా… ఆ పిల్లకి బాయ్ ఫ్రెండ్ ఉన్నాడు…” గుసగుసగా చెప్పింది షామిలి…

“ఓహో, ఓకే…” తలపంకించింది ఐశ్వర్య.

“ఫేస్ బుక్ పరిచయం అట… ఇంకా ఒకరినొకరు కలుసుకోలేదట… చూస్తూ ఉండు, ఆపకుండా మొబైల్ లో ఛాటింగ్ చేస్తూనే ఉంటుంది…”

“అది తన పర్శనల్ లే… ఇప్పుడైతే ఇంకా మనకి పని పూర్తిగా మొదలు కాలేదు కనుక ఫర్వాలేదు కాని తర్వాత తర్వాత  ఆఫీస్ టైం లో అలాంటివి చేస్తే బాగుండదు… పై వాళ్ళు చెబుతారు లే…అదే మిస్టర్ కార్తీక్…” అంది ఐశ్వర్య.

“నీకూ అతనికీ పూర్వపరిచయం ఉందా?” అనుమానంగా చూస్తూ అడిగింది షామిలి.

“అఫ్ కోర్స్… అతను నాకు స్నేహితుడు…ఇక వెళదాం, నాకు చాలా పనుంది…” చెప్పి లేచింది ఐశ్వర్య.

***

“మీకు థర్డ్ ఫ్లోర్ లో త్రీ నాట్ ఫోర్ అలాట్ చేసారు. మీతో మరొకరు ఉంటారు…” హోటల్  రిసెప్షన్ లో, రిజిష్టర్ లో సైన్ చేయించుకుంటూ అన్నాడతను.

“ఓహ్, థాంక్ యు… రేపటి నుంచే సెషన్స్ ప్రారంభం కదా…” సైన్ చేసి, లిఫ్ట్ వైపు నడిచాడు కార్తీక్.

“రూమ్ లో అతనున్నాడు… మీరు వెళ్ళండి, బెల్ బాయ్ సామాన్లు తెస్తాడు…”

రూమ్ ముందు నిలబడి మునివేళ్ళతో తలుపు చిన్నగా తట్టాడు కార్తీక్.

“ఇట్స్ ఓపెన్… ప్లీజ్ కమిన్…”

సున్నితంగా తలుపు తెరచుకొని లోపలికి వచ్చాడు, కార్తీక్. ఏసీ చల్లదనం, కమ్మని రూమ్ ఫ్రెషనర్ పరిమళంతో పాటుగా  ఒక్కసారిగా కమ్మేసింది.

అక్కడ నడుము చుట్టూ టవల్ చుట్టుకొని స్నానానికి వెళ్ళబోతున్న వేణు కనిపించేసరికి ఆశ్చర్యానందాలతో ఊగిపోయాడు.

“హాయ్ వేణూ, మీరు… మీరిక్కడ… గ్రేట్ ప్లెజర్ ఫర్ మీ… నా రూమ్ మేటంటే ఎవరో అనుకున్నాను…” నవ్వుతూ అన్నాడు కరచాలనం కోసం చేయి చాస్తూ…

“ఓహ్, కార్తీక్... మీకూ ఇక్కడే ట్రైనింగ్ ఉందా? నిజంగా ఎంతో సంతోషంగా ఉంది... మనం మూడురోజులు కలిసి ఇక్కడ ఉండబోతున్నాం... ఆహా, ప్రపంచం ఎంత చిన్నదో కదా...” ఆనందంగా చేయి కలుపుతూ అన్నాడు వేణు.

“మీరు స్నానం చేసి రండి... వచ్చాక కాఫీ తాగుదాం... ఈలోగా నా సామాను వస్తుంది...” షూ విప్పుకుంటూ అన్నాడు కార్తీక్.

“సరే, త్వరగా వచ్చేస్తాను...” వేణు వాష్ రూమ్ లోకి వెళ్ళగానే కార్తీక్ సామాను వచ్చింది.

వేణు స్నానం చేసి రాగానే, కార్తీక్ తానూ స్నానం చేసి వచ్చాడు.

“మనకి కాంప్లిమెంటరీ బ్రేక్ ఫాస్ట్ కదా... తొమ్మిదికి వెళదాం... ఈలోగా కాఫీ ఆర్డర్ చేసాను... ఈరోజంతా ఫ్రీనే కదా మనం?” అన్నాడు వేణు.

“అవును... ముంబై చాలా సార్లు వచ్చాను, అందుకే బయటికి వెళ్ళే ఇంట్రెస్ట్ లేదు... నేను రూమ్ లోనే ఉంటాను. అదీగాక రేపటికి కాస్త ప్రిపరేషన్ అవసరం నాకు... మీది ఏ ప్రోగ్రాం?” అడిగాడు కార్తీక్ ఆసక్తిగా.

వేణు మాటల్లో తెలిసింది ఇద్దరిదీ ఒకటే ప్రోగ్రాం అని. మేనేజ్మెంట్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రోగ్రాం కోసం ఇండియా లోని యమ్మెన్సీల వాళ్ళు ఒక ప్రఖ్యాత మేనేజ్మెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ వారు నిర్వహించే ట్రైనింగ్ ప్రోగ్రాం కోసం కొందరిని ఎంపిక చేసి, ముంబయి పంపించారు. వాళ్ళలో వీళ్ళిద్దరూ ఉండటం విశేషం, కాకతాళీయం.

వేడిగా కాఫీ తాగుతూ రిలాక్స్ అయ్యాడు కార్తీక్. న్యూస్ పేపర్ తీసి చదువుతూ సిగరెట్ వెలిగించాడు. ఆ పొగ పడక ఇబ్బందిగా ముఖం పెట్టాడు వేణు.

అది గమనించిన కార్తీక్, “ఓహ్ సారీ...” అంటూ సిగరెట్ ఆర్పేసి యాష్ ట్రే లో వేసేసాడు.


“నాకోసం మీరు ఇబ్బంది పడకండి... నేను రూమ్ మారనా?” అడిగాడు వేణు మొహమాటంగా...

“అబ్బే, వద్దు... నేనే ఈ మూడురోజులూ రూమ్ లో ఉండగా, స్మోక్ చేయకుండా ఉంటాను...” నవ్వాడు కార్తీక్.

“థాంక్స్ అండ్ సారీ టూ...”

"నో... ఎవరో కొత్తవాళ్ళతో ఉండే బదులు మీతో ఉండాలని ఉంది నాకు... సాధారణంగా నేను ఎవరినీ  ఇబ్బంది పెట్టను..." అని చెప్పిన కార్తీక్ పై ఎంతో సదభిప్రాయం కలిగింది వేణుకు.

మరుక్షణమే, 'మరి ఐశ్వర్యను?' అనిపించింది... దాన్ని కప్పిపుచ్చుకుంటూ, "ఓకే కార్తీక్, మీరు కాసేపు రిలాక్స్ అవండి... మరో అరగంట తర్వాత బ్రేక్ ఫాస్ట్ చేయటానికి వెళదాం..." అని టీవీ ఆన్ చేసాడు వేణు.




సుందరమ్మను డిశ్చార్జ్ చేసారు. ఆమెకు వేయాల్సిన మందులు, తీసుకోవలసిన జాగ్రత్తలు, తినకూడని ఆహారపదార్థాలు పెద్ద జాబితా ఇచ్చారు డాక్టర్లు. ఆయాసం కంట్రోల్ అయింది కానీ ఆవిడకి బాగా నీరసం వచ్చేసింది. ఇంటికి వచ్చిన తరువాత, సాధ్యమైనంత వరకూ మందులు వేసుకుని పడుకుని ఉంటోంది.

కబురు తెలిసిన వెంటనే సుగుణమ్మ వియ్యపురాలిని చూడటానికి వచ్చింది. ఎప్పుడూ ఎంతో

ఆప్యాయంగా మాట్లాడే సుందరమ్మ అలా నీరసంగా పడుకుని ఉండటం చూసి ఎంతో బాధపడింది. అవంతిని పలకరించి, ఆమె పిల్లల దగ్గర కూర్చుంది సుగుణమ్మ.

అవంతికి ఇద్దరూ ఆడపిల్లలే. పదిహేను, పన్నెండు సంవత్సరాల అమ్మాయిలు అమెరికాలోనే పుట్టి పెరగటంతో వారికి తెలుగు వచ్చినా అమెరికన్ యాక్సెంట్ తో చిత్రంగా ఉంటాయి వాళ్ళ మాటలు. పొడుగ్గా, దానికి తగ్గ లావుతో, చక్కని ఫ్రాక్ లు వేసుకుని, పోనీలతో అమెరికా అమ్మాయిల్లాగానే ఉన్నారు.

"నమస్తే గ్రాణీ!" అన్నారిద్దరూ సుగుణమ్మను చూస్తూనే. చిరునవ్వుతో వాళ్ళను దగ్గరకు తీసుకుంది సుగుణమ్మ.

"అమ్మా, ఎలా ఉన్నావు?" దగ్గరకు రాబోయింది వినత. అంతలోనే వంటమ్మాయి సావిత్రి పిలవటంతో వంటగదిలోకి వెళ్ళింది.

"కాఫీ తీసుకో మమ్మీ..." ఐదు నిమిషాల తర్వాత మళ్ళీ కాఫీ కప్పుతో వచ్చింది వినత.

"పరిమళా, సౌరభా... మీకు మిల్క్ తీసుకురానా?" అడిగింది.

"వద్దు అట్టా! ఇక్కడ మిల్క్ ఈజ్ నాట్ దట్ మచ్ గూడ్..." నసిగింది సౌరభ.

"బట్ ఫర్ ఎనర్జీ సేక్ యు హావ్ టు డ్రింక్ డియర్..." ఇద్దరికీ చెరో పాల గ్లాసూ తెచ్చి అందించింది వినత. వాళ్ళు ఇబ్బందిగానే తాగేశారు.

"వదినా, కూరలు ఏం చేయించను? మీరేం తింటారు? అత్తయ్య గారికి ఏం వండించాలి?" అవంతిని అడిగింది వినత.
అవంతి వివరంగా చెబుతూ ఉంటే జాగ్రత్తగా విని సావిత్రికి చెప్పింది వినత. విమలమ్మ సావిత్రికి సాయంగా వంటింట్లో పని చేస్తోంది.
వినతను చూస్తూంటే ఆశ్చర్యం, ఆనందం రెండూ కలుగుతున్నాయి సుగుణమ్మకు. ఎంతో

బాధ్యతగా మసలుకుంటున్న వినతను చూస్తూంటే అబ్బురంగా అనిపించింది... ఇది ఇలాగే కొనసాగితే ఎంత బావుంటుందో అనుకుంది మనసులో...

ఇదివరకట్లా తన దగ్గర చేరి గారాబాలు పోవటం లేదు... ఆడబడుచు మీద ఈర్ష్యా దృక్కులు లేవు... అత్తగారికి అలా అయినందుకు ఎంతో బాధపడుతూ, బాధ్యత గల ఇంటి కోడలుగా అటూ ఇటూ తిరుగుతోంది...

కాసేపటి తర్వాత, తల్లి దగ్గరకు వచ్చి కూర్చుంది వినత.

"నీ ట్రిప్ అంతా బాగా జరిగిందా విన్నూ?" అడిగింది సుగుణమ్మ...

"ఫర్వాలేదు అమ్మా... కానీ పవన్ వద్దంటున్నా  అనవసరంగా వెళ్లాను... వెళ్ళగానే అత్తయ్యగారు సిక్ అయ్యారు..." దిగులుగా అంది వినత.

"అన్నయ్య బాగున్నాడా? బాబు ఎలా ఉన్నాడు? మధుబాల బాగుందా?" అడిగింది గబగబా...

"అందరూ బాగానే ఉన్నారు విన్నూ... అన్నయ్య ముంబై వెళ్ళాడు, ఏదో ట్రైనింగ్ ఉందని..."

"అమ్మా... నీతో కాస్త పర్సనల్ గా మాట్లాడాలి... ఒకసారి అలా నా గదిలోకి రామ్మా..." రహస్యంగా చెప్పి తాను  ముందుగా గదిలోకి వెళ్ళింది వినత.

'హు, దీనిలో మార్పు రావటం కల్ల! మళ్ళీ ఏవో నేరాలూ, చాడీలు చెబుతుంది కాబోలు...' దీర్ఘంగా నిట్టూర్చి కూతురి వెనకాలే వెళ్ళింది సుగుణమ్మ.

తల్లి రాగానే తలుపులు దగ్గరికి వేసి, ఆవిడ భుజమ్మీద తల పెట్టుకుని, "నాకు చాలా భయం వేస్తోంది అమ్మా..." అంది వినత గద్గద స్వరంతో. సుగుణమ్మ మనసు ద్రవించింది... కూతుర్ని గుండెలకి హత్తుకుంటూ, "ఎందుకురా? ఎందుకు భయం?" అన్నది అనునయంగా...

‘‘పవన్ కి చాలా కోపంగా ఉందమ్మా… నాతో మాట్లాడటం లేదు… నేను కాఫీ తెచ్చిస్తే తాగటం లేదు… నేను అతనికి ఇష్టం లేకుండా టూర్ కి వెళ్ళటం నిజంగా తప్పే… అప్పుడు నాకు తెలియలేదు… హాస్పిటల్ లో తన తల్లి చావు బతుకుల మధ్య ఉంటే ఒక్కడూ… ఒక్కడూ ఆ నరకాన్ని అనుభవించాడు అమ్మా… నేను పక్కనుంటే బాగుండని అనుకుని ఉంటాడు కదా… అతను ఆ బాధలో ఉంటే, నేను జాలీగా, హాయిగా స్నేహితులతో షికార్లు చేసి వచ్చాను! ఎందుకమ్మా నేను ఇలా అయ్యాను? నాకు… నాకు… మొట్ట మొదటి సారిగా చాలా గిల్టీ గా అనిపిస్తోంది అమ్మా…” వినత కళ్ళనుండి కన్నీరు కాలవలు కట్టింది.

‘‘ఛ, ఊరుకో విన్నూ… నిజానికి నువ్విలా అవటంలో నా పాత్ర కూడా చాలానే ఉందిరా… చిన్న పాపవి అని గారాబం చేసి, నువ్వు అడిగిందీ, అడగందీ కూడా ఇచ్చే దాన్ని… అక్కనీ, అన్నయ్యనీ కూడా నిన్ను బాగా చూసుకోవాలని చెపుతూ, నీ కోసం  కొండ మీది కోతిని కూడా తెచ్చి ఇవ్వాలని ప్రయత్నించే దాన్ని… మీ నాన్న నీ మూర్ఖపు పట్టుదలకి, మొండితనానికి విసుక్కుంటున్నా, నిన్ను మందలించినా నేను వెనకేసుకు వచ్చే దాన్ని…  సరే, అయిందేదో అయిపోయింది.. ఇప్పుడు నీకే తెలుస్తోంది కదా విన్నూ…  పవన్ మళ్ళీ మామూలుగా అవుతాడు లే… భయపడకు…” అంది కూతురి వెన్ను రాస్తూ…

‘‘వినతా…” అవంతి పిలుపు వినబడటం తో, “సరేనమ్మా… నువ్వు నా వెనకాల రా…” అంటూ గబగబా ముఖం వాష్ చేసుకుని, తుడుచుకుంటూ, తలుపులు తెరుచుకుని బయటకు వెళ్ళిపోయింది వినత… ప్యూపా దశ నుంచి సీతాకోకచిలుకగా మారుతున్న కూతుర్ని చూస్తూ ఆనందంగా నిట్టూర్చింది సుగుణమ్మ.

***

‘‘అత్తయ్యా, ఎలా ఉంది పెద్దమ్మ గారికి?” అత్తగారికి ఎదురేగుతూ అడిగింది మధుబాల.

‘‘ఫర్వాలేదు మధూ… గండం గడిచింది… బాబేడీ? పడుకున్నాడా?”

“ఇప్పటివరకూ పాలుతాగి ఇప్పుడే పడుకున్నాడు అత్తయ్యా… వినత ఎలా ఉంది? పవన్ అన్నయ్య బాగున్నారా? అవంతి అక్కయ్య గార్ని మనింటికి రమ్మని పిలిచారా?”

“లేదమ్మా… ఇప్పుడు వాళ్ళు కాస్త ఇదిగా ఉన్నారు కదా… అందులోంచి బయటకు రానీ… అవంతి నెలా పదిహేను రోజులు ఉంటుంది… పిలుద్దాములే… నా భోజనం అయిపోయింది అక్కడే… నువ్వు తిన్నావా అమ్మా?”

“లేదు అత్తయ్యా, మీరు వచ్చాక తిందామని తినలేదు ఇంకా…”

“అయ్యో, బాగా ఆలస్యం అయిందిగా? తినేయమ్మా… నేను బాబు దగ్గర కూర్చుంటాను…” కోడలితో చెప్పింది సుగుణమ్మ.

***

ఆరోజు పగలంతా ట్రైనింగ్ క్లాసులు అయ్యాక, సాయంత్రం ఆరు గంటలకి రూమ్ కి తిరిగి వచ్చారు కార్తీక్, వేణుగోపాల్.

“మీరు ఎక్కడికీ వెళ్ళరుగా?” అడిగాడు కార్తీక్…

“ఉహు, ఈ ట్రాఫిక్ లో ఎక్కడికి వెళతాం? అయినా రూమ్ లోనే చాలా ప్లెజంట్ గా ఉంది… లైక్ టు హావ్ అ కప్ ఆఫ్ టీ!” అన్నాడు వేణుగోపాల్.

“అలాగే, ఆర్డర్ చేస్తాను… ఫ్రెష్ అయి రండి, నెక్స్ట్ నేను వెళతాను…” అన్నాడు కార్తీక్ టీవీ ఆన్ చేసి ఛానల్స్ తిప్పుతూ…
ఇద్దరూ ఫ్రెష్ అయి టీ తాగి రిలాక్స్డ్ గా కూర్చున్నారు.

“మధుబాల గారు బాగున్నారా? మీకు ఒక బాబు అనుకుంటా కదా? పేరేం పెట్టారు?” ఆసక్తి గా అడిగాడు కార్తీక్. ఉన్నట్టుండి వేణుకు గుర్తు వచ్చింది బాబును ‘బాబీ’ అని

పిలుస్తున్నామనీ, ఇంకా పేరేమీ పెట్టలేదనీ... అంతే కాదు, మధుబాలను దూరం చేసుకున్నందుకు కలిగిన బాధతో అతని ముఖం ఫ్లానమైంది...

"మధుబాల, బాబు బాగానే ఉన్నారు కార్తీక్... చాలా రోజులు ఒకరికొకరు దూరంగా ఉన్నాము... ఈ మధ్యే అంటే ఓ పదిహేను రోజుల క్రితం తను మళ్ళీ ఇంటికి వచ్చింది బాబుతో..." చెప్పాడు వేణు.

"ఓహ్, ఏమైంది? ఏమైనా అపార్థాలా? సారీ, ఇది మీ పర్శనల్ అని తెలుసు అనుకోండి... మీ పెళ్ళికి మేము వచ్చినప్పుడు ఇద్దరిదీ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' జంట అని మురిసిపోయింది ఐశ్వర్య... నిజానికి మీరిద్దరూ అలాగే ఉంటారు..." బాధగా తలపంకించాడు వేణు.

"ఏం చెప్పాలో, ఎలా చెప్పాలో కూడా తెలియటం లేదు కార్తీక్... మనం భార్యలను చాలా ప్రేమిస్తామని అనుకుంటాము కానీ, వాళ్ళను కన్నా మనం మన ఈగోలను ఎక్కువగా ప్రేమిస్తాము... మన స్వార్థాన్ని ఎక్కువగా ప్రేమిస్తాము... అక్కడే మన వాళ్ళను దూరం చేసుకుంటాము..."

"ఊ..." సాలోచనగా అన్నాడు కార్తీక్.

"ఇప్పుడు తను మళ్ళీ ఇంటికి వచ్చింది... కానీ కేవలం  లోకం కోసమో, వాళ్ళ నాన్నగారి కోసమో, బాబు కోసమో... అంతే... నాకోసం మాత్రం కాదు... అసలు నాకోసం తను రావాలన్నది నా దురాశే... మా ఇద్దరి మధ్యా ఇప్పుడు ఏ అనుబంధం లేదు కార్తీక్... ఆమె మనసులో కొండంత బాధ, అంతులేని ఆవేదన నేనే కలిగించాను... ఇప్పుడు నేను ఎంత  బాధపడినా దానిని తొలగించలేను... అందుకే అంటారు, 'ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దాన్ క్యూర్' అని... ఒక్క మాటలో చెప్పాలంటే, ఒక కప్పు కింద తలదాచుకున్న బాటసారులం మేమిప్పుడు..."

"మీ మధ్య ఉన్న దూరాన్ని తొలగించటానికి మీ వంతుగా మీరు కృషి చేయండి వేణూ...

అపార్థాలు నల్లమబ్బుల్లాంటివి... కురిసే వరకే వాటి ప్రతాపం... తరువాత ఆకాశం నిర్మలంగా మారిపోతుంది కదా...."

"మీరు వాడిన పోలిక బాగుంది... కానీ నిజజీవితంలో అది అంత తేలిక కాదు కార్తీక్... దానికి కాలమే అతుకులు వేయాలి!"

"ఇంతకూ మీ అబ్బాయి పేరు చెప్పలేదు..."

"బాబీ అని పిలుస్తున్నాము... అసలు పేరు ఇంకా పెట్టలేదు...

"హహ, అదేమిటి?" నవ్వాడు కార్తీక్.

"అదంతే మరి! ఆ ఘడియ ఇంకా రాలేదు..." తనూ నవ్వాడు వేణు.



మనసు ఉండబట్ట లేని సుగుణమ్మ ఆరోజు వియ్యపురాలిని చూడటానికి వెళ్ళినప్పుడు ఆ ఇంట్లో ఏం జరిగిందో, వినత ఎలా ప్రవర్తించిందో వివరంగా కోడలితో చెప్పింది.

వింటున్న మధు మనసులో ఎన్నో భావాలు... వినతలో  మార్పు రావటం ఆశ్చర్యమే అయినా మంచి పరిణామమే... అయితే అది ఎప్పటికీ ఆమెలో అలా నిలచిపోతే అంతే చాలు... అనుకుంది. పైకి మాత్రం తన భావాలను వ్యక్తపరచలేదు.

‘‘రేపు ఆదివారం నేనూ వెళ్లి చూసి వస్తాను అత్తయ్యా...’’ అని మాత్రం అంది.

‘‘ఆ  టైముకి అబ్బాయి వచ్చేస్తాడు, ఇద్దరూ కలిసి వెళ్ళిరండి అమ్మా...’’ అంటున్న అత్తగారివైపు అదోలా చూసింది మధుబాల.

ఆ చూపులను  పట్టించుకోలేదు సుగుణమ్మ...

***

ఆఫీసులో కార్తీక్ లేకపోవటం వలన స్టాఫ్ మెంబర్స్ కి కంట్రోల్ కాస్త తప్పింది. పైగా ఇంకా సరిగ్గా పనులు ప్రారంభం కాకపోవటంతో జస్ట్ కాలేజికి వచ్చి వెళ్లినట్టు అనిపిస్తోంది అందరికీ... ఐశ్వర్య మాత్రం కార్తీక్ అప్పజెప్పిన పనులు పూర్తి చేయటమే కాకుండా, మిగిలిన వారిని కూడా అలెర్ట్ చేస్తూ, కార్తీక్ వచ్చేసరికి కొన్ని ప్లాన్స్ రాసి ఉంచటం లో మునిగిపోయింది.

నీరజ మాత్రం ఎప్పుడూ ఫేస్ బుక్ లోనో, వాట్స్ ఆప్ లోనో మునిగి తేలుతూ ఉంటుంది. ఒక రోజు లంచ్ టైములో అడిగింది ఐశ్వర్య.

‘‘నీరూ,ఆఫీస్ టైములో ఛాటింగ్ ఏమిటి? మనకి వైఫై ఉందని దాన్ని ఇలా దుర్వినియోగం చేయకూడదు కదా!’’

నిర్లక్ష్యంగా చూసింది నీరజ.

‘‘ఛాటింగ్ ఎవరితోనేమిటి, ఫేస్ బుక్ ఫ్రెండ్స్ తోనా?’’ ఈ సారి కాస్త సౌమ్యంగా, స్నేహంగా నవ్వుతూ అడిగింది ఐశ్వర్య.

‘‘అవును ఐషూ... నాకు ఒకతనితో ఫ్రెండ్షిప్ అయింది. అతనికీ నేనంటే చాలా ఇష్టం... నన్ను ప్రేమిస్తున్నానని అన్నాడు...’’ కళ్ళలో మెరుపులు ముఖాన్ని కాంతివంతం చేస్తూ ఉండగా అన్నది నీరజ. ఈసారి ఆమె స్వరంలో కోపానికి బదులుగా ఉరకలు వేసే ఆనందం.

‘‘ఓ, ఎక్కడ ఉంటాడు అతను?’’

‘‘హైదరాబాద్ లోనే... మనలాగే సాఫ్ట్ వేర్ ఇంజినీర్...’’

‘‘అవునా, పేరు?’’

‘‘శ్రీ చైతన్య... అయితే మేమింకా కలవలేదు...’’

‘‘శ్రీ చైతన్యా? ఈ పేరు ఎక్కడో విన్నట్టుందే... మహేష్ బాబు ప్రొఫైల్ పిక్చర్ ఉంటుంది కదా అతనికి?’’ సాలోచనగా అంది ఐశ్వర్య...

‘‘అరె, నిజం... నీకెలా తెలుసు?’’ ఆశ్చర్యపోయింది నీరజ.

‘‘నా ఫ్రెండ్ లిస్టు లో ఉండాలి... ఉండు చూస్తాను...’’ మొబైల్ లో ఫేస్ బుక్ ఆన్ చేసింది ఐశ్వర్య. తన ఫ్రెండ్ లిస్టు లో ఉన్న అతన్ని చూపగానే నీరజ ముఖం వాడిపోయింది...

‘‘అయితే నీతో కూడా ఫ్రెండ్ షిప్ ఉందా అతనికి?’’

‘‘నీరూ, నాతోనే కాదు, ఇంకా నూటేభై అమ్మాయిలతో ఉంది... పైగా నాకు అతనిచ్చిన మెసేజ్ లు చూస్తావా? నేను ఎందుకులే అని ఇగ్నోర్ చేసేసాను... అసభ్యంగా లేవు కానీ, కొంచెం ఓవర్ గానే ఉంటాయి...’’ అంటూ మెసెంజర్ ఓపెన్ చేసి చూపించింది.

ఐశ్వర్య ఫోటోలని చూసి, ఆమె అందాన్ని పొగుడుతూ ఇచ్చిన కాంప్లిమెంట్స్, ఆమె ఫోన్ నంబర్ కావాలంటూ రిక్వెస్ట్స్, వీలుంటే యఫ్బీ స్నేహాన్ని మించి ఎక్కడైనా కలుద్దా మంటూ ప్రపోజల్స్... చాలా వరకూ ఐశ్వర్య జవాబులు మర్యాద పూర్వకంగానే ఉన్నాయి. మూడు నెలల క్రితం వరకూ మెసేజ్ లు ఇచ్చి  ఇక ఊరుకున్నాడు.

''ఇలాంటి అబ్బాయి, నిన్ను ప్రేమిస్తున్నాడని, పెళ్ళి చేసుకుంటాడని అనుకోవటం అసలు కరెక్ట్ కాదు. అసలు అతని టైం లైన్ చూసావా? ఎక్కడా అతని ఫోటోలు కానీ, అతన్ని గురించిన సమాచారం కానీ లేదు. ఫ్రెండ్స్ లో కూడా చాలా మంది ఫేస్ బుక్ సభ్యులే ఉన్నారు. ఒక పని చేయి నీరూ... ఈ సారి నీకు మెసేజ్ చేసినప్పుడు కలుద్దామని ప్రపోజ్ చెయ్యి. కలిసాక, అన్నీ బాగుంటే ముందుకు అడుగు వేయవచ్చు. అతనికి ఇష్టం లేకపోయినా, కలవడానికి సుముఖత చూపకపోయినా వదిలేద్దాం... ఏమంటావు?" చెప్పింది ఐశ్వర్య.

ఐశ్వర్యతో అతను చేసిన ఛాటింగ్ చూసిన తర్వాత నీరజ కళ్ళు గిరగిరా తిరిగాయి. ఆ తర్వాత వివేకంతో ఆలోచిస్తే ఐశ్వర్య చెప్పినదంతా నిజమని అనిపించింది. కానీ తన ఆశలన్నీ కల్లలై పోయినందుకు ఎంతో బాధతో ఆమె ముఖం కమిలిపోయింది.

''ఇప్పుడు ఏం చేయమంటావు ఐశూ!" అడిగింది నీరసంగా కళ్ళు నీళ్ళతో నిండిపోతూ ఉండగా...

''సింపుల్... ఓ ఆదివారం నాడు కలుద్దామని, ఫలానా చోటికి రమ్మనీ మెసేజ్ ఇవ్వు... నీతో పాటుగా నేను కూడా వస్తాను... అరె, ఇదేమిటి? లైట్ తీసుకో నీరూ... ఇవన్నీ మనసుకు పట్టించుకోకు నీరూ... నాకు నీ బాధ అర్థమౌతోంది... ఇదంతా ఒక వర్చువల్ వరల్డ్... ఫేస్ బుక్ ఫ్రెండ్స్ అంటే నిజంగా ఫ్రెండ్స్ అవరు అన్ని వేళలా... ఎక్కడో నూటికీ కోటికీ ఓ సందర్భంలో, ఒక వేవ్ లెంగ్త్ కలిసిన మనుషులు స్నేహితులు అయితే వాళ్ళు ఒక కుటుంబ సభ్యులకన్నా ఎక్కువగా చేరువ అవుతారు... అది చాలా అరుదు...

నువ్వంటే మంచి అమ్మాయివి, సెంటి మెంటల్ గా మనసుతో ఆలోచించే దానివి కాబట్టి కానీ, ఇదిగో ఇలా మెసెంజర్ లో అబ్బాయిల మెసేజ్ లకు వాళ్ళని రెచ్చగొట్టే విధంగా జవాబులు ఇస్తూ, పిచ్చి పిచ్చిగా ప్రొవోక్ చేసే ఫోటోలు పెడుతూ, వాళ్ళ ఇరోటిక్ టాక్ ని ఇష్టపడుతూ, తామూ అలాగే మాట్లాడుతూ ఎంజాయ్ చేసే అమ్మాయిలూ చాలా మంది ఉన్నారు... వాళ్లకి అదొకరకం ఆట...

అసలు సోషల్ మీడియా అంటే ఒక కత్తి లాంటిది... కత్తితో పండు కోసుకోవచ్చు, పీకల్నీ తెగ నరకవచ్చు... ఇప్పుడు ఇవి అలాగే తయారు అయ్యాయి... నిజమైన స్నేహంతో ఒకరికొకరు ఆలంబన అవుతూ, సమాజసేవలో పాలు పంచుకుంటూ, సాహితీప్రస్థానంలో కలిసి మెలిసి అడుగులేస్తున్న స్నేహితులు కొందరు ఉన్నారనుకో... అలాగే, ఫేస్ బుక్ ని వాళ్ళ వాళ్ళ కెరీర్ కి ఓ సోపానంగా ఉపయోగించుకొని అత్యున్నత స్థానాలకు చేరుకున్నవారు కూడా ఎంతో మంది నాకు తెలిసిన వారున్నారు...

నాణేనికి మరో వైపులా ఇలాంటి వికారాలు మాత్రం ఎన్నో... సరే, నేను చెప్పినట్టు చేసి నీ భవిష్యత్తును అందంగా మలచుకో...” నీరజ భుజం తట్టింది ఐశ్వర్య.

“సరే” నని తలూపి, అక్కడినుంచి లేచి వెళ్ళిపోయింది నీరజ.

***

ఆదివారం ఉదయం పది గంటలు...

రాత్రి యు ట్యూబ్ లో ఏదో పాత సినిమా చూసి, ఆలస్యంగా నిద్ర లేచింది ఐశ్వర్య. సాధారణంగా ప్రతీ ఆదివారం ఉదయం ఏడుకల్లా లేచి స్నానాదులు కావించుకొని, ఏదో ఒక టిఫిన్ చేసుకుని అప్పుడు అమల వాళ్ళింటికి వెళ్ళటం రివాజు అయింది ఆమెకు. అమలతో, రూపతో సాన్నిహిత్యం బాగా అలవడింది. కార్తీక్ తో ఎక్కువగా మాట్లాడకపోయినా అతని ఉనికినీ, సామీప్యాన్ని, స్నేహాన్ని ఆస్వాదిస్తూ ఉంటుంది... ఆ వారానికి కావలసినంత సంతోషాన్ని

గుండెల నిండా నింపుకొని, సాయంత్రం ఐదు ఆరు గంటల ప్రాంతం లో ఇంటికి తిరిగి వచ్చేస్తూ ఉంటుంది.

ఈ వారం మాత్రం ఎందుకో అటు వెళ్లాలని అనిపించలేదు... అక్కడ కార్తీక్ ఉండడు కనుక అమలకు ఫోన్ చేసి తనకు వేరే పనుందనీ, రావటం కుదరదనీ చెప్పేసింది.

మధుబాల దగ్గరకు వెళ్లాలని బలంగా అనిపించింది. మధు అత్తగారింటికి వచ్చేసిందని తెలుసు, కానీ కలవటం కుదరలేదు. బాబిగాడిని చూసి కూడా చాలా రోజులు అయింది... ఉదయమే వెళ్ళటం కన్నా మధ్యాహ్నం భోజనం అయిన తర్వాత వెళితే సరి... సాయంత్రం వరకూ ఉండి రావచ్చు... కానీ... అక్కడ తనను ఆదరిస్తారా? వేణుకి తానంటే ఉన్న భావన తనకు  తెలుసు... మధుతో అతను గొడవ పడటానికి ఆమె తనతో చేసిన స్నేహం కూడా ఓ కారణమని గ్రహించింది తను... అయినా వెళ్ళాలనే ఉంది...

అవును... తాను మధు కోసం వెళుతోంది... ఒక వేళ అలాంటి పరిస్థితే వస్తే, ఎక్కువసేపు ఉండకుండా మధుతో కాసేపు మాట్లాడి, బాబీని చూసి వచ్చేస్తుంది... అంతే... వెళ్లాలని స్థిర నిశ్చయం చేసేసుకున్న ఐశ్వర్య త్వర  త్వరగా వంట చేసేసుకుంది చకచకా...

మధ్యలో అన్నపూర్ణ పిన్నిగారు వచ్చి, తాను చేసిన కూరలు తెచ్చి ఇచ్చింది.  మాటల సందర్భంలో తమ పిల్లలు త్వరలో తమను చూడటానికి వస్తున్నట్టు చెప్పింది. ఆ కళ్ళలో ఎంతటి సంతోషమో... కట్టుకున్న వాడి గురించి మాట్లాడినా, కన్న పిల్లల గురించి తలచుకున్నా అతివకు ఎందుకో అంత సంతోషం... బహుశః పెళ్ళి అనే బంధంలో ఉన్న తీయదనం ఇదేనేమో మరి... తన పురుషుడు, తన సంతానం... హు... తనకి ఎప్పటికీ ఆ భాగ్యం లేదా? తింటున్న భోజనం సయించలేదు ఐశ్వర్యకు...

ఐశ్వర్య చిరునామా వెదుక్కుంటూ మధుబాల ఇంటికి వెళ్లేసరికి రెండున్నర అయింది. కావాలనే ఫోన్ చేయలేదు, సర్ప్రైజ్ ఇవ్వాలని. కాలింగ్ బెల్ కొట్టగానే తలుపు తెరుచుకుంది...

‘‘హేయ్ మధూ…” అంటూ ఆమెను చుట్టేయబోయి, తలుపు తెరిచింది మధు కాదన్న విషయం ఆఖరు క్షణంలో గ్రహించి, తనను తాను  సంబాళించుకొని, “అయ్యో, సారీ ఆంటీ!” అంది నాలుక కరచుకుంటూ…

‘‘రామ్మా! నువ్వు?” సుగుణమ్మ అడిగింది ఐశ్వర్యను పరీక్షగా చూస్తూ…


‘‘నా పేరు ఐశ్వర్య ఆంటీ… మధు స్నేహితురాలిని…” చేతులు జోడించి నమస్కరించింది.

ఆమె పేరు వినగానే లిప్తపాటులో చిరుచేదు భావం కదలాడింది సుగుణమ్మ మనసులో… దానిని కప్పిపుచ్చుకుంటూ, “ఓ, నువ్వేనా అమ్మా… రా… కూర్చో…” అంటూ సోఫాలో కూర్చొ బెట్టి తాను ఎదురుగా కూర్చుంది.

‘‘మంచి నీళ్ళు తాగుతావా అమ్మా?” అంటూనే లేచి, ఫ్రిజ్ లోంచి వాటర్ బాటిల్ తీసుకొచ్చి, గ్లాసులో పోసి అందించింది.

‘‘మధు మా వియ్యాలవారింటికి వెళ్ళింది అమ్మా… ఇందాకే వెళ్ళింది… ఓ గంటలో వచ్చేస్తుంది…” అని చెప్పింది సుగుణమ్మ.

ఐశ్వర్యకు నిరాశగా అనిపించింది… తన డిజప్పాయింట్ మెంట్ ముఖంలో ప్రతిఫలిస్తూ ఉండగా, “అరెరే… దానికి సర్ప్రైజ్ ఇవ్వాలని ముందుగా ఫోన్ చేయకుండా వచ్చాను ఆంటీ… బాబు బాగున్నాడా అండీ?” అని ఆరాటంగా అడిగింది.




‘‘బావున్నాడమ్మా... ఇందాకే లోపల పడుకోబెట్టాను... లేవగానే తీసుకువస్తాను... మధు కూడా కాసేపట్లోనే వచ్చేస్తుంది... నువ్వు కూర్చో...’’ అంది సుగుణమ్మ ఆప్యాయంగా.

సరేనంటూ కూర్చుంది ఐశ్వర్య. ఐశ్వర్య కుటుంబ వివరాలు అడిగి తెలుసుకుంది ఆసక్తిగా  సుగుణమ్మ.

‘‘మధు ఎలా ఉంటోంది ఆంటీ? అదే... సారీ ఎలా అడగాలో తెలియటం లేదు... వేణు గారూ, తనూ...’’

ఆవిడ దీర్ఘంగా నిట్టూర్చింది...

‘‘అమ్మా, ఐశ్వర్యా... మీరిద్దరూ చాలా కాలం కలిసే ఉన్నారు కనుక నీకన్ని విషయాలు తెలుసు... నా కొడుక్కి కోపమెక్కువ, కోడలికి దూకుడెక్కువ... ఇద్దరూ మంచివాళ్ళే, ఒకరి పట్ల

ఒకరికి ప్రేమ, అవగాహన ఉన్నవాళ్ళే... కానీ కొన్ని విషయాల్లో వేణూ తొందరపడటం వలన మధు చాలా బాధ పడింది... అదీగాక, నా కూతురు అసూయతో చేసిన ఒక చర్య వలన నా కోడలికి ప్రాణాపాయం తప్పినా ఆమె మనసు విరిగిపోయింది... ఫలితంగా ఇంట్లోంచి అలిగి వెళ్ళిపోయింది...

మీరిద్దరూ ప్రాణ స్నేహితులు కదా... నీకు తెలిసే ఉంటుంది., కోడలు ఇల్లు విడచి వెళ్ళిపోయింది అన్న బాధతో మీ అంకుల్ బెంగతో మానసికంగా బాగా దెబ్బతిన్నారు. ఫలితంగా యాక్సిడెంట్... మాకు శాశ్వతంగా దూరమయ్యారు... చివరివరకూ ఆయన మధు కోసం తల్లడిల్లిపోయారు. మధ్యలో నా కొడుకూ కోడలి మధ్య డబ్బు గొడవలు... రకరకాల సమస్యలు... కొన్నాళ్ళు దూరంగా వెళ్ళిపోయింది. ఇప్పుడు ఇంటికి వచ్చినా, పూర్ణ హృదయంతో మాత్రం కాదు... వాళ్ళ ఇంటి పరువు ప్రతిష్టలు కాపాడటానికి కొంతా, ఆమె తండ్రి ఆరోగ్య పరిస్థితిని బట్టీ, బాబీని మాకు దూరంగా పెంచటం ఇష్టం లేక...

మా వాడు కూడా ఇప్పుడు చాలా మారాడు అమ్మా... ఇదివరకటి కోపం, అసహనం లేవు... కాకపోతే వాళ్ళిద్దరూ మాట్లాడుకోరు, ఒక్క గదిలో పడుకోరు... ఇదే నా వేదన... దేనికైనా సమయం రావాలి అంటారు కదా... అసలు వీళ్ళిద్దరి మధ్యా సయోధ్య నేను చూస్తానో, లేదో..." నిర్వేదంగా అన్నది సుగుణమ్మ...

"అయ్యో ఆంటీ... మీరలా అనుకోకండి... వాళ్ళిద్దరూ తప్పక కలుస్తారు... ఆ నమ్మకం నాకుంది... నిజానికి మధూకి వేణూ అంటే చాలా ప్రేమ... అలాగే మీరన్నా, అంకుల్ అన్నా భక్తిగౌరవాలు... ఆడబడుచులంటే అభిమానమే..." అనునయించింది ఐశ్వర్య..

"అవునమ్మా... నిజానికి నా కడుపున పుట్టిన పిల్లల్లోనే లోపాలున్నాయి... అందుకే ఈ నరకం... ఏది ఏమైనా, నీవు చెప్పినట్టు ఆ తరుణం కోసం ఎదురు చూడక తప్పదు..."

"ఇంతకూ మధు వెళ్ళింది వినతా వాళ్ళింటికేనా ఆంటీ?"

‘‘అవునమ్మా, క్రితం వారం వినత అత్తగారికి  బాగా ఆయాసం వస్తే, హాస్పిటల్లో చేర్పించారు. డిశ్చార్జ్ అయి ఇంటికి వచ్చేసారిప్పుడు…ఈరోజు మధు చూసి వస్తానని వెళ్ళింది… మా వాడు ఇవాళ వస్తాడని అనుకున్నాను., కానీ ఎందుకో ఆలస్యం అయింది… లేకపోతే ఇద్దరినీ కలిసి వెళ్ళమనే చెప్పాను…”

‘‘ఓహో…”

‘‘టీ చేసుకుని వస్తాను… కూర్చోమ్మా… నువ్వు తాగుతావు కదా?

‘‘అయ్యో, మీరేమీ శ్రమ పడకండి ఆంటీ… ఫర్వాలేదు… మధూ వచ్చాక పెడుతుంది లే…”

‘‘ఇందులో శ్రమ ఏమీ లేదమ్మా, నేను కూడా తాగుతాను కదా…” అంటూనే వంటింట్లోకి వెళ్ళి పది నిమిషాల్లో బిస్కట్లు, టీ కప్పులతో తిరిగి వచ్చింది సుగుణమ్మ.

‘‘థాంక్ యు ఆంటీ… మీ దగ్గర నాకు ఇంత ఆదరణ దొరుకుతుంది అని నేను ఊహించలేదు…” అప్రయత్నంగా అనేసింది ఐశ్వర్య…

సుగుణమ్మకు ఒక ఆడపిల్ల నోట ఆ మాటలు చాలా వేదనను కలిగించాయి…

‘‘ఎందుకమ్మా, నువ్వేం తప్పు చేసావని? నీవు ఎన్నుకున్న మార్గంలో నువ్వు ప్రయాణించావు. అది తప్పు ఎలా అవుతుంది? కాకపోతే యుగయుగాలుగా, తరతరాలుగా మన సమాజంలో కొన్ని గీతలూ, రేఖలూ ఉన్నాయి… వాటిని నీవు అతిక్రమించావు అంతే… ఫర్వాలేదు, నమ్మిన సిద్ధాంతం కోసం అలా చేయవచ్చు… కాకపోతే…అతను నీ చేయి విడచి వెళ్లిపోవటమే బాధను కలిగిస్తోంది…” అన్నది సుగుణమ్మ… ఆ మాటలు అన్న తర్వాత తన ఆలోచనా ధోరణి తనకే విచిత్రంగా అనిపించింది ఆవిడకి… భర్త ఉన్న రోజుల్లో ఆయన ఆలోచనలు ఎలా ఉండేవో అలా మాట్లాడింది ఇప్పుడు తాను. అప్పట్లో ఆయన ఇలా మాట్లాడితే తనకూ, వేణుకీ నచ్చేది కాదు… ముఖ్యంగా ఐశ్వర్య విషయంలో… ఆమెతో, మధూ స్నేహం విషయంలో…

ఇంత చక్కని అమ్మాయితో స్నేహం చేయకుండా ఎవరుండగలరు?

సుగుణమ్మ మాటలు ఐశ్వర్య మనసుకు ఎంతో సాంత్వనగా అనిపించాయి... తరాల అంతరం ఉన్నా, అన్నపూర్ణ పిన్ని తర్వాత తనను అర్థం చేసుకున్న  మరో మాతృసమానురాలు కనిపించింది ఆమెకు. రెండు చేతులూ జోడించింది మౌనంగా...

“అయ్యో, వద్దమ్మా, నాకంత అర్హత ఉందనుకోను... నీ పర్సనల్ మేటర్ అనుకోకపోతే ఒకటి అడగనా?”

“అడగండి ఆంటీ...”

“నువ్వు పెళ్ళి చేసుకోకూడదా? నీ ఆలోచనలు సిద్ధాంతపరంగా గొప్పవి అవునో కాదో నాకు తెలియదు... కానీ మన సమాజంలో పెళ్ళి చేసుకోకుండా కాపురం చేసే ఆడదానికి గౌరవం లేదమ్మా... నీకు మంచి వాడు భర్తగా లభిస్తాడు... సంబంధం చూడమని మా వేణుకు చెబుతాను...”

ఐశ్వర్య మనసంతా ఒక అవ్యక్తమైన అనుభూతితో నిండిపోయింది... ఇప్పుడిప్పుడే పెళ్ళి మీద సుముఖత కలుగుతోంది... పెళ్ళి కాని యువతి ఒక మగాడితో కాపురం చేసింది, చేస్తోంది అని తెలిసిన తరువాత ఆడవారు కానీ, మగవారు కానీ ఆమెను గౌరవంతో చూడకపోవటం తాను గమనించింది... కార్తీక్ వెళ్ళిపోయిన తరువాత ఒంటరితనం, మానసికంగా సపోర్ట్ లేకపోవటం... ఎంతో దిగులుతో కాలం గడుపుతోంది ఇప్పుడు... అనుకోకుండా అమల కుటుంబానికి దగ్గర అవటం వలన ప్రతీ ఆదివారం బాగానే వాళ్ళతో కాలం గడుస్తోంది... మిగిలిన రోజుల్లో ఆఫీసు పని...ఇంటికి వచ్చాక పిన్నిగారితో కలిసి సంగీత సాధన, పుస్తక పఠనం తో సమయం తెలియటం లేదు...

ఏదో తాను దగ్గరగా చూసిన జీవితాలనుంచి, కలిగిన అనుభవాల నుంచి వైవాహిక జీవితం పట్ల ఒక విరక్తిని, విరుద్ధ భావాన్ని పెంచుకున్నది. అలాంటి వాడే అయిన  కార్తీక్ తారసపడే సరికి,

ఇద్దరి మధ్యా ప్రేమ అంకురించబట్టి అతన్ని తన భాగస్వామిగా అంగీకరించింది... లేకపోతే పెళ్ళి కానీ, సహజీవనం కానీ లేకుండా అలాగే ఒంటరిగా మిగిలిపోయి ఉండేదేమో...

"ఏమ్మా? ఏమంటావు?" మళ్ళీ సుగుణమ్మ అడిగిన ప్రశ్నకు ఉలిక్కి పడి ఈ లోకంలోకి వచ్చింది ఐశ్వర్య.

"ఆ...ఆంటీ, అదీ... కార్తీక్ ని కాకుండా వేరే ఎవరినీ నా జీవితంలోకి ఆహ్వానించ లేను ఆంటీ... ఎందుకంటే నేను అతన్నే ప్రేమించాను...మరి ఈ జన్మకు  నా మనసు, తనువూ రెండూ ఎవరినీ అంగీకరించవు" భారంగా చెప్పింది ఐశ్వర్య.

"నిన్ను వదులుకున్న ఆ కార్తీక్ చాలా దురదృష్టవంతుడు తల్లీ... ఒక సారి నాకు కనిపిస్తే... గట్టిగా చెప్పి ఉండేదాన్ని..."

సుగుణమ్మ మాటలకు గట్టిగా నవ్వేసింది ఐశ్వర్య.

"ఇన్నాళ్ళూ మీ దగ్గరకు రాకుండా తప్పు చేసాను ఆంటీ..." అంది...

***

"వెళ్ళి వస్తాను పెద్దమ్మ గారూ... జాగ్రత్తగా సమయానికి ఆహారం తీసుకుంటూ, మందులు అవీ జాగ్రత్తగా వేసుకోండి..." సుందరమ్మ చేయి నిమురుతూ చెప్పింది మధుబాల.

"అబ్బాయి వచ్చాక ఇద్దరూ కలిసి రండమ్మా..." నీరసంగా చెప్పింది సుందరమ్మ.

"నిన్ను చూడటం మొదటిసారే... అయినా ఎంత బాగా కలిసిపోయావు మధూ? చాలా సంతోషంగా ఉంది..." అంది అవంతి ఆత్మీయంగా.
నవ్వుతూ మధుబాలకి బొట్టుపెట్టి, తాంబూలం, పండ్లతో పాటుగా చీరా జాకెట్ ఉన్న కవర్ ఇచ్చింది వినత. మధుబాలకి ఎంతో సంతోషంగా అనిపించింది. వినతను దగ్గరగా తీసుకొని

ఆమె నుదుట ముద్దు పెట్టుకుంది మనస్ఫూర్తిగా...

అసలు ఆరోజు ఉదయం లేస్తూనే చెప్పింది మధు అత్తగారితో...

‘‘అత్తయ్యా, నేను ఈరోజు ఓ సారి పెద్దమ్మ గారి దగ్గరకు వెళ్ళి వస్తాను. బాబును చూసుకుంటారా?” అని.

‘‘ఈ రోజా? నువ్వు ఒక్కదానివే వెళ్ళటం ఎందుకు?”

‘‘లేదులే అత్తయ్యా, రేపటి నుండి మళ్ళీ బిజీ అవుతాను కదా... మీరు ఇప్పుడునాతో  రావటం కష్టం... కాలు నొప్పి అన్నారు కదా, ఇంటిదగ్గరే ఉండి రెస్ట్ తీసుకోండి... పదకొండుకి వెళ్లి మళ్ళీ లంచ్ టైం కల్లా వచ్చేస్తాను...” చెప్పింది మధుబాల.

‘‘సరేనమ్మా...” అయిష్టంగానే అంగీకరించింది సుగుణమ్మ. ఆవిడ భయమంతా కూతురు మళ్ళీ ఏదైనా అని కోడలిని హర్ట్ చేస్తుందేమో అని...

తన టూ వీలర్ మీదనే వెళ్ళింది మధుబాల. గేటు బయట వెహికల్ పార్క్ చేసి, గేటు తెరుచుకుని లోపలికి  అడుగు పెట్టింది. అలికిడి విని ఇంట్లోంచి బయటకు వచ్చిన వినత లోపలికి నడిచి వస్తున్న వదిన గార్ని చూడగానే ఒక్క క్షణం ఉలిక్కిపడింది. అయినా పెదవులపైకి చిరునవ్వును అరువు తెచ్చుకుంటూ, మధుబాలకు ఎదురేగి ఆమె చేయి పట్టుకుంది.

మధుబాలకూ మనసులో బెదురుగా, బెరుకుగానే ఉన్నా, దాన్ని కనబడనీయకుండా, వినతతో, “బాగున్నావా వినతా?” అన్నది.

‘‘బావున్నాను వదినా... రా, లోపలికి...” సౌమ్యంగా పలికి తనతో తీసుకువెళుతున్న వినతను చూసి ఆశ్చర్యాన్ని అణచుకోలేక పోయింది మధుబాల. తనతో పెడసరంగా కాకుండా, సామరస్యంగా మాట్లాడటం, పేరు పెట్టి పిలవకుండా వదినా అని పిలవటం... విచిత్రంగా

అనిపించింది.

మధుబాలను అవంతికి పరిచయం చేస్తూ, "మా వదిన మధుబాల వదినా... తను మా వదిన అవంతి. వీళ్ళిద్దరూ పరిమళ, సౌరభ..." అంటూ పిల్లలను కూడా పరిచయం చేసింది వినత.

"నమస్తే అక్కయ్యా, బాగున్నారా?" రెండు చేతులూ జోడించి అవంతికి నమస్కరించి, పిల్లల ఇద్దరి తలలూ నిమిరింది మధుబాల. వాళ్ళిద్దరూ నోటితో నమస్తే చెబుతూనే, చేత్తో షేక్ హ్యాండ్ ఇచ్చారు.

"పెద్దమ్మ ఎలా ఉన్నారు?"

"రండి, చూద్దాం..." తల్లి గదిలోకి తీసుకు వెళ్ళింది అవంతి.

అడుగుల సవ్వడికి మెలకువ వచ్చిన సుందరమ్మ కనులు తెరిచి మధుబాలను చూసి, గుర్తు పట్టినట్టుగా చిరునవ్వు నవ్వింది. శక్తిని తెచ్చుకుంటూ, మెల్లగా అందరి క్షేమ సమాచారాలు అడిగింది.

కొద్దికాలం తాను భర్తతో లేదు... ఆ విషయం తెలిసినా ఏమీ అడగని ఆవిడ సంస్కారానికి మనసులోనే ధన్యవాదాలు చెప్పుకుంది మధుబాల.

కాసేపు అవీ ఇవీ మాట్లాడి వచ్చేద్దామని అనుకుంది కానీ, భోజనం చేసి వెళ్ళమని సుందరమ్మ చెప్పింది. అవంతీ, పిల్లలూ కూడా బలవంతం చేయటం తో ఉండిపోక తప్పలేదు. వినత చిరునవ్వుతో పలకరించినా, భయం భయంగా మధుబాలకు దూరంగానే ఉంటోంది... ఆమె మానసిక స్థితి అర్థమైన మధుబాలకి ఎంతో జాలిగా అనిపించింది. ఈర్ష్యాసూయలు ఎంత వినాశకరమైనవో ఈమెకు అర్థమయ్యే ఉంటుందని అనుకుంది మనసులో. వినతలో వచ్చిన ఈ సానుకూల మార్పు ఎంతో సంతోషం కలిగించింది మధుబాలకు.

పవన్ జాడ కనబడక అడిగితే, బంధువులింట్లో ఫంక్షన్ ఏదో ఉంటే వెళ్ళాడని తెలిసింది.

భోజనాలు అయ్యాక వెంటనే వచ్చేస్తే బాగుండదని పిల్లలతో కబుర్లు చెబుతూ కూర్చుని, బయలుదేరే ముందు సుందరమ్మ దగ్గరకు వెళ్లి చెప్పింది తను వెళుతున్నట్టుగా…

వినత బొట్టుపెట్టి, చీర పెడితే కాదనలేకపోయింది… మధుబాల మనసులో అప్పటివరకూ ఉన్న దిగులు మేఘాలు తొలగిపోయినట్టు అయింది… తేలిక పడిన మనసుతో ఇంటికి బయలుదేరింది. బయలుదేరే ముందు అందరినీ తమ ఇంటికి ఆహ్వానించటం మరచిపోలేదు, మధుబాల.




లోపలి నుంచి వినిపిస్తున్న నవ్వులు వింటూ ఆశ్చర్యంగా లోపలికి అడుగు పెట్టిన మధుబాల, చక్కగా నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్న అత్తగారినీ, ఐశ్వర్యనూ చూస్తూనే మరింత ఆశ్చర్యానికి లోనైంది.

“మధూ!” ఆనందంగా లేచి వచ్చి ఆమెను గాఢంగా కౌగలించుకుంది ఐశ్వర్య.

“ఐశూ! ఎన్నాళ్ళకి చూసానే నిన్ను!” మధు కళ్ళు చెమరించాయి. ఐశ్వర్య చెయ్యి పట్టి సోఫాలో కూర్చోబెట్టింది.

“ఎంత సేపైంది ఐశూ వచ్చి?”

“అరగంట దాటిందే... ఆంటీ టీ కూడా ఇచ్చారు...” నవ్వుతూ చెప్పింది ఐశ్వర్య.

“మధూ, నీ ఫ్రెండ్ నాకూ ఫ్రెండ్ అయిపోయింది...” నవ్వింది సుగుణమ్మ. అత్తగారిని మనసులో ప్రశంసించకుండా ఉండలేకపోయింది మధుబాల. ఐశ్వర్య గురించి అందరికీ తెలుసు. ఒకప్పుడు తమ  స్నేహాన్ని వ్యతిరేకించిన వారే అందరూ... అసలు వేణూ కూడా ఐశ్వర్యను యాక్సెప్ట్ చేసి ఉంటే ఎంత బాగుండేది?

“ఏమిటే ఆలోచిస్తున్నావు?” అడిగింది ఐశ్వర్య.

“ఉహు,” తల విదిలించింది మధుబాల.

“ఎలా ఉన్నారమ్మా ఆవిడ?” సుగుణమ్మ ప్రశ్నకు, “ఫర్వాలేదు అత్తయ్యా... బాగా నీరసంగా కనిపిస్తున్నారు. కోలుకోవడానికి ఇంకా సమయం పట్టేట్టుంది...” అంది మధుబాల.

ఇంతలో లోపలినుంచి బాబి ఏడుపు వినిపించింది. గబగబా లోపలికి పరుగు పెట్టి, వాణ్ణి ఎత్తుకుని తీసుకువచ్చింది మధుబాల. తల్లి ఎత్తుకోగానే ఠక్కున ఏడుపు మానేసాడు వాడు... వాడిని తీసుకు వచ్చి, “ఇదిగో నీ ఆంటీ వచ్చేసింది... ఏడవకు రా బాబీ...” అంటూ ఐశ్వర్య ఒడిలో కూర్చోబెట్టింది.

ఐశ్వర్య కొత్తగా అనిపించడంతో మళ్ళీ ఏడుపు మొహం పెట్టాడు వాడు... ఇంతలో పాలు కలిపి తెచ్చిన సుగుణమ్మ వాడిని ఎత్తుకుని పాలు పడుతూ ఉంటే, స్నేహితురాళ్ళు ఇద్దరూ కబుర్లలో పడిపోయారు.

రెండు గంటల తర్వాత, టిఫినూ, కాఫీ అయ్యాక  ఐశ్వర్య వెళుతూ ఉంటే, "వస్తూ ఉండమ్మా, నేను చెప్పింది మర్చిపోకు..." అన్నది సుగుణమ్మ.

"అలాగే ఆంటీ..." అని సుగుణమ్మ పాదాలకు నమస్కరించి, బయలుదేరింది ఐశ్వర్య.

***

"అయిపోయింది... మూడురోజులూ మూడు క్షణాల్లా గడిచాయి కదా... ట్రైనింగ్ కి అసలు ఇష్టం లేకుండా వచ్చాను... ఇప్పుడు మీతో చక్కని అనుబంధం ఏర్పడి, మనం విడిపోవాలంటే కాస్త దిగులు వేస్తోంది..." సూట్ కేసు సర్దుకుంటూ అన్నాడు వేణు, కార్తీక్ తో.

"అసలు నేను మనుషులతో అనుబంధం పెట్టుకోనండి, అవసరానికి మాట్లాడతాను అంతే...  ఐశ్వర్యతో కలిసి ఉన్నప్పుడు కూడా, మీ మధుబాల గారు మా అనుబంధాన్ని అంత హర్షించలేదని నాకు ఆమె అంటే కొంచెం కోపం ఉండేది. అయినా ఐశ్వర్య కోసమని మీ పెళ్ళికి వచ్చాను. ఐశూకి ఉన్నంత ప్రేమాభిమానాలు నాకు ఎవరి మీదా ఉండవు... చివరికి మా అమ్మానాన్నలు, అన్నా వదినలు, వాళ్ళ పాప రూప... ఊహు, ఎవరి మీదా... చివరికి ఐశ్వర్య మీద కూడా... మానసిక అనుబంధం ఎరగని ఒక రోగ్ ని నేను... అలాంటిది, నేనూ నాలాంటి వాళ్ళ  చేతుల్లో దెబ్బ తిన్నాక, ఇప్పుడిప్పుడే మనుషుల విలువ తెలుస్తోంది వేణూ... ఈ మూడురోజులూ నేను డ్రింక్ చేయలేదు, కనీసం సిగరెట్ వెలిగించ లేదు... ఎలా ఉండగలిగాను? మీతో కలిసి ఉండటం కోసం... మీకు ఇబ్బంది కలిగించకుండా ఉండటం కోసం... ఇంత బావుంటుందా మనం ఎదుటి వారికోసం సర్దుకుంటే? ఓహ్... నాలోనూ మనసనేది ఉందన్న మాట!" ఉద్వేగంగా అన్నాడు కార్తీక్.
"కార్తీక్... మీరు కొద్దిగా ఆవేశపడుతున్నారు... కంట్రోల్ యువర్ సెల్ఫ్ మై ఫ్రెండ్..." కార్తీక్ భుజమ్మీద చేయి వేసాడు వేణు.
ఆ చేతిని అలాగే అదిమి పట్టుకుని కొన్ని క్షణాలు ఉండిపోయాడు కార్తీక్.

‘‘వేణూ… నాకూ మనిషిగా మారాలని ఉంది… ఐశ్వర్యతో కలిసి జీవించాలని ఉంది… సాధ్యమేనంటారా?” ఆర్తిగా అడిగాడు కార్తీక్.
‘‘నిజంగానా?” వేణు కళ్ళలో ఆనందం…

‘‘అవునండీ, తను మా వదినకు బాగా దగ్గరైంది. ప్రతీ వారం వాళ్ళింటికి వచ్చి, మా అమ్మానాన్నలతో, రూపతో కలిసి గడిపి వెళుతోంది… మా పేరెంట్స్ కి కూడా ఐశూ అంటే చాలా ఇష్టం… నాతో నా మనిషిగా, ప్రియురాలిగా జీవించిన ఐశూ ఈరోజు నాకేమీ కానట్టు, ఓ పరాయి పిల్లలా నా ముందు తిరుగుతూ ఉంటే ఎంతో బాధ కలుగుతోంది… ఆమె నన్ను ఇగ్నోర్ చేస్తున్న ఫీలింగ్ నన్ను రంపంలా కోసేస్తోంది… సెంటిమెంట్స్ అంటూ లేని నేనేనా ఇలా ఆలోచిస్తున్నాను? అనిపిస్తోంది… కానీ నాకు అర్థమైంది ఏమిటంటే, ఐశూని నేను ప్రేమిస్తూనే ఉన్నాను… ఆమె ప్రెజెన్స్ లో ఎంతో హాయిగా ఉంటుంది… నాకేం కావాలో ఆమెకు తెలుసు… ఇన్నాళ్ళూ గాలికి తిరిగాను… ఇప్పుడు… ఇప్పుడు ఆమె ఒప్పుకుంటే… ఆమెను వివాహం చేసుకోవాలని అనుకుంటున్నాను…”

‘‘కార్తీక్, మీరేం మాట్లాడుతున్నారు?” సంభ్రమంగా అడిగాడు వేణు. “మీరు వివాహం…”

‘‘యస్ వేణూ… మా అన్నావదినల పెళ్ళి అయి పదిహేను సంవత్సరాలు దాటింది… పాపకు సమస్య… నడవలేదు… ఇద్దరికీ ఆ విషయంలో బెంగే… ఆనందం లేదు… కానీ ఇద్దరి మధ్యా అవగాహన ఉంది… సయోధ్య ఉంది… విజయవంతమైన వైవాహిక జీవితానికి అద్భుతమైన ఉదాహరణ వాళ్ళే… మరి నేనెందుకు పెళ్ళిని మానుకొని, ఇలా ఎండమావుల వంక పరుగు తీశాను? కేవలం నా మూర్ఖత్వం వల్ల మాత్రమే… తప్పు చేసాను నిజమే… కానీ దిద్దుకోవాలని అనుకుంటున్నాను. ఎంతో తీవ్రంగా గాయపరిచాను నా ఐశూని… ఇప్పుడు నేను అడగగానే ఆమె ఒప్పుకుంటుందన్న నమ్మకం నాకు లేదు… అసలు ఎందుకు ఒప్పుకోవాలి? అయినా అడుగుతాను… ఏ మూలనైనా నన్ను క్షమించాలని తనకు అనిపిస్తే, నాకన్నా అదృష్టవంతుడు వేరే ఎవరూ ఉండరు…” ఉద్వేగంగా చెప్పాడు కార్తీక్.

‘‘తప్పకుండా మీ ఆశ నెరవేరుతుంది కార్తీక్... ఆల్ ది వెరీ బెస్ట్... మీరు ఐశూ గురించి చెబుతూ ఉంటే, మధూని నేను నా కోపంతో, అసహనంతో, స్వార్థంతో ఎంత బాధించానో బాగా అర్థం అవుతోంది... నాకూ మంచిరోజులు రావాలని దేవుడిని ప్రార్థిస్తాను...ఆ... ఫ్లైట్ టైం అవుతోంది... టాక్సీ అరేంజ్ చేయమని రిసెప్షన్ వాళ్ళకి చెబుదామా?” అన్నాడు వేణు.

సంజ చీకట్లు ముసురుకుని, వినీలాకాశంలో వాళ్ళు ఎక్కిన విమానం మబ్బుల మధ్యనుంచి పయనిస్తూ ఉంటే,  నిశీథిలో వెలుగుతున్న నక్షత్రాల్లా ఆ యువకులిద్దరి మనసుల్లోనూ మధురోహలు మెరుస్తున్నాయి...

***

రాత్రి పదిన్నరకి కాలింగ్ బెల్ మ్రోగితే తలుపు తెరిచింది మధుబాల. ఎదురుగా ట్రాలీ బాగ్ తో నిలుచుని ఉన్నాడు వేణు... పక్కకు తప్పుకుని దారిచ్చింది మధుబాల.

‘‘హాయ్ మధూ... బాగున్నావా?” చిరునవ్వుతో పలకరించాడు... చాలా రోజుల తర్వాత మొట్టమొదటిసారిగా తానీ ఇంటికి వచ్చిన తరువాత మాట్లాడాడు వేణు - అనుకుంటూ, “ఊ...” అంది ముక్తసరిగా.

‘‘అమ్మ పడుకుందా?” అన్నాడు షూ విప్పుకుంటూ...

‘‘ఊ... ఆవిడకి కాళ్ళు నొప్పులుగా ఉన్నాయి... ఇందాకే పడుకున్నారు...”

‘‘బాబిగాడు...”

‘‘వాడు కూడా పడుకున్నాడు... మీరు భోజనం చేస్తారా? రెడీగా ఉంది టేబుల్ మీద...”

‘‘సరే, కాస్త ఫ్రెష్ అయి వచ్చి, నేను వడ్డించుకుని తింటాను, నువ్వెళ్ళి పడుకో...” చెప్పాడు వేణు. తలూపి, మౌనంగా లోపలికి వెళ్ళిపోయింది మధుబాల. ‘ఈ సౌమ్యత, ప్రసన్నత అప్పుడు

ఉండి ఉంటే ఎంత బావుండేది?” ఆమె మనసు మూల్గింది...

***

సుగుణమ్మ మేనత్తకి సీరియస్ గా ఉందని పల్లె నుంచి ఫోన్ రావటంతో, ఆవిడ వెళ్లాలని హడావుడి పడసాగింది. నిజానికి బాగా పెద్ద వయసావిడ... చివరి రోజుల్లో మేనకోడలిని చూడాలని కలవరిస్తోంది అని ఆమె పిల్లలు చెప్పటంతో మనసాగక బయలుదేరింది... తల్లిదండ్రులను చిన్నప్పుడే కోల్పోయిన చిన్నారి సుగుణను మేనత్తే పెంచి పెద్దజేసింది... అందువలన ఆవిడతో అనుబంధం ఎక్కువ.
వేణుకు సెలవు దొరకలేదు. అందువలన దూరపు బంధువుల అబ్బాయిని తోడిచ్చి టాక్సీ బుక్ చేసి తల్లిని ఊరికి పంపక తప్పలేదు.

***

అత్తగారు ఊరికి వెళ్ళిన మొదటి రోజు బాబును చూసుకోవటం కోసం ఆఫీసుకు సెలవు పెట్టింది మధుబాల. పనిమనిషి సహాయంతో ఆమె ఇంటిపనీ, వంటపనీ చూసుకుంటూ ఉంటే తాను ఆఫీస్ కి వెళ్ళేవరకూ బాబిని చూసుకున్నాడు వేణు. ఇద్దరి మధ్యా పెద్దగా మాటలు లేకుండానే సౌమ్యంగా పనులు జరిగిపోతున్నాయి.

రెండవ రోజున సుందరమ్మను చూడటానికి, సరాసరి ఆఫీసు నుంచే  వినత ఇంటికి వెళ్ళాడు వేణు. ఆవిడ మెల్లగా కోలుకుంటోంది... వేణుతో చాలా ఆదరంగా మాట్లాడింది. అలాగే అవంతి, పిల్లలూ కూడా వేణుతో చాలా అభిమానంగా మాట్లాడారు. వినత సరేసరి... ఆమెలో వచ్చిన మార్పు వేణును కూడా ఆనందం లో ముంచింది... ‘ఇప్పటికి బాధ్యత తెలిసింది...’ అనుకున్నాడు. పవన్ మాత్రం మొహం ముడుచుకునే ఉన్నాడు. వేణుతో చాలా ముక్తసరిగా మాట్లాడాడు...

వేణు ఇంటికి బయలుదేరబోతుంటే, “బావా నీతో మాట్లాడాలి...” అన్నాడు పవన్ ముఖాన గంటు పెట్టుకునే... వేణుకు ఏమీ అర్థం కాలేదు... సరేనన్నట్టు తలూపాడు... పవన్ తన స్టడీ

రూమ్ వైపు నడిచాడు.

ఇద్దరూ టేబుల్ కి అటూ ఇటూ కుర్చీల్లో కూర్చున్నాడు... టేబుల్ మీద ఉన్న గాజు పేపర్ వెయిట్ ను చేత్తో అటూ ఇటూ తిప్పుతూ, దాని వైపే దృష్టి సారించిన పవన్ హఠాత్తుగా, "బావా, అయామ్ సారీ... వినతతో నేను జీవించలేను... నాకు స్వేచ్ఛ కావాలి... మీ చెల్లెల్ని నీవు మీ ఇంటికి తీసుకువెళ్ళు..." అన్నాడు కటువుగా...

"పవన్ బావా... ఏమిటి? ఏం మాట్లాడుతున్నావు నువ్వు? తాగి ఉన్నావా??" క్షణాల్లో రౌద్రాకారం దాల్చాడు వేణు.




"ధైర్యంగా నిజం మాట్లాడటానికి తాగనక్కరలేదు బావా..."

"నా చెల్లెలు ఏం తప్పు చేసిందని పుట్టింటికి పంపేస్తావు?" కోపంగా అన్నాడు వేణు.

“అసలు ఆమె ఎప్పుడైనా సవ్యంగా సంసారం చేసిందా బావా? అయాం సారీ, ఈ పిలుపు బాంధవ్యం కోసం కాదు, నిన్ను పేరు పెట్టి పిలవ లేక... వినతకి ఇల్లాలి లక్షణాలు ఏవీ లేవు... ఎంత సేపూ సరదాలు, షికార్లు... స్నేహాలు, విహారాలు... ఒక బాధ్యత కలిగిన ఇంటి కోడలిగా ఎప్పుడూ ప్రవర్తించ లేదు... పెళ్ళికి ముందు నేను కూడా నా దాంపత్య జీవితం గురించి చాలానే కలలు కన్నాను బావా... భర్తతో భార్య ఉండే విధంగా మీ చెల్లెలు ఎప్పుడూ నాతో లేదు... పోనీ మాట తీరు ఏమైనా స్నేహ పూర్వకమా అంటే ఈటెల గాయాలే... పుల్ల విరుపు మాటలూ, సాధింపులతో నా జీవితాన్ని అల్లకల్లోలం చేసేసింది. ఒక్కో సారి ఇంటికి రావాలంటే ఎంతో భయం వేసేది... అమ్మ కనుక నాతో లేక పోతే, విరక్తితో  నేను దేశాలు పట్టి పోయే వాడినేమో...

ఏం కావాలన్నా, ఏడుపులూ, అలకలూ... అడిగింది ఇచ్చేయాలి... ప్రతీ నెలా ఆమె కోసం డబ్బివ్వాలి... రక రకాల పెర్ఫ్యూమ్ లు, కాస్మెటిక్స్, ఖరీదైన చీరలు, నగలు, చెప్పులు... లేటెస్ట్ మోడల్ ఏది వచ్చినా అది ఆమె అప్పటి కప్పుడు తెచ్చేసుకో వలసిందే... ఇవి కాక కిట్టీ పార్టీలు...వారం వారం సినిమాలు... పిక్నిక్ లు...  మీ ఇంట్లో ఎలా గడిచిందో నాకు తెలియదు కానీ నా ఇంట్లో మాత్రం ఆమె అలాగే ఉంది, రాజసంగా  కావలసినవి అన్నీ సాధించుకుంటూ ఉంది.

పోనీ తోచటం లేదేమో అని, చదువుకోమని అన్నాను. ఇంట్రెస్ట్ లేదని చెప్పింది... నాతో పాటు మా ఆఫీసుకు రమ్మనీ, పని నేర్చుకోమనీ, చెప్పాను. నాది స్వంత బిజినెస్ కాబట్టి తానూ సహకరిస్తే ఎంతో బాగుంటుందని ఆశ పడ్డాను. రాను గాక రానని తెగేసి చెప్పింది... నేను బలవంతం చేయ లేక ఊరుకున్నాను.

నా ఇంటి వంటింట్లో స్టవ్వు ఎలా ఉంటుందో తనకి తెలియదు... ఈ వారం రోజుల నుంచీ మాత్రమే  వంట చేస్తోంది, చేయిస్తోంది కానీ, ఇది వరకెప్పుడూ ఆ గది లోకి అడుగు పెట్ట లేదు... అత్త గారికి సేవలు చేయటం మానె, కనీసం ఆప్యాయంగా ఓ పలకరింపు లేదు... మీ నాన్న గారు ఉన్నంత కాలం వినతను సరి చేయాలని ఎంత గానో ప్రయత్నించారు. నేను కూడా

ఆయన మీద ఉన్న గౌరవం కొద్దీ విషయాన్ని పెద్దది చేయ లేదు. అన్నీ తెలిసిన ఆయనతో ఆమె మీద నేరాలూ చెప్ప లేదు.

నాకు సంసార సుఖం ఎప్పుడూ దక్క లేదు... ఇక పిల్లలెలా పుడతారు? అయినా నాలోనే లోపం ఉందని అందరికీ చెప్పింది... ఆ అవమానాన్ని కూడా భరించాను... ఇంకా చిన్న తనం పోలేదు, తానే మారుతుందని ఆశించాను... నా సౌమ్యత ఆమెకు అసమర్థతలా కన బడింది. కాలం గడిచి పోతోంది కానీ తనలో మార్పు రాలేదు...

ముందు రోజు నుంచే అమ్మకి కొద్దిగా ఆయాసంగా ఉంది... మా అక్క వచ్చే రోజు దగ్గర అవుతోంది... అప్పటికే వినత అరకు లోయ ట్రిప్ వేసేసుకుంది... నేను ఎంత గానో ప్రాధేయ పడ్డాను. అమ్మకి బాగా లేదని, ఈ ఒక్క సారికి టూర్ మానేయమని చెప్పాను. విన లేదు... నన్ను ఓ పురుగును చూసినట్టు చూసి తన మానాన తాను వెళ్ళి పోయింది... అంతే కాదు... అమ్మకి అటాక్ వస్తే, హాస్పిటల్ లో జాయిన్ చేసి, అడ్వాన్స్ చెల్లించటానికి డెబిట్ కార్డు ఇస్తే బాలెన్స్ లేదని రిజెక్ట్ అయింది... కారణం తెలుసా? నాకు చెప్పకుండా వినత లక్ష రూపాయలు విత్ డ్రా చేసేసింది... తెలిసిన వాళ్ళే కనుక, నా ఫరం కరెంట్ ఎకౌంటు లో ఓవర్ డ్రాఫ్ట్ ఫెసిలిటీ ఉంది కనుక మర్నాడు తెచ్చి కట్టేస్తానని వాళ్ళతో చెప్పి ఒప్పించాను. అవసరం గట్టెక్కింది... కానీ హాస్పిటల్ స్టాఫ్ ముందు నా పరువు పోయింది.
ఇక ఆ రాత్రి అమ్మ ఆయాసంతో, పెద్ద శబ్దంతో రొప్పుతూ ఉంటే, బాధతో ఆమె గుండెలు ఎగసి ఎగసి పడుతూ ఉంటే, నాకు ప్రాణం పోయినంత పని అయింది. అమ్మను ఐసిసియు లో ఉంచి నన్ను బయట కూర్చోమని చెప్పారు. డాక్టర్స్ ట్రీట్మెంట్ ఇస్తూనే ఉన్నారు. నేను ఒంటరిగా బయట బిక్కు బిక్కుమంటూ ఒక్కడినీ బాధగా, భయంగా, బరువుగా... తెల్లారి రాబోయే అక్క కోసం ఎదురు చూస్తూ, అసలు 'అక్క వచ్చే సరికి అమ్మ ఉంటుందా,' అని మథన పడుతూ... ఆ రాత్రి ఎంత ఘోర నరకాన్ని అనుభవించానో నీకు తెలుసా బావా? ఆ సమయంలో నా భార్య పక్కన ఉండి, 'ఏం ఫర్వా లేదండి, అత్తయ్యకి ఏమీ కాదు... దేవుడు కరుణిస్తాడు... డాక్టర్లు చూస్తున్నారు కదా, తగ్గిపోతుంది...' అని భుజమ్మీద చేయి వేస్తే, ఒక చిన్న మంచి మాటతో ఊరడిస్తే ఆ క్షణం నేను ఎంత గుండె ధైర్యాన్ని తెచ్చుకుని ఉండే

వాడిని? అసలు పెళ్ళి చేసుకునేది అలాంటి తోడు కోసం కాదా బావా? మధు చెల్లాయి నీకు అలాంటి తోడు కాదా?

ఈ రోజు లోకానికి భయ పడో, మీరేమైనా అంటారనో తాను ఒద్దికగా ఉంది... కానీ, అదెంత సేపు? లాగి పట్టుకున్నంత సేపే కదా కుక్క తోక సరిగ్గా నిలిచేది... వదిలామో వెంటనే వంకర అయి పోతుంది... ఇప్పుడు మా అక్కా, పిల్లలూ అమెరికాకి వెళ్ళి పోగానే, వినత పాత వినత అయి పోతుంది... నాకు ఈ జీవితం మీదే విరక్తిని కలిగించిన ధీర వనిత మీ వినత... వద్దు బావా... లాయర్ గారిని తీసుకుని, మీ ఇంటికి వస్తాను... అన్నింటికీ సిద్ధ పడండి... మ్యూచువల్ కన్సెంట్ మీద విడాకులు తీసుకుంటే త్వరగా వచ్చేస్తాయి... ఆమెకీ స్వేచ్ఛ, తన సరదాలు తీర్చుకోవచ్చు... నాకూ హాయి... శేష జీవితాన్ని ప్రశాంతంగా గడప వచ్చు... మీరూ ఆలోచించండి... ఇంత కన్నా గత్యంతరం లేదు నాకు...” చెప్పటం ముగించి, బాధగా నుదురు రాసుకున్నాడు పవన్.

పవన్ మాటలన్నీ వింటుంటే, వేణు కోపమంతా ఏమైందో ఏమో, జావ గారినట్టు అయిపోయి, పాలి పోయిన ముఖంతో, జీవం లేని మనిషిలా అయి పోయాడు. అతనికి ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి...పవన్ చెప్పినవి అన్నీ, కాదన లేని నిజాలే!

తల్లీ, తనూ కలిసి అతి గారాబంతో వినతను చాలా చెడ్డ దానిగా తయారు చేసారు... పసి వాళ్ళుగా ఉన్నప్పుడు పిల్లలు అందరూ మంచి వాళ్ళే... వాళ్ళు పెరిగిన వాతావరణాలూ, కుటుంబ సభ్యులే వారి మనస్తత్వాలను తీర్చి దిద్దుతాయి అనేది అక్షర లక్షల విలువైన సత్యం...
అయితే ఇక వినతను వదిలేస్తాడు పవన్... తనకు అర్ధమై పోయింది... చాలా గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఎవరు చెప్పినా వినేట్టు లేడు... ప్రపంచానికీ, బంధు వర్గానికీ తెలుసు - వినత ఎలాంటిదో... పవన్ ని ఎవ్వరూ తప్పు పట్టరు కూడా... నిజానికి అతను అనుభవించిన నరకం కన్నా, వినతా, తామూ అనుభవించ బోయేది చాలా చిన్నది...

తమకిలా జరగాల్సిందే ... కళ్ళలో పెట్టుకుని పెంచిన చెల్లెలి బ్రతుకు ఇకపై పుట్టింట్లోనే... ఒక్క క్షణం మధు ముఖం కనుల ముందు మెదిలింది... ఆమెను క్షోభ పెట్టినందుకేనేమో తమ ముఖాన ఇంత నరక యాతన అనుభవించమని రాసాడు ఆ దేవుడు! ఇలాగే, ఆమెకు తెలియకుండా జాయింట్ అకౌంట్ లోంచి డబ్బు వాడేసాడు తను... అచ్చు వినత లాగానే... 'చెల్లుకు చెల్లు' అన్నట్టు తమ అందరి పాపాలకూ, తప్పులకూ చెల్లు చీటీ రాయాల్సిన సమయం వచ్చేసింది...

స్వప్నావశిష్టుడిలా బయటకు వచ్చాడు వేణు... యాంత్రికంగా బైక్ స్టార్ట్ చేసాడు... ఇంటికి బయలు దేరాడు...

***

ఆఫీసులో కార్తీక్ ని చూడగానే ఐశ్వర్య కళ్ళలో ఇంద్ర ధనుసులు విరిశాయి. కళ్ళ నిండుగా అతన్ని చూసుకుంటూ, మనసులో ఆనందాన్ని నింపుకుంటూ అలాగే ఉండి పోయింది...

ఫైల్ ని స్టడీ చేస్తున్న కార్తీక్ ఏవో చూపుల తూపులు తనను గుచ్చుతున్నట్టు అనిపిస్తూంటే గబుక్కున తలెత్తి చూసాడు. వెంటనే తల దించుకుంది ఐశ్వర్య. ఆమెను చూస్తూంటే మనసు ఝల్లుమన్నట్టు అయింది కార్తీక్ కి... ఇది వరలో ఎప్పుడూ లేనిది... కలిసి కాపురం చేసినప్పుడు సైతం కలగనిది... తొలి చూపులో ప్రేమ లాంటి ఒక రకమైన మధుర భావన! ఒక్క క్షణం తనకు తానే కొత్తగా అనిపించాడు కార్తీక్ కి. తనను తాను సంబాళించుకుంటూ, తిరిగి ఫైల్ వైపు దృష్టి మరల్చాడు.

మధ్యాహ్నం ఆమెను తన టేబుల్ దగ్గరకు పిలిచాడు. ఐశ్వర్య రాగానే సీట్ ఆఫర్ చేసి, తనతో పాటు తీసుకు వచ్చిన ఒక కవర్ అందిస్తూ, "ఐశూ... నీ కోసం ముంబై నుంచి తీసుకు వచ్చాను..." అని అందించాడు. లోపల చక్కని హాండ్ బాగ్...

"ముంబై లో నేను స్టే చేసిన హోటల్ లోనే షాప్ ఉంది... ఇది నీకు బాగుంటుందనిపించింది... నీకు నచ్చిందా?"

‘‘బావుంది… థాంక్ యు కార్తీక్…” మెల్లగా చెప్పింది ఐశ్వర్య.

‘‘అన్నట్టు… మీ ఫ్రెండ్ మధూ వాళ్ళ ఆయన వేణు కూడా ట్రైనింగ్ కి వచ్చాడు… ఇద్దరం ఒకే రూమ్ లో ఉన్నాం…”

‘‘ఓహో…”

‘‘ఏమిటి డల్ గా ఉన్నావు? ఒంట్లో బాగా లేదా?” ఆదుర్దాగా అడిగాడు…

కార్తీక్ లో ఎప్పుడూ కనబడని కొత్త కోణాలు కనబడుతూ ఉంటే కొద్దిగా ఆశ్చర్యం గానే, “ఏం లేదే, బాగానే ఉన్నాను…” అంది తడబడుతూ…
‘‘నేను అప్పగించిన పనులు…”

‘‘పూర్తి చేసాను… ఉదయం నుంచి బిజీగా ఉన్నావని రాలేదు…”

‘‘సరే, సాయంత్రం రా… డిస్కస్ చేద్దాం… ” ఆమెను అలాగే చూస్తూ ఉండి పోవాలని, మాట్లాడుతూ ఉండాలని ఉంది అతనికి… ‘లేత గులాబీ రంగు సల్వార్ సూట్ ఆమెకు చక్కగా అమరింది…’ అనుకున్నాడు ఆమె లేచి వెళుతూ ఉంటే… ఒక ఆడదాని శరీరాన్ని గురించి, అందులోని ఒంపు సొంపుల గురించే తప్ప, వస్త్ర ధారణ గురించి, రూప లావణ్యం గురించి, మనో సౌందర్యం గురించి ఏనాడూ ఆలోచించని కార్తీక్ మనసులో ఏవేవో కొత్త భావనలు చిక్కని అరుణ రాగాల్లా అలరిస్తున్నాయి…

ఆమె కావాలి… యస్… ఐశ్వర్య తనకు కావాలి! ఎప్పటికీ అచ్చంగా తనకే కావాలి!! అంతే!!!

***

‘‘వదినా, బాగా తల నొప్పిగా ఉంది… కొంచెం కాఫీ ఇస్తావా?” దీనంగా అడిగింది వినత.

‘‘అమ్మా వినతా, నువ్వు అడిగినప్పుడల్లా కాఫీలు, టీలు రెడీ గా అందించటానికి ఇది హోటల్

కాదు, నేను నీ వంటమ్మాయిని కాదు... పని మనిషి రావటం లేదు, పనితో నేను సతమతమై పోతున్నాను... బట్టలు ఉతకమని చెప్పాను... ఉతికావా?" అడిగింది మధు బాల.

"వాషింగ్ మెషిన్ వేసాను వదినా..."

"ఊ... బాబి గాడు లేచే వేళయింది... ఈ పాలు తీసుకెళ్ళి రెడీగా ఉంచుకో... ఏడిస్తే వాడికి పట్టు..." ఫీడర్ నిండా పాలు నింపి ఇచ్చింది మధు బాల.

"బట్టల పని చూడు... కాఫీ ఇస్తాను..." ముక్త సరిగా చెప్పి పనిలో మునిగి పోయింది.

హాల్లో బట్టలు ఇస్త్రీ చేస్తున్న వేణుతో, "అమ్మ ఎప్పుడు వస్తుంది అన్నయ్యా?" అంది వినత.

"ఏమోనే... ఫోన్ చేస్తే కలవటం లేదు... ఎప్పుడొస్తుందో ఏమో మరి..." త్రుంచినట్టే జవాబు చెప్పాడు. బట్టల పని అయి, డ్రైయర్ లోంచి తీసి, బాల్కనీలో ఆరేసి, క్లిప్పులు పెట్టి లోపలికి వచ్చే సరికే బాబి గాడు నిద్ర లేచి, ఇంటి కప్పు ఎగిరి పోయేలా ఏడుస్తున్నాడు... గబుక్కున వచ్చి ఎత్తుకుంది వినత. అప్పటికే పక్క తడి చేసాడేమో, వాడి తడి బట్టలు వినతకి అంటుకున్నాయి... వాడిని పక్కన పడుకో బెట్టి వాష్ చేసుకుని వచ్చే లోగా మరింత  గట్టిగా ఏడవటం మొదలు పెట్టాడు...

లబలబలాడుతూ వచ్చేసింది మధు బాల...

"వినతా, చెప్పాను కదా పాలు పట్టమని?" కోపంగా అడిగింది వాడిని ఎత్తుకుంటూ...

"అదీ... తడి బట్టలు అంటుకున్నాయి వదినా, కడుక్కుని వస్తున్నాను..."

"వాడికి డ్రాయర్ మార్చకుండా, ఆ చెమ్మ బట్టలతో ఉంచేసి, అర్జెంటుగా కడుక్కుని వచ్చేయటానికి వెళ్ళావా? మరీ అంత సుకుమారమా? అసలు... పిల్లల్ని లాలించటం నీకేం తెలుసులేమ్మా, ఒక్క బిడ్డను కని ఉంటే తెలిసేది..." బాబుకి పొడి చెడ్డీ వేస్తూ అన్నది మధు

బాల సాధింపుగా...

చివ్వున కన్నీళ్లు చిమ్మాయి వినత కళ్ళ లోంచి...




దుఃఖాన్ని బలవంతంగా ఆపుకుంటూ కళ్ళు తుడుచుకోవాలని చీర కొంగు ముందుకు లాక్కోబోయింది వినత. చీర కొంగు తగలలేదు... మళ్ళీ తడుముకుంది... మెత్తని శాటిన్ నైటీ తగిలింది...

గబుక్కున మెలకువ వచ్చేసి, ఒక్క ఉదుటున లేచి కూర్చుంది వినత. ఆమె కళ్ళ నుండి ఇంకా కన్నీళ్లు జారుతూనే ఉన్నాయి... తాను కలగన్నానని అర్థమైంది... కానీ దుఃఖం మాత్రం ఆగటం లేదు. ఇది కలా? కలేనా? నిజం కాదు కదా? చుట్టూ చూసింది. మసక వెలుతురులో తన గది, గదిలోని వస్తువులూ కనిపించాయి. అబ్బా, ఎంత భయంకరమైన కల! ఎంత పరుషమైన

మాటలు!!

పవన్ తన అన్నయ్యతో మాట్లాడిన మాటలు విని చెదిరిపోయిన మనసుతో, ఎంతో దుఃఖంతో గదిలోకి వచ్చి ఏడుస్తూ పడుకుంది తను. విడిపోవటం అంటూ జరిగితే అన్నయ్య ఇంట్లో తన పరిస్థితి ఇంతేగా? భవిష్యద్వాణి కల ద్వారా చెప్పేసింది...

మధు వదిన ఎంత మంచిది, సాత్వికురాలు అయినా తన మీద కోపం ఎలా పోతుంది? ఆ రోజు ఆమె జారి పడాలని, ఆమె గర్భాన ఉన్న బిడ్డ ఆమెకి దక్కకూడదని ఏ ఆడదీ చేయకూడని పని తాను చేసింది... అదసలు ఎవరైనా క్షమించగలిగే నేరమేనా? పశ్చాత్తాపంతో వినత కళ్ళల్లోంచి మళ్ళీ  గంగాయమునలు ప్రవహించసాగాయి. మెల్లగా కంట్రోల్ చేసుకుంటూ బల్ల మీద ఉన్న వాటర్ బాటిల్ ఎత్తి నీళ్లన్నీ తాగేసింది.

ఇంతలో హాల్లోంచి సన్నగా మాటలు వినబడసాగాయి.  పవన్ ఫోన్ లో మాట్లాడుతున్నాడు...

‘‘అయ్యో, మధూ, కంగారు పడకమ్మా, నేను ఇప్పుడే బయలుదేరుతున్నాను...’’ మొబైల్ మాట్లాడుతూ లోపలికి వచ్చి, బట్టలు మార్చుకున్నాడు.

‘‘ఏమైంది?’’ గాబరాగా అడిగింది వినత.

‘‘ఏం లేదు వినతా... నువ్వు పడుకో...’’ పర్సు తీసి జేబులో పెట్టుకుంటూ చెప్పాడు పవన్.

‘‘కాదు, నిజం చెప్పండి పవన్, ఏమైంది?’’   దీర్ఘంగా నిట్టూర్చాడు పవన్. “మీ అన్నయ్యకి యాక్సిడెంట్ అయిందట... హాస్పిటల్ లో ఉన్నాడు... కానీ డోంట్ వర్రీ... ప్రాణానికి ఏమీ భయం లేదు...కాలికి దెబ్బ తగిలింది అంతే... సరేనా, నేను వెళ్లి వస్తాను... అందరూ పడుకున్నారు... ఎవరికీ చెప్పకు, కంగారు పడకు...’’

‘‘కాదు... నేనూ వస్తాను మీతో...’’

‘‘నో… ఎమర్జెన్సీ వార్డ్ లో ఉన్నాడు… ఎవరినీ ఇప్పుడు రానీయరు… నేను చెబుతున్నాను కదా, ఏం భయం లేదు… నేను అక్కడినుంచి ఫోన్ చేస్తాను…లోపలి నుంచి తలుపు వేసుకో…”

అతని వెనుకనే వచ్చి తలుపు వేయబోతూ, “పవన్, అయామ్ ఆ ఫుల్లీ సారీ… నాకు… నాకు ఇంకా చాలా మాట్లాడాలని ఉంది… అవకాశం ఇస్తారు కదూ?” అంది పూడుకుపోయిన గొంతు పెగుల్చుకుంటూ…

‘‘ఇది సమయం కాదు… నన్ను వెళ్ళనీ…” రెండు నిమిషాల్లో కారు స్టార్ట్ చేసిన శబ్దం వినిపించింది… ఏం చేయాలో తోచక, తనను తాను నిందించుకొంటూ, ఒక్క అవకాశం ఇవ్వమని దేవుడిని వేడుకుంటూ, అన్న గారి కోసం ప్రార్థిస్తూ వీధి తలుపు మూసి, లోపలికి వచ్చింది వినత. ఎల్లవేళలా విశ్వవిజేతలా ఉండే వినత ఇప్పుడు సర్వస్వం కోల్పోయిన దీనురాలిలా ఉంది.

***

పవన్ మాట్లాడిన మాటలు విన్నాక వేణు చాలా డిస్టర్బ్ అయ్యాడు. పవన్ తాను వినత వలన పడిన బాధలు, అనుభవించిన మానసిక క్షోభ చెబుతూ ఉంటే తనకు తానే ఒక దోషిలా ఫీలయ్యాడు…

ఇంటికి బయలుదేరాడే కానీ, మనసులో పవన్ మాటలు, అతను తీసుకున్న నిర్ణయం మారు మ్రోగుతూ ఉండగా, బైక్ కి అడ్డం వచ్చిన కుక్కపిల్లని తప్పించబోయి, లెఫ్ట్ కి కట్ చేసి, మరో బైక్ కి ఢీ కొట్టి, క్రింద పడిపోయాడు.

ఆ బైక్ మీదున్న అబ్బాయికి పెద్దగా దెబ్బలు తగల్లేదు… కానీ వేణుకు మాత్రం చేతులూ, కాళ్ళూ చెక్కుకుపోవటంతో పాటుగా కుడి  కాలికి బాగా దెబ్బ తగిలింది… కాలు కదల్చ లేకపోయాడు….వేరే బైక్ మీది అబ్బాయి వెంటనే స్పందించి దగ్గరలో ఉన్న హాస్పిటల్ కి తీసుకొని వెళితే వెంటనే జాయిన్ చేసేసుకున్నారు. అక్కడి నుంచి మధూకి ఫోన్ చేసాడు వేణు.

పవన్ వెళ్లేసరికి పరిస్థితి ఏమిటంటే, ఫస్ట్ ఎయిడ్ చేసి, గాయాలకు ప్లాస్టర్లు వేసారు.

కదల్చలేకపోతున్న కుడి కాలికి ఎక్స్ రే తీసారు. అనుమానించినట్టే మేజర్ ఫ్రాక్చర్ ఉంది... మర్నాడు సర్జరీ చేయాలని, సర్జరీ అయ్యాక ఆరు వారాలు కంపల్సరీగా బెడ్ రెస్ట్ తీసుకోవాలని పవన్ తో చెప్పారు...

మధుబాలకి ఫోన్ కాల్ వచ్చేసరికి కంగారు పడిపోయింది. ఒక్క ఉదుటన ఇంట్లో ఉన్న డబ్బు బాగ్ లో కుక్కుకుని, క్రెడిట్ కార్డు, డెబిట్ కార్డులు పట్టుకుని, బాబుతో బయలుదేరిపోయి వచ్చేసింది. ఒంటి  మీద  గాయాలతో, కాలు నొప్పితో మూల్గుతున్న భర్తను చూడగానే ఆమెకు దుఃఖం ఆగలేదు... బాధ పడుతూనే, డాక్టర్స్ చెప్పిన ప్రకారం హాస్పిటల్ లో అడ్వాన్స్ డబ్బు కట్టి, అతని దగ్గర ఉండి, వాళ్ళకు సహకరిస్తూ, వాళ్ళు చెప్పినట్టు చేస్తూ నిలబడి ఉంది. బాబును ఎత్తుకుని అలా చేయటం ఆమెకు కష్టమే అయినా తప్పలేదు. ఆ స్థితిలో కూడా వేణుకు, తన కోసం ఎంతో తాపత్రయ పడుతున్న మధుబాలను చూస్తుంటే ఎంతో బాధ, వేదన, అపరాధ భావన  కలిగాయి. ఇదేనా వివాహ బంధం అంటే? ఒక కప్పు క్రింద ఉన్న ఇద్దరి మనుషుల మనసుల మధ్య ఇంతగా అనుబంధమనే తీగ అల్లుకుంటుందా? వేణును స్పెషల్ రూమ్ కి తరలించారు. "మధూ, బాబుతో నువ్విక్కడ ఉండటం చాలా కష్టం... మనింటికి వెళదాం... అక్కడ ఉందువు గాని... బావను నేను చూసుకుంటాను... హాస్పిటల్ వాతావరణం లో బాబును ఉంచటం అంత మంచిది కాదమ్మా..." అన్నాడు పవన్. ఏమనాలో తెలియలేదు మధుబాలకు... కానీ పవన్ చెప్పింది కూడా నిజమే...

"నువ్వుండి చేసేదేముంది మధూ? బావకు నిద్రకి మందు ఇచ్చారు... రేపటి వరకూ విశ్రాంతిగా పడుకుని ఉంటాడు. వెయ్యాల్సిన మందులూ, డ్రిప్ పెట్టటం అన్నీ హాస్పిటల్ స్టాఫ్ చూసుకుంటారు. నేను ఆయన పక్కనే ఉంటాను... పదమ్మా..." అంటూ, అక్కడ నర్సింగ్ స్టాఫ్ కి ఇరవై నిమిషాల్లో వస్తానని చెప్పి, మధును తనింటికి తీసుకు వచ్చేసాడు, పవన్.

మధుబాలను వినతకు అప్పగించి, తాను మళ్ళీ హాస్పిటల్ కి వెళుతూ ఉంటే "అన్నయ్యా, వేణుకు ఏం ఫర్వాలేదు కదూ?" అని దీనంగా అడిగింది మధుబాల. ఆ స్వరంలో వినిపించిన దుఃఖానికి పవన్ హృదయం కదిలిపోయింది.

‘‘ఫర్వాలేదమ్మా... నీ మంచితనమే అతనికి శ్రీరామ రక్ష!” ఆమె తల నిమిరి వెళ్ళిపోయాడు. వినత నిద్ర పోతున్న బాబును ఎత్తుకుని తీసుకువెళ్ళి పక్క మీద పడుకోబెట్టింది. అలికిడికి లేచి వచ్చిన అవంతితో విషయం చెప్పింది వినత విచారంగా... మధు నీరసంగా సోఫా మీద కూలబడింది.

‘‘మధూ, ఏమీ బాధ పడకమ్మా, వేణు త్వరగానే కోలుకుంటాడు... ప్రాణానికి ఏమీ భయం లేదని చెప్పారు కదా... రేపు ఆపరేషన్ సవ్యంగా జరిగిపోతుంది... నువ్వేమీ కంగారు పడకు... అత్తయ్యకు మాత్రం విషయం చెప్పకండి... కంగారు పడి వచ్చేస్తారు...” అంది అవంతి ధైర్యం చెబుతూ... తలూపింది మధు.

మేనత్త చనిపోవటం వలన సుగుణమ్మ పల్లెలోనే ఉండి పోయింది. పదిరోజుల వరకూ రానని ముందు రోజునే ఫోన్ చేసింది... “మీరు వెళ్ళి పడుకోండి వదినా... మధు వదిన నా రూమ్ లో పడుకుంటుంది...” చెప్పింది వినత. “సరేనమ్మా... జాగ్రత్త... గుడ్ నైట్...” అని చెప్పి వెళ్ళింది అవంతి. వంటగదిలోకి వెళ్లి పాలు వేడి చేసి ఓ గ్లాసులో పోసి తీసుకువచ్చి, మధుకు ఇచ్చింది  వినత. వద్దనకుండా తాగేసింది మధు...

‘‘రా వదినా... పడుకో...”ఆదరంగా ఆమె చేయి పట్టుకుని తన బెడ్ రూమ్ వైపు నడిపించింది వినత. వాన వెలసిన తరువాత ఆకాశంలా వినత హృదయం నిర్మలంగా ఉందిప్పుడు...

***

వేణుకు ఆపరేషన్ జరిగింది. మోకాలి కిందుగా స్టీల్ ప్లేట్ వేసి ఆపరేట్ చేసారు. నొప్పిని భరించలేకపోతున్నాడు వేణు... వినత ఇంట్లో  బాబును చూసుకుంటూ ఉంటే, మధు హాస్పిటల్ లోనే ఉండిపోతోంది... వేణుకు కావలసినవి అన్నీ క్షణంలో అమరుస్తోంది...
అవంతి వంట చేసి, మధుబాలకు పంపిస్తోంది... వేణుకు కావలసిన డైట్ మాత్రం హాస్పిటల్ వాళ్ళే ఇస్తున్నారు.

ఆపరేషన్ అయిన రెండవరోజు ఉదయం బెడ్ మీద అనీజీగా కదులుతుంటే, తనకు బెడ్ పాన్ పెడుతున్న భార్య కనిపించి వేణుకు హృదయం మెలిపెట్టినట్టే అయింది...

దేహ బాధ తీరి, వార్డ్ బాయ్ వచ్చి బెడ్ పాన్ తీసేసి వెళ్ళగానే, "అయామ్ వెరీ వెరీ సారీ మధూ... నిన్ను చాలా బాధపెట్టాను... నాకు నిష్కృతి లేదు..." అన్నాడు ఆమె చేతిని పెదవులకు చేర్చుకుని... గెడ్డం దగ్గర తగిలిన గాయం నొప్పి పుడుతూ ఉంటే సరిగ్గా మాట్లాడలేకపోతున్నాడతను...

"ష్... మాట్లాడకండి... నొప్పి పుడుతుంది..." గడ్డం మీదున్న గాయాన్ని చూపిస్తూ అంది మధుబాల... వార్డ్ బాయ్ సహాయంతో అతనికి బ్రష్ చేయించింది. నర్స్ వచ్చి మందులు వేసి వెళ్ళింది... బ్రేక్ ఫాస్ట్ అయ్యాక డాక్టర్ వచ్చి చూసి రెండురోజుల్లో డిశ్చార్జ్ చేస్తామని చెప్పి వెళ్ళారు.

***

"ఐశూ..." ఆఫీసయ్యాక, ఇంటికి వెళ్ళటానికని బాగ్ సర్దుకుంటున్న ఐశ్వర్య దగ్గరకు వచ్చింది నీరజ.

"ఆ... చెప్పు నీరూ..."

"ఈ ఆదివారం నీకేమైనా పని ఉందా? నాతో రాగలవా? శ్రీ చైతన్య ను చట్నీస్ రెస్టారెంట్ లో కలుద్దామని ప్రపోజ్ చేసాను... నువ్వూ నాతో వస్తే..."

"ఆదివారం కాదు కానీ, శనివారం కూడా మనకి సెలవే కదా... వీలైతే నీ ప్రోగ్రాం ముందుకు మార్చు... నేను తప్పకుండా వస్తాను. ఆదివారం మా ఫ్రెండ్ ఇంటికి వెళ్ళాలి... తప్పనిసరి..." చెప్పింది ఐశ్వర్య.

"సరే, ఏ సంగతీ నీకు రేపు చెప్తాను ఐశ్వర్యా..."

‘‘ఓకే నీరూ… బట్  డోంట్ లూజ్ యువర్ హార్ట్… సరేనా? కొద్దిగా ప్రాక్టికల్ గా ఉండటం అలవాటు చేసుకోవాలి… తప్పదు!” అంది ఐశ్వర్య నీరజ భుజం తడుతూ…

‘‘అవును ఐశూ… అండ్ థాంక్ యు ఫర్ ది సపోర్ట్…” చేయి ఊపి వెళ్ళిపోయింది నీరజ.

‘‘ఐశూ, ఓ సారి రాగలవా?” ఇంటర్ కాం లో పిలిచాడు కార్తీక్.

‘‘యా, కార్తీ, ఏమైనా పనుందా?” అతని సీట్ దగ్గరకు వెళ్లి ఎదురుగా కూర్చుంది ఐశ్వర్య.

‘‘పనేమీ లేదు కానీ, మీ మధు వాళ్ళ హజ్బెండ్ వేణుకి యాక్సిడెంట్ అయిందట…” “అవును…” విచారంగా అంది ఐశ్వర్య.




‘‘పాపం కదా.. చాలా మంచి వాడు వేణూ…”

‘‘అవును కార్తీ... హాస్పిటల్ నుంచి డిశ్చార్జ్ అయ్యాడు... కుడి కాలు ఫ్రాక్చర్ అయింది... ఆరువారాలు బెడ్ రెస్ట్ అన్నారు... ఇంకా ఇంటికి రాలేదు, వాళ్ళ ఆడపడుచు వినత ఇంట్లో ఉన్నారు వాళ్ళు... ఆదివారం నాడు వెళ్ళి చూసి వస్తాను...’’ చెప్పింది ఐశ్వర్య.

‘‘నేను కూడా వస్తాను ఐశూ...’’

‘‘కానీ నేను ఉదయమే వెళదామని అనుకుంటున్నాను...’’

‘‘సరే... నేను పదకొండు గంటలకి వచ్చి చూసి వెళతాను... ట్రైనింగ్ లో చాలా ఆత్మీయుడు అయ్యాడు వేణు నాకు... చెప్పాను కదా...’’

‘‘ఊ... అవును...’’

‘‘ఇంటికి వెళుతున్నావా?’’

‘‘అవును...’’

‘‘నా వర్క్ కూడా అయింది... అటే వస్తున్నాను... నిన్ను డ్రాప్ చేస్తాను...’’

‘‘ఊహు, వద్దులే కార్తీ... నేను వెళతాను...’’

‘‘ఐశూ... అయితే నన్ను నీ స్నేహితుడిలా కూడా చూడలేక పోతున్నావా? సరే, నీ ఇష్టం...’’ కార్తీక్ ముఖం బాధతో ఎర్రబడింది... ఇదివరలో అతనికిలాంటి భావనలు కలిగేవి కావు... (నిజానికి ఐశ్వర్య నుంచి ఎలాంటి వ్యతిరేకతలు వ్యక్తం అయ్యేవి కావు) కానీ, ఇప్పుడు...

‘‘అయ్యో, అదేమీ కాదు...’’ ఇబ్బందిగా కదిలింది ఐశ్వర్య...

‘‘సరే ఐశ్వర్యా, నువ్వు వెళ్ళు...’’తలూపి లేచి నిలబడింది ఐశ్వర్య... ఆశాభంగం చెందిన వాడిలా, ఫైల్స్ ఉన్న బీరువా లాక్ చేసి, డ్రా సొరుగులన్నీ మూసి, లాక్ చేసి, బ్రీఫ్ కేస్

తీసుకుని లేచాడు కార్తీక్. ఆఫీసు బయటకు వచ్చి చూస్తే ఆటో కోసం ఎదురు చూస్తూ నిలబడి ఉంది ఐశ్వర్య. లేత నీలం రంగు చీరలో సాగర కన్యలా ఉంది... అతన్ని చూసి బై చెపుతున్నట్టుగా చిరునవ్వు నవ్వింది. ఉక్రోషంగా తల తిప్పుకుని, కార్ పార్కింగ్ వైపు వెళ్ళాడు కార్తీక్.

తనలో తానే నవ్వుకుంది ఐశ్వర్య.

***

శనివారం సాయంకాలం ఏడుగంటల సమయం. చట్నీస్ – హిమాయత్ నగర్ బ్రాంచ్ చాలా రష్ గా ఉంది.

‘‘హాయ్, అయామ్ నీరజ... నీరూ...’’ అతనికి షేక్ హాండ్ ఇస్తూ చెప్పింది చిరునవ్వులో నీరజ.

‘‘ఓహ్, నీరూ... యు ఆర్ మార్వలెస్... టూ ప్రెట్టీ...’’ షేక్ హ్యాండ్ ఇస్తూ ఆమె చేయిని గట్టిగా నలిపేసాడు మొరటుగా ఆ వ్యక్తి.
చేయి వదిలించుకుని, నవ్వుతూనే అతని ఎదురుగా కూర్చుంది నీరజ. నీరజ తో పాటుగా వచ్చిన ఐశ్వర్య వాళ్ళ టేబుల్ పక్కనే మరో చిన్న టేబుల్ దగ్గర కూర్చుంది.

నీరజ తన ఎదురుగా ఉన్న శ్రీచైతన్యను పరిశీలనగా చూసింది... ముప్పై ఐదేళ్ళ వయసు ఉంటుంది అతనికి. బట్టతల కూడా వస్తోంది... మరీ పొడుగ్గా కాకుండా మధ్యస్తంగా ఉన్నాడు... గుబురు మీసాలు... అతని కళ్ళలో విపరీతమైన కాంక్ష కనిపిస్తోంది... నీరజను చూపులతోనే తినేస్తున్నాడు...

అప్పటికే ఐశ్వర్య మాటల వలన ప్రిపేర్ అయిపోయిన నీరజకు పెద్దగా ఆశాభంగంలాంటిదేదీ కలగలేదు... కానీ మగవాడు ఎలా ఆడదాని బలహీనతతో ఆడుకుంటాడో మాత్రం అర్థమై, బాగా జ్ఞానోదయం కలిగినట్టు అయింది...

‘‘నీరూ... ఎప్పటి నుంచి ఊరిస్తున్నావు... కలుద్దామని ఎన్ని సార్లు చెప్పినా నీకు దయ కలగలేదు... ఇన్నాళ్ళకి కుదిరింది...’’ సగం నిష్టూరం, సగం సంతోషం కలగలిపి మాట్లాడుతూ, ‘‘ఏం తింటావు?’’ అని అడిగాడు మెనూని అటూ ఇటూ తిరగేస్తూ...

‘‘లైట్ గా టిఫిన్ ఏదైనా...’’

‘‘సరే... పనీర్ దోసె చెబుదాం... బావుంటుంది... ఇంతకూ... నువ్వు హాస్టల్ లో ఉంటున్నావు కదా...’’

‘‘ఊ...’’

‘‘నువ్వు చాలా అందంగా ఉన్నావు నీరూ...’’

‘‘థాంక్స్!’’ నవ్వింది నీరజ...

‘‘నిన్ను చూస్తుంటే నాలో చాలా ఉద్రేకం కలుగుతోంది... యు ఆర్ టూ...’’

‘‘ఒన్ సెకండ్...’’ అతని మాటను కట్ చేస్తూ, ఆమెకి వచ్చిన ఫోన్ కాల్ అటెండ్ అయింది నీరజ.

‘‘అబ్బ, నీ చెయ్యి ఎంత మెత్తగా ఉందో...’’ ఆమె చేతిని తన చేతిలోనికి తీసుకుని ఒత్తాడు...

‘‘ప్లీజ్...’’ చేయి లాక్కుంది నీరజ. టిఫిన్స్ వచ్చాయి... మౌనంగా దోశె తుంచుకుని ఐదు రకాల చట్నీలతో కలిపి తింటూ మధ్య మధ్యలో స్పూన్ తో సాంబార్ చప్పరిస్తూ, ఆ రుచిని ఆస్వాదించ సాగింది నీరజ.

‘‘అన్నట్టు మీకు ఇంకా పెళ్ళి కాలేదా?’’ ఉన్నట్టుండి అడిగిన ప్రశ్నకు అతనికి పొలమారింది... గబుక్కున మంచి నీళ్ళు తాగి స్థిమితపడ్డాడు...

‘‘ఊ, అయిందంటే అయింది... కాలేదంటే కాలేదు...’’

‘‘అదేమిటి? అప్పుడెప్పుడో పెళ్ళి కాలేదని చెప్పినట్టు గుర్తు?’’

‘‘అంటే, ఈ పెళ్ళి అయినా కాలేదన్నట్టు అర్థం అన్న మాట... నా భార్య పరమ గయ్యాళి... ఆరోగ్యం బాగోదు, సంసారానికి పనికి రాదు...’’

‘‘అయ్యో... మరి మరో పెళ్ళి చేసుకోకపోయారా?’’

‘‘చేసుకుందామనే అనుకున్నాను... కానీ నీకు తెలుసుగా నీరూ, మన సమాజంలో రెండో పెళ్ళానికి ఎంత మాత్రం విలువుందో... కోరికలు తేనెటీగలై నన్ను కుట్టి చంపేస్తున్నాయి... నిద్ర పట్టదంటే నమ్ము... రాత్రి నిద్రపోయేటప్పుడు నువ్వే గుర్తు వస్తావు... ప్లీజ్ నీరూ... మనిద్దరం....’’

‘‘ఛీ... మీకిదేమి బుద్ధండీ? మీ ఆవిడా మీలాగే అనుకుంటే?’’

‘‘చాల్లే, అన్యాయం అయిపోయింది నేను... నీరూ, నువ్వు ఒప్పుకుంటే, మనిద్దరం వీకెండ్స్ కలిసి గడుపుదాం... కొన్నాళ్ళు ఎంజాయ్ చేయి... తర్వాత పెళ్ళి చేసుకో...’’

‘‘ఎవరినీ? మిమ్మల్నా?’’ నవ్వాపుకుంటూ అంది నీరజ. పూరీ సాగ్ తింటున్న ఐశ్వర్య పరిస్థితీ అదే...కర్చీఫ్ తో కవర్ చేసుకుంటున్నా ఆగటం లేదు.

‘‘నన్ను కాదులే, ఇంకెవరినైనా... ఈలోగా ఎంతకాలం ఒంటరిగా ఉంటావు?’’

‘‘ఇంతకూ, మీ పేరు నిజంగా శ్రీ చైతన్యేనా?’’

‘‘అంటే, పెద్దవాళ్ళు పెట్టిన పేరు చిన్నారావు అనుకో... నేనే మోడరన్ గా మార్చుకున్నాను...’’ వెకిలిగా నవ్వాడు...
నీరజకి తన మీద తనకే విరక్తి కలిగింది... ఈ వ్యక్తినా తాను అంతగా ఆరాధించింది? ఆ రాతలను, కవితలను చూసి పడిపోయిందా? అసలవి ఇతని స్వంతమేనా? ఇలా ఎంత మందిని

మోసం చేస్తున్నాడో...

కాఫీ తాగాక, తానే బిల్లు చెల్లించింది నీరజ. మాటవరసకీ, మొహమాటానికైనా తాను ఇస్తానని అనలేదు శ్రీ చైతన్య ఉరఫ్ చిన్నారావు. పైగా రిలీఫ్ గా నిట్టూర్చినట్టు అనిపించింది నీరజకి.

"సరేనండి చిన్నారావు గారూ... మళ్ళీ కలుద్దాం..."

"అయ్యో అదేమిటి, నేను చెప్పిన దానికి నువ్వేమీ అనలేదు... రేపు ఫ్రీ యేనా? మధ్యాహ్నం నుంచి కలుద్దామా?"

"అబ్బే, రేపు  మా పిన్ని వస్తోంది ఊరినుంచి... బిజీ అండీ... మళ్ళీ వీలున్నప్పుడు కలుద్దాం లెండి..."

"సరే, మనిద్దరం ఇలా బయట కలుసుకున్నట్టు ఎవరితోనూ అనకే, ఫేస్ బుక్ లో అందరూ నీకు నాతో ఫ్రెండ్ షిప్ అయిందని కుళ్ళి చచ్చిపోతున్నారు... అందుకని..."

"అబ్బే, నేను ఎవరితో అంటాను? పైగా అంటే పోయేది నా పరువేగా?"

"ఓహో... భలే! ఆ సంగతి గుర్తుంది కదా... సరే నీరూ... మళ్ళీ కలుద్దాము... మళ్ళీ కలుసుకునే దాకా నా ఆత్మ... నీ చుట్టూనే... మనసంతా నీ వైపు పరుగు తీస్తూనే...  వస్తాను మరి..." నీరజ బుగ్గ మీద చిటికె వేసి బయటకు నడిచాడు. కనీసం 'నువ్వెలా వెళతావు?' అని కూడా అడగలేదు.

అతను బయటకు వెళ్ళగానే ఐశ్వర్య వచ్చి నీరజ పక్కనే కూర్చుంది... ఒక్కసారిగా పగలబడి నవ్వుకున్నారిద్దరూ... నీరజ నవ్వుతూనే ఐశ్వర్య భుజమ్మీద తల పెట్టుకుని కన్నీళ్లు పెట్టుకుంది...

"థాంక్ యు ఐశూ... థాంక్ యు... ఎంత పిచ్చిదాన్ని అయ్యాను, నువ్వు చెప్పకపోయి

ఉంటే…'' ఆమె గొంతు రుద్ధమైంది…

“సరేలే, వాడి రాతలూ, కవితలూ అంత గొప్పగానే ఉంటాయ్… ఎవరైనా మోసపోతారు… సరే, ఏం చేయదలచుకున్నావు?''

“ఏం చేసినా కాస్త స్ట్రాంగ్ గానే చేస్తాను… సరే, వెళదామా?''

“వెళదాం… ఛీరప్… అతని నిజస్వరూపం తెలిసినందుకు మనం హ్యాపీగా ఫీలవాలి…''

“అవును… నిజం… నాతో వచ్చినందుకు థాంక్స్ ఐశూ…''

“ఇట్స్ ఓకే… ఫ్రెండ్స్ మధ్యన థాంక్స్ లు ఏమిటి? పద… నిన్ను డ్రాప్ చేసి నేను వెళతాను…'' అంటూ బయటకి వచ్చి ఆటోని పిలిచింది ఐశ్వర్య.



‘‘ఐశూ, అప్పుడే నువ్వు లేవటం, రెడీ అవటం కూడా అయి పోయిందా తల్లీ?” డిష్ నిండా వేడి వేడి ఇడ్లీలు, గిన్నెలలో రెండు రకాల చట్నీలు కారప్పొడి పట్టుకు వచ్చింది అన్నపూర్ణ.

‘‘అవును పిన్నీ, మధూ భర్తకు యాక్సిడెంట్ అయిందని చెప్పాను కదా... అతన్ని చూడ టానికి వెళుతున్నాను...” అద్దంలో చూసుకుని బొట్టు పెట్టు కుంటూ చెప్పింది ఐశ్వర్య.

‘‘ఊ... పాపం చాలా బాధా కరంరా అలా జరగటం... మధూని ధైర్యంగా ఉండమని చెప్పు...రా, త్వరగా... వేడి వేడిగా తినేయమ్మా!” టేబుల్ మీద ప్లేట్ లో పెట్టి పిలిచింది అన్నపూర్ణ.

‘‘అయ్యో పిన్నీ ఎందుకు ఈ హైరానా? నేను ఏ బిస్కట్లో తిని, పాలు తాగి వెళతాను కదా... చూడు ఇప్పటికే మీరు పెట్టిన టిఫిన్లకీ, కూరలకీ, పిండి వంటలకీ ఎంత లావై పోతున్నానో...” అంది ఐశ్వర్య...

‘‘కావాలంటే బాగా ఎక్సర్ సైజులు చేసుకో కానీ తిండి మాన కూడదు... సరే గానీ, నీతో కొన్ని విషయాలు చెప్పాలి... రామ్మా, టిఫిన్ తింటూ ఉండు... మాట్లాడుకుందాం...”

‘‘సరే పిన్నీ...” బుద్ధిగా వచ్చి కూర్చుంది ఐశ్వర్య.“ఐశూ, మీ అన్నయ్యలు ఇద్దరూ మమ్మల్ని అమెరికా వచ్చేయమని అంటున్నారు...”
‘‘అవునా, హాయిగా వెళ్ళి పొండి...”

‘‘పర్మనెంట్ గానా, ఉహు, ఆ ఉద్దేశ్యం మాకు లేదు తల్లీ...”

‘‘ఎందుకు పిన్నీ, అక్కడ చక్కగా మనవలతో ఆడుకుంటూ శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపవచ్చు కదా...”

‘‘లేదురా... మీ బాబాయికి అక్కడి వాతావరణం పడదు... వెళ్ళిన వెంటనే నెమ్ము చేసేస్తుంది... తర్వాత అందరూ బయటికి వెళ్ళి పోతే, గంటలు గంటలు ఇంట్లో జంట ఖైదీల్లా గడపాలి... అదీ నాకు నచ్చదు...”

తినటం పూర్తి చేసి చేతులు కడుక్కుని వచ్చి అన్నపూర్ణ పక్కనే కూర్చుంది ఐశ్వర్య.

‘‘పిన్నీ, మీ ఇద్దరినీ చూస్తూ ఉంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుంది... ఒకరి కోసం ఒకరు ఎంతో ఆరాట పడి పోతూ ఉంటారు. నిన్న బాబాయ్ కూడా ఇదే విషయం చెప్పారు... అక్కడికి వెళితే మీకు అక్కడి ఫుడ్ పడదని, చాలా ఇబ్బంది పడతారని, ఏమీ తోచదని చెప్పి, అన్నయ్యలకు రాము అని చెప్పేసాము అన్నారు...”

‘‘అవును... వాళ్ళు అక్కడ స్థిర పడి పోయారు... ఇక ఇక్కడికి వచ్చేది చుట్టపు చూపే... మేము అక్కడ ఉండ లేము...బ్రతికి ఉన్నంత కాలం ఒకరికొకరుగా...ఇక్కడే...”

‘‘పిన్నీ, ఎలా? భార్యా భర్తల మధ్య ఎలా కలుగుతుంది అంతటి అనుబంధం?”

‘‘అదే కదమ్మా విచిత్రం? పెళ్ళికి ముందు ఒకరికి ఒకరు పరిచయం లేదు... అయినా ఆ మూడు ముళ్ళ బంధం ఇలా ముడి వేస్తుంది... అయినా, నీకు మాత్రం కార్తీక్ అంటే ప్రేమ లేదా?”

ఐశ్వర్య ముఖం వాడి పోయింది... “నాది ప్రేమో కాదో తెలియదు పిన్నీ... కానీ జీవితమంతా అతనితోనే బ్రతకాలని అనుకున్నాను... అతను అనుకోలేదు... అందుకే నా జీవితం ఇలా అయింది...”

‘‘వివాహం అంటే బాధాకరమైన బందిఖానా కాదమ్మా... కొన్ని జీవితాలు అలాంటివి నీవు చూసి ఉండవచ్చు... కాదని అనను... కానీ మనువుతో ఒకసారి ఒకటి అయ్యాక, రెండు మనసులూ ఏకమై ఒక దృఢమైన బంధంగా మారి పోతుంది... ఆ బంధమే ఒక కమిట్ మెంట్ ని ఇస్తుంది...ఒక బాధ్యతగా మారుతుంది... ఒకరికొకరిని అందమైన బందీలుగా మారుస్తుంది... ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకునే సంస్కారం ఉంటే చాలమ్మా... జీవితాంతం ఒక్కటిగా బ్రతికేయవచ్చు...ఇది అందమైన అపురూపమైన బంధం... దీనికి కొలమానం లేదు... ఏ బంధమూ దీనికి సాటిరాదు... నేటి యువతకు నచ్చక పోయినా, నా అనుభవం ప్రకారం, ఇదే

చక్కని ప్రేమానుబంధం, భార్యా bhaర్తలే అపురూపమైన ప్రేమికులు...”

“మీరు చెబుతూ ఉంటే అనిపిస్తోంది... కార్తీక్ ని నేను పెళ్ళి చేసుకుని ఉంటే, అతను వెళ్ళి పోయే వాడు కాదేమో కదా పిన్నీ...” ఐశ్వర్య నయనాలు సజలాలు అయ్యాయి...

“అయ్యో, బాధ పడకు... ఇప్పుడు మీ ఇద్దరూ ఒకటే ఆఫీసు కదా... నీతో బాగానే ఉంటున్నాడని అంటున్నావు కదా... ఓ సారి ఇంటికి తీసుకు రామ్మా, బాబాయి మాట్లాడతారు... మాకు కన్యా దాన ఫలం దక్కుతుంది కూడా...” దీర్ఘంగా నిట్టూర్పు విడిచింది ఐశ్వర్య...“అతనికి పెళ్లి అంటే అసహ్యం పిన్నీ... మళ్ళీ సహ జీవనానికి నేను సిద్ధంగా లేను...”

“ఊ...కానీ ఎంత కాలం ఇలా ఒంటరిగా ఉంటావు తల్లీ?”

“ఏమో పిన్నీ... నాకేమీ తెలియటం లేదు...”

“సరే, మధూ దగ్గరికి వెళతానని అన్నావు కదా... టైము అవుతుందేమో చూడు...”

“ఆ, అవును పిన్నీ, నేను బయలు దేరతాను...” లేచింది ఐశ్వర్య.

***

ఉదయం పదిన్నర  అవుతూ ఉండగా, మధు బాల ఫోన్ లో ఇచ్చిన సూచనల ప్రకారం, వినత ఇల్లు చేరుకుంది ఐశ్వర్య. ఐశ్వర్య వెళ్ళే సరికి ఎదురు వచ్చింది వినత.“నమస్తే, మీరు వదిన ఫ్రెండ్ కదా... రండి... కూర్చోండి... అన్నయ్యకు ఫిజియో థెరపీ జరుగు తోంది లోపల... వదిన అక్కడే ఉంది...”

“అవును... మనం మధు పెళ్ళిలో కలిసాము కదా... బాగున్నారా?” చిరు నవ్వుతో అడుగుతూ కూర్చుంది ఐశ్వర్య. ఆ పెళ్ళిలో తను ప్రవర్తించిన తీరు, చేసిన హటం గుర్తు వచ్చి మనసులో చిన్న తనంగా అనిపించింది వినతకు. అంతే కాకుండా, ఐశ్వర్య మీదా, ఆమె జీవన విధానం

మీద తాను చేసిన విమర్శలు, ఆమె కోసమని మధు కంచి నుంచి తీసుకువచ్చిన పట్టు చీరను తాను పంతంగా తీసేసుకోవటం మదిలో మెదిలాయి... అపరాధ భావనతో కళ్ళు చెమ్మగిల్లాయి...

‘‘ఒక్క నిమిషం...” అంటూ లోపలికి వెళ్ళి, ట్రే లో మంచి నీళ్ళ గ్లాసులతో వచ్చింది.

అవంతి, పిల్లలు వచ్చి కూర్చుని ఐశ్వర్య తో కబుర్లు చెప్ప సాగారు. వినత కూడా వాళ్ళతో నవ్వుతూ మాట్లాడుతూ ఉంటే, ఆమె మనస్తత్వం గురించి తెలిసిన ఐశ్వర్యకు ఆమెలోని మార్పును గమనించాక చాలా ఆశ్చర్యంగా అనిపించింది... ఈలోగా గునగునా పాకుతూ వచ్చాడు బాబి గాడు...

‘‘హో... వీడు ఒక్క క్షణం కుదురుగా ఓ చోట ఉండడుగా?” మురిపెంగా అంటూ, వాడిని ఎత్తుకుంది వినత. ఐశ్వర్య చేతులు చాప గానే ఆమె మీదికి ఉరికాడు...

‘‘నా దగ్గరికి రాడమ్మా... నీ దగ్గరకు చక్కగా వచ్చాడు...” అంది అవంతి నవ్వుతూ...

‘‘తను వాళ్ళమ్మ ఫ్రెండ్ కదా, వీడికీ ఫ్రెండే మరి!” నవ్వి, “కాఫీ తెస్తాను... వదినా మీరు తాగుతారు కదా?” అంది లోపలికి వెళుతూ వినత.

‘‘హాయ్ ఐశూ...” వచ్చి, ఐశ్వర్య పక్కనే కూర్చుని ఆమె భుజమ్మీద తల వాల్చింది మధుబాల.

‘‘మధూ... ఎలా ఉంది వేణుకి?” ఆమె జుట్టు నిమురుతూ అన్నది ఐశ్వర్య.

‘‘దేవుడి దయ వలన పెద్ద ప్రమాదమే తప్పింది ఐశూ... కానీ ఇప్పట్లో నడవ లేరు... ఫిజియో థెరపీ చేయిస్తున్నాము. నాకు చాలా భయం వేసిందే... అత్తయ్య కూడా లేరు కదా... కానీ పవన్ అన్నయ్య ఎంతో ధైర్యం చెప్పి తనే అన్నీ చూసుకున్నారు... ఇంట్లో బాబుతో చాలా కష్టం అని చెప్పి, పెద్దమ్మ గారు ఇక్కడికే తీసుకు రమ్మని చెప్పారట... అందుకే ఇక్కడే

ఉన్నాము... మూడు నాలుగు రోజుల్లో అత్తయ్య రాగానే మా ఇంటికి వెళతాం...” గబగబా చెప్పింది మధు బాల.


“పోనీ లేవే, దేవుడు నిజంగా దయా మయుడే... మీ పెద్దమ్మ గారిని కూడా ఈరోజు చూడాలి...” నవ్వుతూ అన్నది ఐశ్వర్య...

“తప్పకుండా... ఆవిడతో మాట్లాడితే మనసుకు ఎంత సాంత్వన గా ఉంటుందో తెలుసా?”

“మీ ఇద్దరినీ చూస్తూంటే నాకు అసూయగా ఉంది మధూ...” అన్నది అవంతి.

“ఎందుకు అక్కా?”

“ఎందుకేమిటి? నాకసలు నా మనసుకు నచ్చిన స్నేహితులే లేరు... నేను ఇంట్రావర్ట్ ని... నేనే కాదులే, నా తమ్ముడు కూడా అంతే...” మెల్లగా చెప్పింది అవంతి.



‘‘అందుకు కారణం మా నాన్నగారు… అమ్మను, మమ్మల్ని నిరంకుశంగా పాలించారు… అమ్మ వలన సహజంగానే సౌమ్య స్వభావం అలవడింది మా ఇద్దరికీ… విపరీతమైన క్రమశిక్షణతో మమ్మల్ని ఇంట్లోంచి బయటకు వెళ్ళనిచ్చే వారు కాదు మా నాన్న… అందుకే పుస్తకాలే మాకు స్నేహితులయ్యాయి… కానీ నాన్నగారి మరణం తరువాత, అమ్మ మాకు మంచి స్నేహితురాలు అయింది… ఆవిడ వలన ఎంతో ప్రపంచ జ్ఞానం అబ్బింది…మాకు అందరినీ ప్రేమించే గుణాన్ని నేర్పింది మా అమ్మే… ఐశ్వర్యా… మీరు మా అమ్మను తప్పక కలవాలి…” అవంతి చెబుతూ ఉంటే ఎప్పుడూ అడిగిన దానికి తప్ప జవాబు చెప్పని ఆమె మాటలను ఆశ్చర్యంగా విన్నది వినత. ఫిజియో థెరపిస్ట్ బయటకు వచ్చి, “పవన్ గారు లేరా మేడమ్? ఈరోజు వాకర్ కొని తీసుకు రావాలి వేణు గారికి…” అని చెప్పాడు.

‘‘అలాగే నండి, నేను చెబుతాను… ఇప్పుడే బయటకు వెళ్ళారు…” చెప్పింది వినత.

‘‘వేణు గారికి కాసేపాగి, జ్యూస్ ఇవ్వండి… అలసి పోయారు… మళ్ళీ సాయంత్రం వస్తాను…” అతను వెళ్ళి పోయాడు. అందరికీ కాఫీలు తీసుకు వచ్చి ఇచ్చింది వినత. సావిత్రిని పిలిచి బత్తాయి రసం తీసి ఇవ్వ మని చెప్పింది.

వినతలో వచ్చిన ఆ మార్పును, చూస్తూ ఉంటే అందరికీ ఆశ్చర్యం గానూ, ఆనందం గానూ ఉంది… ఆమె లోని ఈ మార్పు ఎప్పటికీ ఇలాగే ఉండి పోవాలి అనుకున్నారు మనసులో…

***

‘‘ప్చ్… బాగా చిక్కి పోయారు…” బాధగా అంది ఐశ్వర్య, వేణూ ముఖం చూస్తూనే. పేలవంగా నవ్వాడు వేణు… “మీ ఫ్రెండుని బాధ పెట్టినందుకు భగవంతుడు నాకు వేసిన శిక్ష ఇది…” మధు వైపు చూస్తూ, ఐశ్వర్యతో అన్నాడు…

‘‘అయ్యో, ఎంత మాట! కలతలు, బాధలు, కోపాలు, అపార్థాలు వస్తాయి… అయిన వాళ్ళ మధ్య అవన్నీ క్షణికాలే… తేలి పోయే మబ్బుల్లాంటివి… మీకు త్వరగానే తగ్గి పోతుంది… పెద్ద

గండం తప్పినందుకు సంతోష పడాలి…” చెప్పింది ఐశ్వర్య.

“మీరు చాలా పెద్ద వాళ్ళు అయి పోయారు… బాగా మెచ్యూరిటీ వచ్చింది మీ మాటల్లో…” అభిమాన పూర్వకంగా ఆమె వైపు చూసాడు వేణు.
“అనుభవాలు నేర్పే పాఠాలు ఎన్నెన్నో…” నవ్వింది ఐశ్వర్య…

“కార్తీక్, మీరూ ఒకే చోట పనిచేస్తున్నారని తెలిసింది!”

“అవునండి…”

“మరి…” ఏదో అడగ బోయి, పవన్ లోపలికి రావటంతో ఆగి పోయాడు వేణు.

“బావా, ఆయన ఇచ్చిన మెజర్మెంట్స్ ప్రకారం వాకర్ తీసుకు వచ్చాను… సాయంత్రం నుంచి నడిపిస్తానని అంటున్నాడు…” చేతిలో ఉన్న వాకర్ ని ఫోల్డ్ చేసి, గోడకి ఆనించాడు పవన్.తలూపి, “ఈమె మధు ఫ్రెండ్ ఐశ్వర్య…” పరిచయం చేసాడు. జ్యూస్ గ్లాసుతో లోపలికి వచ్చింది మధు బాల.

“అబ్బా, నాకు వద్దు మధూ… నోరంతా చాలా చేదుగా ఉంది…” ముఖం వికారంగా పెట్టాడు వేణు.

“అన్నయ్యా, ప్లీజ్… అలా అంటే నీరసం ఎలా తగ్గుతుందిరా? ఇటివ్వు వదినా…” కోప్పడుతూ, వినత వేణుతో జ్యూస్ తాగించేసింది.

“మీరు లంచ్ చేసి వెళ్ళాలి…” ఐశ్వర్యతో చెప్పాడు పవన్…

“అబ్బే, వద్దండీ… కాసేపు కూర్చుని వెళ్ళి పోతాను…”

“అదేమీ కుదరదు… ఈరోజు అందరం కలిసి భోజనం చేస్తున్నాం అంతే… మీకిష్టమైన స్వీట్

ఏమిటో చెప్పండి, సావిత్రి చేస్తుంది...” నవ్వుతూ అన్నది వినత. మొహ మాటంగా నవ్వింది ఐశ్వర్య.

‘‘కాలు చాలా నొప్పిగా ఉంది...” బాధగా ముఖం పెట్టాడు వేణు...

‘‘ఉదయమే టాబ్లెట్స్ వేసుకున్నారు కదా, తగ్గి పోతుంది... కాసేపు పడుకోండి...” మృదువుగా చెప్పింది మధు బాల...కాసేపు సుందరమ్మ దగ్గర కూడా కూర్చుని కబుర్లు చెప్పింది ఐశ్వర్య.

‘‘ఏమైంది ఆ అమ్మాయికి? నా వైపు అదోలా చూస్తోంది...” ఇంటర్ కామ్ లో ఐశ్వర్యను అడిగాడు కార్తీక్.

‘‘ఎవరు?’’

‘‘అదే... ఆ అమ్మాయి... షామిలి...’’

‘‘ఏమో మరి? నాకేం తెలుసు?’’ మనసులోనే నవ్వుకుంటూ అన్నది ఐశ్వర్య.

‘‘సరే...’’ ఫోన్ డిస్కనెక్ట్ చేసి తలెత్తి ఉలిక్కి పడ్డాడు కార్తీక్. ఎదురుగా షామిలి. ఈరోజు ఫార్మల్ డ్రెస్ కాకుండా లంగా, వోణీ వేసుకుని వచ్చింది. స్వీట్ బాక్స్ ముందుకు చాపుతూ, ‘‘కార్తీక్, స్వీట్ తీసుకోండి... ఈరోజు నా పుట్టినరోజు...’’ అని చెప్పింది సిగ్గుగా నవ్వుతూ...

‘‘ఓ, విష్ యు మెనీ మెనీ హేపీ రిటర్న్స్ షామిలి...’’ అంటూ ఒక స్వీట్ పీస్ తీసుకున్నాడు...

‘‘నేను మీతో కొంచెం మాట్లాడాలి... పర్సనల్...’’

‘‘పర్సనలా? ఏమిటి?’’ అయోమయంగా అడిగాడు కార్తీక్.

‘‘అదీ... అదీ... ఐ లవ్ యూ...’’ గబుక్కున వెనక్కి తిరిగి పారిపోయింది షామిలి. తలతిరిగినట్టయింది కార్తీక్ కి. మధ్యాహ్నం చిరుజల్లుగా మొదలైన వర్షం కాస్తా,

సాయంత్రం అయ్యేసరికి జడివానగా మారిపోయింది. దాంతో అందరూ త్వరత్వరగా పర్మిషన్ తీసుకుని వెళ్ళిపోయారు. ఐశ్వర్య మాత్రం చేస్తున్న పనిని మధ్యలో వదలటం ఇష్టం లేక ఆగిపోయింది. అది పూర్తి అయి, బాస్ చేత సంతకాలు పెట్టించి, ముంబై కి ఫాక్స్ చేయాల్సి వచ్చింది. అదంతా కార్తీక్ కంప్లీట్ చేసాడు. ఈ లోగా బాస్ కి ఫోన్ కాల్ రావటం, ఆయన తనింటికి కార్లో వెళ్ళిపోవటం కూడా జరిగిపోయాయి.

‘‘అందరూ వెళ్ళిపోయారు... మనం మాత్రమే మిగిలాము...’’ డెస్క్ సర్ది తాళం వేస్తూ చెప్పాడు కార్తీక్.

‘‘సరే, నేను వెళతాను...’’

‘‘ఎలా వెళతావు, ఇంత వర్షం పడుతూ ఉంటే? నా కారులో దింపుతాను ఐశూ...’’

‘‘ఊహు... ఎలాగో అలా వెళతాను... కాబ్ బుక్ చేస్తాను...’’

‘‘సరే, చెయ్యి, నీకు కాబ్ బుక్ అయ్యే వరకూ ఉంటాను...’’ ఆమె ఎదురుగా కుర్చీ లాక్కుని కూర్చున్నాడు కార్తీక్. మొబైల్ చేతిలోకి తీసుకుని ప్రయత్నించసాగింది... దరిదాపుల్లో ఎక్కడా కాబ్స్ లేవు... అయినా మళ్ళీ మళ్ళీ ప్రయత్నించసాగింది... విసురుగా ఆమె చేతిలోంచి మొబైల్ లాక్కున్నాడు కార్తీక్... ‘‘ఇక చాల్లే పద!’’ అన్నాడు కోపంగా.

మారు మాటాడకుండా హాండ్ బాగ్ తీసుకుని, అతని వెంట నడిచింది ఐశ్వర్య.

కారిడార్ లోంచి కార్ పార్కింగ్ వరకూ వెళ్ళే సరికే ముద్దగా తడిసిపోయారు. కుండలతో కుమ్మరించినట్టు ఒకటే వర్షం... గబుక్కున తలుపు తెరిచి కూర్చుని, అటువైపు తలుపు తెరిచాడు కార్తీక్. ఐశ్వర్య కూర్చోగానే, డాష్ బోర్డ్ లోంచి నాప్ కిన్ తీసి తుడుచుకోవడానికి ఇచ్చాడు... ఐశ్వర్య తన ముఖం, జుట్టూ తుడుచుకున్నా ఇంకా నీళ్ళు కారసాగాయి... ఆమె దగ్గరనుంచి తీసుకుని తాను కూడా ముఖం తుడుచుకొని కార్ స్టార్ట్ చేసాడు.




సాయంకాలం ఆరున్నరకే చిమ్మచీకటి కమ్మేసింది. పిచ్చిపట్టినట్టు చెట్లన్నీ గాలికి ఊగిపోతున్నాయి. గుండ్రటి రాళ్ళలాంటి  చినుకులు కారు టాప్ మీదా, అద్దాల మీదా  మృదంగం వాయిస్తున్నాయి. రోడ్ మీద నీళ్ళ ప్రవాహం... కారు టైర్స్ కూడా రెండు అడుగుల లోతులో మునిగిపోతున్నాయి... “మై గాడ్... ఇట్స్ హారిబుల్...” గొణుక్కున్నాడు కార్తీక్. జాగ్రత్తగా డ్రైవ్ చేస్తూ ఐశ్వర్య ఉండే ‘సప్తగిరి నిలయం’ చేరే సరికి అర్ధగంట పైగా పట్టింది. అలవాటుగా తమ పార్కింగ్ స్లాట్ వైపు పోనిచ్చి అక్కడే పార్క్ చేసాడు కార్తీక్. వారించబోయి ఆగిపోయింది ఐశ్వర్య.

ఐశ్వర్య రమ్మని అనకపోయినా ఆమెతో పాటుగా లిఫ్ట్ లో పైకి వచ్చాడు కార్తీక్. తలుపు తాళం తెరవగానే లోపలికి వచ్చాడు. కూర్చోమని అనకుండానే కూర్చున్నాడు.

“త్వరగా కాఫీయో, టీ నో చెయ్యి... తాగుదాం...ఏదీ ముందు టవల్ ఒకటి తెచ్చివ్వు...” అన్నాడు తడిసిపోయిన షర్టు తీసి వాష్ రూమ్ దగ్గర స్టాండ్ కి వేసి వస్తూ...

ఏమీ మాట్లాడకుండానే టీ తయారు చేసి అతనికి బిస్కట్స్ తో పాటుగా సర్వ్ చేసింది ఐశ్వర్య.

‘‘ఇవాళ ఓ తమాషా జరిగింది… షామిలి నాకు ‘ఐ లవ్ యూ’ చెప్పింది…’’ అన్నాడు ఆమె ముఖం లోకి పరీక్ష గా చూస్తూ…

‘‘అందులో ఆశ్చర్యం ఏముంది? నిన్ను ప్రేమిస్తున్నానని, ప్రపోజ్ చేస్తానని నాకు ముందే చెప్పింది…’’ అంది ఐశ్వర్య.

‘‘అయితే నీకు ముందే తెలుసా? మరి నన్ను హెచ్చరించాలి కదా… సరే, నేను ఇందాకే చెప్పేసానులే!

‘‘ఏమని?’’

‘‘అదే, నాకు ఆల్రెడీ పెళ్ళి అయిపోయింది అని… నా భార్యవు నువ్వేనని…’’

‘‘వాట్ ఎ జోక్ కార్తీ!’’

‘‘జోకా? ఏమంటున్నావ్ ఐశూ? ఇది జోకా?’’ కోపంగా అడిగాడు కార్తీక్.

‘‘మరి? పెళ్ళి మీద నీకూ, నాకూ ఇద్దరికీ నమ్మకం లేని సమయంలో ఒకటి అయ్యాము. కొన్నాళ్ళు కాపురం చేసాము, విడిపోయాము… ఇప్పుడు కొత్తగా నువ్వు పెళ్ళి గురించి మాట్లాడుతూ ఉంటే, నాకు నిజంగా చిత్రంగా ఉంది…’’

‘‘ఐశూ… ప్లీజ్… పెళ్ళి అనే బంధం లోని తీయదనాన్ని తెలుసుకోకుండా ఇన్నాళ్ళు అజ్ఞానాంధకారం లో ఉన్నాను… ఇప్పుడిప్పుడే కళ్ళకు ఆవరించిన పొరలు కరిగిపోతున్నాయి… మనసా, వాచా, కర్మణా నన్ను వలచి, వలపించుకున్న నా ప్రేయసివి… నువ్వే నా

సహధర్మచారిణివి... నీవు అంగీకరిస్తే, మనం  అగ్నిసాక్షిగా పెళ్ళి చేసుకుందాము... నన్ను కాదనకు ఐశూ...'' ఆమె చేయిని మృదువుగా పట్టుకున్నాడు కార్తీక్. సున్నితంగా ఆ చేతిని విడిపించుకుంది ఐశ్వర్య.

''కార్తీక్, వివాహ బంధమే అన్నిటికన్నా ఉన్నతమైన విలువలు కలదని, అది ఒక అతులిత బంధమని నేను కూడా చాలా ఆలస్యంగానే తెలుసుకున్నాను... ఇవాళ నువ్వు పెళ్ళి చేసుకుందామని అంటున్నావు... నీకు తెలుసా, పెళ్ళి చేసుకుంటే, ఈ చేతిని ఎన్నడూ విడిచిపెట్టి వెళ్ళకూడదు... నీ స్వేచ్ఛకు అది భంగమే అవుతుంది...''

''నాకు తెలుసు ఐశూ... అసలు నిన్ను విడచిపెట్టి వెళ్ళే ప్రసక్తే లేదు... నాకు విలువలు లేని స్వేచ్ఛ వద్దు, అది విశృంఖలత అవుతుందని తెలుసుకున్నాను...''

''కానీ, కానీ... నాకు నిన్ను అంగీకరించాలంటే చాలా భయంగా ఉంది... నన్ను ప్రేమించిన కార్తీక్ ఎంతగా మారిపోయాడు? నేను తల్లిని కాబోతున్నానని తెలిసిన క్షణాన ఎంత సంతోషపడ్డానో, ఆ అరుదైన ఫలం నా చేతికి రాకుండానే దూరమైపోయిన క్షణాన, ప్రాణాపాయ స్థితిలో ఇదిగో ఇక్కడే ఒక మూటలా రక్తపు మడుగులో పడి క్షణాలు లెక్కపెట్టుకుంటూ కూడా నీ కోసమే కలవరించాను... కానీ... కానీ... నాకు అందరానంత దూరంలో నువ్వు ఎవరితోనో... అబ్బా, ఆ అసహాయ స్థితి పగ వారికి కూడా వద్దు... అప్పుడు, ఆ క్షణంలో మధూ  రాకపోయి ఉంటే నేను ఏమైపోయి ఉండేదాన్ని?

నాకు నీ ప్రేమ కావాలి... నా ప్రేమికుడైన కార్తీక్ భర్తగా కావాలి... నన్ను ఎన్నడూ వీడని నీ చేయి కావాలి... చెప్పు... నాకు ఎప్పటికీ తోడుగా ఉంటావా? మధ్యలో విడిచిపెట్టి వెళ్ళిపోతావా? అలా నాతో జీవితాంతమూ కలిసి ఉండేట్టు అయితేనే ఈ చేయిని పట్టుకో... లేకపోతే... ఇక్కడినుండి వెళ్ళిపో... పెళ్ళి అంటే సుఖమే కాదు, సంఘంలో ఒక స్థానాన్ని కల్పించే సాధనమే కాదు, జీవితానికి పరిపూర్ణత మాత్రమే  కాదు... పెళ్ళి అంటే ఒక బాధ్యత, పెళ్లి అంటే ఒక తోడు, పెళ్ళి అంటే ఒక ఆలంబన... అది శారీరకంగా కలవటానికి ఓ జంట పొందే లైసెన్స్

మాత్రం కాదు... ఒకరికి ఒకరై జీవితమంతా కలిసి బ్రతకటానికి కట్టుకున్న జీవన సౌధం...

అలాంటి సౌధంలోనికి నాతో అడుగుపెడతానని అంటావా? బాగా ఆలోచించుకున్నావా? ఇది అగ్రిమెంట్ కాదు, మధ్యలో చింపేసుకుని విడిపోవటానికి... ఆలోచించి నిర్ణయం తీసుకో కార్తీ..." ఆవేదనతో కూడిన ఆమె మాటలు కార్తీక్ ని నిలువెల్లా దహించివేసాయి...ఏం మాట్లాడాలో అర్థం కాలేదు...




ఒంటరిగా, అసహాయతతో అల్లాడి పోయిన తన అమాయక ప్రేయసి నిస్సహాయ స్థితి కనుల ముందు మెదిలింది... దానికి తోడు, చిధ్రమైన తమ ప్రేమఫలం విషయం తెలిసి అపరాధ

భావనతో కుమిలిపోసాగాడు కార్తీక్... బాధగా, వేదనగా ఐశ్వర్య వైపు చూసి, ఒక్కసారిగా వంగి ఆమె పాదాన్ని స్పృశించాడు.

“క్షమకు అర్హుడిని కాను... కానీ...దయచేసి నన్ను క్షమించి నన్ను నీ వాడిగా అంగీకరించు ఐశూ... ప్రమాణం చేసి చెబుతున్నాను... ఇక నీ కంట ఆనంద బాష్పాలే తప్ప దుఃఖాశ్రువులు రానీయను... ఒట్టు!” ఆమె తల మీద చేయి వేసి దగ్గరకు తీసుకుని, కన్నీటితో, ఆమె నుదుట ముద్దు పెట్టాడు కార్తీక్.

అతని గుండెల్లో తల దాచుకుని, ఒదిగి పోయి అలాగే ఉండి పోయింది ఐశ్వర్య... ఆ కౌగిలిలో కోరిక లేదు... ఆ దగ్గర తనంలో కామం లేదు... ఒకరి నొకరు కోరుకుంటున్న అభిలాష, అనురాగం మాత్రమే ఉన్నాయి.

అతని చేతుల నుండి విడిపించుకుంటూ, “బెడ్ రూమ్ లో నీ డ్రెసెస్ కొన్ని ఉన్నాయి... మార్చుకుని రా కార్తీ... ఈ లోగా మనకి డిన్నర్ ప్రిపేర్ చేస్తాను...” అంది ఐశ్వర్య.

“థాంక్స్ రా ఐశూ... థాంక్స్ అ లాట్...” ఆమె చేతిని అందుకుని పెదవులకు ఆనించుకుని వదిలి బెడ్ రూమ్ లోకి వెళ్లి చూసిన కార్తీక్ తన కళ్ళను తనే నమ్మ లేక పోయాడు. తాను ఇల్లు విడిచి వెళ్ళినప్పుడు ఎలా ఉన్నదో అలాగే సర్ది ఉంది రూమ్ అంతా... వార్డ్ రోబ్ లో తన డ్రెస్ లు కొన్ని, ఇంట్లో వేసుకునేవి, బయటకు వేసుకు వెళ్ళేవి ఉన్నాయి. తన వస్తువులు, పుస్తకాలు కొన్ని ఇంకా అలాగే ఉన్నాయి... డ్రెస్సింగ్ టేబుల్ దగ్గర తాను వాడే పెర్ఫ్యూమ్, ఆఫ్టర్ షేవ్ లోషన్, తనకిష్టమైన కలర్ దువ్వెన, వాష్ రూమ్ లో తనకిష్టమైన బ్రాండ్ సోప్, షాంపూ అన్నీ అలాగే అమర్చ బడి ఉన్నాయి ... అవన్నీ తన చెలి తన కోసం ఎంతగా ఎదురు చూస్తున్నాయో చెబుతున్నాయి...
“ఈ ప్రపంచంలో ఐశూ కన్నా మిన్న అయిన ప్రియురాలు ఎవరికీ దొరకదేమో... ఈమె తన ప్రియ సఖి... ఉహు కాదు, ప్రియ సతి...” అనుకున్నాడు గర్వంగా.

స్నానం చేసి బట్టలు మార్చుకుని వచ్చాడు బయటకి.

‘‘ఐషూ… బాబాయి గారున్నారా? కలిసి మాట్లాడి వస్తాను…’’

‘‘ఓ, ఏం మాట్లాడతావు కార్తీ?’’ చిలిపిగా అడిగింది ఐశ్వర్య.

‘‘నీ తరఫున వాళ్ళిద్దరూ ఇక్కడ లోకల్ గార్డియన్స్ కదా, నిన్ను నాకిమ్మని అడిగి వస్తాను… సరేనా?’’ నవ్వుకుంటూ బయటకు నడిచాడు కార్తీక్. అతని మనసు పూల మేఘాలలో తేలి పోతోంది.

***

‘‘హమ్మయ్య, మనింటికి వచ్చేసాక హాయిగా ఉంది నాకు…’’ అన్నాడు వేణు మధు ఇచ్చిన మాత్రలు వేసుకుంటూ.

‘‘పవన్ అన్నయ్య వాళ్ళు అంత బాగా చూసుకుంటే, అదేమిటి అలా అంటారు?’’ అంది మధు.

‘‘అవునమ్మా, అల్లుడైనా కొడుకు లాగే చూసుకున్నాడు… కానీ… మన ఇంట్లో ఉన్న స్వేచ్ఛ, స్వాతంత్ర్యం ఎక్కడ ఉంటాయి…’’ అన్నది సుగుణమ్మ.

‘‘నిజమే అత్తయ్యా… నాకూ అక్కడ చాలా బాగా అనిపించింది… పెద్దమ్మ గారూ, అవంతి అక్కయ్యా, పవన్ అన్నయ్యా అందరూ ఎంతో బాగా చూసుకున్నారు మమ్మల్ని… వినత కూడా ఎంతో ఆత్మీయురాలు అయి పోయింది …’’

‘‘అవునమ్మా, అతను అంత గట్టిగా, కఠినంగా చెప్పి ఉండక పోతే ఎప్పటికీ మార్పు వచ్చి ఉండేది కాదేమో దానిలో… ఏం జరిగినా మన మంచికే…’’ అంటూ బాబి ఏడుస్తూ ఉంటే అవతలికి తీసుకు వెళ్ళింది సుగుణమ్మ.

‘‘మధూ, నా వలన, వినత వలన నీ మనసు చాలా సార్లు చాలా గాయ పడింది… సారీ చెబితే సరి పోదు… అయినా అయామ్ సో సారీ డియర్…’’ ఆమె చేతిని నిమిరాడు వేణు.

“ఇట్స్ ఆల్ రైట్ వేణు... మన జీవితంలోంచి చెడ్డ రోజులు వెళ్ళి పోయాయని ఆశిద్దాం... మనం ప్రేమించి పెళ్ళి చేసుకోక పోయినా, పెళ్ళి చేసుకుని ఒకరి నొకరు ప్రేమించు కున్నాము... మధ్యలో అపార్థాలు, అనుకోని సంఘటనలు జరిగాయి... చిన్న ఎడం వచ్చింది... కానీ అంత మాత్రం చేత విడి పోవటం సరియైన పని కాదని మనిద్దరికీ తెలుసు... ఏ ఇద్దరూ ఒకేలా ఉండరు... ప్రాణ స్నేహితులు కూడా ఒక్కలా ఆలోచించరు. అయినా వారిని యాక్సెప్ట్ చేస్తాము... భార్యా భర్తల మధ్య మాటా మాటా వస్తేనో, అభిప్రాయ భేదాలు వస్తేనో మాత్రం ‘ఈగో’లకు పోయి, నా మాటే నెగ్గాలని ఎవరికీ వారే అనుకుంటాము... అందు వలన వచ్చిన ‘గ్యాప్’ మరింత ఎక్కువ అవుతుంది... నిజానికి మీ తప్పు ఎంత ఉందో, దానికి ప్రతి చర్యగా నా వంతూ తప్పులు జరిగాయి... అంచేత జరిగినది మరచి పోయి, ఇక అవి మళ్ళీ మళ్ళీ జరగకుండా జాగ్రత్త పడదాం... కొత్త జీవితాన్ని ప్రారంభిద్దాం...” నవ్వుతూ చెప్పింది మధుబాల.

“నేను నడవటం మొదలు పెట్టగానే అర్జెంట్ గా మన బాబుకు నామకరణం జరిపించాలి...” అన్నాడు వేణు గోపాల్.

ఫక్కున నవ్వింది మధుబాల... “ఇంకో రెండు నెలల్లో వాడికి మొదటి పుట్టిన రోజు వస్తోంది... అప్పుడు పేరు పెట్టేద్దాం లెండి... ఐశ్వర్య, కార్తీక్ కూడా అప్పుడే పెళ్ళి చేసుకుంటారట!”

“అవునా, ఎందుకంత ఆలస్యం?”

“మీరు కోలుకున్నాకే, మనమిద్దరం వెళ్ళి పెళ్ళి జరిపించాలని కోరిక ఇద్దరికీ... అఫ్ కోర్స్ రిజిస్టర్ మేరేజే అనుకోండి... అయినా, మనం పక్కన ఉండాలి వాళ్ళకి...”

“ఏమిటి మధూ? ఐశ్వర్య పెళ్ళా? అబ్బ, ఎంత కమ్మని కబురు చెప్పావు అమ్మా? ఆ అబ్బాయి తోనేగా?” అంది సుగుణమ్మ లోపలికి వస్తూ. “అవును అత్తయ్యా, కార్తీక్ తోనే...” చెప్పింది మధు.

‘‘హమ్మయ్య… పోనీలే, ఆ అమ్మాయి జీవితం స్థిర పడుతోంది…” తృప్తిగా నిట్టూర్చింది సుగుణమ్మ…“అన్నట్టు మమత గుర్తుంది కదా… అత్తయ్యా, ఓ సారి మీకు చెప్పాను కదా, నా క్లాస్ మేట్ అని… ఆమె పెళ్ళి కూడా కుదిరింది… ఢిల్లీ లోనే పెళ్ళి…” ఆనందంగా చెప్పింది మధు బాల.

‘‘పోనీలేమ్మా, ఆ అమ్మాయి కూడా, ఆ మొగుడితో  చాలా బాధలు పడింది పాపం… అలాంటి ఆదుకునే తల్లిదండ్రులు ఉండాలి… లేక పోతే ఆడ పిల్లలు ఏమై పోతారు?”

‘‘నిజమే అత్తయ్యా…”

***

హోటల్ తార – ఐదు నక్షత్రాల హోటల్ లో పెళ్ళి రిసెప్షన్ జరుగుతోంది.

వేదిక మీద సూట్ లో కార్తీక్, పట్టు చీరెలో ఐశ్వర్య కూర్చుని ఉన్నారు. వేదికకి ఎదురుగా ఉన్న కుర్చీలలో ఐశ్వర్య తల్లిదండ్రులు, కార్తీక్ తల్లిదండ్రులు, అన్నా వదినలు, రూప, అన్నపూర్ణ, విశ్వనాథంలు, వేణు, మధు, సుగుణమ్మ, వినత, పవన్ అందరూ ఉన్నారు. అందరి మనసుల లోని సంతోష తరంగాలు ముఖాల్లో ఆనంద జ్యోతులై వెలిగి పోతున్నాయి.

ఒకరి మెడలో ఒకరు పూల దండలు వేసుకున్నారు. ఒకరి వేలికి మరొకరు పెళ్ళి ఉంగరాలు మార్చుకున్నారు. ఉదయమే గుడిలో దైవం ముందు కార్తీక్ కట్టిన పచ్చని పసుపు తాడు ఐశ్వర్య మెడలో మరింత పచ్చగా మెరిసిపోతోంది. నుదుట గుండ్రని బొట్టు కింద ఎర్రగా మెరిసి పోతున్న కుంకుమ బొట్టు ఆమె ముఖానికి సరికొత్త వెలుగునిస్తోంది.

నిండు ముత్తయిదువగా తమ కూతురిని చూసుకుంటున్న తిరుపతయ్యకు, అలిమేలమ్మకూ ఆనందంలో కళ్ళూ, మనసు నిండి పోయాయి…

ఇక కాత్యాయని, పరమేశ్వర రావుల ఆనందానికి హద్దు లేదు… తమ చిన్నకొడుకు జీవితంలో అటూ ఇటూ ఆకతాయి పరుగులు మాని ఒక చక్కని అమ్మాయికి భర్త

అవుతున్నాడంటే, స్థిరమైన జీవితానికి నాంది పలుకుతున్నాడు అంటే అంతకన్నా సంతోషకరమైన విషయం మరేముంటుంది?

కార్తీక్ కి ఐశ్వర్యను చూస్తుంటే, అంతులేని ఆమె హృదయం లోని ప్రేమ అనే ఐశ్వర్యానికి అధిపతి అయినందుకు, విశ్వవిజేతను అనే భావన కలుగుతోంది... 'నిన్ను నిన్నుగా ప్రేమించుటకు... నీకోసమే కన్నీరు నించుటకు, నేనున్నానని నిండుగా పలికే తోడొకరుండిన అదే భాగ్యమూ, అదే స్వర్గము....' అనే పంక్తులు మదిలో మెదిలాయి. ఆ క్షణం తనకన్నా భాగ్యవంతుడు ఎవరున్నారని అనిపించింది.

ఐశ్వర్యకు తన తల్లిదండ్రుల ఆనందాన్ని చూస్తూంటే, తన శ్రేయోభిలాషుల సంతోషాన్ని, తృప్తిని చూస్తూంటే, 'వివాహం' చేసుకోవటంలో తనకు స్వయంగానే కాక, తనవారికి ఇంతమందికి తృప్తి ఉన్నదా -అనిపించింది. తనకిష్టమైన వాడితో జీవితాంతం ఒక్కటిగా బ్రతకటం... ఈ ఆలోచనే ఎంతో బలాన్నీ, శక్తినీ ఇస్తోంది... ఇక 'సహజీవనం' అనే జీవన విధానంలో ఒక అభద్రతా భావంతో అన్నాళ్ళు తానెలా బ్రతికిందో ఆలోచిస్తేనే ఒక్క క్షణం ఒళ్ళు జలదరించినట్టయింది.

బంధు మిత్రులంతా ఒకరి వెనుక ఒకరు వచ్చి వధూవరులను అభినందిస్తూ, అక్షతలు వేసి ఆశీర్వదించసాగారు.

మధు, వేణు బాబుతో సహా వేదిక మీదకు వచ్చి ఇద్దరినీ అభినందించారు. మధు ఐశ్వర్యను గాఢంగా ఆలింగనం చేసుకోగానే, "మధూ, నాకు చాలా గట్టిగా ఏడవాలని ఉందే..." అంది ఐశ్వర్య జీరపోయిన గొంతుతో...

"ఛ, ఆ రోజులు వెళ్ళి పోయాయి... ఇక అన్నీ నవ్వులే వినిపించాలి నీ ముంగిట్లో... హార్టీ కంగ్రాట్స్ ఐశూ... నీ లక్ష్యం నీవు చేరుకున్నావు..." మనసారా అభినందించింది మధుబాల.

వేణు కూడా కార్తీక్ ని హగ్ చేసుకుని అభినందించాడు... "కార్తీక్, మీ నావ తీరం చేరింది...

కంగ్రాట్స్..." అన్నాడు మనసారా...
ఉప్పొంగే సంతోషపు ఉప్పెన నిండిన ముఖాలతో ఒకరి కళ్ళలోకి ఒకరు
ఆనందంగా  చూసుకున్నారు కార్తీక్, ఐశ్వర్య... ఆ చూపులలో ఎన్ని బాసలో, భాష్యం లేని
ఊసులో!